సాహిత్య విమర్శకుడు

ఆచార్య ఎస్వీ రామారావు

కన్నుమూత

40కి పైగా విమర్శనా పుస్తకాలు రచించిన ఎస్వీ

తెలుగు పాఠ్యపుస్తకాల రూపకల్పనలో పాత్ర

3

www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI



గురువారం | 18-9-2025 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 23 సంచిక (Issue) : 171 | శ్రీ విశ్వావసునామ సంవత్సరం, దక్షిణాయనం, వర్షరుతువు, భాద్రపదమాసం, బహుళపక్షం, తిథి: ద్వాదశి రా.11.25 తదుపరి త్రయోదశి, నక్షత్రం: పుష్యమి ఉ.6.32 తదుపరి ఆశ్లేష, వర్జ్యం: రా.7.38-9.16, దుర్ముహూర్తం: ఉ.10.08-10.56, మ.2.58-3.46, అమృతఘడియలు: తె. 5.27 మొదలు, రాహుకాలం: మ.1.30-3.00, సూర్యోదయం: 6.00, సూర్యాస్తమయం: 6.00 | వరంగల్

Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

ఫాంహౌజ్‌లో దాక్కున్నా..

లాక్కొచ్చి లోపలేస్తాం!

గత ప్రభుత్వంలో హైదరాబాద్‌ను 'గేట్ వే ఆఫ్ డ్రగ్స్'గా మార్చారు

ఆ భూతాన్ని కూకటివేళ్లతో పెకిలించేందుకే మేం ఈగల్ ఫోర్స్ తీసుకువచ్చాం

ఎవరి మిత్రులైనా, బంధువులైనా వదలం

రాష్ట్రాన్ని గంజాయి, డ్రగ్స్ రహితం చేస్తాం

అక్కసుతో ఫ్యూచర్ సిటీని అడ్డుకుంటున్నారు

విద్యనే మనందరి విజయానికి వజ్రాయుధం

ఇందిరమ్మ ఇళ్లు పేదల ఆత్మగౌరవ ప్రతీకలు

డిసెంబరు 9న తెలంగాణ రైజింగ్-2047 ప్రణాళిక ప్రకటిస్తాం

మేధావులు సూచనలు, సలహాలు ఇవ్వాలి

ప్రజాపాలన దినోత్సవంలో సీఎం రేవంత్

భాష, నైపుణ్యాలు, క్రీడల మేళవింపుతో తెలంగాణ విద్యా విధానం.. సమీక్షలో సీఎం



గన్‌పార్క్‌లో తెలంగాణ అమరవీరుల స్థూపం వద్ద నివాళులర్పిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

హైదరాబాద్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వంలో కొందరు హైదరాబాద్‌ను గేట్ వే ఆఫ్ డ్రగ్స్‌గా మార్చారని.. ఆ సంస్కృతిని రూపుమాపి, డ్రగ్స్ భూతాన్ని కూకటివేళ్లతో పెకిలించేందుకు ఈగల్ ఫోర్స్‌ను తీసుకొచ్చామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. ఫాంహౌజ్‌లను డ్రగ్స్, గంజాయికి కేంద్రాలుగా మార్చితే.. ఎంతటివారైనా, ఫాంహౌజ్‌లో ఉన్నా, ఏ బొక్కలో దాక్కున్నా లాక్కొచ్చి కటకటాల్లో వేస్తామని హెచ్చరించారు. బుధవారం హైదరాబాద్‌లోని పబ్లిక్ గార్డెన్స్‌లో జరిగిన తెలంగాణ ప్రజాపాలన దినోత్సవంలో సీఎం ప్రసంగించారు. "ఇటీవల 138 దేశాలు పాల్గొన్న 'వరల్డ్ పోలీస్ సదస్సు' మాదకద్రవ్య నియంత్రణ కేటగిరీలో హైదరాబాద్ నార్కోటిక్స్

మిగతా 13వ పేజీలో...

ఆర్టీసీలో 1,743 పోస్టులు!

రాష్ట్రం ఏర్పడ్డాక తొలి నోటిఫికేషన్

డ్రైవర్ పోస్టులు 1000. శ్రామిక్ 743 ఖాళీలు

8 నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ

12



తెలంగాణ విమోచన దినోత్సవ సభలో రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్‌కు జ్ఞాపికను అందజేస్తున్న కిషన్‌రెడ్డి

రజాకార్లు.. పహల్గాం ఉగ్రవాదులు

ఇద్దరూ ఒక్కటే!

భారత్‌ను సమర్థించేవారందరికీ రజాకార్లు శత్రువులే

భారత్‌లో విలీనం చేయాలన్నందుకు విలేకరి షోయబుల్లాఖాన్ చేతులు నరికారు

దేశ చరిత్రలో 'ఆపరేషన్ పోలో' కీలకఘట్టం

ఆపరేషన్ సిందూర్ ముగిసిపోలేదు

ఉగ్రదాడులు జరిగితే మళ్లీ బుద్ధి చెబుతాం

తెలంగాణ విమోచన దినోత్సవ వేడుకల్లో రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్

12

నిజాం పాలనలో దారుణాలు: మోదీ

మోదీ బాల్యంపై సినిమా

స్కూళ్లలో ప్రదర్శన.. సీబీఎస్ఈ, కేవీఎస్, ఎన్‌వీఎస్‌లకు కేంద్రం లేఖ

2



మెట్రో రైల్ నుంచి

ఎల్ & టీ ఔట్?

వెళ్లిపోతానంటే ప్రభుత్వమే తీసుకునే యోచన

రూ.6 వేల కోట్లు ఇస్తే గుడ్‌బై చెబుతామంటూ ఎల్ అండ్ టీ లేఖ

మెట్రో 2వ దశకు ఎల్ అండ్ టీ సహకరం లేకపోవడంపై సర్కారు అసంతృప్తి

మొదటి దశ ఆస్తుల నిర్వహణ విషయంలోనూ అభ్యంతరాలు

హైదరాబాద్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): "మెట్రో రైల్ ప్రాజెక్టు నుంచి వైదొలుగుతాం.. రూ.6వేల కోట్లు ఇస్తే వెళ్లిపోతాం" అని ఇటీవల ఎల్ అండ్ టీ సంస్థ రాసిన లేఖపై ప్రభుత్వం లోతుగా ఆలోచిస్తోంది. పదే పదే అదే పాట పాడితే.. వెళ్లిపోతానని అంటే.. సరే అనడానికి సిద్ధమైనట్లు విశ్వసనీయ సమాచారం. మెట్రో రెండో దశ ప్రాజెక్టును ఎలాగూ ప్రభుత్వమే నిర్మించి నిర్వహించాలని నిర్ణయించిన సంగతి తెలిసిందే. తాజా పరిణామాల నేపథ్యంలో.. మొదటి దశను కూడా నిర్వహించేందుకు అవసరమైతే సిద్ధంగా ఉండాలన్న చర్చ ప్రభుత్వంలో నడుస్తోంది. తమకు అప్పులు, వడ్డీల భారం ఎక్కువగా ఉందని ఎల్ అండ్ టీ సంస్థ చెబుతుండగా.. తొలి దశలో ఆ సంస్థకు ఇచ్చిన ఆస్తుల నిర్వహణ సమర్థంగా లేదన్న అభిప్రాయం ప్రభుత్వంలో ఉంది. మెట్రో నిర్వహణ తమకు లాభదాయకంగా లేదని ఎల్ అండ్ టీ సంస్థ అంతర్గతంగా

మిగతా 13వ పేజీలో...



● ఏపీలో దారుణం

టిప్పర్ బీభత్సం

14

మితిమీరిన వేగంతో రాంగ్‌రూట్‌లోకి దూసుకొచ్చి కారును ఢీకొట్టిన టిప్పర్

కారులోని ఏడుగురూ మృత్యువాత

డ్రైవర్ తప్ప అందరూ బంధువులే

నెల్లూరు జిల్లా సంగం మండలం జాతీయ రహదారిపై దుర్ఘటన

ప్రాణం మీదకు తెచ్చిన 'బర్త్ డే బంప్స్'

పుట్టిన రోజు వేడుక పేరుతో విద్యార్థికి తోటి విద్యార్థుల పిడిగుద్దులు

తీవ్ర గాయాలు.. ఆస్పత్రికి తరలింపు

నాచారం ఢిల్లీ పబ్లిక్ స్కూల్లో ఘటన

మూడు నెలల పాటు విశ్రాంతి తీసుకోవాలన్న వైద్యులు

ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు

10

బాత్రూంలో 17 లక్షలు!

చేవెళ్ల విద్యుత్ ఏడీఈ ఇంట్లో ఏసీబీ సోదాల్లో దొరికిన నగదు

స్థిరాస్తుల పత్రాలూ స్వాధీనం

ఇప్పటికే ఏసీబీ అరెస్టు చేసిన ఏడీఈ అంబేడ్కర్‌కు ఇతను బినామీ

అంబేడ్కర్‌కు 14 రోజుల రిమాండ్



ఏడీఈ రాజేష్‌బాబు

హైదరాబాద్/చేవెళ్ల, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో విద్యుత్ శాఖ ఏడీఈ ఏరుగు అంబేడ్కర్‌ను అరెస్టు చేసిన ఏసీబీ అధికారులు.. బుధవారం సాయంత్రం అతని బినామీ అయిన మరో ఏడీఈ రాజేష్‌బాబు ఇంట్లో సోదాలు నిర్వహించారు. సికింద్రాబాద్ మారెడ్‌పల్లిలో ఉన్న రాజేష్‌బాబు ఇంటికి చేరుకున్న ఏసీబీ అధికారులు సోదాలు చేపట్టగా.. కవర్‌లో పెట్టి బాత్‌రూంలో దాచిన రూ.17 లక్షల నగదు లభ్యమైంది. కొన్ని స్థిరాస్తులకు సంబంధించిన పత్రాలను సైతం ఏసీబీ అధికారులు స్వాధీనం చేసుకున్నట్లు తెలుస్తోంది. సోదాల సమయంలో రాజేష్‌బాబు ఇంట్లో లేడు. ఆయన రెండు రోజుల నుంచి ఆఫీసుకు కూడా రావడం లేదని తెలిసింది. రాజేష్‌బాబు 9 నెలల క్రితం పదోన్నతిపై రంగారెడ్డి జిల్లా చేవెళ్లకు ఏడీఈగా వచ్చాడు. అంతకుముందు మొయినాబాద్ మండలం చిల్కూర్ ఫీడర్ ఏఈగా చాలాకాలం పనిచేశాడు. కాగా ఇబ్రహీంబాగ్ ఏడీఈ అంబేడ్కర్ కూడబెట్టిన ఆస్తుల

మిగతా 10వ పేజీలో...

ఏసీబీకి చిక్కిన ఖమ్మం జిల్లా తల్లాడ తహసీల్దార్



అమీర్‌పేట్‌లో చెరువును తలపిస్తున్న రోడ్డు

రాజధానిపై

మళ్లీ కుంభవృష్టి

రాత్రి 3 గంటలపాటు ఏకధాటిగా వర్షం.. చెరువులను తలపించిన రోడ్లు, ఇళ్లలోకి వరద

మియాపూర్ హైవేపై కి.మీ మేర నిలిచిపోయిన వాహనాలు

14

ముషీరాబాద్‌లో 15 సెం.మీ, మోండామార్కెట్‌లో 13 సెం.మీ.ల వర్షపాతం నమోదు

రాష్ట్రవ్యాప్తంగా పలుచోట్ల భారీ వర్షం.. అప్రమత్తంగా ఉండండి.. అధికార్లకు సీఎం ఆదేశం

గ్రూప్-1 తీర్పు

తప్పుల తడక

డివిజన్ బెంచ్‌ను ఆశ్రయించిన టీజీపీఎస్సీ

సింగిల్ జడ్జి ఇచ్చింది విపరీతమైన తీర్పు

పరిధి మీరి మైక్రోస్కోపిక్ విచారణ చేశారు

మేమిచ్చిన ఆధారాలు పరిగణనలోకి తీసుకోలేదు

కమిషన్ వాదనల కన్నా.. ఉద్యోగసాధనలో విఫలమైన అభ్యర్థుల వాదనలే నమ్మారని వెల్లడి

హైదరాబాద్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): గ్రూప్-1 మెయిన్స్ పరీక్షలకు సంబంధించిన సమాధాన పత్రాలను పునర్ మూల్యాంకనం చేయాలని.. లేనిపక్షంలో మొత్తం మెయిన్స్ పరీక్ష రద్దవుతుందని పేర్కొంటూ హైకోర్టు సింగిల్ జడ్జి ఈ నెల 9న ఇచ్చిన తీర్పుపై తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీజీపీఎస్సీ).. హైకోర్టు ద్విసభ్య ధర్మాసనం ఎదుట అప్పీల్ దాఖలు చేసింది. తాము సమర్పించిన మెటీరియల్‌ను, ఆధారాలను పరిగణనలోకి

మిగతా 10వ పేజీలో...



ఈవీఎంపై అభ్యర్థుల

కలర్ ఫొటోలు

సులభంగా చదివేలా పెద్ద అక్షరాలతో పేర్లు

ఓటింగ్ ప్రక్రియలో పారదర్శకత పెంపునకు ఎన్నికల కమిషన్ నిర్ణయం

బిహార్ అసెంబ్లీ ఎన్నికల నుంచే అమలు

అన్ని రాష్ట్రాలు/యూటీల ఎన్నికల కమిషనర్లకు లేఖలు

2



ఇజ్రాయెల్ బాంబుల దాడితో నేలమట్టమైన భవనం

ఇజ్రాయెల్ అధీనంలోకి గాజా!

2

ఇప్పటికే 75% భూభాగం స్వాధీనం

వైమానిక దాడులతో పలు భవనాలు నేలమట్టం

ఉధృతంగా కొనసాగుతున్న భూతల దాడులు

లేఖల కలకలం!

మావోయిస్టుల లేఖలు నిజమైనవేనా?

ఆయుధాలు వదిలేందుకు సిద్ధమయ్యారా?

ఏది అసలు..? ఏది నకిలీ..?

ప్రజాసంఘాలు, మాజీ మావోయిస్టుల భిన్నాభిప్రాయాలు

3

అదంతా మైండ్‌గేమ్ అంటున్న పోలీసులు

చీలిక దిశగా మావోయిస్టు పార్టీ?



మీరు పరమభక్తులంటున్నారు కదా..

వెళ్లి విష్ణువునే ప్రార్థించండి

» ఖజురహోలో విష్ణుమూర్తి విగ్రహ పునరుద్ధరణ కోరుతూ దాఖలైన వ్యాజ్యంలో సీజేఐ జస్టిస్ బీఆర్ గవాయ్ వ్యాఖ్య

న్యూఢిల్లీ, సెప్టెంబరు 17: ఖజురహోలోని జావరీ ఆలయంలో మొఘలుల కాలంలో విధ్వంసానికి గురైన 7 అడుగుల విష్ణుమూర్తి విగ్రహాన్ని పునరుద్ధరించాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌ను విచారించడానికి సుప్రీంకోర్టు నిరాకరించింది. రాకేశ్ దలాల్ అనే వ్యకి ఈ పిటిషన్ వేశారు. మొఘలుల దండయాత్రల్లో ఆ విగ్రహం తల నరికారని.. దాన్ని పునరుద్ధరించాలంటూ ప్రభుత్వానికి ఎన్నిసార్లు విజ్ఞప్తి చేసినా పట్టించుకోవట్లేదని ఆయన తన పిటిషన్‌లో పేర్కొన్నారు. సుప్రీం సీజే జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ ఏజే మాసిహ్‌తో కూడిన ధర్మాసనం ముందుకు ఈ పిటిషన్ రాగా.. ఈ అంశం ఆర్కియలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా (ఏఎస్ఐ) పరిధిలో ఉందని పేర్కొంటూ దాన్ని విచారించేందుకు ధర్మాసనం తిరస్కరించింది. ఈ సందర్భంగా జస్టిస్ గవాయ్.. "మీరు విష్ణుమూర్తికి పరమభక్తులని చెబుతున్నారు కదా.. వెళ్లి దీనిపై ఏదైనా చేయాలని ఆ దేవుణ్నే అడగండి. వెళ్లి ప్రార్థించండి" అని పిటిషనర్‌కు సలహా ఇచ్చారు. "అది భారత పురావస్తు శాఖకు చెందిన స్థలం. కాబట్టి అక్కడేమైనా చెయాలంటే ఏఎస్ఐ అనుమతి ఇవ్వాలి. సారీ" అన్నారు

రైతుల్లో కొందరిని అరెస్టు చేస్తేగానీ పంట వ్యర్థాల దహనం మానరు: సుప్రీంకోర్టు

న్యూఢిల్లీ, సెప్టెంబరు 17: దేశ రాజధానిలోని కాలుష్యంపై విచారణ సందర్భంగా బుధవారం సుప్రీంకోర్టు ఘాటు వ్యాఖ్యలు చేసింది. పొలాల్లో పంట దుబ్బులను కాల్చడం కారణంగా కాలుష్యం పెరుగుతుండడాన్ని తీవ్రంగా పరిగణించింది. అలా చేస్తున్న కొందర్ని జైల్లో వేస్తేనే రైతులకు సరైన సందేశం వెళ్తుందని అభిప్రాయపడింది. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బి.ఆర్.గవాయ్ మాట్లాడుతూ "రైతులు ప్రత్యేకమైనవారు, కాదనడం లేదు. వారి కారణంగానే అన్నం తింటున్నాం. అలాగని పర్యావరణాన్ని రక్షించకుండా ఉండలేం" అని అభిప్రాయపడ్డారు. రైతులపైనా జరిమానాలు వేసే నిబంధనలు గురించి ఆలోచించాలని అన్నారు. పంట వ్యర్థాలను జీవ ఇంధనంగా తయారు చేసే అవకాశం ఉన్నా దీన్ని అయిదేళ్ల కార్యక్రమంగా చేపట్టలేకపోయారని అన్నారు. కేంద్ర, యూపీ, రాజస్థాన్, హరియాణా, పంజాబ్ కాలుష్య నివారణ మండళ్లు, ఎయిర్ క్వాలిటీ మేనేజ్‌మెంట్ కమిషన్‌లో ఖాళీగా ఉన్న పోస్టులను మూడు నెలల్లో భర్తీ చేయాలని సుప్రీంకోర్టు ఆదేశించింది.

గ్యాంగ్‌స్టర్ ఛోటా రాజన్ బెయిల్ రద్దు

న్యూఢిల్లీ, సెప్టెంబరు 17: హత్య కేసులో యావజ్జీవ కారాగార శిక్ష అనుభవిస్తున్న గ్యాంగ్‌స్టర్ ఛోటా రాజన్‌కు బాంబే హైకోర్టు ఇచ్చిన బెయిల్‌ను బుధవారం సుప్రీంకోర్టు రద్దు చేసింది. బెయిల్ మంజూరు చేస్తూ గత ఏడాది అక్టోబరు 23న హైకోర్టు ఇచ్చిన ఆదేశాలను రద్దు చేయాలని కోరుతూ సీబీఐ చేసిన వినతిని అంగీకరించింది. 2001లో ముంబయికి చెందిన హోటల్ యాజమాని జయా శెట్టిని హత్య చేసిన కేసులో రాజన్‌కు యావజ్జీవ కారాగార శిక్ష విధిస్తూ 2024లో ప్రత్యేక కోర్టు తీర్పు చెప్పింది. అయితే బాంబే హైకోర్టు ఆ శిక్షను రద్దు చేయడంతో పాటు, వేరే కేసులో జైలు జీవితం అనుభవిస్తున్న అతడికి తాత్కాలిక బెయిల్ మంజూరు చేసింది. దీనిని సవాలు చేస్తూ సీబీఐ చేసిన అప్పీలుపై సుప్రీం ధర్మాసనం విచారణ జరిపింది. 27 ఏళ్ల పాటు పరారీలో ఉండి, నాలుగు కేసుల్లో శిక్ష పడ్డ ముద్దాయిని విడుదల చేయడం ఏమిటని ధర్మాసనం ప్రశ్నించింది.

ప్రధానిపై పోస్టు చేసిన వీడియోను తీసేయండి

» కాంగ్రెస్‌కు పట్నా హైకోర్టు ఆదేశం

పట్నా, సెప్టెంబరు 17: ఏఐ సాయంతో ప్రధాని మోదీపై రూపొందించిన వీడియోను సామాజిక మాధ్యమాల నుంచి తొలగించాలని కాంగ్రెస్ పార్టీని బుధవారం పట్నా హైకోర్టు ఆదేశించింది. తదుపరి విచారణ జరిగే నాటికి దానిని తొలగించాలని తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ పి.బి.బజంత్రి ఆదేశించారు. 'సాహబ్ కే సప్నో మే ఆయీ మా. దేఖియే రోచక్ సంవాద్' (సాహెబ్ కలలోకి అమ్మ వచ్చింది. ఆసక్తికరమైన సంభాషణను వినండి) పేరుతో కృత్రిమ మేధ సాయంతో హిందీలో వీడియోను రూపొందించింది. మోదీ కలలోకి ఆయన తల్లి వచ్చి నోట్ల రద్దు, ఓట్ల చోరీ వంటి అంశాలను ప్రస్తావించినట్టు అందులో ఉంది. ఇది పరువు నష్టం కలిగించేదంటూ న్యాయవాది వివేకానంద సింగ్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది.

టగ్‌బోట్ శుభ్రం చేస్తూ ఊపిరాడక ముగ్గురి మృతి

చెన్నై, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): తమిళనాడులోని తూత్తుకుడిలో ఉన్న వీవోసీ హార్బర్‌లో ఓ టగ్‌బోట్ శుభ్రం చేస్తూ ఊపిరాడక ముగ్గురు కార్మికులు దుర్మరణం చెందారు. ఈ ముగ్గురూ రాజస్థాన్‌కు చెందిన వారుగా పోలీసులు గుర్తించారు. వీఓసీ హార్బర్ నుంచి ప్రతిరోజూ భారీగా వస్తువులు ఎగుమతి, దిగుమతి అవుతుంటాయి. ఈ నేపథ్యంలో బుధవారం హార్బర్‌లోని కార్గో టగ్ బోట్ అడుగున పేరుకుపోయిన వ్యర్థాలను తొలగించేందుకు సందీప్ కుమార్ (22), జెనిక్సన్ థామస్ (35), హిరేన్ జార్జ్ (22) లోనికెళ్లారు. ఎంతసేపటికీ ఆ ముగ్గురూ బయటకు రాకపోవడంతో సహచర సిబ్బంది అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. అగ్నిమాపక సిబ్బంది లోనికెళ్లి చూడగా.. అప్పటికే వారు మృతి చెందినట్టు తేలింది.

పర్యాటకులను పశువుల్లా చూశారు..!

» జార్జియా అధికారుల తీరుపై భారతీయ మహిళ ధ్వజం

న్యూఢిల్లీ, సెప్టెంబరు 17: జార్జియా పర్యటనకు వెళ్లిన భారతీయ పర్యాటకులతో అక్కడి అధికారులు అత్యంత అమానవీయంగా ప్రవర్తించారని ఓ మహిళ ఆరోపించారు. తమను గంటల తరబడి జంతువుల్లా రోడ్డు పక్కన ఫుట్‌పాత్‌పై కూర్చోబెట్టారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆర్మేనియా నుంచి 56 మంది పర్యాటకులతో కూడిన బృందం సడఖ్లో సరిహద్దు వద్ద జార్జియాలోకి ప్రవేశిస్తున్న సమయంలో ఈ ఘటన జరిగిందని తెలిపారు. ఈ క్రమంలో తమకు ఎదురైన అనుభవాలను బాధితురాలు ధ్రువీ పటేల్ సోషల్ మీడియాలో పంచుకున్నారు. తమవద్ద ఈ-వీసాలు, చెల్లుబాటయ్యే అన్ని ధ్రువపత్రాలు ఉన్నప్పటికీ అవమానాలతో పాటు నిర్బంధాన్ని ఎదుర్కోవాల్సి వచ్చిందన్నారు. ఆ సమయంలో ఆహారం ఇవ్వకపోగా, టాయిలెట్‌కు కూడా వెళ్లనీయలేదని మండిపడ్డారు. రెండు గంటలకు పైగా తమ పాస్‌పోర్టులు స్వాధీనం చేసుకోవడంతో పాటు నేరస్థుల్లాగా తమను వీడియోలు తీశారని తెలిపారు.

యూపీలో ఎన్‌కౌంటర్.. ఇద్దరి మృతి

» నటి దిశ పటానీ ఇంటి వద్ద కాల్పులు జరిపిన కేసులో నిందితులు

న్యూఢిల్లీ, సెప్టెంబరు 17: ఉత్తరప్రదేశ్‌లోని బరేలీలో బాలీవుడ్ నటి దిశ పటానీ నివాసం వద్ద కాల్పులు జరిపారన్న ఆరోపణలు ఉన్న ఇద్దరు వ్యక్తులు బుధవారం జరిగిన ఎన్‌కౌంటర్‌లో మరణించారు. ఘాజియాబాద్‌లోని ట్రోనికాసిటీ వద్ద జరిగిన ఎదురుకాల్పుల్లో వారు హతమయ్యారు. మరణించిన వారిని హరియాణాలోని రోహతక్‌కు చెందిన రవీందర్, సోనిపట్‌కు చెందిన అరుణ్‌గా గుర్తించారు. వీరు దిశ పటానీ ఇంటివద్ద ఈనెల 12వ తేదీ కాల్పులు జరిపినట్టు గుర్తించారు.

భారత్‌పై దాడుల సూత్రధారి మసూద్ అజహరే

పార్లమెంటుపై దాడి అతడి పనేనన్న జైషే కమాండర్ ఇల్యాసీ

న్యూఢిల్లీ, సెప్టెంబరు 17: ఉగ్రవాదులు తమ భూభాగంలో లేరంటూ పాకిస్థాన్ చెబుతున్న మాటలు అబద్ధమని మరోసారి తేలింది. ఉగ్రవాద సంస్థ అయిన జైష్ ఎ మహమ్మద్‌లో కమాండర్‌గా పనిచేసిన మసూద్ ఇల్యాస్ కశ్మీరీ చెప్పిన దానిప్రకారం భారత్‌కు వ్యతిరేకంగా జరిగిన ఉగ్రవాద కార్యకలాపాలకు రూపకల్పన పాకిస్థాన్‌లోనే జరిగింది. వెలుగులోకి వచ్చిన ఓ వీడియోలో ఇందుకు సంబంధించిన ఆసక్తికరమైన విషయాలు ఉన్నాయి. దీని ప్రకారం మజూద్ అజహర్ భారత్‌పై జరిగిన ఉగ్రవాద దాడులకు బాలాకోట్ నుంచే ప్రణాళికలు రూపొందించాడు. ఈ స్థావరంపైనే 2019లో భారత్ వైమానిక దాడులు చేయడం గమనార్హం.

తీర ప్రాంతాలకు తరలిపోతున్న గాజా ప్రజలు



ఇజ్రాయెల్ దాడులతో గాజాలో కూలిపోయిన భవనాలు



గాజా నేలమట్టం

ఆ నగరంపై ఇజ్రాయెల్ బాంబుల వర్షం

» తీరప్రాంతాలకు వెళ్లిపోతున్న గాజా వాసులు

» రెండేళ్ల యుద్ధంలో 65 వేలకు చేరిన మృతులు

గాజా/టెల్‌అవీవ్, సెప్టెంబరు 17: ఇజ్రాయెల్ వైమానిక దాడులతో పాటు భూతల దాడులు కూడా తోడవడంతో గాజా ధ్వంసమైపోతోంది. బహుళ అంతస్థుల భవనాలు క్షణాల్లో నేలమట్టమవుతున్నాయి. గాజాపై ఇప్పటికే 75 శాతం నియంత్రణ తెచ్చుకున్న ఇజ్రాయెల్ పూర్తి పట్టుకోసం భూతల దాడులు ముమ్మరం చేసింది. దీనికి తోడు గాజా సిటీలో ఇప్పటికీ 3 వేల మంది హమాస్ ఉగ్రవాదులు ఉన్నారని వారిని అంతమొందిస్తేనే తమ లక్ష్యం నెరవేరుతుందంటూ దాడులు కొనసాగిస్తోంది. గాజాలో ఇజ్రాయెల్ మారణహోమం సృష్టిస్తోందని ఐక్యరాజ్యసమితి నివేదిక వెలువడినా ఐడీఎఫ్ ఉధృతంగా దాడులు చేస్తోంది. దాడులు విధ్వంసకరంగా మారడంతో గాజా సిటీ నుంచి వేలాది మంది ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని తీరప్రాంతాలకు వెళ్లిపోతున్నారు. తీర ప్రాంత రహదారి పూర్తిగా వాహనాలతో నిండిపోయింది. సిటీని వీడాలన్న ఐడీఎఫ్ హెచ్చరికలతో ముందుగానే మూడున్నర లక్షల మంది తీరప్రాంతాలకు వెళ్లిపోగా భూతల దాడుల తర్వాత మరో 3 లక్షల మంది గాజా నగరాన్ని విడిచిపెట్టారని సమాచారం. ఇజ్రాయెల్ దాడుల్లో గత రెండేళ్లలో 65,062 మంది పాలస్తీనియన్లు మృతిచెందగా 1,65,697 మంది గాయపడ్డారు.

యెమెన్‌పై ఇజ్రాయెల్ వైమానిక దాడులు

యెమెన్‌లోని హొడైడాలో ఉన్న హౌతీల ఆయుధ స్థావరాలపై ఇజ్రాయెల్ భారీగా వైమానిక దాడులు జరిపింది. దీంతో హౌతీలు తమ గగనతల రక్షణ వ్యవస్థను క్రియాశీలం చేశారు. ఈ కారణంగా ఇజ్రాయెల్ విమానాలు తికమకపడి వెనుతిరిగాయని హౌతీల అధికార ప్రతినిధి ప్రకటించారు. ఆ తర్వాత హౌతీలు ఇజ్రాయెల్‌పైకి రాకెట్లు ప్రయోగించడంతో జెరుసలెంతో పాటు టెల్ అవీవ్‌లో సైరన్లు మోగాయి. హౌతీల రాకెట్లను కూల్చేశామని ఐడీఎఫ్ ప్రకటించింది.

ఈయూ ఆంక్షల యోచన

గాజాపై భారీ దాడుల నేపథ్యంలో ఇజ్రాయెల్‌పై ఆంక్షలు విధించాలని యూరోపియన్ యూనియన్ యోచిస్తోంది. అయితే ఏకాభిప్రాయం కుదరడం లేదు. జర్మనీ, హంగేరీ, చెక్ రిపబ్లిక్ వంటి దేశాలు వ్యతిరేకిస్తుండగా స్పెయిన్, ఐర్లాండ్ దేశాలు ఆంక్షలను సమర్థిస్తున్నాయి. మరోవైపు తమపై ఆంక్షలు విధించాలన్న ఈయూ యోచనను ఇజ్రాయెల్ తప్పుబట్టింది.



గాజా సరిహద్దుల్లో ఇజ్రాయెల్ యుద్ధ ట్యాంకులు

భారత కాన్సులేట్‌ను ముట్టడిస్తాం

» కెనడాలోని ఖలిస్థానీ సంస్థ 'సిక్స్ ఫర్ జస్టిస్' హెచ్చరిక

» నేడు కాన్సులేట్‌కు వెళ్లొద్దని ఇండో-కెనడియన్లకు సూచన

వాంకోవర్, సెప్టెంబరు 17: కెనడాలోని వాంకోవర్ నగరంలో ఉన్న భారత కాన్సులేట్‌ను గురువారం 12 గంటలపాటు ముట్టడించనున్నామని ఖలిస్థానీ వేర్పాటువాద సంస్థ 'సిక్స్ ఫర్ జస్టిస్' హెచ్చరించింది. అందువల్ల గురువారం భారత కాన్సులేట్‌కు వెళ్లొద్దని ఇండో-కెనడియన్లకు ఒక ప్రకటనలో సూచించింది. భారత కాన్సులేట్ కెనడాలో గూఢచర్య నెట్‌వర్క్‌ను నడుపుతోందని, ఖలిస్థానీలపై నిఘా పెట్టిందని ఆ ప్రకటనలో ఆరోపించింది. దీనిపై కాన్సులేట్‌ను జవాబుదారీ చేయాలనే డిమాండుతో ఖలిస్థాన్ అనుకూలురైన సిక్కులు ఈ ముట్టడి నిర్వహించనున్నట్టు తెలిపింది. 'హర్దీప్ సింగ్ నిజ్జర్ హత్యలో భారత ఏజంట్ల పాత్ర గురించి దర్యాప్తు జరుగుతోందని రెండేళ్ల క్రితమే నాటి ప్రధాని జస్టిన్ ట్రూడో పార్లమెంటుకు తెలిపారు. రెండేళ్లు దాటినా భారత కాన్సులేట్‌లు కెనడాలో గూఢచర్య నెట్‌వర్క్‌లను నడుపుతూనే ఉన్నాయి. ఖలిస్థాన్ ఉద్యమకారులపై నిఘా కొనసాగిస్తూనే ఉన్నాయి' అని ఆ ప్రకటనలో ఆరోపించింది. కెనడాలోని భారత నూతన రాయబారి దినేశ్ పట్నాయక్ లక్ష్యంగా ఆయన ఫొటోతో ఒక పోస్టరును కూడా విడుదల చేసింది. ఖలిస్థానీ ఉగ్రవాది హర్దీప్ సింగ్ నిజ్జర్ హత్య తర్వాత ఇరుదేశాల మధ్య రెండేళ్లుగా దెబ్బతిన్న సంబంధాల పునరుద్ధరణలో భాగంగా భారత్, కెనడా దేశాలు పరస్పరం కొత్తగా రాయబారులను నియమించుకొన్న వారం రోజులకే ఖలిస్తానీల నుంచి తాజా బెదిరింపులు రావడం గమనార్హం. 2023 జూన్‌లో వాంకోవర్‌లోని ఒక సిక్కు ఆలయం బయట ఇద్దరు సాయుధులు నిజ్జర్‌ను కాల్చిచంపారు. ఈ హత్యలో భారత ఏజెంట్ల పాత్ర ఉందని కెనడా ఆరోపించింది. నాటి భారత రాయబారితోపాటు అనేకమంది దౌత్యవేత్తలను దేశం నుంచి బహిష్కరించింది. కెనడా ఆరోపణలను తోసిపుచ్చిన భారత్ కూడా అంతే తీవ్రంగా స్పందించింది. కెనడా రాయబారి సహా ఆ దేశానికి చెందిన ఆరుగురు సీనియర్ దౌత్యవేత్తలను భారత్ నుంచి వెళ్లిపోవాలని ఆదేశించింది.

లోకం తీరు



గుంతల రోడ్లతో ఇబ్బందిగా ఉంది.. వేరే రాష్ట్రానికి వెళ్లిపోతాం

» కర్ణాటకకు బ్లాక్‌బక్ కంపెనీ షాక్!

» విశాఖకు రావాలంటూ ఆ వెంటనే ఏపీ ఐటీ మంత్రి లోకేశ్ ఆహ్వానం

బెంగళూరు, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): కర్ణాటక ప్రభుత్వానికి బెంగళూరులోని ప్రముఖ లాజిస్టిక్స్ టెక్ కంపెనీ బ్లాక్‌బక్ షాకిచ్చింది. గుంతలమయమైన రహదారులు, ట్రాఫిక్ సమస్యతో ఇబ్బంది పడుతున్నామని, అందుకే తమ కంపెనీని బెంగళూరు నుంచి తరలించాలని నిర్ణయించినట్లు ఆ సంస్థ సీఈవో రాజేశ్ యవాజీ బుధవారం 'ఎక్స్' వేదికగా ప్రకటించారు. బెంగళూరు ఔటర్ రింగ్ రోడ్డు, కాడుబీసినహళ్లి ప్రాంతంలో రహదారులు నాసిరకంగా, గుంతలమయంగా ఉన్నాయి. ఔటర్ రింగ్ రోడ్డులోని బెళ్లందూరులో తన ఇల్లు, కార్యాలయం ఉన్నాయని.. ఈ ప్రాంతం నుంచి ఎటు వెళ్లాలన్నా కష్టంగా ఉందని.. తమ ఉద్యోగులు కార్యాలయానికి వచ్చేందుకు గంటన్నరకు పైగా పడుతోందని రాజేశ్ తన పోస్టులో ఆవేదన వ్యక్తంచేశారు. రోడ్డంతా గుంతలు పడ్డాయని, దుమ్ము రేగుతోందని, కనీస నిర్వహణ కూడా లేదన్నారు. తొమ్మిదేళ్లుగా బాధలు పడుతున్నామని.. మరో ఐదేళ్లయినా ఈ సమస్య పరిష్కారమవుతుందన్న నమ్మకం లేదని తెలిపారు. అందుకే కంపెనీని తరలించాయని నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారు. బ్లాక్‌బక్ లాజిస్టిక్స్ టెక్ కంపెనీలో బి-కేపిటల్, అసీల్, గోల్డ్‌మ్యాన్ సాక్స్ లాంటి సంస్థలు పెట్టుబడులు పెట్టాయి. సంస్థలో 1,500 మంది ఉద్యోగులు ఉన్నారు. కాగా, రాజేశ్ ప్రకటనపై ఏపీ ఐటీ మంత్రి లోకేశ్ స్పందించారు. విశాఖకు వచ్చేయాలని ఆహ్వానించారు. రాజేశ్ పోస్టు.. లోకేశ్ స్పందనపై బెంగళూరులోని ప్రఖ్యాత పారిశ్రామికవేత్తలు మోహన్ దాస్ పాయ్, కిరణ్ మజుందార్ షా తీవ్రంగా స్పందించారు. బెంగళూరులో పాలనా వైఫల్యానికి ఇది నిదర్శనమని పాయ్ 'ఎక్స్'లో ధ్వజమెత్తారు.

జపాన్‌కు నకిలీ పాకిస్థాన్ ఫుట్‌బాల్ జట్టు

ఎయిర్‌పోర్ట్ నుంచే తిప్పి పంపిన అధికారులు

లాహోర్, సెప్టెంబరు 17: జపాన్‌లో అడుగుపెట్టిన ఓ నకిలీ పాకిస్థాన్ ఫుట్‌బాల్ జట్టు గుట్టురట్టయింది. ఈ జట్టు మోసం బయటపడటంతో అక్కడి నుంచి వెనక్కి పంపేసినట్టు ఫెడరల్ ఇన్వెస్టిగేషన్ ఏజెన్సీ(ఎఫ్ఐఏ) బుధవారం వెల్లడించింది. 22 మందితో ఉన్న నకిలీ ఫుట్‌బాల్ జట్టును జపాన్‌కు పంపడంలో ఓ మానవ అక్రమ రవాణా నెట్‌వర్క్ ప్రమేయం ఉన్నట్టుగా పేర్కొంది. 15 రోజుల వీసాతో ఈ జట్టు జూన్‌లో జపాన్‌కు చేరుకుంది. నకిలీ ఆటగాళ్లు ఫుట్‌బాల్ కిట్స్ ధరించడమేకాకుండా పాకిస్థాన్ ఫుట్‌బాల్ ఫెడరేషన్ వద్ద రిజిస్టర్ అయి ఉన్నామని, ఓ జపనీస్ క్లబ్‌తో మ్యాచ్‌లు ఆడాల్సి ఉందని కూడా చెప్పారు. అయితే వీరిపై అనుమానం రావడంతో జపనీస్ ఇమ్మిగ్రేషన్ అధికారులు ప్రశ్నించారు. నకిలీ జట్టుగా గుర్తించి విమానాశ్రయం నుంచే వెనక్కి పంపించారు.

మోదీకి శుభాకాంక్షల వెల్లువ

న్యూఢిల్లీ, సెప్టెంబరు 17: ప్రధాని మోదీకి బుధవారంతో 75 ఏళ్లు నిండడంతో పలువురు ప్రముఖులు, ప్రపంచ నేతలు ఆయనకు తమ శుభాకాంక్షలు తెలియజేశారు. ఆయన నాయకత్వ లక్షణాలను ప్రశంసించారు. బీజేపీ ఈ సందర్భంగా 15 రోజుల పాటు పలు సంక్షేమ కార్యక్రమాలను చేపట్టేందుకు నిర్ణయించింది. రాష్ట్రపతి ముర్ము ఉన్నత లక్ష్యాలను సాధించేలా దేశాన్ని మలిచారని ప్రధానిని ప్రశంసిస్తూ జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఖర్గే, రాహుల్‌గాంధీ కూడా తమ శుభాకాంక్షలు తెలిపారు. రష్యా అధ్యక్షుడు పుతిన్, ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు, ఇటలీ ప్రధాని జార్జియా మెలోనీ, ఆస్ట్రేలియా ప్రధాని ఆంథోనీ అల్బనీస్, శ్రీలంక అధ్యక్షుడు అనుర కుమార దిశ నాయకే తదితరులు మోదీకి శుభాకాంక్షలు తెలిపారు.

నిజాం పాలనలో ఎన్నో దారుణాలు

హైదరాబాద్ విమోచన దినాన్ని గత పాలకులు పట్టించుకోలేదు

» మేం వచ్చాకే 'సెప్టెంబరు 17'ను అధికారికంగా ప్రకటించాం

» మధ్యప్రదేశ్‌లో సభలో ప్రధాని మోదీ

ధార్ (మధ్యప్రదేశ్), సెప్టెంబరు 17: నిజాం పాలనలో హైదరాబాద్ సంస్థానంలో అనేక దారుణాలు జరిగాయని ప్రధాని మోదీ గుర్తుచేశారు. నిజాం పాలకుల చెర నుంచి హైదరాబాద్‌కు విముక్తి కల్పించడంలో సర్దార్ వల్లభాయ్ పటేల్ కీలకపాత్ర పోషించారన్నారు. ఉక్కు మనిషి పటేల్ చొరవతోనే హైదరాబాద్ సంస్థానం భారత్‌లో భాగమైందని కొనియాడారు. బుధవారం మధ్యప్రదేశ్‌లోని ధార్ జిల్లాలో ప్రధాని మోదీ పలు అభివృద్ధి కార్యక్రమాలకు ప్రారంభోత్సవం, శంకుస్థాపనలు చేశారు. అనంతరం నిర్వహించిన బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. "ఈ రోజు సెప్టెంబరు 17. ఇది మరో చరిత్రాత్మక దినం. సర్దార్ వల్లభాయ్ పటేల్ ఎంతో ధైర్య సాహసాలు చూపించి హైదరాబాద్‌ను దేశంలో విలీనం చేశారు. భారత సైన్యం నిజాం అకృత్యాల నుంచి హైదరాబాద్ సంస్థానానికి విముక్తి కల్పించింది. దానికి గుర్తుగా హైదరాబాద్ విమోచన దినం నిర్వహిస్తున్నాం" అని ప్రధాని చెప్పారు. హైదరాబాద్ విమోచన దినం మనకు స్ఫూర్తిదాయకమని, భరతమాత గౌరవం కంటే పెద్ద అంశమేదీ లేదని అన్నారు. ఇంతటి ఘన విజయాన్ని కూడా కొన్ని దశాబ్దాల పాటు జరుపుకోలేకపోయామంటూ ప్రతిపక్షాలపై విమర్శలు గుప్పించారు. తమ ప్రభుత్వం వచ్చాకే సెప్టెంబరు 17ను హైదరాబాద్ విమోచన దినంగా అధికారికంగా ప్రకటించినట్లు చెప్పారు. ప్రస్తుతం హైదరాబాద్ నగరంలో విమోచన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించుకుంటున్నారని తెలిపారు.

'స్వస్థ్ నారీ సశక్త్ పరివార్' ప్రారంభం

తన పుట్టిన రోజునాడు మధ్యప్రదేశ్‌లో పర్యటిస్తున్న ప్రధాని మోదీ.. 'స్వస్థ్ నారీ సశక్త్ పరివార్, రాష్ట్రీయ పోషణ్ మాహ్' కార్యక్రమాలను ప్రారంభించారు. మహిళల ఆరోగ్యాన్ని మెరుగుపరచడం కోసం ఈ పథకాలను ప్రారంభించినట్లు తెలిపారు. వికసిత్ భారత్‌కు మహిళలు, యువత, పేదలు, రైతులు నాలుగు స్తంభాలని పేర్కొన్నారు. నారీ శక్తి మన దేశాభివృద్ధికి పునాది అన్నారు. తల్లి ఆరోగ్యంగా ఉంటే ఇంట్లోని వారంతా ఆరోగ్యంగా ఉంటారని, తల్లికి సుస్తీ చేస్తే మొత్తం ఇల్లంతా జబ్బు పడినట్లే నని తెలిపారు. అందుకే 'స్వస్థ్ నారీ సశక్త్ పరివార్' కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు వెల్లడించారు. మెరుగైన వైద్య సేవల ద్వారా కుటుంబాలను, దేశాన్ని బలోపేతం చేసే లక్ష్యంతో ఈ పథకాలను తీసుకొచ్చినట్లు చెప్పారు. ఇదే సమయంలో పహల్గాం ఉగ్రదాడులను ప్రస్తావించిన మోదీ.. ఆపరేషన్ సిందూర్‌తో పాక్‌లోని ఉగ్రస్థావరాలను ధ్వంసం చేశామని చెప్పారు. అణు ముప్పులకు నవ భారతం భయపడదని మోదీ అన్నారు. కాగా, 'స్వస్థ్ నారీ, సశక్త్ పరివార్ అభియాన్' కార్యక్రమంలో భాగంగా ఈసీఐసీ బుధవారం నుంచి అక్టోబరు 2వ తేదీ వరకు దేశవ్యాప్తంగా తన అధీనంలోని 160 ఆస్పత్రుల్లో, 1600కు పైగా డిస్పెన్సరీల్లో మహిళల కోసం హెల్త్ క్యాంప్‌లు నిర్వహించనుంది. ఈ హెల్త్ క్యాంపుల్లో ఉచితంగా రోగనిర్ధారణ పరీక్షలు చేయనున్నారు. ఈ మేరకు బుధవారం కేంద్ర కార్మిక శాఖ ఒక ప్రకటన విడుదల చేసింది.



ధార్‌లో పసిపాపతో ఆడుకుంటున్న మోదీ

మోదీ బాల్యంపై పాఠశాలల్లో సినిమా

న్యూఢిల్లీ, సెప్టెంబరు 17: మోదీ బాల్యంలో జరిగిన ఘటనల ఆధారంగా రూపొందిన 'చలో జీతే హై' చిత్రాన్ని బడుల్లో ప్రదర్శించనున్నారు. ఈ సినిమా ప్రదర్శనపై అనుబంధ పాఠశాలలకు తగిన ఆదేశాలు జారీ చేయాలని సీబీఎస్ఈ, కేంద్రీయ విద్యాలయ సంఘటన్ (కేవీఎస్), నవోదయ విద్యాలయ సమితి (ఎన్‌వీఎస్) ఉన్నతాధికారులకు కేంద్ర విద్యాశాఖ జాయింట్ సెక్రటరీ అర్చనా శర్మ అవస్థీ ఇటీవల లేఖలు రాశారు. విద్యార్థుల్లో వ్యక్తిత్వం, బాధ్యత, సేవా గుణాలను పెంపొందించే దిశగా ఈ మేరకు చర్యలు తీసుకోవాలని కోరారు. కాగా, 32 నిమిషాల నిడివితో 2018లో విడుదలైన ఈ చిత్రం 2019లో బెస్ట్ నాన్-ఫీచర్ ఫిల్మ్ కేటగిరీలో జాతీయ అవార్డు కైవసం చేసుకుంది.

ఈవీఎంపై అభ్యర్థుల కలర్ ఫొటోలు

» ఓటింగ్ ప్రక్రియలో పారదర్శకతకు ఎన్నికల కమిషన్ కీలక నిర్ణయం

న్యూఢిల్లీ, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఓటింగ్ ప్రక్రియలో మరింత పారదర్శకతను తెచ్చేందుకు కేంద్ర ఎన్నికల కమిషన్ కీలక నిర్ణయం తీసుకుంది. బిహార్ ఎన్నికల నేపథ్యంలో ఎస్ఐఆర్, ఓట్ల చోరీ వంటి ఆరోపణలవేళ ఎలక్షన్ కమిషన్ కీలక మార్పులకు శ్రీకారం చుట్టింది. ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషిన్ల (ఈవీఎం) బ్యాలెట్ పేపర్లు, అభ్యర్థి ఫొటో స్పష్టంగా ఉండేలా కొన్ని మార్గదర్శకాలను రూపొందించింది. వీటిని బుధవారం కేంద్ర ఎన్నికల సంఘం వెల్లడించింది. ఈమేరకు అన్ని రాష్ట్రాలు/కేంద్రపాలిత ప్రాంతాలకు చెందిన ఎన్నికల కమిషనర్లకు లేఖలు రాసింది. ఈవీఎం బ్యాలెట్ పేపర్ల రూపకల్పన, ముద్రణలో స్పష్టత, అందరికీ కనిపించేలా, స్పష్టంగా చదవగలిగేలా మార్గదర్శకాలను సవరించినట్టు ఈసీఐ పేర్కొంది. నోటాతో సహా అభ్యర్థులందరి పేర్లు ఒకే రకమైన ఫాంట్‌లో ఓటర్లు సులభంగా చదవగలిగేలా తగినంత పెద్ద ఫాంట్ సైజులో ముద్రించనున్నట్లు స్పష్టం చేసింది. బిహార్ ఎన్నికల నుంచే రంగు ఫొటోలు, పెద్ద ఫాంట్‌తో ఈవీఎం బ్యాలెట్ పేపర్లకు శ్రీకారం చుట్టనున్నట్టు తెలిపింది.

ప్రధాన మార్పులు ఇవే..

- **కలర్ ఫొటోలు:** ఇకపై ఈవీఎం బ్యాలెట్ పత్రంపై అభ్యర్థుల ఫొటోలు నలుపు, తెలుపు రంగులో కాకుండా కలర్‌లో ప్రింట్ చేస్తారు. ఫొటోలో మూడు వంతుల భాగం అభ్యర్థి ముఖం స్పష్టంగా కనిపించేలా ముద్రిస్తారు.
- **పెద్ద సీరియల్ నంబర్లు:** అభ్యర్థుల సీరియల్ నంబర్లు, నోటా గుర్తును పెద్దగా, స్పష్టంగా కనిపించేలా బోల్డ్ అక్షరాలతో (30 ఫాంట్ సైజు) ముద్రిస్తారు.
- **ఒకే రకమైన ఫాంట్:** అభ్యర్థులందరి పేర్లు, నోటా ఆప్షన్‌ను సులభంగా చదవగలిగేలా ఒకే రకమైన పెద్ద ఫాంట్‌లో ఉంటాయి.

చాలా రాష్ట్రాల్లో సగం మందికిపైగా ఓటర్లు

ఎస్ఐఆర్‌కు పత్రాలు ఇవ్వనవసరం లేదు: ఈసీ

» వారంతా గత ఎస్ఐఆర్‌లోనే పత్రాలు సమర్పించారని వెల్లడి

న్యూఢిల్లీ, సెప్టెంబరు 17: చాలా రాష్ట్రాల్లో సగం మందికిపైగా ఓటర్లు ఎస్ఐఆర్(సమగ్ర ఓటర్ల సవరణ)లో ఏ విధమైన పత్రాలూ సమర్పించాల్సిన అవసరం ఉండకపోవచ్చని ఎన్నికల కమిషన్ అధికారులు బుధవారం వెల్లడించారు. వారంతా ఆయా రాష్ట్రాల్లో గత ఎస్ఐఆర్‌లోనే ఓటర్లుగా నమోదవడమే దీనికి కారణమని పేర్కొన్నారు. చాలా రాష్ట్రాలు 2002, 2004 సంవత్సరాల మధ్య ఎస్ఐఆర్ నిర్వహించాయని తెలిపారు. గత ఎస్ఐఆర్ నిర్వహించిన సంవత్సరాన్నే తదుపరి ఎస్ఐఆర్‌కు కటాఫ్ తేదీగా పరిగణిస్తామని పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా మళ్లీ ఎప్పుడు ఎస్ఐఆర్ నిర్వహించాలో ఈసీ త్వరలో తేదీని నిర్ణయించనుంది. గత ఎస్ఐఆర్ తర్వాత ప్రచురించిన ఎన్నికల జాబితాలను సిద్ధంగా ఉంచుకోవాలని ఆయా రాష్ట్రాల ముఖ్య ఎన్నికల అధికారుల(సీఈవోల)ను ఇప్పటికే ఈసీ ఆదేశించింది. కొన్ని రాష్ట్రాల సీఈవోలు ఇప్పటికే ఆ జాబితాలను తమ వెబ్‌సైట్‌లలో ఉంచారు. ఢిల్లీలో చివరిసారిగా 2008 సంవత్సరంలో ఎస్ఐఆర్ నిర్వహించడంతో 2008 నాటి ఓటర్ల జాబితాను ఢిల్లీ సీఈవో వెబ్‌సైట్‌లో ఉంచారు. అలాగే, ఉత్తరాఖండ్ సీఈవో 2006 నాటి ఓటర్ల జాబితాను వెబ్‌సైట్‌లో ఉంచారు. కాగా, బిహార్‌లో 2003లో ఎస్ఐఆర్ నిర్వహించడంతో అప్పుడు ఓటర్లుగా నమోదైన 4.96 కోట్ల మంది(ప్రస్తుత ఓటర్లలో దాదాపు 60శాతం మంది) తాజా ఎస్ఐఆర్‌లో ఎలాంటి పత్రాలూ సమర్పించాల్సిన అవసరం లేదని అధికారులకు ఈసీ సూచించింది. కాగా ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన ఓటర్ల కోసం అదనంగా మరో డిక్లరేషన్ ఫామ్‌ను పొందుపరిచారు. వీరంతా 1987 జూలై 1వ తేదీకి ముందు భారతదేశంలోనే పుట్టామని నిర్ధారించేందుకు ఏదైనా పత్రాన్ని సమర్పించాల్సి ఉంటుంది. అలాగే, 1987 జూలై 1-2004 డిసెంబరు 2వ తేదీ మధ్య పుట్టిన దరఖాస్తుదారులు తమ తల్లిదండ్రుల పుట్టిన తేదీ, స్థలం నిర్ధారించే పత్రాలను కూడా సమర్పించాలి.

సాహిత్య విమర్శకుడు ఆచార్య ఎస్వీ రామారావు కన్నుమూత



హైదరాబాద్ సిటీ, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): తెలుగు సాహిత్య విమర్శ అధ్యయనంలో మేటి, ప్రముఖ సాహిత్య విమర్శకులు ఆచార్య ఎస్వీ రామారావు(85) కన్నుమూశారు. కొంతకాలంగా కాలేయ సమస్యతో బాధపడుతున్న ఆయన హైదరాబాద్‌లోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ బుధవారం తుది శ్వాస విడిచారు. మహబూబ్‌నగర్ జిల్లా శ్రీరంగాపురంలో 1941 జూన్ 5న జన్మించిన ఎస్వీ రామారావు పూర్తి పేరు సుగూరు వెంకట రామారావు. హైదరాబాద్ నిజాం కళాశాలలో పీయూసీ, డిగ్రీ చేసిన ఎస్వీ రామారావు.. ఉస్మానియా విశ్వవిద్యాలయంలో ఎంఏ తెలుగు పూర్తి చేశారు. అలాగే, సినారె పర్యవేక్షణలో 'తెలుగులో సాహిత్య విమర్శ - అవతరణ వికాసాలు' అంశంపై పరిశోధన చేసి ఓయూ నుంచి పీహెచ్‌డీ అందుకున్నారు. 1966లో ఓయూలో తెలుగు అధ్యాపకునిగా చేరిన ఎస్వీ రామారావు 1987లో ఆచార్యుడిగా పదోన్నతి పొందారు. ఓయూ తెలుగుశాఖ అధ్యక్షుడిగా, బోర్డు ఆఫ్ స్టడీస్ సంచాలకుడిగా పని చేశారు. 2001లో ఉద్యోగ విరమణ పొందిన ఆయన ఒకటో తరగతి నుంచి ఎంఏ కోర్సు వరకు తెలుగు పాఠ్యపుస్తకాల రూపకల్పనలో కీలక భాగస్వామ్యం వహించారు. ఎస్వీ రామారావు 40కిపైగా సాహిత్య విమర్శ పుస్తకాలు రచించారు. అందులో తెలుగు సాహిత్య వైశిష్ట్యం, తెలంగాణ సాహిత్య చరిత్ర, సమగ్ర తెలుగు సాహిత్య చరిత్ర, సమగ్ర తెలుగు వాఙ్మయకోశం, పాలమూరు ఆధునిక కవుల చరిత్ర తదితర రచనలు ప్రత్యేక గుర్తింపు పొందాయి. సాహిత్య విమర్శలో ఎస్వీ రామారావు చేసిన కృషిని గుర్తించి తెలుగు విశ్వవిద్యాలయం విశిష్ట పురస్కారం, శ్రీకృష్ణ దేవరాయ భాషానిలయం దాశరథి స్మారక పురస్కారంతో గౌరవించాయి. బూర్గుల రామకృష్ణారావు, బీఎన్ శాస్త్రి స్మారక అవార్డులతోపాటు ఎన్నో పురస్కారాలు వరించాయి. పలువురు సాహిత్య విమర్శకులు ఎస్వీ రామారావు మీద అభిమానంతో 'విమర్శనా రామం' వ్యాస సంకలనాన్ని వెలువరించారు. సాహిత్య విమర్శను విశ్వవిద్యాలయ స్థాయిలో చారిత్రక దృష్టి తో అధ్యయనం చేయడానికి ఎస్వీ రామారావు బాటలు వేశారని ఏపీ, తెలంగాణ అభ్యుదయ రచయితల సంఘం ప్రతినిధులు గుర్తు చేసుకున్నారు. ఎస్వీ రామారావు మృతి పట్ల తెలంగాణ ప్రభుత్వ మాజీ సలహాదారు కేవీ రమణాచారి, ప్రముఖ రచయిత్రి ముదిగంటి సుజాతారెడ్డి, తెలంగాణ సారస్వత పరిషత్ అధ్యక్షుడు ఎల్లూరి శివారెడ్డి, ప్రధాన కార్యదర్శి జె. చెన్నయ్య, కవి యాకూబ్, ఓయూ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య కాసీం తదితరులు విచారం వ్యక్తం చేశారు. ఎస్వీ రామారావుకు భార్య స్వయంప్రభ, కుమారుడు సాయి గిరిధర్ ఉన్నారు. అమెరికాలో స్థిరపడిన సాయి గిరిధర్ గురువారం సాయంత్రానికి హైదరాబాద్‌కు చేరుకోనుండగా ఎస్వీ రామారావు అంత్యక్రియలు శుక్రవారం జరగనున్నాయి. ఎల్బీనగర్ చిత్ర లేఅవుట్‌లోని ఆయన స్వగృహంలో ఎస్వీ రామారావు భౌతికకాయాన్ని శుక్రవారం ఉదయం 6 గంటల నుంచి 11 గంటల వరకు ఉంచుతామని, అనంతరం అంత్యక్రియలు నిర్వహిస్తామని కుటుంబసభ్యులు తెలిపారు.

ఛత్తీస్‌గఢ్‌లో మరో ఎన్‌కౌంటర్

- నలుగురు మావోయిస్టులు మృతి
- ఇన్‌ఫార్మర్ పేరిట గిరిజనుడిని హత్య చేసిన మావోయిస్టులు
- లొంగిపోయిన 12 మంది

చర్ల/చింతూరు, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఛత్తీస్‌గఢ్‌లోని రెండు వేర్వేరు జిల్లాల్లో బుధవారం జరిగిన ఎన్‌కౌంటర్లలో నలుగురు మావోయిస్టులు మృతి చెందారు. అందులో ఇద్దరు మహిళా మావోయిస్టులు ఉన్నారు. ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర సరిహద్దులోని గడ్చిరోలి జిల్లా ఏటపల్లి అటవీ ప్రాంతంలో సీ-60 కమాండోలు కూంబింగ్ నిర్వహించారు. ఈక్రమంలో తారసపడిన మావోయిస్టులు, కమాండోల మధ్య ఎదురుకాల్పులు జరిగాయి. ఇద్దరు మహిళా మావోయిస్టులు మృతి చెందారు. ఘటనా స్థలంలో ఒక ఏకే 47 తుపాకీ, ఒక రైఫిల్‌తో సహా భారీగా పేలుడు సామగ్రిని కమాండోలు స్వాధీనం చేసుకున్నారు. అలాగే, బీజాపూర్ జిల్లా గంగులూర్ అటవీ ప్రాంతంలో డీఆర్‌జీ, ఎస్టీఎఫ్ జవాన్ల కూంబింగ్ సందర్భంగా ఎదురుకాల్పులు జరిగాయి. మరో ఇద్దరు మావోయిస్టులు మృతి చెందారు. ఘటనా స్థలంలో 303 రైఫిల్, బీజీఎల్ లాంచర్, పేలుడు సామగ్రిని జవాన్లు స్వాధీనం చేసుకున్నారు. ఇక అబూజ్‌మాడ్ పరిధిలోని నారాయణపూర్ జిల్లాలో 12మంది మావోయిస్టులు పోలీసుల ఎదుట లొంగిపోయారు. వారిలో ఐదుగురు మహిళా మావోయిస్టులతోపాటు ఏరియా కమిటీ సభ్యులు ఉన్నారు. మొత్తంగా వీరందరిపై రూ.18లక్షల రివార్డు ఉన్నట్లు పోలీసులు పేర్కొన్నారు. మరోవైపు ఛత్తీస్‌గఢ్‌లోని దంతెవాడ జిల్లా నిలవయా గ్రామంలో కోరం బండి (45) అనే గిరిజనుడిని పోలీసు ఇన్‌ఫార్మర్‌గా పేర్కొంటూ మావోయిస్టులు హత్య చేశారు. నాలుగేళ్ల క్రితం కోరం బండి కుమారుడిని కూడా మావోయిస్టులు ఇలాగే చంపేశారు. ఇక కాంకేర్ జిల్లాలో పోలీసులు బుధవారం మోస్ట్ వాంటెడ్ మావోయిస్టుల పోస్టర్లు, బ్యానర్లను విడుదల చేశారు. వాటిపై ఉన్న మావోయిస్టుల ఆచూకీ తెలిపిన వారికి బహుమతి ఇస్తామంటూ ముమ్మర ప్రచారం చేపట్టారు.

నవనవలాడే దశలో పండుటాకై..

వరుస వానలకు పత్తి పంట సర్వనాశనం.. ఎర్రబారిన మొక్కలు.. నేలరాలుతున్న కాయలు

- చీడపీడల సమస్య.. రైతుల గుండె చెరువు
- పెట్టుబడి కూడా చేతికి రాదనే నైరాశ్యం
- ఆదిలాబాద్‌లో 14వేల ఎకరాల్లో నష్టం



ఎరుపుబారిన పత్తి పంటను చూపుతున్న రైతు ముకుంద్

ఆదిలాబాద్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): కొన్నాళ్లుగా కురుస్తున్న వర్షాలు పత్తి రైతులను కష్టాల్లోపడేశాయి. చేలో నీరు నిలవడంతో పత్తి మొక్కలు మురిగిపోతున్నాయి. చిగుళ్లు వేసి ఏపుగా ఎదగాల్సిన దశలో చాలాచోట్ల పండుటాకులతో మొక్కలు వెలవెలబోతున్నాయి. ఇంకొన్నిచోట్ల పంట ఎర్రబారుతోంది. మరికొన్నిచోట్ల పూత, కాత దశలో ఉన్న పంటకు చీడపీడలు ఆశించాయి. ముందుగా పంట వేసిన చోట్ల పత్తి కాయలు నేలరాలుతున్నాయి. మొత్తంగా పత్తిపంట పత్తి పంటలా లేదు. రెక్కల కష్టంతో దుక్కిచేసి.. విత్తనాలు వేసి, కలుపుతీసిన పంటేనా ఇది? అని రైతులు తల పట్టుకుంటున్నారు. వర్షాల కారణంగా రాష్ట్రవ్యాప్తంగా పత్తిపంటకు తీవ్రనష్టం జరిగింది. ఆదిలాబాద్ జిల్లాలో 5.72 లక్షల ఎకరాల్లో పత్తిపంట సాగైతే 13,804 ఎకరాల్లో పంట నష్టం జరిగింది. చాలాచోట్ల బురద మట్టి, ఇసుక మేటలు వేయడంతో పంట పూర్తిగా నేలమట్టమైంది. మరికొన్నిచోట్ల పంట సాగుచేసి మూడు నెలలవుతున్నా మొక్కలు మూరెడెత్తయినా ఎదిగినట్లు కనిపించడం లేదని రైతులు అంటున్నారు. నేల చిత్తడిగా ఉండటంతో కలుపు నివారణ సాధ్యం కావడం లేదు. కాలు తీసి కాలు పెట్టే పరిస్థితి కనిపించడం లేదు. దీంతో పత్తి మొక్కలను కలుపు మొక్కలు కప్పేస్తున్నాయి. ముఖ్యంగా నల్లరేగడి నేలల్లో సాగు చేస్తున్న పత్తి పంటకు భారీ నష్టం వాటిల్లుతోంది. వర్షాలు తగ్గుముఖం పడితేనే దిగుబడులపై ఆశలు ఉంటాయని.. లేదంటే పెట్టుబడులూ నష్టపోయి, అప్పులు మిగులుతాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పురుగుమందులు పిచికారి చేస్తున్నా చీడపీడల బెడద వీడటం లేదని, పెస్టిసైడ్స్‌తో అదనపుభారం పడుతోందని రైతులు చెబుతున్నారు. ఇప్పటికే ఎకరాకు రూ.20వేల నుంచి రూ.30 వేల వరకు పెట్టుబడులు పెట్టామని, పరిస్థితులు చూస్తుంటే ఈ డబ్బులూ చేతికి వచ్చే పరిస్థితి కనిపించడం లేదని చెబుతున్నారు. ముఖ్యంగా పత్తిలో వేరుకుళ్లు తెగుళ్ల ఉధృతి ఎక్కువగా కనిపిస్తోంది.

నీరు నిలవకుండా జాగ్రత్తలు తీసుకోవాలి



పత్తి పంటలో వర్షపు నీరు నిలవకుండా రైతులు జాగ్రత్తలు తీసుకోవాలి. చేలో రోజుల తరబడి నీరు నిలిస్తే మొక్కలు పోషకాలను తీసుకొనే పరిస్థితి ఉండదు. ఫలితంగా ఆకులు ఎర్రబారిపోయి రాలిపోతాయి. దీన్ని అధిగమించేందుకు యూరియా, 20:20, 19:19 ఫర్టిలైజర్ ఎరువులను అందించాలి.

- శివకుమార్, ఏడీఏ, ఆదిలాబాద్

దిగుబడి రావడం కష్టమే



కురుస్తున్న భారీ వర్షాలకు పంట ఎదుగుదలపై ప్రభావం పడుతోంది. కాత పూత దశలోనే అధిక వర్షాలు కురవడం ఇబ్బందికరంగా మారింది. రసాయన మందులు పిచికారి చేసేందుకు కూడా సమయం లేకుండా పోయింది. దీంతో చీడపీడలు ఆశించి పంటను దెబ్బతీస్తున్నాయి. పంట భూములు జాలుపట్టి పోయి పత్తి ఎర్రబారుతూ ఆకులు నేలరాలుతున్నాయి. పెట్టుబడి కూడా చేతికి రావడం కష్టంగానే కనిపిస్తోంది.

- పాముల గంగాదర్, రైతు, బజార్‌హత్నూర్, ఆదిలాబాద్

'క్యాప్స్ గోల్డ్' ఆఫీసుల్లో ఐటీ సోదాలు

- నాలుగు రాష్ట్రాల్లోని 15 ప్రాంతాల్లో తనిఖీలు
- పన్ను ఎగవేత సహా ఇతర అవకతవకలపై నజర్
- అక్రమంగా బంగారం కొంటున్నట్లు అనుమానాలు

హైదరాబాద్/బోయినపల్లి, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): పన్ను ఎగవేతకు సంబంధించిన ఆరోపణలపై క్యాప్స్ గోల్డ్ కంపెనీ ఆఫీసులు, షోరూంలు, కంపెనీ డైరెక్టర్ల ఇళ్లలో ఆదాయపు పన్ను శాఖ అధికారులు బుధవారం సోదాలు చేపట్టారు. హైదరాబాద్‌లోని క్యాప్స్ గోల్డ్ ఆఫీసులు, షోరూంలు, కంపెనీ డైరెక్టర్ల ఇళ్లతోపాటు విశాఖ, విజయవాడ, ముంబై, బెంగళూరులోని క్యాప్స్ గోల్డ్ షోరూంల్లో (నాలుగు రాష్ట్రాల్లోని 15ప్రాంతాల్లో) తనిఖీలు జరిగాయి. వాస్తవానికి క్యాప్స్ గోల్డ్ కంపెనీని 1901లో ప్రారంభించారు. అప్పట్లో చందా అంజయ్య పరమేశ్వర్ జ్యువెలరీస్ పేరిట వ్యాపారం ప్రారంభించారు. అదే సంస్థను క్యాప్స్ గోల్డ్‌గా మార్చిన నిర్వాహకులు.. దేశవ్యాప్తంగా వ్యాపారాన్ని విస్తరించారు. క్యాప్స్ గోల్డ్ సంస్థ నిర్వహిస్తున్న కొన్ని స్కీముల్లో వచ్చిన డబ్బులతోపాటు దిగుమతి చేసుకున్న బంగారం, ఎగుమతి చేస్తున్న ఆభరణాలు, ఎంఎంటీసీ నుంచి కొనుగోలు చేస్తున్న బంగారానికి సంబంధించిన వ్యవహారంలో పన్ను ఎగవేతలు ఉన్నట్లు ఐటీకి ఫిర్యాదులు అందినట్లు తెలిసింది. ఇందులో భాగంగానే క్యాప్స్ గోల్డ్ కంపెనీ చైర్మన్ చందా నర్సింహరావు, డైరెక్టర్లు చందా శ్రీనివాస్, చందా వెంకటేశ్, చందా శ్రీనివాసరావు ఇళ్లల్లో తనిఖీలు జరిగాయి. బోయినపల్లిలోని లగ్జరీ గ్రీన్ విల్లాలో ఉన్న మూడు విల్లాలు, ఆయా ఇళ్ల ముందు ఉన్న ఖరీదైన కార్లలోనూ అధికారులు సోదాలు చేశారు. క్యాప్స్ గోల్డ్ కంపెనీ.. బ్లాక్ మార్కెట్ నుంచి అక్రమంగా బంగారాన్ని కొనుగోలు చేస్తోందని ఐటీ అధికారులు అనుమానిస్తున్నారు. అలాగే, కాప్ గోల్డ్ నుంచి పెద్ద ఎత్తున బంగారు ఆభరణాలు తీసుకుంటున్న కొన్ని రిటైల్ ఆభరణాల షాపుల్లోనూ ఐటీ అధికారులు తనిఖీలు చేపట్టారు. సికింద్రాబాద్ జనరల్ బజార్‌లోని పవన్ జ్యువెల్లర్స్‌లో స్టాక్‌తోపాటు రికార్డులను పరిశీలించారు. వాస్తవానికి బంగారం స్మగ్లింగ్ చేస్తుండగా గత ఏడాది చెన్నైలో పవన్ జ్యువెల్లర్స్ యజమాని పవన్‌కుమార్‌ను డీఆర్ఐ అధికారులు పట్టుకున్నారు. కాగా, కాప్స్ గోల్డ్‌కు బ్లాక్ మార్కెట్‌లో బంగారం అందజేస్తున్న లింకులను సైతం ఐటీ అధికారులు పరిశీలిస్తుండటడంతో బంగారం వ్యాపారుల్లో కలవరం నెలకొంది.

ఇంటర్వ్యూకని వెళ్లి... తిరిగిరాని లోకాలకు

- రోడ్డు ప్రమాదంలో భార్య, తండ్రి మృతి
- యువకుడికి తీవ్రగాయాలు





నారాయణ, పూజ (ఫైల్)

నందిపేట/ మాక్లూర్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో తండ్రి, భార్య మృతి చెందగా యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. నిజామాబాద్ జిల్లా నందిపేట మండలంలోని తల్వేద గ్రామానికి చెందిన నీరడి చింటూ తన భార్య పూజ (26)కు ఇంటర్వ్యూ ఉండడంతో తనను రైల్వేస్టేషన్‌లో దింపడానికి తన తండ్రి నీరడి నారాయణ (59)తో కలిసి ద్విచక్రవాహనంపై బుధవారం ఉదయం నిజామాబాద్‌కు బయలుదేరాడు. మార్గమధ్యలో మాక్లూర్ మండలం దుర్గానగర్ శివారులో బైకు అదుపుతప్పి పడిపోయింది. తీవ్రంగా గాయపడిన నారాయణ అక్కడికక్కడే మృతి చెందగా, చింటూ, పూజలకు కూడా తీవ్రంగా గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు వారిని ఆస్పత్రికి తరలించగా.. పూజ చికిత్స పొందుతూ మృతి చెందింది. చింటూ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. కాగా వీరికి పది నెలల కిందటే వివాహం జరిగింది. వివాహానికి ముందు సాఫ్ట్‌వేర్ ఇంజనీరుగా పనిచేసిన పూజ వివాహానంతరం మానేసింది. ఇంట్లో ఖాళీగా ఉండడం ఇష్టం లేక మళ్లీ ఉద్యోగ ప్రయత్నాలు ప్రారంభించింది. ఈ నేపథ్యంలోనే ఈ ప్రమాదం చోటుచేసుకోవడం విషాదం. పోలీసులు కేసు నమోదు చేశారు..

అప్పులు తీర్చలేక రైతు ఆత్మహత్య



దేవసోత్ రవి

చిన్నశంకరంపేట, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ కలిసి రాకపోవడం, ఆర్థిక ఇబ్బందులు, పెరిగిపోయిన అప్పుల నేపథ్యంలో జీవితంపై విరక్తి చెందిన ఓ రైతు ఆత్మహత్య చేసుకుని బలన్మరణానికి పాల్పడ్డాడు. ఈ ఘటన మెదక్ జిల్లా చిన్నశంకరంపేట మండలంలోని కామారం తండాలో బుధవారం జరిగింది. తండాకు చెందిన దేవసోత్ రవి(44) వ్యవసాయం చేస్తూ జీవనం కొనసాగిస్తున్నాడు. తన ఇంటి నిర్మాణం కోసం, వ్యవసాయ పెట్టుబడి అవసరాల నిమిత్తం ఓ బ్యాంకులో పొలాన్ని తాకట్టు పెట్టి రూ.5 లక్షల రుణాన్ని తీసుకున్నాడు. ఈ అప్పులు తిరిగి చెల్లించే మార్గం కనిపించకపోవడంతో మనోవేదనకు గురై బుధవారం తన వ్యవసాయ పొలం వద్ద చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు.

క్షవరం చేయలేదని బార్బర్ షాపు యజమాని తల్లిదండ్రులపై యువకుడి దాడి

- సంగారెడ్డి జిల్లా పోతిరెడ్డిపల్లిలో ఘటన

జోగిపేట రూరల్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): ముందుగా తనకు క్షవరం చేయలేదన్న ఆగ్రహంతో బార్బర్ షాపు యజమాని తల్లిదండ్రులపై ఓ యువకుడు దాడి చేసిన ఉదంతమిది. ఎస్సై పాండు కథనం ప్రకారం.. సంగారెడ్డి జిల్లా అందోల్ మండల పరిధి పోతిరెడ్డిపల్లికి చెందిన సాయి అదే గ్రామంలో సెలూన్ నడుపుతున్నాడు. బుధవారం అదే గ్రామానికి చెందిన ఉపేందర్ సెలూన్‌కు వచ్చాడు. అప్పటికే సెలూన్‌లో కొందరు ఉన్నప్పటికీ తనకు ముందుగా క్షవరం చేయాలని సాయిని కోరారు. ముందు వచ్చిన వారు కొందరు ఉన్నారని, కొంచెం సమయం పడుతుందని సాయి చెప్పడంతో ఆగ్రహానికి గురైన ఉపేందర్ నేరుగా సాయి ఇంటికి వెళ్లి.. అతని తల్లిదండ్రులు శంకర్, రుక్కమ్మలపై దాడి చేశాడు. ఈ దాడిలో శంకర్ చేతికి గాయమైంది. రుక్కమ్మ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

మెట్రో నుంచి ఎల్‌అండ్‌టీ తప్పుకొంటోంది
ముడుపుల వేధింపులతోనే

- కాంగ్రెస్ ఎంపీలను గొర్రెల్లా బీజేపీకి అమ్మేశారు
- గ్రూప్-1 ఉద్యోగాలను రూ.3కోట్ల చొప్పున అమ్మేశారు
- ఆ డబ్బులు ఏయే మంత్రులు తీసుకున్నారనేది అభ్యర్థులు నాకు చెప్పారు
- ఎప్పుడు బయటకు రావాలో కేసీఆర్‌కు తెలుసు: కేటీఆర్

హైదరాబాద్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ముడుపుల వేధింపులను తట్టుకోలేకే హైదరాబాద్ మెట్రోరైలు ప్రాజెక్టు నుంచి ఎల్‌అండ్‌టీ సంస్థ తప్పుకొంటోందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. గతంలో ఎల్‌అండ్‌టీ చీఫ్ ఫైనాన్షియల్ ఆఫీసర్‌ను జైల్లో పెడతానని బెదిరించారని, ఇలాంటి దుర్మార్గ చర్యలవల్ల ప్రైవేటు కంపెనీలు రాష్ట్రం నుంచి వెళ్లిపోతున్నాయని విమర్శించారు. గతంలో పీసీసీ పీఠాన్ని కొన్న రేవంత్‌రెడ్డి రాష్ట్రంలో అన్నింటినీ అమ్మేస్తున్నారని.. కాంగ్రెస్ తరఫున గెలిచిన 8 మంది ఎంపీలను గొర్రెలు, మేకల మాదిరిగా బీజేపీకి అమ్మేశారని ఆరోపించారు. బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిన నియోజకవర్గ నాయకుల పరిస్థితి చూస్తే జాలి కలుగుతోందన్నారు. నిజంగా రాష్ట్రం లో అద్భుతపాలన ఉంటే వెంటనే ఉపఎన్నికలు పెట్టాలని సవాల్ విసిరారు. బీఆర్ఎస్ టికెట్‌తో ఎమ్మెల్యేగా గెలిచి, కాంగ్రెస్ బీ-ఫారమ్‌తో ఎంపీగా పోటీచేసిన దానం నాగేందర్ స్పీకర్‌ను ఎందుకు కలుస్తున్నారని ప్రశ్నించారు. బుధవారం తెలంగాణ భవన్‌లో కేటీఆర్ మీడియాతో మాట్లాడారు. త్వరలో వివాదాస్పద ఎంఆర్‌సంస్థ ఆస్తులను అమ్మనున్నారని, ఇందులో రేవంత్ ఎంత కమీషన్ తీసుకున్నారో బయటపడనుందన్నారు. గతంలో పలుకంపెనీలపై ఉన్నకేసులను అడ్డుపెట్టుకొని సెటిల్‌మెంట్లు చేసుకుంటున్నారని, అన్ని కంపెనీలనుంచి ముడుపులు వసూలు చేసి ఢిల్లీకి పంపించడమే ఆయనకు ఏకైకపని అని ఆరోపించారు. సుజన్‌రెడ్డి, అమిత్‌రెడ్డిలకు వందలకోట్ల కాంట్రాక్టులు కొత్తగాఇచ్చారని ఆరోపించారు. రూ.3 కోట్ల చొప్పున గ్రూప్-1 ఉద్యోగాలు అమ్ముకున్నారని అభ్యర్థులే చెబుతున్నారని, ఆ డబ్బులు ఎవరు తీసుకున్నారో అభ్యర్థులు తనతో చెప్పారని తెలి పారు. కాగా, బీఆర్ఎస్ ఆధ్వర్యంలో పాదయాత్ర ఎప్పుడన్నది త్వర లో వెల్లడిస్తామన్నారు. సరైన సమయంలో గులాబీ బాస్ జనంలోకి వస్తారన్నారు. బీఆర్ఎస్ నేత రాకేష్‌రెడ్డి రూపొందించిన కాళేశ్వరం డాక్యుమెంటరీని తెలంగాణ భవన్‌లో ఆయన ఆవిష్కరించారు.

మావోయిస్టు లేఖల కలకలం!

అవి నిజమైనవేనా?.. ఏది అసలు..? ఏది నకిలీ..?.. ఆయుధాలు వదిలేందుకు సిద్ధమయ్యారా?

- ప్రజాసంఘాలు, మాజీ మావోయిస్టుల భిన్నాభిప్రాయాలు
- మైండ్‌గేమ్ అంటున్న పోలీసులు
- మావోయిస్టు పార్టీ చీలిక దిశగా పయనిస్తోందా!?

హైదరాబాద్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): ప్రాణంతో సమానంగా చూసుకుంటున్న ఆయుధాలను వదిలేస్తామని మావోయిస్టులు నిజంగానే నిర్ణయించారా? ఆయుధాలను వదిలేస్తామంటూ మావోయిస్టు పార్టీ అధికార ప్రతినిధి అభయ్ పేరిట విడుదలైన లేఖ నిజమైనదేనా? మావోయిస్టులు లేఖల పేరిట మైండ్‌గేమ్ ఆడుతున్నారా? అంటే.. భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. అభయ్ పేరిట విడుదలైన లేఖ ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. మావోయిస్టు పార్టీ పంథాకు పూర్తి విరుద్ధమైన అంశాలు లేఖలో ఉండడం, లేఖపై అభయ్ ఫొటో ముద్రించి ఉండడం, ప్రజల అభిప్రాయాలు తెలుసుకోవడం కోసమంటూ ఈమెయిల్, ఫేస్‌బుక్ ఐడీలు ఇవ్వడం చూస్తుంటే అది పక్కాగా నకిలీ లేఖేనని ప్రజా సంఘాల నేతలు, మాజీ మావోయిస్టులు పేర్కొంటున్నారు. ఒకవేళ ఈ లేఖ నిజమైనదే అయితే మాత్రం మావోయిస్టు పార్టీ చీలిక దిశగా పయనిస్తోందన్న అభిప్రాయాలూ వ్యక్తమవుతున్నాయి. వాస్తవానికి మావోయిస్టు పార్టీ కేంద్ర అధికార ప్రతినిధి ఇటీవల ఓ లేఖ విడుదల చేశారు. అందులో ఆపరేషన్ కగార్‌ను ప్రస్తావిస్తూ.. తమ పార్టీ క్యాడర్ పలు సందర్భాల్లో పోలీసులను సమర్థంగా ఎదుర్కొంటోందని, పోలీసులకు జరిగిన నష్టాన్ని, మరణాలను వెల్లడించడం లేదని పేర్కొన్నారు. కర్రెగుట్టల వద్ద అమర్చిన బూబీ ట్రాప్‌ల్లో చిక్కుకుని దాదాపు 50 మందికి పైగా పోలీసులు మరణించారని, ఈ విషయాన్ని ప్రభుత్వం దాచిపెడుతోందని ఆరోపించారు. అలాగే కర్రెగుట్టల సమీపంలో తమకు, గ్రేహౌండ్స్ పోలీసులకు మధ్య జరిగిన ఎదురుకాల్పుల్లో ముగ్గురు కానిస్టేబుళ్లు మరణించారని, పోలీసులు ఆ విషయాన్ని మార్చి చెప్పారని లేఖలో ప్రస్తావించారు. ఇటీవల మావోయిస్టు సీనియర్ నేత పోతుల పద్మావతి డీజీపీ జితేందర్ సమక్షంలో లొంగిపోయిన క్రమంలో మావోయిస్టు లేఖ, గ్రేహౌండ్స్ కానిస్టేబుళ్ల మరణాలపై 'ఆంధ్రజ్యోతి' విలేకరి అడిగిన ప్రశ్నకు.. మైండ్‌గేమ్‌లో భాగంగానే మావోయిస్టులు ఆ లేఖను జారీ చేసి ఉండొచ్చని డీజీపీ బదులిచ్చారు. అంటే మావోయిస్టులు లేఖల ద్వారా మైండ్ గేమ్ ఆడుతున్నారని ఆయనే అంగీకరించారన్నమాట. గతంలో మావోయిస్టులకు దీటుగా రకరకాల కోబ్రాలను రంగంలోకి దింపి లేఖలు విడుదల చేసిన చరిత్ర పోలీసులకూ ఉంది. మావోయిస్టులతో చర్చలు జరపాలని శాంతి సంఘాలు కోరుతుండగా.. ఆయుధాలు వదిలి లొంగిపోవాలని, వారితో చర్చల ప్రసక్తే లేదని కేంద్ర హోంమంత్రి అమిత్ షా పలుమార్లు స్పష్టం చేశారు.

పార్టీలో సమన్వయ లోపం?

ఆయుధాలు వదిలిపెట్టే విషయంలో మావోయిస్టు పార్టీలో భిన్నాభిప్రాయాలు ఉన్నట్లు సమాచారం. ఆపరేషన్ కగార్ ప్రారంభమైన తర్వాత మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ సభ్యులు, పొలిట్‌బ్యూరో మధ్య సమాచార, సమన్వయ లోపం ఉన్నట్లు తెలుస్తోంది. పోతుల పద్మావతి లొంగుబాటుకు సంబంధించి మే నుంచి ప్రయత్నాలు జరుగుతున్నాయి. తాను లొంగిపోవాలనుకుంటున్న విషయాన్ని పద్మావతి మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడు పుల్లూరు ప్రసాదరావు ద్వారా కేంద్ర కమిటీ బాధ్యులకు, పొలిట్ బ్యూరోకు తెలియజేసింది. కానీ, వారి నుంచి అనుమతి రావడానికి నాలుగు నెలలు పట్టింది. అంటే పార్టీలో సమాచార వ్యవస్థ ఎంత నిదానంగా ఉందన్న విషయాన్ని అర్థం చేసుకోవచ్చు. మావోయిస్టు పార్టీ నూతన సారథిగా పోటీలో ఉన్న మల్లోజుల వేణుగోపాల్ అలియాస్ అభయ్ తనకు ఆ స్థానం దక్కకపోవడంతోనే ఈ లేఖ విడుదల చేశారా? పార్టీ నుంచి ఆయన విడిపోవడానికి నిర్ణయించుకున్నారా? లేక మల్లోజుల పేరిట లేఖను సృష్టించి, పార్టీలో ఆయనపై అనుమానాలు రేకెత్తించడానికి పోలీసులు చేసిన ప్రయత్నమా? అన్న విషయంలో వామపక్ష మేధావుల్లో భిన్నాభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి.

ఘనంగా ప్రజాపాలన దినోత్సవం

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్)



సిద్దిపేట జిల్లా బైరాన్‌పల్లిలోని అమరవీరుల స్థూపం వద్ద మాట్లాడుతున్న మంత్రి పొన్నం ప్రభాకర్

తెలంగాణ ప్రజాపాలన దినోత్సవాన్ని బుధవారం రాష్ట్రవ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. అన్ని జిల్లాల కలెక్టర్ కార్యాలయాలు, జిల్లా కేంద్రాల్లో మంత్రులు, ప్రజాప్రతినిధులు, అధికారులు జాతీయ జెండాను ఆవిష్కరించారు. అనంతరం జరిగిన సభల్లో వారు మాట్లాడుతూ... రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, కార్యక్రమాలను వివరించారు. ఖమ్మం పోలీసు పరేడ్ మైదానంలో నిర్వహించిన ప్రజాపాలన దినోత్సవంలో పాల్గొన్న డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, హన్మకొండ కలెక్టరేట్‌లో జరిగిన ఉత్సవాల్లో మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిలు జాతీయ పతాకాలను ఆవిష్కరించి, పోలీసు గౌరవ వందనాన్ని స్వీకరించారు. కొత్తగూడెం కలెక్టరేట్ ప్రాంగణంలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు జాతీయ పతాకాన్ని ఆవిష్కరించిన అనంతరం ముల్కలపల్లిలో స్వస్థ్ నారీ సశక్తి అభియాన్ వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. ఆ తర్వాత జరిగిన సభలో కోయ (గిరిజన) భాషలో ప్రసంగించారు. విద్యార్థులతో కలిసి సహపంక్తి భోజనం చేశారు. సూర్యాపేట, నల్లగొండ, వరంగల్, మహబూబ్‌నగర్, నారాయణపేటలలో మంత్రులు శ్రీధర్ బాబు, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, కొండా సురేఖ, జూపల్లి కృష్ణారావు, వాకిటి శ్రీహరి ప్రజాపాలన దినోత్సవంలో పాల్గొన్నారు. సిద్దిపేట జిల్లా ధూళిమిట్ట మండలం బైరాన్‌పల్లిలో అమరవీరుల స్థూపం వద్ద మంత్రి పొన్నం ప్రభాకర్ అమరవీరులకు నివాళులర్పించారు. అనంతరం జాతీయ జెండాను ఎగురవేశారు. భువనగిరిలో శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, నిజామాబాద్‌లో సీఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డి ఉత్సవాలకు హాజరయ్యారు. కాగా, రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో బుధవారం ప్రజాపాలన దినోత్సవానికి కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఆలస్యంగా రావడం ప్రొటోకాల్ వివాదంగా మారింది. ముఖ్య అతిథి అయిన ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ సందేశం విషయాన్ని చేర్చకుండా ఆహ్వాన పత్రికను ముద్రించారు. కలెక్టర్ తీరుపై ఆది శ్రీనివాస్.. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శితో పాటు ఇతర అధికారులకు ఫిర్యాదు చేశారు.

బిహార్ ఎన్నికలపై కాంగ్రెస్ నజర్!

- 24న పట్నాలో సీడబ్ల్యూసీ భేటీ

న్యూఢిల్లీ, సెప్టెంబరు 17: బిహార్ అసెంబ్లీ ఎన్నికలపై మేధోమథనానికి, ఓట్ల చోరీపై బీజేపీ దాడిని తీవ్రతరం చేయడానికి కాంగ్రెస్ సమాయత్తమవుతోంది. ఇందుకోసం ఈ నెల 24న పట్నాలో వర్కింగ్ కమిటీ (సీడబ్ల్యూసీ) విస్తృత స్థాయి సమావేశాన్ని నిర్వహిస్తోంది. ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ సహా పార్టీ అతిరథ మహారథులంతా హాజరు కానున్నారు. వర్కింగ్ కమిటీ సభ్యులతో పాటు శాశ్వత, ప్రత్యేక ఆహ్వానితులు, పార్టీ పాలిత రాష్ట్రాల సీఎంలు, పీసీసీ అధ్యక్షులు, సీఎల్పీ నేతలు కూడా పాల్గొననున్నారు. బిహార్లో ప్రచార వ్యూహం, భవిష్యత్‌లో జరిగే ఎన్నికలు, ఓట్ల చోరీపై సమగ్రంగా చర్చిస్తారని ఏఐసీసీ వర్గాలు వెల్లడించాయి. 'ఇండీ' కూటమిలోని బిహార్ పార్టీలతో కూడిన మహాకూటమిలో సీట్ల సర్దుబాటు చర్చలు జరుగుతున్న సమయంలో సీడబ్ల్యూసీ సమావేశం నిర్వహించడానికి ప్రాధాన్యం ఉందన్నాయి. మంగళవారం కాంగ్రెస్ రాష్ట్ర ఎన్నికల కమిటీని కూడా నియమించింది. పీసీసీ అధ్యక్షుడు రాజేశ్‌రాం, సీనియర్ నేతలు షకీల్ అహ్మద్ ఖాన్, మదన్ మోహన్ ఝా సహా 39 మంది సభ్యులను ఇందులో నియమించింది.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

మధ్యేమార్గం

వక్ఫ్ సవరణ చట్టమే దురుద్దేశపూరితమైనది కనుక, ఓ మూడు నిబంధనలను సర్వోన్నతన్యాయస్థానం నిలిపివేసినంతమాత్రాన సంతోషించాల్సిందేమీ లేదని మైనారిటీ నేతల అభిప్రాయం. కుట్రపూరిత ఆలోచనలూ లక్ష్యాలతో తయారైన చట్టాన్ని సమూలంగా కొట్టివేయాల్సి ఉండగా, చిన్న పాటి సవరణలతో దానిని మొత్తంగా అనుమతించిన సుప్రీం కోర్టు మధ్యంతర తీర్పు మైనారిటీలకు ఏ మాత్రం ఉపశమనాన్ని కల్పించలేదని వారి బాధ. వక్ఫ్ స్ఫూర్తికి పూర్తిభిన్నంగా, ఆ ఆశయాలను వమ్ముచేస్తూ పలు వివాదాస్పద ప్రతిపాదనలను గుదిగుచ్చిన ఈ చట్టాన్ని సుప్రీంకోర్టు సరేననడం సరికాదంటున్నారు వారు. ఇది రాజీమార్గం కాదు, కీలక నిబంధనలను కాదంటూ మిగతా చట్టాన్ని అనుమతించడం ద్వారా సుప్రీంకోర్టు మధ్యేమార్గాన్ని ఎంచుకొని మంచిపనిచేసిందని మిగతావారంటున్నారు. ఇది మా విజయం అని పాలకులు కూడా సంబరపడుతున్నందున అసలు విజేతలు ఎవరో, న్యాయం ఎవరికి దక్కిందో ఒక పట్టాన అర్థంకాదు.

అంతిమతీర్పు మిగిలే ఉంది. ఇంతలోగా ఆ కొన్ని ఆదేశాలు తాత్కాలిక ఉపశమనం. ఇది ప్రభుత్వానికి పెద్ద ఎదురుదెబ్బ అని విపక్షాలు అంటున్నాయి. ముస్లిం ధార్మిక సంస్థల నిర్వహణను, వాటి మీద ప్రభుత్వపెత్తనాన్ని సుప్రీంకోర్టు ప్రశ్నించిందని అంటున్నాయి. ఏది వక్ఫ్ ఆస్తి, ఏది కాదన్నది నిర్ణయించే అధికారం కలెక్టర్‌కు లేదని తేల్చేయడం పిటిషన్‌దారులకు పెద్ద ఉపశమనం. తరతరాలుగా వాడుకలో ఉన్న వక్ఫ్ ఆస్తిని జిల్లా కలెక్టర్ కాదని నిర్ధారించడంతోనే అది తన స్వరూపస్వభావాలు కోల్పోయే ప్రమాదాన్ని కోర్టు నివారించింది. ఆస్తులపై వివాదాలు ఎందుకు రేగుతాయో తెలిసిందే కనుక, తగువు తీర్చడానికి సిద్ధపడిన కలెక్టర్ ఏ మేరకు న్యాయం చేయగలుగుతారో ఊహించవచ్చు. అంతిమనిర్ణయాన్ని అటుంచితే, వివాదం రేగిన మరుక్షణం నుంచే అది వక్ఫ్ ఆస్తికాకపోవడం వంటి ప్రమాదకరమైన అంశాలు సైతం ఈ నిబంధనలో ఉన్నాయి. వక్ఫ్ ఆస్తిగా గుర్తించడానికి వాంగ్మూలాలు, దశాబ్దాల వినియోగం, చారిత్రక ఆధారాలు కాక, సర్వేలు, రికార్డులు, లిఖితపూర్వక దస్తావేజులు ఉండాల్సిందేనని కొత్త నిబంధనలు రాసుకున్నాక కలెక్టర్ తీర్పు ఊహకు అందనిదేమీ కాదు. అత్యధికశాతం వక్ఫ్ ఆస్తులు దురాక్రమణలోనో, వివాదంలోనో ఉన్నప్పుడు నిజనిర్ధారణ జరగాల్సిందే కానీ, కలెక్టర్ న్యాయాధికారి కాకూడదన్నది సుప్రీం అభిప్రాయం. ట్రిబ్యునళ్ళలోనూ, కోర్టుల్లోనూ తేలాల్సిన వ్యవహారాన్ని కార్యనిర్వాహకవర్గం తన చేతుల్లోకి తీసుకోవడం కోర్టుకు నచ్చలేదు. ఐదేళ్ళుగా ఇస్లాంను ఆచరిస్తున్నవారే ఆస్తుల దానానికి అర్హులన్న నిబంధన కూడా ఇటువంటిదే. ఆచరణ అంటే ఏమిటో, ఎవరు ఎలా అందుకు అర్హులవుతారో చట్టం చెప్పలేదు కనుక, తమ ఆస్తిని ఎలా ఉపయోగించాలో నిర్ణయించుకొనే రాజ్యాంగ హక్కు, అధికారం పౌరులకు ఉన్నందున ప్రభుత్వాలు ఈ అంశాన్ని తేల్చేంతవరకూ దీనిని కూడా కోర్టు నిలిపివేసింది.

ఆస్తి నిర్వచనం నుంచి, వక్ఫ్‌బోర్డుల అధికారాలు, ట్రిబ్యునళ్ళ నిర్ణయాలను తిరగదోడటం వరకూ ప్రతీ అంశాన్నీ తన చేతుల్లోకి తీసుకొని వక్ఫ్ ఆస్తులపై పూర్తిపెత్తనం సాధించాలన్న లక్ష్యంతో ఈ చట్టం తయారైందన్నది ప్రధాన ఆరోపణ. వక్ఫ్ సంస్థల్లోకి ముస్లిమేతరులను ప్రవేశపెట్టడం అందుకు మార్గం సుగమం చేస్తుందన్న భయాలు నెలకొన్న తరుణంలో ఆ ప్రయత్నానికి సుప్రీంకోర్టు ముకుతాడు వేసింది. సెంట్రల్ వక్ఫ్ కౌన్సిల్‌లోని 22 మంది సభ్యుల్లో నలుగురు, స్టేట్ బోర్డుల్లోని 11 మందిలో ముగ్గురు మాత్రమే అన్యమతస్థులను కోర్టు అనుమతించింది. అయితే, ముస్లిమేతర మతాలకు చెందిన ఆధ్యాత్మిక, ధార్మిక సంస్థల్లో ముస్లింలకు చోటులేనప్పుడు, కేవలం వక్ఫ్‌బోర్డుల్లో అన్యమతస్థులు ఎందుకు అని ప్రశ్నిస్తున్నవారికి ఈ వెసులుబాటు నచ్చకపోవడం సహజం, సముచితం. కొత్త వక్ఫ్‌చట్టం రాజ్యాంగ విహితమైనదో కాదో తేల్చేవరకూ ఈ మధ్యంతర ఉత్తర్వుల ద్వారా సర్వోన్నత న్యాయస్థానం పాలకుల దూకుడుకు కొంతఅడ్డుకట్టవేసింది. మిగతా కీలక నిబంధనలన్నింటినీ అనుమతించినందున కోర్టు తీర్పు తమకు అనుకూలంగా ఉన్నదని ప్రభుత్వం భావించడంలో తప్పులేదు. వక్ఫ్‌భూముల వివాదాలను, దురాక్రమణలను పరిష్కరించి, నిర్వహణను చక్కదిద్దాలని అందరూ కోరుకుంటున్నదే. కానీ, ముస్లిం పెద్దలు, పర్సనల్ లాబోర్డుతోనే కాదు, కనీసం విపక్షాలతో కూడా సంప్రదింపులు జరపకుండా, చట్టసభలో విస్తృతచర్చ లేకుండా దానిని ముందుకు తోయడం సరికాదు. సర్వోన్నత న్యాయస్థానం అంతిమంగా ఏమి చెబుతుందన్నది అటుంచితే, ఏకాభిప్రాయ సాధనకు ఇంకా సమయం మించిపోలేదు.

ప్రజల హక్కులు గౌరవిస్తేనే సుస్థిరత

ఇటీవల కాలంలో మన పొరుగున ఉన్న బంగ్లాదేశ్, మయన్మార్, శ్రీలంక, పాకిస్తాన్ వంటి దేశాలలో అనేక పరిణామాలు చోటు చేసుకుంటున్నాయి. తాజాగా నేపాల్‌లో ప్రజల తీవ్ర ఆందోళనల మధ్య ఆ దేశ ప్రధానమంత్రి రాజీనామా చేయవలసి వచ్చింది. దానికంటే ముందు బంగ్లాదేశ్‌లో కూడా అలాంటి ఆందోళనల మధ్య ఆ దేశ ప్రధాని రాజీనామా చేసి, భారతదేశంలో తలదాచుకోవాల్సి వచ్చింది. కొన్ని సందర్భాలలో ఆందోళనలు అరాచకరూపం కూడా తీసుకున్నాయి. ఈ ఆందోళనల వెనక ఉన్న ప్రధానమైన కారణం ఆ దేశ ప్రజల సమస్యలు పెరగడం, వాటిని పరిష్కారం చేయకపోగా, ఆయా పాలకులు ప్రజల అసంతృప్తిని అణచివేయడానికి చేసే ప్రయత్నాలే ప్రధానంగా కనపడతాయి.

మోదీ ప్రభుత్వ పాలనతో దేశ ప్రజలు పలు సమస్యలు ఎదుర్కొంటున్నారు. ఆర్థిక అసమానతలు, పెరుగుతున్న పేదరికం, నిరుద్యోగం, గిట్టుబాటు ధర, మహిళలపై అత్యాచారాలు, పరస్పర అపనమ్మకాలు వంటివి ఈ రోజు దేశంలో నిత్యకృత్యమయ్యాయి. ఇవన్నీ పాలకుల కార్పొరేట్ అనుకూల విధానాల ఫలితాలే. వివిధ తరగతుల ప్రజలలో పెరుగుతున్న అసంతృప్తిని అణచివేయడానికి ప్రభుత్వం నిర్బంధాన్ని ప్రయోగిస్తోంది. ప్రశ్నించే వారిపై అక్రమ కేసులు బనాయిస్తోంది. అరెస్టు చేసిన విద్యార్థి నాయకులను సుదీర్ఘకాలం పాటు విచారణ చేపట్టకుండా జైల్లో నిర్బంధించిన ఉదంతాలు ఉన్నాయి. ఇవన్నీ దేనికి సంకేతాలుగా నిలుస్తున్నాయి అన్నది పరిశీలిస్తే నేడు దేశంలో నెలకొన్న వాతావరణం అవగతమవుతుంది.

> ప్రజలలో పెరుగుతున్న అసంతృప్తిని బలవంతంగా అణచివేయడం ఎల్లకాలమూ సాధ్యం కాదని మన ఇరుగు పొరుగు దేశాల అనుభవాలు తేటతెల్లం చేస్తున్నాయి. ప్రజానుకూల విధానాలను అవలంబించడంతో పాటు, ప్రజల అన్ని ప్రజాస్వామ్య హక్కులను గౌరవించి, రాజ్యాంగ విలువలను పరిరక్షించాలి. అయితే మన పాలకులు విచిత్రంగా ఆ రెండూ చేయడం లేదు.

నేపాల్‌లో వాస్తవంగా గత దశాబ్దన్నర కాలంలో చాలా చైతన్యవంతమైన మార్పులు చోటు చేసుకున్నాయి. రాచరిక పాలన నుంచి ప్రజాస్వామ్యం వైపుగా ఆ దేశం అడుగులు వేసింది. సాయుధ పోరాట మార్గాన్ని వదిలి మావోయిస్టు పార్టీ కూడా ప్రధాన జీవన స్రవంతిలో కలిసి ఎన్నికలలో భాగస్వాములు కావడం వంటి అనేక పరిణామాలు ఆ దేశంలో చోటుచేసుకున్నాయి. అయితే వరుసగా ఏర్పడిన ప్రభుత్వాలు ప్రజల మౌలిక సమస్యలు పరిష్కారం చేయడంలో విఫలమయ్యాయి. దీనికి తోడు ప్రజల అసంతృప్తిని అణచివేయడానికి తీవ్ర నిర్బంధ చర్యలకు కూడా పాల్పడ్డాయి. చివరకు సోషల్ మీడియా మీద కూడా నిషేధం విధించడంతో ప్రజల అసంతృప్తి కట్టలు తెంచుకుంది. అప్పటిదాకా ఓర్పుతో ఉన్న ప్రజానీకం ఒక్కసారిగా రోడ్లమీదకు వచ్చి తిరగబడింది. అది హింసా రూపం కూడా తీసుకుంది. దాదాపు ఇలాంటి పరిణామాలే బంగ్లాదేశ్‌లో కూడా గత సంవత్సరం చోటుచేసుకున్నాయి.

ఈ సందర్భంగా మన దేశంలోని పాలకులు ఈ పరిణామాల నుంచి నేర్చుకోవలసిన విలువైన పాఠాలు ఉన్నాయి. నేడు కేంద్రంలోని నరేంద్ర

ఇన్ని తీవ్ర సమస్యలు ఉన్నా మన దేశంలో పొరుగు దేశాలలో లాగా ఆందోళనలు ఎందుకు జరగడం లేదు అన్న సందేహం సహజంగానే కలుగుతుంది. దీనికి ప్రధాన కారణం ప్రజలలో అసంతృప్తి లేకపోవడం మాత్రం కాదు. దీనికి భిన్నంగా సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి బీఆర్ గవాయ్ తాజాగా పేర్కొన్నట్లు మన రాజ్యాంగం విశిష్టతే దీనికి ప్రధాన కారణం.

భారతదేశ రాజ్యాంగంలో ప్రజలకు నిరసన తెలిపే హక్కు, ప్రభుత్వాలను ఎన్నుకునే ప్రజాస్వామ్య హక్కులు వంటివి అనేకం ఉన్నాయి. అలాగే అత్యంత విలువైన ఓటు హక్కును కూడా మన రాజ్యాంగం కల్పించింది. వీటి ద్వారా ప్రజలు తమ అసంతృప్తిని ఎన్నికల సందర్భాలలో తమకు నచ్చని ప్రభుత్వాలను మార్చేసే రూపంలో వ్యక్తం చేసిన సందర్భాలు కూడా అనేకం ఉన్నాయి. ఇప్పటి వరకూ ఈ హక్కులు ఎంతో కొంత మేరకు కొనసాగడం వల్లనే మన దేశంలో అటువంటి అరాచకాలు, ఆందోళనలు జరగలేదు. కానీ పరిస్థితి ఎల్లకాలం ఇలాగే ఉంటుందని అనుకోలేమని కొన్ని తాజా పరిణామాలు సూచిస్తున్నాయి.

కేంద్రంలోని మోదీ ప్రభుత్వం, వివిధ రాష్ట్రాలలోని పాలక పార్టీలు.. ప్రజల అసంతృప్తిని అణచివేయడానికి తీవ్రమైన నిర్బంధాన్ని ప్రయోగిస్తున్నాయి. కనీసం నిరసన తెలిపే హక్కు కూడా లేకుండా సెక్షన్ 144, సెక్షన్ 30 వంటివి నిరవధికంగా కొనసాగిస్తున్నాయి. సభలకు, ప్రదర్శనలకు, నిరసనలకు సైతం అనుమతులు నిరాకరిస్తున్నారు.



ప్రజలు తమ అసంతృప్తిని వెలిబుచ్చే గొప్ప ప్రజాస్వామ్య అవకాశం మన దేశంలో ఎన్నికల వ్యవస్థ కల్పించింది. దీన్ని కూడా పూర్తిగా నిలిపివేయడానికి నరేంద్ర మోదీ ప్రభుత్వం అన్ని చర్యలూ చేపడుతోంది. ఎన్నికల కమిషన్ నియామక ప్రక్రియనే పూర్తిగా మార్చేసి, తమకు అనుకూలమైన వారిని నియమించుకొని, స్వతంత్రంగా ఉండవలసిన ఆ కమిషన్‌ను తన గుప్పెట్లో పెట్టుకుంది. అయినా గెలుస్తామనే నమ్మకం లేక ఓటర్లను డబ్బు, మతం, కులం పేరుతో తీవ్రంగా ప్రభావితం చేస్తోంది. ఇంకా గెలుపుపై నమ్మకం కుదరకపోవడంతో తమకు రావనుకునే ఓట్లను తొలగించే పనికి కూడా పూనుకుంది. బిహార్ రాష్ట్రంలో తాజాగా జరుగుతున్న ఎన్నికల సవరణ ఇందులో భాగమే. కొత్త ఓటర్లను చేర్చడం, పాత ఓటర్లను తొలగించడం వంటి చర్యల ద్వారా ఎన్నికల ఫలితాలను తారుమారు చేసేలా ఎలా వ్యవహరించారో కర్ణాటకలోని బెంగళూరు సెంట్రల్ పార్లమెంటు స్థానంలోని మహదేవపుర అసెంబ్లీ నియోజకవర్గ ఉదాహరణ ఇటీవలే వెలుగులోకి వచ్చింది. ఇలాంటివి దేశంలో చాలా జరుగుతున్నాయనే ఆరోపణలు ఉన్నాయి. దీనిపై స్పందించి, జరిగిన తప్పులను ఆమోదించి, సరిచేయవలసిన ఎన్నికల కమిషన్, ఆ పని చేయకపోగా తిరిగి ప్రశ్నించిన వారిపై ఎదురు దాడికి దిగడం ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేయడమే. కేంద్ర ప్రభుత్వ ఈ చర్యలన్నీ మన రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధంగా ఉన్నాయి. ప్రజాస్వామ్యాన్ని బలహీనపరుస్తున్నాయి.

ప్రజలలో పెరుగుతున్న అసంతృప్తిని బలవంతంగా అణచివేయడం ఎల్లకాలమూ సాధ్యం కాదని మనకు పొరుగు దేశాల అనుభవాలు తేటతెల్లం చేస్తున్నాయి. అందువల్ల నేడు మన దేశ పాలకుల వద్ద రెండే రెండు మార్గాలు ఉన్నాయి. ప్రజానుకూల విధానాలను అవలంబించడంతో పాటు, ప్రజలు తమ అసంతృప్తిని వెలిబుచ్చే అన్ని ప్రజాస్వామ్య హక్కులను గౌరవించి, రాజ్యాంగ విలువలను పరిరక్షించడం. కానీ విచిత్రంగా మన పాలకులు ఆ రెండూ చేయడం లేదు.

ఇంకా విచిత్రంగా ఇటీవల కొంతమంది కొన్ని వింత వాదనలు చేస్తున్నారు. అవేమిటంటే దేశంలోని ప్రజలకు– ముఖ్యంగా యువతకు భూత దయ, యోగా, ధ్యానం వంటివి అలవాటు చేస్తే వారి జీవితం ఆనందదాయకమై, మన దేశం సుభిక్షంగా ఉంటుందని. తద్వారా సమాజంలో జరుగుతున్న పరిణామాలు గురించి పట్టించుకోకుండా, వారు ఎటువంటి ఆందోళనలు చేయకుండా ప్రశాంత జీవనం గడుపుతారని సెలవిస్తున్నారు. అందుకే నేమో మోదీ ప్రభుత్వం పాఠ్యాంశాలలో ఇలాంటివి చేర్చింది.

ఇంతకంటే విడ్డూరం మరొకటి ఉండదు. సమాజాన్ని సరైన మార్గంలో నడిపే బాధ్యత వహించవలసిన పాలకులు ఆ పని చేయకుండా, ఒక పక్క ప్రజలపై పెను భారాలు వేస్తూ, మరో పక్క ఆ ప్రజలు ఏమీ మాట్లాడకుండా యోగా, ధ్యానం వంటివి చేసుకుంటూ, నోరు మూసుకొని ఉండాలని ఉద్బోధిస్తోంది! దీని వెనుక దాగి ఉన్న ప్రభుత్వ ఉద్దేశ్యాలను కూడా ప్రజలు గమనించాలి.

మన పొరుగు దేశాలలో జరుగుతున్న పరిణామాల వంటివి మనదేశంలో జరగకుండా ఉండడం... ఎన్నికలు నిష్పక్షపాతంగా నిర్వహిస్తూ ప్రజాస్వామ్య ప్రక్రియను, భారత రాజ్యాంగ స్ఫూర్తిని మరింత బలోపేతం చేసుకోవడం ద్వారానే సాధ్యం. అప్పుడు మాత్రమే భారత్ ఒక గౌరవప్రదమైన సమాజంగా రూపుదిద్దుకోగలదు.

▪ ఎ. అజశర్మ
ప్రధాన కార్యదర్శి, ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక

చరిత్ర నుదుటన చెరగని సంతకం

"నీ కోసం జీవిస్తే నీలోనే ఉంటావు, జనం కోసం జీవిస్తే జనంలో ఉంటావు"
– బాబా సాహెబ్ అంబేడ్కర్

ఈ మాటకు ఒక ఆచరణ రూపం వస్తే... అది కచ్చితంగా ట్రేడ్ యూనియన్ లీడర్ జి.ఎల్లయ్యే అవుతుంది. ఎనిమిది పదుల సుదీర్ఘ జీవితంలో ఆయన బతుకంతా ప్రజల కోసమే గడిచింది. 1941 జూన్ 5న మెదక్ జిల్లా రామాయంపేట సమీపాన గల చౌదర్‌పల్లిలో ఎల్లయ్య సాధారణ మధ్యతరగతి కుటుంబంలో జన్మించాడు. చిన్ననాడే తండ్రి చనిపోవడంతో మేనమామలు ఎల్లయ్యను, అతడి తల్లి వీరమ్మను చేరదీశారు. తండ్రి లేని లోటును తల్లి వీరమ్మే కొంత తీర్చింది. వ్యవసాయ పనులు చేసుకుంటూనే చదువు కొనసాగించాడు. ఉపాధ్యాయ ఉద్యోగం సంపాదించాడు. 18 నెలల పాటు టీచర్‌గా కొనసాగిన తరువాత నిజామాబాద్‌లో ఐటీఐ శిక్షణ పూర్తి చేశాడు. అట్లా బీహెచ్‌ఈఎల్‌లో ఉద్యోగంలోకి ప్రవేశించాడు.

బీహెచ్‌ఈఎల్‌లో ఒక సామాన్యుడిగా మొదలైన ఎల్లయ్య ప్రస్థానం ఆయన కృషితో అగ్రస్థానానికి చేరింది. బీహెచ్‌ఈఎల్ అంటే ఎల్లయ్య, ఎల్లయ్య అంటే బీహెచ్‌ఈఎల్‌లా మారింది. అందుకు కారణం కార్మికుల సంక్షేమమే తన ప్రథమ కర్తవ్యంగా భావించడం. కాంగ్రెస్ అనుబంధ కార్మిక సంఘమైన ఐఎన్‌టీయూసీ ట్రేడ్ యూనియన్‌లో కార్యకర్తగా కార్యాచరణ మొదలుపెట్టాడు. అంచెలంచెలుగా ఎదిగి జాతీయ స్థాయికి చేరుకున్నాడు. అందుకు కారణం ఆయనలోని నిబద్ధత, ధైర్యశీలత. కార్మికులకు ఏ సమస్య వచ్చినా 'నేనున్నా...' అనేవాడు. అట్లా వందలాదిమంది కార్మికుల కుటుంబాలకు పెద్దదిక్కు అయ్యాడు. బీహెచ్‌ఈఎల్‌లో అప్పటికే పలు ట్రేడ్ యూనియన్లు ఉన్నప్పటికీ ఎల్లయ్య నిజాయితీ, తలవంచని వ్యక్తిత్వం సంఘాలకు అతీతంగా అతడిని అభిమానించేలా చేసింది. చేతక్ స్కూటర్ మీద బీహెచ్‌ఈఎల్ కలయ తిరుగుతూ కార్మికులకు అందుబాటులో ఉన్నాడు.



> బీహెచ్‌ఈఎల్‌లో అప్పటికే పలు ట్రేడ్ యూనియన్లు ఉన్నప్పటికీ ఎల్లయ్య నిజాయితీ, తలవంచని వ్యక్తిత్వం సంఘాలకు అతీతంగా అతడిని అభిమానించేలా చేసింది. చేతక్ స్కూటర్ మీద బీహెచ్‌ఈఎల్ కలయ తిరుగుతూ కార్మికులకు అందుబాటులో ఉన్నాడు. బీహెచ్‌ఈఎల్‌లో ఇవాళ కార్మికులు పొందుతున్న అనేక సౌకర్యాలు ఆయన సాధించినవే.

పోరాటమే తన ఊపిరిగా మలుచుకున్నాడు ఎల్లయ్య. బీహెచ్‌ఈఎల్‌లో ఇవాళ కార్మికులు పొందుతున్న అనేక సౌకర్యాలు ఆయన సాధించినవే. 25శాతం హెచ్ఆర్ఏ, ఎంఐజీ ఫస్ట్ ఫేజ్, సెకండ్ ఫేజ్‌లో దాదాపు ఆరేడు వేల మందికి ఇండ్లు కట్టించాడు. ఇప్పుడు ఆ ఇండ్ల మార్కెట్ ధర ఒక్కొక్కటి రెండుకోట్ల పైమాటే. సూపర్ స్పెషాలిటీ వైద్యం, గ్రామీణ వికాస సేవ సమితి (జీవీఎస్ఎస్) ఆధ్వర్యంలో యువతకు ప్రింటింగ్ ఉపాధి కల్పించి వారిని పర్మినెంట్ చేపించాడు. ఇక ప్రమాదకర స్థలాల్లో పని చేసే ఉద్యోగులకు ప్రతిరోజూ అర లీటర్ పాలు ఇప్పించే ఏర్పాటు చేయించాడు. ఉద్యోగులందరికీ క్యాంటీన్ వసతి ఉండాలని పోరాడాడు. వాటి ధరలు కూడా పెరగకుండా ఉద్యమించాడు. ఇక దూర ప్రాంతాల నుంచి బీహెచ్‌ఈఎల్‌కు వచ్చి పని చేసే కార్మికుల కోసం బస్సు సౌకర్యం కావాలని పోరాడి సాధించాడు. కంపెనీ అభివృద్ధి కోసం ఓవర్‌టైమ్ పని చేసే కార్మికులకు అదనపు వేతన పద్ధతిని సాధించాడు. అప్పటిదాకా ట్రేడ్ యూనియన్‌ల పక్షాన బయటి వ్యక్తులు కూడా బీహెచ్‌ఈఎల్‌లో పోటీ చేసే సంప్రదాయం ఉండేది. దానిని కూడా రద్దు చేయించి కార్మికుల్లో ఒకరే ప్రెసిడెంట్‌గా ఉండాలని డిమాండ్ చేసి సాధించాడు.

ఇక తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ఎల్లయ్య నాలుగు దశాబ్దాల పాటు విరామమెరుగని పోరు సలిపినాడు. 1969లో తెలంగాణ కోసం ఉద్యమం పెద్దెత్తున రగులుకున్న సమయంలో అందులో భాగస్వామి అయ్యాడు. ఆనాటి ప్రధాన నాయకత్వమైన మర్రి చెన్నారెడ్డి, మల్లికార్జున్, సదాలక్ష్మీ, మదన్‌మోహన్ వంటి వారితో కలిసి నడిచాడు. ముఖ్యంగా కేంద్ర మాజీ మంత్రి మల్లికార్జున్‌కు అత్యంత సన్నిహితుడు ఎల్లయ్య. 2001లో కేసీఆర్ టీఆర్ఎస్ పార్టీ పెట్టడానికి ముందే తెలంగాణ కోసం తండ్లాడిండు. అదే సమయంలో బీహెచ్‌ఈఎల్‌లో ఉండే ఆంధ్రా ఉద్యోగులతో సఖ్యతగానే ఉండేవాడు. ఆంధ్రా పాలకులతోనే యుద్ధం తప్ప, ఆంధ్రా సోదరులతో కాదు అని ప్రకటించాడు. అన్నట్టుగానే నాటి ఉమ్మడి రాష్ట్రం గుంటూరులో వరదలు వచ్చినప్పుడు, బీహెచ్‌ఈఎల్ యాజమాన్యంతో మాట్లాడి రెండువందలకు పైగా ఇండ్లు కట్టించాడు. ఇట్లా విశేష కార్మికాదరణ కలిగిన నేతగా ఆవిర్భవించాడు. అందుకే 13 సార్లు పోటీ చేసి 9 సార్లు ప్రెసిడెంట్‌గా గెలుపొందాడు. 1989, 1991, 1994 ఎన్నికల్లో హ్యాట్రిక్ విజయాన్ని సాధించాడు.

2014లో జేఏసీ ఇచ్చిన అసెంబ్లీ ముట్టడి కార్యక్రమంలో ముందువరసలో పాల్గొన్నప్పుడు పోలీసులు ఆయన్ను అరెస్ట్ చేశారు. డీసీఎంలో స్టేషన్‌కు తరలించే ప్రయత్నం చేస్తే ఎల్లయ్య దానిని నిరసించాడు. 'శాంతియుతంగా పోరాడుతున్న మమ్మల్ని ఎట్లా అరెస్ట్ చేస్తారంటూ' వ్యాన్‌లో నుండి కిందికి దూకాడు. అట్లా రెండు కాళ్లు విరిగాయి. హాస్పిటల్‌లో బెడ్ మీద ఉన్నా తెలంగాణ ముచ్చట మాత్రం మరువనివాడు ఎల్లయ్య. తెలంగాణకు జరుగుతున్న అన్యాయాలపై అనర్గళంగా మాట్లాడేవాడు. వేదికల మీద కంచుకంఠంతో జనాలను ఉత్సాహపరిచి, దిశానిర్దేశం చేసేవాడు. తాను కాంగ్రెస్ అనుబంధ ఐఎన్‌టీయూసీ సంఘంలో ఉన్నప్పటికీ, కమ్యూనిస్టుల పట్ల అమితమైన గౌరవం ఉండేది. కమ్యూనిస్టులు చట్టసభల్లో ఉంటేనే ప్రజలకు మేలు జరుగుతుందని నమ్మేవాడు.

అనామకుడిగా మొదలైన తన ప్రస్థానం అనతి కాలంలోనే కేంద్ర ప్రభుత్వ సంస్థల జేఏసీ చైర్మన్ స్థాయికి చేరింది. పాండురావు, బంగారు లక్ష్మణ్, మహా పాత్రోలతో కలసి పోరాడాడు. మంత్రులు, ముఖ్యమంత్రులకే కాదు ఎల్లయ్య నాయకత్వ పటిమ ఇందిరాగాంధీ, రాజీవ్‌గాంధీ, పీవీ నర్సింహారావు వంటి ప్రధానులకు కూడా చేరింది. అంతటి విజనరీ ఎల్లయ్య. తనకు తిండి పెడుతున్న బీహెచ్‌ఈఎల్‌ను కర్మభూమిగా భావించేవాడు. కంపెనీ ఉత్పత్తిని కొల్లగొట్టే కుట్రలు చేసిన గోల్ మిల్ ఆర్డర్స్‌కు వ్యతిరేకంగా పోరాటం చేసి కొన్ని వందలకోట్ల రూపాయల మేలు చేశాడు. క్రమశిక్షణతో జీవించడం అన్నా, ఇతరుల కష్టాలకు స్పందించడమన్నా ఎల్లన్నకు ఎనలేని ప్రీతి. అందుకే ఆయనను "బీహెచ్‌ఈఎల్ టైగర్" అని పిలుచుకునేవారు. ఆయన చేసిన కృషికి గత బీఆర్ఎస్ సర్కారులో గానీ, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వంలో గానీ దక్కాల్సిన గౌరవం దక్కలేదు. ఇప్పటికైనా ప్రభుత్వం పూనుకొని ఎల్లయ్య కృషిని, స్ఫూర్తిని శాశ్వతం చేయాలి. బీహెచ్‌ఈఎల్ మెయిన్ గేట్ ముందు ఆయన విగ్రహం ఏర్పాటు చేయాలి.

○ కొల్లూరి సత్తయ్య
ఫౌండర్ చైర్మన్, అమృత సత్తయ్య కొల్లూరి ఎడ్యుకేషనల్ సొసైటీ

(సెప్టెంబర్ 5న జి. ఎల్లయ్య కన్నుమూశారు)

ప్రభుత్వ నిర్లక్ష్యానికి ఉద్యోగులు, పెన్షనర్లు బలి

ఇటీవల సీఎం రేవంత్‌రెడ్డి బీసీ కుల గణనపై ఢిల్లీలో పవర్ పాయింట్ ప్రజెంటేషన్ నిర్వహించి 'నా దగ్గర కుల గణనకు సంబంధించి కొన్ని కోట్ల పేజీలకు సరిపడే సమాచారం ఉంద'ని సగర్వంగా తెలిపారు. కానీ అంతటి సమాచారాన్ని ఆయనకు అందించింది ప్రభుత్వ ఉద్యోగులే కదా?! వారి సమస్యల గురించి సీఎం పట్టించుకోకపోవడం విచారకరం. తాము అధికారంలోకి వస్తే 'ఆరు గ్యారంటీ'ల అమలుతో పాటు ఉద్యోగుల సమస్యలను పరిష్కరిస్తామని ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను సీఎం మరిచిపోయినట్లున్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల సమస్యలపై ఎందుకు అంతటి ఉదాసీనత?

ప్రస్తుతం రాష్ట్రంలో ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు, మరో మూడు లక్షల మంది ఔట్ సోర్సింగ్, కాంట్రాక్ట్ ఉద్యోగులతో కలిపి తొమ్మిది లక్షల మంది వరకు ఉంటారు. వారిపై ఆధారపడిన వారిని కూడా కలుపుకుంటే మొత్తం ప్రభావితులు రాష్ట్ర జనాభాలో దాదాపు తొమ్మిది శాతం మంది! గత ప్రభుత్వం ఉద్యోగులకు వ్యతిరేకంగా అనేక పోకడలు పోయింది. 2023 అసెంబ్లీ ఎన్నికల ఫలితాల్లో పోస్టల్ బ్యాలెట్ ఓట్ల తీరును విశ్లేషిస్తే వందకు పైగా స్థానాల్లో నాటి ప్రభుత్వానికి వ్యతిరేకంగా, కాంగ్రెస్ అభ్యర్థులకు అండగా ఉద్యోగులు ఓటు వేసి గెలిపించుకున్నారన్న విషయం సీఎం విస్మరించకూడదు.

దేశంలో ఎక్కడా లేని విధంగా కేవలం కాంగ్రెస్ అధికారంలో ఉన్న రాష్ట్రాలైన కర్ణాటక, హిమాచల్‌ప్రదేశ్, తెలంగాణలోనే అయిదు డీఏలు పెండింగ్‌లో ఉన్నాయి! తాము అధికారంలోకి వస్తే ఆరు నెలల్లో పీఆర్సీ ఇస్తామన్న కాంగ్రెస్ ప్రభుత్వం ఆ మాటనే మరిచింది. 2026 జనవరి నుంచి ఎనిమిదో పీఆర్సీ అమలుకు కేంద్ర ప్రభుత్వం సన్నాహాలు చేస్తున్నది. 16వ పీఆర్సీలో ఉండాల్సిన రాష్ట్ర ఉద్యోగులు ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల నాలుగు పీఆర్సీలు నష్టపోతున్నారు. ఉద్యోగులకు హెల్త్‌కార్డుల ద్వారా ఏ ఆసుపత్రిలోనూ చికిత్సలు జరగడం లేదు. గత ప్రభుత్వం తెచ్చిన జోనల్ విధానం వల్ల నష్టపోయిన (జీవో 317) ఉద్యోగులను వారి స్వస్థలాలకు పంపిస్తామని, సీపీఎస్‌ను రద్దు చేస్తామని ఇచ్చిన హామీని కాంగ్రెస్‌కు తుంగలో తొక్కినట్టే కనిపిస్తోంది. గత 16 నెలల్లో 12,000 మంది ఉద్యోగులు రిటైర్ అయ్యారు. వీరికి ఒక్కొక్కరికి సరాసరిన రూ.50 లక్షల చొప్పున పెన్షన్ బెనిఫిట్స్‌ను ప్రభుత్వం చెల్లించాల్సి ఉంది. కోర్టుకు వెళ్లి ఆదేశాలు తెచ్చుకుంటే తప్ప ప్రభుత్వం వీటిని చెల్లించకపోవడం దురదృష్టకరం. ఉద్యోగుల జీపీఎఫ్, సరెండర్ లీవు వేతనం, మెడికల్ రియింబర్స్‌మెంట్ బిల్లుల చెల్లింపులు కూడా జరగడం లేదు.

ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం గతంలో ముగ్గురు మంత్రులు, ముగ్గురు ఐఏఎస్‌లతో కమిటీని ఏర్పాటు చేసింది. కానీ ఫలితం శూన్యం. పెండింగ్‌లో ఉన్న అయిదు డీఏలను ఆరు నెలలకొకటి చొప్పున ఇస్తామంటూ జీవో విడుదల చేయడం విడ్డూరం. నేడు రాష్ట్రంలో దాదాపు 1 లక్షా 60 వేల ఉద్యోగ ఖాళీలు ఉన్నాయి. ప్రస్తుతం పనిచేస్తున్న ఉద్యోగులే ఆ ఖాళీల పని భారాన్ని మోయాల్సి వస్తున్నది. ప్రభుత్వం త్వరగా ఉద్యోగ నియామకాలు చేపట్టాలి. ఇప్పటికైనా సీఎం రేవంత్‌రెడ్డి స్పందించి ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం చిత్తశుద్ధితో కృషి చేయాలి.

– పులి సరోత్తంరెడ్డి, పీఆర్‌టీయూ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు

విద్యపై ఉపన్యాసాలు కాదు, కార్యాచరణ కావాలి!


విద్య కోసం ఏటా రూ.40వేల కోట్లు (బడ్జెట్‌లో 13 శాతం) ఖర్చు చేస్తున్నామనీ, కార్పొరేట్ కంటే నాణ్యమైన విద్యను అందిస్తామనీ, పేదలు చదువుకున్నప్పుడే రాష్ట్రం తలరాత మారుతుందనీ పెద్ద పెద్ద మాటలతో టీచర్స్ డే రోజు విద్యాశాఖ మంత్రి కూడా అయిన ముఖ్యమంత్రి చేసిన ప్రసంగం ఆశాజనకంగా అనిపించినప్పటికీ, రాష్ట్రంలోని పాఠశాలల వాస్తవ పరిస్థితులు అందుకు పూర్తి విరుద్ధంగా ఉన్నాయి.

ప్రైవేటు విద్యాసంస్థల్లో ఫీజుల భారంతో, ప్రభుత్వ విద్యా సంస్థల్లో అరకొర వసతులతో, మారుమూల ప్రాంతాల్లో టీచర్ల కొరతతో అత్యధిక శాతం తెలంగాణ విద్యార్థుల భవిష్యత్తుపై నీడలు వాలుతున్నాయి. ప్రభుత్వం నుంచి అందుతున్న నాసిరకం విద్యతో తెలంగాణ బిడ్డలు ప్రభుత్వం తలపెట్టిన అభివృద్ధిబాట నుంచి వెలివేయబడుతారు. ఈ బిడ్డలంతా పేద అణగారిన వర్గాలకు చెందిన బిడ్డలని గుర్తించాలి. నిజాయితీతో కూడిన విద్యా కార్యాచరణ చేపట్టకపోతే ఈ బిడ్డలను సామాజిక న్యాయానికి దూరం చేసినవారమవుతాం.

తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావానికి విద్య ఒక ప్రధాన ఎజెండాగా నిలిచింది. ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసి, ప్రైవేట్ ఆధిపత్యం నుంచి తప్పిస్తామని హామీలు గుప్పించారు. కానీ పరిస్థితి విరుద్ధంగా మారింది. నేడు ప్రభుత్వ విద్య అంపశయ్యపై ఉన్నది. ప్రైవేటు విద్యా సంస్థలు మరింత బలపడ్డాయి. 2014–15లో ప్రభుత్వ పాఠశాలల్లో 28.4 లక్షల విద్యార్థులు ఉండగా, ఇప్పుడు 23.3 లక్షలకు పడిపోయారు. మరోవైపు ప్రైవేట్ పాఠశాలల్లో చేరిన పిల్లల సంఖ్య 29 లక్షల నుంచి 36.8 లక్షలకు పెరిగింది. తల్లిదండ్రులు నాణ్యత కోసం ప్రభుత్వాన్ని వదిలి ప్రైవేట్ వైపు వెళ్లడం గమనార్హం. 2024–25 విద్యా సంవత్సరంలో ఒకటవ తరగతిలో చేరిన 6,62,134 మంది విద్యార్థుల్లో– ప్రైవేటు విద్యా సంస్థల్లో చేరినవారు 4,79,402 మంది (72శాతం) కాగా, ప్రభుత్వ బడులలో చేరినవారు కేవలం 1,76,038 విద్యార్థులు (28శాతం) మాత్రమే! ఏటేటా ప్రభుత్వ బడులలో పిల్లల నమోదు తగ్గుతూనే వస్తున్నది.

కేంద్రం నిర్వహించిన 80వ జాతీయ శాంపిల్ సర్వే (ఎన్ఎస్ఎస్) ద్వారా ప్రైవేటు పాఠశాలల్లో విద్య కోసం కుటుంబాలు చేసే వ్యయం ఎంతో వెల్లడైనది. గ్రామీణ ప్రాంతాల్లో ప్రైవేటు విద్యా సంస్థలలో ఒక్కో విద్యార్థి కోసం సంవత్సరానికి రూ.35వేలు ఖర్చు చేస్తుండగా, పట్టణ ప్రాంతాలలో దాదాపు రూ.41 వేల వరకు ఖర్చు చేస్తున్నారు. హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్, హన్మకొండ జిల్లాలలో మొత్తం కలిపి 25 లక్షల మంది విద్యార్థులు నమోదు కాగా వారిలో దాదాపు 20 లక్షల మంది అంటే 80 శాతం మంది విద్యార్థులు ప్రైవేట్ పాఠశాలల్లో చదువుకుంటున్నారు. ప్రజలు పన్నులు చెల్లిస్తున్నా తమ పిల్లల భవిష్యత్తు కోసం ప్రైవేట్ పాఠశాలల్లో ఖరీదైన విద్యను కొనుగోలు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. అభివృద్ధి చెందిన అమెరికా యూరప్‌లలో ఏ దేశంలోనూ ఇలాంటి పరిస్థితి లేదు. ఇది విద్యా

> ప్రైవేటు విద్యాసంస్థల్లో ఫీజుల భారంతో, ప్రభుత్వం విద్యా సంస్థల్లో అరకొర వసతులతో, మారుమూల ప్రాంతాల్లో టీచర్ల కొరతతో అత్యధిక శాతం తెలంగాణ విద్యార్థుల భవిష్యత్తుపై నీడలు వాలుతున్నాయి. ఈ పరిస్థితిలో తెలంగాణ ప్రభుత్వం విద్యకు అత్యున్నత ప్రాధాన్యం ఇవ్వడం తక్షణ కర్తవ్యం. ఊకదంపుడు ఉపన్యాసాలతో కాలం వృథా చేయకుండా, విద్యను నిజమైన ప్రజా హక్కుగా అమలు చేయాలి.



హక్కుపై ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని స్పష్టంగా చూపిస్తున్నది.

ప్రభుత్వ పాఠశాలల మౌలిక సదుపాయాలు కూడా దారుణంగా ఉన్నాయి. ఈ మధ్య విడుదల చేసిన యుడైస్ 2024–25 ప్రకారం సైన్స్ లాబ్స్ ఉన్న పాఠశాలలు కేవలం 63 శాతం మాత్రమే. కంప్యూటర్లు 21 శాతం పాఠశాలలకే పరిమితం. స్మార్ట్ క్లాస్ రూమ్స్ 29 శాతం, లాప్‌టాప్‌లు 3శాతం పాఠశాలల్లోనే ఉన్నాయి. గురుకులాలు, సంక్షేమ వసతి గృహాలు సమస్యలకు నిలయాలుగా మారుతున్నాయి. కొన్ని భవనాలు శిథిలమయ్యాయి. కొన్ని చోట్ల టాయిలెట్లు లేక విద్యార్థినుల అవస్థలు చెప్పజాలనివి. మధ్యాహ్న భోజనం వంట చేసే సంఘాలకు మెస్ బిల్లులు సరైన సమయంలో అందడం లేదు. గురుకులాల మెస్ బిల్లుల కోసం నెలల తరబడి వేచి చూడాల్సిన పరిస్థితి. అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. ఆర్థిక భారంతో సగంలోనే అనేక పనులు మధ్యలో ఆపేసిన విషయం తెలిసిందే.

అత్యంత ఆందోళన కలిగించే అంశం అభ్యాస ఫలితాలు. 2024లో నిర్వహించిన పరఖ్ సర్వేలో తెలంగాణ విద్యార్థుల ప్రతిభ జాతీయ సగటు కంటే తక్కువగా ఉంది. మూడో తరగతిలో సగం మంది పిల్లలు కథ చదవలేకపోతున్నారు, ప్రాథమిక గణితం చేయలేకపోతున్నారు. ఆరవ తరగతిలో యూనిట్ల మార్పిడి, అత్యవసర పరిస్థితుల్లో స్పందన వంటి కనీస నైపుణ్యాల్లో కూడా బలహీనత కనిపిస్తోంది. తొమ్మిదో తరగతిలో శాతం లెక్కలు చేయగలిగినవారు కేవలం 25శాతం మాత్రమే. ఇది కేవలం పనితీరు లోపం కాదు, వ్యూహ రచన లోపం. భవిష్యత్తు తరాలను అజ్ఞానంలోకి నెట్టే కుట్ర– అనే అపవాదు మూట కట్టుకోకుండా ప్రభుత్వం తక్షణ కార్యాచరణకు దిగాలి. పలు రంగాల నిపుణులతో చర్చలు చేసి రూపొందించిన విద్యా కమిషన్ నివేదికల అమలుపై చర్చ జరగాలి. కమిటీల మీద కమిటీలతో కాలయాపన చేస్తే ప్రభుత్వ నిధులు వృథా తప్ప ఫలితం ఉండదు.

ఈ పరిస్థితిలో తెలంగాణ ప్రభుత్వం విద్యకు అత్యున్నత ప్రాధాన్యం ఇవ్వడం తక్షణ కర్తవ్యం. అధిక విద్యార్థులు ఉన్న పాఠశాలలను మౌలిక వసతులు, లైబ్రరీలు, ల్యాబ్స్, డిజిటల్ సదుపాయాలతో బలోపేతం చేయాలి. పాఠశాలల్లో చట్టపరంగా ఉన్న తల్లిదండ్రుల పాత్రను వెంటనే పునరుద్ధరించాలి. పాఠశాల మేనేజ్‌మెంట్ కమిటీలను పునఃవ్యవస్థీకరించాలి. వెంటనే విద్యా అత్యవసర పరిస్థితిని ప్రకటించి, మూడు నుంచి తొమ్మిదో తరగతి వరకు ప్రత్యేక అభ్యాస కార్యక్రమాలు చేపట్టాలి. రాష్ట్ర బడ్జెట్‌లో విద్య ఖర్చును కనీసం 20శాతానికి పెంచాలి. ప్రైవేట్ పాఠశాలలను నియంత్రించి, ఫీజుల్లో పారదర్శకతను తేవాలి. యూపీఏ ప్రభుత్వ హయాంలో వచ్చిన విద్యా హక్కు చట్టం అమలుకు చట్టబద్ధ బాధ్యత వహించాలి.

తెలంగాణలో ఇప్పుడు ప్రభుత్వ పెద్దలకు నిజాలను నిక్కచ్చిగా చెప్పే అధికార యంత్రాంగం కావాలి. వారి నుంచి వాస్తవ పరిస్థితులను విని అర్థం చేసుకునే నాయకత్వం కావాలి. ఊకదంపుడు ఉపన్యాసాలతో కాలం వృథా చేయకుండా, ధైర్యంగా నిజాలను ఒప్పుకుని నిర్ణయాలు తీసుకుని, విద్యను నిజమైన ప్రజా హక్కుగా అమలుచేయాలి.

• ఆర్. వెంకటరెడ్డి
తెలంగాణ విద్యాకమిషన్ సలహాదారు



మంత్రాల అనుమానంతోనే
రాధమ్మ హత్య
నెల్లికుదురు ఘటనలో వీడిన మిస్టరీ



విమోచనం పేరుతో
బీజేపీ మత రాజకీయం
సీపీఎం జాతీయ కార్యదర్శి ఎంఏ బేబీ



6

- జిల్లాలో 54,226 మంది రైతులకు రూ.42 కోట్ల రుణమాఫీ చేశాం..
- ఎరువుల కొరత లేకుండా చూస్తున్నాం
- పేదలకు ఇందిరమ్మ ఇళ్లు నిర్మించి ఇస్తున్నాం
- రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ
- వరంగల్ కలెక్టరేట్ గ్రౌండ్‌లో ఘనంగా ప్రజాపాలన దినోత్సవం



ప్రసంగిస్తున్న మంత్రి కొండా సురేఖ



జాతీయజెండాకు వందనం చేస్తున్న మంత్రి కొండా సురేఖ, కలెక్టర్ సత్యశారద ఇతర అధికారులు

ప్రజా సంక్షేమమే లక్ష్యం

ఓరుగల్లును రెండో రాజధానిగా అభివృద్ధి చేస్తున్నాం

వరంగల్ కలెక్టరేట్/గిర్మాజిపేట, సెప్టెంబరు17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రం అభివృద్ధి, ప్రజా సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు. తెలంగాణ ప్రజాపాలన దినోత్సవం సందర్భంగా బుధవారం వరంగల్ అజంజాహిమిల్లు గ్రౌండ్‌లో నిర్మిస్తున్న కలెక్టరేట్ గ్రౌండ్‌లో ఆమె జాతీయ జెండాను ఎగురవేసి పోలీసుల గౌరవ వందనాన్ని స్వీకరించారు. అనంతరం మాట్లాడుతూ- హైదరాబాద్ సంస్థానం భారత యూనియన్‌లో విలీనమైన సెప్టెంబరు 17ను రేవంత్ రెడ్డి ప్రభుత్వం ప్రజాపాలన దినోత్సవంగా నిర్వహిస్తోందని అన్నారు. చారిత్రక వరంగల్ మహానగరాన్ని రాష్ట్ర రెండో రాజధానిగా అభివృద్ధి చేస్తున్నట్లు మంత్రి తెలిపారు. ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటూనే ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీలతో పాటుగా అన్ని సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నామని అన్నారు.

జిల్లాలో 54వేల226 మంది రైతులకు రూ.42 కోట్ల రుణమాఫీ చేసినట్లు చెప్పారు. రైతు బీమా కింద 454 మంది రైతు కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.5 లక్షల చొప్పున రూ.22 కోట్ల 70 లక్షలు అందచేశామన్నారు. రైతు భరోసా కింద జిల్లాలో లక్షా 57 వేల మందికి రూ.165 కోట్లు జమ చేసినట్లు తెలిపారు. సన్నరకం ధాన్యానికి మద్దతు ధర కంటే రు.500లు బోనస్ చెల్లిస్తున్నామన్నారు. జిల్లాలో లక్షా 11వేల మెట్రిక్ టన్నులు ఎరువులు అవసరం కాగా ఇప్పటి వరకు 96వేల 977 మెట్రిక్ టన్నుల పంపిణీ చేశామన్నారు. భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం లక్ష్యంగా అమలు చేస్తున్న భూభారతి చట్టం పైలెట్ ప్రాజెక్ట్ వర్ధన్నపేట మండలంలో దిగ్విజయం అయిందని అన్నారు.

గత ప్రభుత్వం నిర్వీర్యం చేసిన రెవెన్యూశాఖను బలోపేతం చేసేందుకు గ్రామపరిపాలనాధికారులను నియమించామన్నారు. జిల్లాలో 177 మంది జీపీవోలు విధుల్లో చేరారని అన్నారు. అర్హులందరికీ ఇందిరమ్మ ఇండ్లు ఇస్తున్నామని, స్థలం ఉన్న వారికి రూ.5 లక్షలు ఇస్తున్నామని అన్నారు. జిల్లాలో మంజూరైన 3866 గృహాలలో 2213 గృహాలు పూర్తిఅయ్యాయని, 1600 గృహాలు వివిధ దశల్లో ఉన్నాయని అన్నారు. జిల్లాలో ఇప్పటి వరకు 6815 నూతన ఆహార భద్రత కార్డులు పంపిణీ చేశామన్నారు. ఎంజీఎం, సీకేఎం, ప్రాంతీయ కంటి ఆస్పత్రులతో పాటుగా ప్రాథమిక, పట్టణ ఆరోగ్య కేంద్రాలలో అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నామన్నారు. జిల్లాలోని మూడు నియోజకవర్గాలకు మూడు యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ మోడల్ స్కూల్స్ మంజూరయ్యాయని తెలిపారు. ఈ ఏడాది ఇప్పటివరకు 26 లక్షల 80 వేల మొక్కలు నాటామన్నారు. గ్రీన్ హెరిటేజ్ పాకాల బయో డైవర్సిటీ పార్కును అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు.

మామూనూరు ఎయిర్‌పోర్టు, అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ వ్యవస్థ ఏర్పాటు చేస్తున్నామని, సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిని అభివృద్ధి చేస్తున్నామని, రూ.80 కోట్లతో వరంగల్ కలెక్టరేట్ (మిగతా 6వ పేజీలో)

- తెలంగాణకు ఆ పెద్ద మనిషి నయా నిజాం అయ్యాడు..
- భూములను, ప్రాజెక్టులను మింగేశారు..
- కాంగ్రెస్ పాలన రాకతో తెలంగాణకు స్వేచ్ఛ
- కంచెలు తొలగించాం.. మానసిక బానిసత్వ సంకెళ్లు తెంచాం..
- అభివృద్ధి, సంక్షేమం లక్ష్యంగా ద్విముఖ వ్యూహంతో పాలన
- ప్రజా పాలన దినోత్సవంలో జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొంగులేటి



మాట్లాడుతున్న మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి



హనుమకొండ కలెక్టరేట్‌లో జెండా ఆవిష్కరించి జాతీయ గీతాలపన చేస్తున్న మంత్రి పొంగులేటి తదితరులు

పదేళ్లు నియంత పాలన

హనుమకొండ, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : పదేళ్లలో తెలంగాణ రాష్ట్రం నియంత పాలనలో మగ్గిపోయిందని, రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత తెలంగాణకు స్వేచ్ఛ లభించదని రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. బుధవారం హనుమకొండ కలెక్టరేట్ కార్యాలయంలో సెప్టెంబరు 17న నిజాం విముక్తిని పురస్కరించుకొని ప్రజాపాలన దినోత్సవం ఘనంగా నిర్వహించారు. మంత్రి శ్రీనివాస్‌రెడ్డి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. పోలీసు గౌరవ వందనాన్ని స్వీకరించారు. అనంతరం మంత్రి జిల్లా ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు.

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ నుంచి విడిపోయి తెలంగాణ ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పడిన తర్వాత ఆ పెద్ద మనిషి నయా నిజం అయ్యాడని, పదేళ్లలో తెలంగాణ నియంత పాలనంలో మగ్గిపోయిందని, ప్రజాస్వామ్యం పీక పిసికేశారని ధ్వజమెత్తారు. తెలంగాణ నియంత పాలన నుంచి విముక్తి చేస్తామని మాట ఇచ్చామని, 2023 డిసెంబర్ 3న తెలంగాణకు స్వేచ్ఛను ప్రసాదించడంలో తమకు స్ఫూర్తి నాటి సాయుధ పోరాటమేనన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో ఇందిరమ్మ ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాల ఫలితంగా అన్నిరంగాల్లో రాష్ట్రం సర్వతోముఖంగా అభివృద్ధి సాధిస్తోందన్నారు. సంక్షేమానికి కేరాఫ్ కాంగ్రెస్ పాలన అని, దీనికి చరిత్రే సాక్ష్యం అని పేర్కొన్నారు.

ప్రగతి పథంలో జిల్లా

హనుమకొండ జిల్లా అభివృద్ధికి సీఎం అధిక ప్రాధాన్యత ఇస్తున్నారని మంత్రి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. తమ ప్రభుత్వం దాదాపు రూ.5వేల కోట్లతో వివిధ అభివృద్ధి పనులను చేపట్టిందని అన్నారు. 2057 నాటికి పెరిగే జనాభాను దృష్టిలో పెట్టుకొని రూ.4,100కోట్లతో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులను త్వరలో ప్రారంభించనున్నట్టు మంత్రి ప్రకటించారు. 2040 వరకు పెరిగే జనాభా అవసరాలకు అనుగుణంగా మాస్టర్‌ప్లాన్‌ను తీసుకువచ్చామని చెప్పారు. భద్రకాళి దేవాలయం మాడవీధుల నిర్మాణం పనులు చివరి దశలో ఉన్నాయని, పురాతన హనుమ కొండ కలెక్టర్ బంగ్లాను ఆధునీకరించామని, జాతీయ రహదారుల విస్తరణలో భాగంగా స్టేషన్‌ఘనపూర్ నుంచి ఐనవోలు, కూనూరు, గర్నెపల్లి వరకు రోడ్డు, ఒగ్లాపూర్ నుంచి ధర్మా రం రోడ్డు విస్తరణ పనులు పూర్తయ్యా యని చెప్పారు. భీమదేవరపల్లి (మిగతా 6వ పేజీలో)

పైపులైన్ పనుల్లో డొల్లతనం

- వర్ధన్నపేటలో కొనసాగుతున్న అమృత్ 2.0 పనులు
- రూ.34.08కోట్ల నిధులతో తాగునీటి పథకం
- రెండు ట్యాంకులు, 40 కి.మీ. మేర పైపులైన్ల ఏర్పాటు
- ప్రైవేటు కంపెనీ ఫైబర్ పైపు సైతం ఇందులోనే..
- వర్ధన్నపేట - జఫర్‌గడ్ బీటీ రోడ్డు ధ్వంసం
- ఆయా శాఖల అనుమతులపై అనుమానాలు

వర్ధన్నపేట రూరల్/వర్ధన్నపేట, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ కేంద్రమైన వర్ధన్నపేటలో కొన్ని రోజులుగా సాగుతున్న తాగునీటి పైపులైను పనుల్లో పారదర్శకత లోపించినట్టు ఆరోపణలు వస్తున్నాయి. ఇక్కడ అమృత్ 2.0 ప్రాజెక్టులో భాగంగా ఈ పనులను కొన్ని నెలల కిందట ప్రారంభించారు. పట్టణంలో రెండు చోట్ల ట్యాంకులను ఏర్పాటు చేసి వేర్వేరుగా పైపు లైన్లు వేసి ప్రజలకు నీరందించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం నిధులను విడుదల చేసింది. రూ.34.08కోట్లతో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సమ భాగాలు డబ్బులను అందిస్తోంది. డీసీ తండా కేంద్రంగా మిగిలిన 10 తండాలు, వర్ధన్నపేట సంగెపు వాగు వద్ద ఉన్న శ్మశానవాటిక కేంద్రంగా ప్రధాన రహదారి గుండా పైపులైన్లను వేస్తున్నారు. ఈ పైపులైను పనుల్లో డొల్లతనం కనిపిస్తోందని స్థానికులు ఆరోపిస్తున్నారు. అధికారుల పర్యవేక్షణ లేకుండా కొన్నిసార్లు జేసీబీతో తవ్వకాలు జరిగి పైపులు వేసి చేతులు దులుపుకుంటున్నారనే ఆరోపణలు వస్తున్నాయి.



వర్ధన్నపేటలో నిర్మాణంలో ఉన్న వాటర్ ట్యాంక్

రెండు ట్యాంకులు, 40 కి.మీ. వరకు పైపులు

అమృత్ 2.0 ప్రాజెక్టులో భాగంగా వర్ధన్నపేట మునిసిపాలిటీ పరిధిలో రెండు ట్యాంకులను నిర్మిస్తున్నారు. డీసీ తండాలో 8లక్షల లీటర్ల సామర్థ్యం ఉన్న ఓ ట్యాంకు, సంగెపు వాగు వద్ద ఉన్న శ్మశానవాటిక ప్రాంగణంలో 10 లక్షల లీటర్ల సామర్థ్యం మరో వాటర్ ట్యాంకు నిర్మాణ దశలో ఉంది. వీటి నుంచి డీసీ తండా వైపు ఉన్న 10 తండాలకు పైపు లైన్లు వేస్తారు. సంగెపు వాగు నుంచి ప్రధాన రహదారి పక్క నుంచి ప్రస్తుతం వర్ధన్నపేట - జఫర్‌గడ్ రోడ్డుకు వెళ్లే మార్గంలో బీటీ రోడ్డును ధ్వంసం చేసి పైపులు వేస్తున్నారు. డీసీ తండా పరిధిలో దాదాపు 20 కి.మీ. మరో వైపు 20 కి.మీ. వేసేందుకు అంచనా వేశారు. ఆగస్టు 2024లో ప్రారంభమైన పనులు నత్త నడకన సాగుతూనే ఉన్నాయి.



నీరు, ఫైబర్ పైపులు వేసేందుకు గుంతలు తీస్తున్న జేసీబీ

ప్రైవేటు కంపెనీ ఫైబర్ పైపు...

ఓ ప్రముఖ కన్‌స్ట్రక్షన్ లిమిటెడ్ కంపెనీ పైపు లైను పనులను దక్కించుకుంది. కానీ వారి నుంచి మరో వ్యక్తి సబ్ కాంట్రాక్టర్‌గా పనులు చే యిస్తున్నాడనిఅధికారులు చెప్పకనే చెబుతున్నారు. దీనికి తోడు నీటి పైపుతో పాటు ఓ ప్రముఖ కంపెనీకి చెందిన ఫైబర్ పైపును సైతం దీనితో పాటే వేస్తున్నారు. ఒక మీటరు లోతును తీసి పైపులు వేయాల్సి ఉండగా, ఆ దిశ గా పనులు సాగుతున్నాయో లేదో అధికారులు పట్టించుకోవడం లేదు.

దీనికి తోడు పైపులైన్‌తోపాటు ఫైబర్ పైపు వేయడం ద్వారా భవిష్యత్‌లో సమస్యలు రావనే నమ్మకం (మిగతా 6వ పేజీలో)



హనుమకొండలోని డీసీసీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతున్న నాయిని రాజేందర్‌రెడ్డి

ఫిరాయింపులను ప్రోత్సహించింది బీఆర్ఎస్సే..

- రాజకీయ విలువలను కేసీఆర్ మంటగలిపారు..
- దమ్ముంటే ఉమ్మడి జిల్లా అభివృద్ధిపై చర్చకు రావాలి
- వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి

హనుమకొండ సిటీ, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): పార్టీ ఫిరాయింపులను ప్రోత్సహించిందే బీఆర్ఎస్ పార్టీ అని హనుమకొండ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి విమర్శించారు. బుధవారం హనుమకొండలోని జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో జరిగిన మీడియా సమావేశంలో రాజేందర్‌రెడ్డి బీఆర్ఎస్‌పై భగ్గుమన్నారు. నాడు 36మంది ఎమ్మెల్యేలను అక్కున చేర్చుకున్న బీఆర్ఎస్.. ఈరోజు కాంగ్రెస్‌పై నోరు పారేసుకోవడం హాస్యాస్పదంగా ఉందన్నారు. అధికారం, స్వార్థం, ధన దాహం కోసం కేసీఆర్ రాజకీయ విలువలను మంటగలిపారని మండిపడ్డారు. బీఆర్ఎస్‌ను వ్యతిరేకిస్తున్న ఎమ్మెల్యేలు, నేతలు.. అభివృద్ధిలో కాంగ్రెస్‌తో కలిసి వస్తున్నారనిరాజేందర్‌రెడ్డి పేర్కొన్నారు. కడియం శ్రీహరి నియోజకవర్గ అభివృద్ధి కోసం వేయి కోట్ల నిధులు తీసుకొచ్చారన్నారు. ఇకనైనా దుష్ప్రచారాలు మానుకోవాలని, నోటికొచ్చినట్లు మాట్లాడితే సహించేది లేదని రాజేందర్‌రెడ్డి హెచ్చరించారు. దళితుడైన టి.రాజయ్యను ఏ కారణంతో డిప్యూటీ సీఎం పదవి నుంచి తొలగించారనే ప్రశ్నలకు నేటికీ కేసీఆర్ వద్ద సమాధానం లేదని దుయ్యబట్టారు. ఎమ్మెల్సీ కవిత చేసిన అవినీతి ఆరోపణలపై కేటీఆర్, హరీశ్‌రావు ఎందుకు స్పందించడం లేదని నాయిని మండిపడ్డారు. కాళేశ్వరం ప్రాజెక్టులో భారీ కుంభకోణం జరిగిందని (మిగతా 6వ పేజీలో)

కాంగ్రెస్‌ది ప్రజాకంటక పాలన

- ఎన్నికల హామీలను గాలికొదిలేసింది..
- బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్‌భాస్కర్
- పార్టీ కార్యాలయంలో జాతీయ సమైక్యత దినోత్సవం



జాతీయజెండాకు వందనం చేస్తున్న బీఆర్ఎస్ శ్రేణులు

హనుమకొండ టౌన్, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ప్రజాకంటక పాలన కొనసాగిస్తున్నదని ప్రభుత్వ మాజీ చీఫ్ విప్, బీఆర్ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ భాస్కర్ ధ్వజ మెత్తారు. హనుమకొండ బాలసముద్రంలోని భారత రాష్ట్ర సమితి పార్టీ జిల్లా కార్యాలయంలో జాతీయ సమైక్యత దినోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. భారతమాత చిత్రపటానికి ఆయనతో పాటు 'కుడా' మాజీ చైర్మన్ మర్రి యాదవరెడ్డి, బీఆర్ఎస్ లీగల్‌సెల్ నేత తాళ్లపెల్లి జనార్దన్ గౌడ్ తెలంగాణ తల్లి విగ్రహానికి పూలమాలలు వేశారు. అనంతరం జాతీయ జెండాను ఆవిష్కరించారు.ఈ సందర్భంగా వినయభాస్కర్ మాట్లాడుతూ.. నాడు సాయుధ రైతాంగ, తెలంగాణ తొలి, మలిదశ అమరవీరులం దరికీ జాతీయ సమైక్యత దినోత్సవం సందర్భంగా నివాళులర్పిస్తున్నట్లు తెలిపారు. తెలంగాణ ప్రజల 60 ఏళ్ల కలను సాకారం చేసేందుకు కేసీఆర్ 14 ఏళ్ల పోరాటం చేశారని అన్నారు. సాధించిన తెలంగాణను పదేళ్లలో అన్ని రంగాల్లో దేశంలోనే నంబర్‌వన్ రాష్ట్రంగా తీర్చిదిద్దిన ఘనత కేఆర్‌కే దక్కుతుందని స్పష్టం చేశారు. రాష్ట్రంలో అధికారాన్ని చేపట్టిన కాంగ్రెస్ పార్టీ ప్రజా వ్యతిరేక పాలన సాగిస్తోందని దుయ్యబట్టారు. 420 హామీలు, ఆరు గ్యారంటీలు ఎన్నికల్లో ప్రకటించిన కాంగ్రెస్ వాటిని అమలును విస్మరించిందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు జోరిక రమేష్, తండమల్ల వేణు, కుసుమ లక్ష్మీనారాయణ, నియోజక వర్గ కోఆర్డినేటర్ పులి రజినీకాంత్, మైనార్టీ సెల్ ఉమ్మడి జిల్లా నేత ఎండి నయీమొద్దీన్, బీఆర్ఎస్ నేతలు నరెడ్ల శ్రీధర్, బండి రజినీకుమార్, గనిపాక విజయ్, దూలం వెంకన్న, సోని, మహమూద్, ఖలీల్, ఇస్మాయిల్, సదాంత్, గౌస్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యశ్రీ సేవలు కొనసాగించండి..

- మానవీయ కోణంలో పేదలకు వైద్యం అందించాలి
- రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్

వరంగల్ మెడికల్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఆరోగ్యశ్రీ నిలిపివేతతో పేదలు ఇబ్బందులు పడుతున్నారని, మానవీయ కోణంలో పేదలకు వైద్యం అందించాలని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ జిల్లా ప్రయివేట్ హాస్పిటల్ యాజమాన్యాలకు ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. ప్రయివేట్ హాస్పిటళ్లు ఆరోగ్యశ్రీ సేవల నిలిపివేతపై వెనక్కి తగ్గాలని పేర్కొ న్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో వైద్య, ఆరోగ్యశా ఖ మంత్రి దామోదర రాజనర్సింహా ఆధ్వర్యంలో ఆరోగ్యశ్రీ ఉచిత వైద్య పరిమితి రూ.5లక్షల నుంచి రూ.10లక్షలకు పెంచామన్నారు. గడిచిన 21నెలల్లో రాష్ట్రవ్యాప్తంగా రూ.1779 కోట్లు ఆరోగ్యశ్రీ కింద ప్రయివేట్ హాస్పిటళ్లకు ప్రభుత్వం చెల్లించామన్నారు. ప్రభుత్వం ఏర్పడిన వెంటనే 1,375 చికిత్సల చార్జీలను సగటున 22శాతానికి పైగా పెంచిందని పేర్కొన్నారు.

కొత్తగా 163 రకాల ఖరీదైన వైద్య సేవలను ఆరోగ్యశ్రీ చేర్చి ప్రజలకు ఇబ్బందులు లేకుండా వైద్య సేవలను అందుబాటులోకి తెచ్చామన్నారు. ఆరోగ్యశాఖ మంత్రి ఎప్పటికప్పుడు ప్రయివేట్ ఆస్పత్రుల యాజమాన్యాలపై సంప్రదింపులు జరుపుతున్నారని తెలిపారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని ప్రయివేట్ హాస్పిటళ్ల యాజమాన్యాలు అర్థం చేసుకొని ఆరోగ్యశ్రీ సేవలను పునరుద్ధరించాలని విజ్ఞప్తి చేస్తున్నట్లు రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు.

అభివృద్ధి పనులపై సుదీర్ఘ చర్చ

- మంత్రి పొంగులేటి ఆధ్వర్యంలో పాల్గొన్న ఎంపీ, ఎమ్మెల్యేలు
- హాజరైన కలెక్టర్లు, ఇతర అధికారులు
- ప్రస్తావనకు వచ్చిన ఎయిర్ పోర్టు భూసేకరణ
- స్పోర్ట్స్ స్కూల్ స్థలం, పారిశుధ్య సిబ్బంది నియామకం
- సమావేశానికి మంత్రి సురేఖ దూరం

7



స్వస్థనారి ఆరోగ్య అభియాన్ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎంపీ కావ్య

మహిళల ఆరోగ్యమే కుటుంబానికి ఆనందం

- వరంగల్ ఎంపీ కడియం కావ్య
- స్వస్థనారి ఆరోగ్య అభియాన్ కార్యక్రమం ప్రారంభం

6

యూరియాను బ్లాక్‌చేస్తే కఠిన చర్యలు

మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి

మరిపెడ, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): జిల్లా యంత్రాంగమంతా యూరియా పంపిణీపై ఫోకస్ పెట్టాలని రెవెన్యూ, గృహ నిర్మాణల శాఖమంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. బుధవారం డోర్నకల్ ఎమ్మెల్యే రాంచంద్రునాయక్‌తో కలిసి మరిపెడ విశ్రాంతి భవన్‌లో స్థానిక అధికారులతో యూరియా పంపిణీపై పొంగులేటి సమీక్ష జరిపారు. అనంతరం ఆయన మహబూబాబాద్ జిల్లా మరిపెడలో విలేకరులతో మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి రాష్ట్ర రైతుల కోసం యూరియా సమకూర్చుతున్నారని గుర్తు చేశారు. రైతులు యూరియా కోసం ఆందోళనలకు గురికావొద్దని సూచించారు. యూరియాను బ్లాక్‌చేస్తే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో కలిసి పని చేయాలని సూచించారు.

బతుకమ్మకు అన్ని ఏర్పాట్లు చేయాలి

వరంగల్ నగర మేయర్ గుండు సుధారాణి



అధికారులతో మాట్లాడుతున్న మేయర్ సుధారాణి

వరంగల్ కార్పొరేషన్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 21న వేయిస్తంభాల ఆలయంలో నిర్వహించే బతుకమ్మ వేడుకలకు అన్ని ఏర్పాట్లు చేయాలని మేయర్ గుండు సుధారాణి అధికారులకు సూచించారు. బుధవారం వరంగల్ నగర పాలక సంస్థ ప్రధాన కార్యాలయంలో జీడబ్ల్యూఎంసీ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ.. బతుకమ్మ వేడుకలకు హనుమకొండ నగరంతో పాటు చుట్టుపక్కల 26 చోట్ల, వరంగల్‌లో 20 ప్రాంతాలను ఇప్పటికే ఎంపిక చేశామని, అక్కడ మహిళలకు కావలసిన అన్ని ఏర్పాట్లు చేయాలని సూచించారు. శానిటేషన్ సిబ్బంది బతుకమ్మలు ఆడుకునే ప్రాంతాలను సిబ్బందితో శుభ్రం చేయాలన్నారు. ఎక్కడా ప్రజలకు, మహిళలకు ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని ఆదేశించారు. ఇంజనీరింగ్ అధికారులు విద్యుత్ లైట్లు ఏర్పాటు చేయాలని, ఎక్కడైనా ఇబ్బందులు ఉన్నట్టు గుర్తిస్తే జనరేటర్ ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఇంజనీరింగ్, శానిటేషన్ విభాగాల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఇది ముమ్మాటికీ విద్రోహ దినమే..

పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు మొగిలి వెంకట్‌రెడ్డి

బాలసముద్రం, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): సెప్టెంబరు 17 విలీనం కాదు.. విమోచనం కాదని, ముమ్మాటికీ విద్రోహ దినమని పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు మొగిలి వెంకట్‌రెడ్డి అన్నారు. బుధవారం హనుమకొండలోని కాళోజీ జంక్షన్‌లో పీడీఎస్‌యూ హనుమకొండ జిల్లా కార్యవర్గం ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ.. సెప్టెంబరు 17ను పాలకవర్గాలు, రాజకీయ పార్టీలు విలీనం, విమోచనం పేరుతో చరిత్రను వక్రీకరిస్తున్నారన్నారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి రాచకొండ రంజిత్, జిల్లా నాయకులు ముషారఫ్, డానియెల్, నాని, సాయి పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే లక్ష్యం

(5వ పేజీ తరువాయి)

నిర్మిస్తున్నామని, రూ.60 కోట్లతో బస్‌స్టేషన్ పనులు కొనసాగుతున్నాయని అన్నారు. కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కులో స్థానిక యువతకు ఉద్యోగ, ఉపాధి కల్పిస్తున్నామని, వరంగల్ నగరానికి ఇన్నర్, అవుటర్ రింగ్ రోడ్డు పనులు కొనసాగుతున్నాయన్నారు. కార్యక్రమంలో మేయర్ సుధారాణి, కలెక్టర్ సత్య శారద, బల్దియా కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్, డీసీపీ అంకిత్ కుమార్, ఏసీపీ శుభం, వివిధశాఖల ఉన్నతాధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు. అయితే జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఇతర ప్రజాప్రతినిధులు హాజరు కాకపోవడం విశేషం.

విద్యారంగం అభివృద్ధికి ఉద్యమించాలి

యూఎస్ఎఫ్ఐ జాతీయ సలహాదారుడు మాడిశెట్టి అరుణ్‌కుమార్



మహా సభలో మాట్లాడుతున్న అరుణ్‌కుమార్

బాలసముద్రం, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యారంగాన్ని పూర్తిగా విస్మరించి పాలన కొనసాగిస్తున్నాయని భారత ఐక్య విద్యార్థి ఫెడరేషన్ జాతీయ సలహాదారుడు మాడిశెట్టి అరుణ్‌కుమార్ అన్నారు. బుధవారం హనుమకొండలోని హరిత కాకతీయ హోటల్‌లో నిర్వహించిన జిల్లా స్థాయి 3వ మహాసభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. మొదటగా ఏకశిల పార్కు నుంచి హరిత కాకతీయ హోటల్ వరకు విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐకేఎఫ్ జాతీయ కార్యదర్శి మోర్తాల చందర్‌రావు జెండాను ఆవిష్కరించి భగత్ సింగ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

అనంతరం అరుణ్‌కుమార్ మాట్లాడుతూ.. యూఎస్ఎఫ్ఐ అలుపెరుగని పోరాటాలు చేస్తూ సంక్షేమ వసతి గృహాల విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తోందని అన్నారు. మహాసభలో మరో అతిథిగా పాల్గొన్న చందర్‌రావు మాట్లాడుతూ.. విద్యార్థులు ఉన్నత విద్యను చదువలేక భవిష్యత్‌ను పక్కనపెట్టి కూలీ పనులకు వెళ్లే పరిస్థితులు రాష్ట్రంలో నెలకొన్నాయని అన్నారు. విద్యార్థులకు చెల్లించాల్సిన బకాయిలను విడుదల చేయలేకపోతే విద్యార్థులతో కలిసి ప్రజా భవన్‌ను ముట్టడిస్తామని ఆయన హెచ్చరించారు. రాష్ట్ర కార్యదర్శి మాదం తిరుపతి మాట్లాడుతూ.. ప్రభుత్వ జూనియర్ డిగ్రీ కళాశాలల్లో మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి మాలోత్ రాజేష్‌నాయక్, అధ్యక్షుడు మనోజ్, సహాయ కార్యదర్శి బాలగోని రాకేష్, జిల్లా ఉపాధ్యక్షుడు జయకృష్ణ, జిల్లా నాయకులు అరీఫ్, కృష్ణమూర్తి, అభిరామ్, సురేష్, ధనుష్, మహేష్ పాల్గొన్నారు.

మంత్రాల అనుమానంతోనే రాధమ్మ హత్య

నెల్లికుదురు ఘటనలో వీడిన మిస్టరీ

నెల్లికుదురు (మహబూబాబాద్ జిల్లా), సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : ఈనెల 12న నెల్లికుదురులో జరిగిన వీరగాని రాధమ్మ హత్య కేసును పోలీసులు ఛేదించారు. ఆమెను బంగారం కోసం హత్యచేసి బావిలో పడేశారని భావించి, తొలుత కేసు నమోదు చేశారు. హత్య జరిగిన అనంతరం మూడురోజుల పాటు పోలీసులు సమాచారం సేకరించి, అనుమానితులను పట్టుకొని విచారించారు. దీంతో మంత్రాల అనుమానంతో తామే రాధమ్మను హత్యచేశామని వారు అంగీకరించారు. హత్యకు పాల్పడిన ఇద్దరితో పాటు సహకరించిన మరొకరిని బుధవారం అరెస్ట్ చేశారు. హత్యకేసు వివరాలను తొర్రూరు డీఎస్పీ కృష్ణకిషోర్ వెల్లడించారు.

నెల్లికుదురుకు చెందిన వీరగాని రాధమ్మ (80) భర్త హంస్సేన్ పదేళ్ల క్రితం చనిపోయాడు. వారికి ముగ్గురు కుమారులుకాగా, వేరే ప్రాంతాలకు బతుకు దెరువు కోసం వెళ్లడంతో ఇంట్లో ఒంటరిగా ఆమె జీవిస్తోంది. కాగా, అదే గ్రామానికి చెందిన వీరగాని ఉప్పలయ్య అలియాస్ ఉపేందర్ కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. రాధమ్మ మంత్రాలు చేయడంతోనే అనారోగ్యానికి గురవుతున్నాననే అనుమానంతో ఆమెను హత్యచేయాలని బావించాడు. ఈ విషయాన్ని ఉపేందర్ తన సోదరుడు మహేష్‌తో చెప్పాడు. అందుకు అతనూ అంగీకరించాడు. ఇద్దరూ కలసి ఈ నెల 12న రాత్రి 11గంటల సమయంలో ఇనుపరాడ్ పట్టుకొని రాధమ్మ ఇంటికి వెళ్లి గుడుంబా కావాలని తలుపు కొట్టారు. ఆమె తలుపులు తీసి బయటకు రాగా, ఉపేందర్ రాడ్‌తో రాధమ్మ తలపై కొట్టడంతో అక్కడిక్కడే మృతి చెందింది. శవాన్ని ఇంటిముందు ఉన్న బావిలో పడేశారు.

హత్య అనంతరం బయటకు వచ్చి పారిపోవడానికి మహేష్ తన స్నేహితుడైన దువ్వ రాజును బైక్ తీసుకోనిరావాలని ఫోన్‌చేయగా ఆయన వచ్చి ఉప్పలయ్యను, మహేష్‌ను బ్రాహ్మణకొత్తపెల్లి ఆకేరు వద్దకు తీసుకెళ్లాడు. హత్యకు ఉపయోగించిన ఇనుపరాడ్‌ను ఆకేరువాగు ఇసుకలో పాతిపెట్టి, ఇద్దరు స్నానాలు చేసి రక్తపుమరకల దుస్తులను శుభ్రం చేసుకొని రాజు బైక్‌పై నెల్లికుదురుకు తిరిగి వచ్చి ఎవరింటికి వారు వెళ్లిపోయారు. హత్య ఘటన తర్వాత రాధమ్మ ఇంటి సమీపంలో ఉండే వారిపై పోలీసులు నిఘా సారించారు. గుడుంబా తాగేందుకు ఆమె ఇంటికి వెళ్లే వారిని గుర్తించి అదుపులోకి తీసుకోవడంతో ఉపేందర్, మహేశ్‌ల ఘాతుకం బయటపడింది. వీరిద్దరితో పాటు వారిని బైక్‌పై తీసుకెళ్లిన రాజుపై కేసు నమోదు చేసి, అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. హత్యకేసు ఛేదించిన తొర్రూరు సీఐ గణేష్, నెల్లికుదురు ఎస్సై సీహెచ్. రమేష్‌బాబు పోలీస్‌లు డీఎస్పీ కృష్ణకిషోర్ అభినందించారు.

21, 22 తేదీల్లో కాకతీయ నృత్య నాటకోత్సవాలు

హనుమకొండ కల్చరల్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ సంగీత నాటక అకాడమీ ఆధ్వర్యంలో తొలిసారిగా వరంగల్ నగరంలోని కాళోజీ కళాక్షేత్రంలో ఈనెల 21, 22 తేదీల్లో కాకతీయ నృత్య నాటకోత్సవాలను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. నాటకోత్సవాల్లో భాగంగా 21న సంగీత నాటక అకాడమీ చైర్మన్ అలేఖ్య పుంజాల నిర్వహణలో చాకలి ఐలమ్మ నృత్య నాటకం, 22న సాయంత్రం తెలంగాణ డ్రమెటిక్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రాణిరుద్రమ నాటకం, గద్దర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రజాసాహిత్య కళారూపాలు, జీవన సంఘర్షణలాంటి నృత్య రూపకాలను ప్రదర్శింపజేయనున్నారు. ఈ వేడుకలను ఉపముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క 21న ప్రారంభించనున్నారు. సాంస్కృతిక, పురావస్తు శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, పర్యావరణ, దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ, పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క, వరంగల్ ఎంపీ కడియం కావ్య, అనేక మంది ప్రజాప్రతినిధులు వేడుకల్లో పాల్గొంటారని, కళాభిమానులు పాల్గొని విజయవంతం చేయాలని అలేఖ్య పుంజాల కోరారు.

డోర్ లాక్ ఉన్న మీటర్ రీడింగ్‌లపై దృష్టిసారించాలి

● వీడియో కాన్ఫరెన్స్‌లో ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్‌రెడ్డి

రాంనగర్, సెప్టెంబర్ 17 (ఆంధ్రజ్యోతి): డోర్ లాక్ ఉన్న మీటర్ రీడింగ్‌లపై దృష్టిసారించాలని టీజీ ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. ఎన్పీడీసీఎల్ పరిధిలోని 16 సర్కిళ్ల ఎస్ఈలు, డీఈలు, ఎస్ఏఓలతో సీఎండీ బుధవారం హనుమకొండ నక్కలగుట్ట విద్యుత్‌భవన్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎండీ మాట్లాడుతూ.. ట్రాన్స్‌ఫార్మర్ల డిజిటలైజేషన్ ప్రక్రియ వేగవంతం చేయాలన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్లపై ఉన్న సర్వీసులను మ్యాపింగ్ చేయాలన్నారు. ఇంటిలోపల మీటర్లు ఉన్నట్లయితే బయట అమర్చేలా చర్యలు తీసుకోవాలన్నారు. రియల్ టైం ఫీడర్ మానిటరింగ్ సిస్టం పనులల్లో భాగంగా సబ్‌స్టేషన్ పనులను సత్వరమే పూర్తి చేయాలన్నారు. ఫీడర్‌పరంగా నష్టాలు లేకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. సర్కిల్ పరిధిలో విధిగా పనుల పురోగతిపై ఎప్పటికప్పుడు సమీక్షలు నిర్వహించాలని ఎస్ఈలను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు మోహన్‌రావు, తిరుపతిరెడ్డి, మధుసూదన్, ప్రభాకర్, సీఈలు తదితరులు పాల్గొన్నారు.

గ్రూప్-4 ఉద్యోగులకు వార్డుల కేటాయింపు

వరంగల్ కార్పొరేషన్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన గ్రూప్-4 పరీక్షలో ఉత్తీర్ణులై ఇటీవల వరంగల్‌కు జీడబ్ల్యూఎంసీకి కేటాయించిన ఉద్యోగులకు బుధవారం 66 డివిజన్‌లలో కొన్ని వార్డును కేటాయిస్తూ జీడబ్ల్యూఎంసీ కమిషనర్ చహత్ బాజ్‌పాయ్ ఉత్తర్వులు జారీ చేశారు. ఇటీవల మునిసిపల్ కార్పొరేషన్ నుంచి 26 మంది వీఆర్ఏలు విధుల నుంచి రిలీవ్ కావడంతో వారి స్థానాల్లో 31 మందిని భర్తీ చేశారు. ఆరు మాసాలుగా గ్రూప్-4 ఉద్యోగులు పలు విభాగాల్లో పని చేస్తున్నారు. 28 మంది గ్రూప్-4 ఉద్యోగులతో పాటు మరో ముగ్గురు ఉద్యోగులకు 31 డివిజన్‌లలో విధులు నిర్వర్తించాలని కమిషనర్ సూచించారు. వీరు కేటాయించిన డివిజన్‌లలో పన్నుల వసూలుతో పాటు ఆర్ఐ (రెవెన్యూ అధికారుల)లను సమన్వయం చేసుకుని విధులు నిర్వర్తిస్తారు.

ఫార్మకోవిజిలెన్స్ వారోత్సవాలు ప్రారంభం



ఫార్మసీ కాలేజీలో ఫార్మకోవిజిలెన్స్ వారోత్సవాలను పురస్కరించుకొని ముఖ్యులకు సత్కారం

హనుమకొండ, సెప్టెంబర్ 17 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ రాంనగర్‌లోని వాగ్దేవి విద్యాసంస్థల కాలేజ్ ఆఫ్ ఫార్మసీలో బుధవారం 5వ జాతీయ ఫార్మకోవిజిలెన్స్ వారోత్సవాలు ప్రారంభమయ్యాయి. ఈనెల 23 వరకు ఈ వారోత్సవాలు జరుగుతాయి. 'యువర్ సేఫ్టీ జస్ట్ ఏ క్లిక్' అనే ఇతివృత్తంతో ఈ ఉత్సవాలను నిర్వహిస్తున్నారు. ఫార్మాకాలజీ హెచ్‌వోడీ డాక్టర్ బీఎస్ శరవణభవ, డాక్టర్ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పీఎంఎస్ఎస్‌వై ఆస్పత్రి సీఏఎస్ ఆర్ఎంవో డాక్టర్ సంకు సనత్ రోషన్ పాల్గొన్నారు. గౌరవాతిథిగా వరంగల్ ఆజరా హాస్పిటల్స్ జనరల్ ఫిజీషియన్ డాక్టర్ బి.సత్య కిరణ్, వాగ్దేవి కాలేజ్ ఆఫ్ ఫార్మసీ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.శ్రీనివాస్‌రెడ్డి, విభాగాధిపతులు డాక్టర్ వై.శ్రవన్ కుమార్, డాక్టర్ డి.కుమారస్వామి, డాక్టర్ సీహెచ్ మహేష్ తదితరులు పాల్గొన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాస్ మాట్లాడుతూ.. ఫార్మకోవిజిలెన్స్ వారోత్సవం ముఖ్య ఉద్దేశం, ఏడీఆర్ రిపోర్టింగ్ ఆవశ్యకత, ఫార్మసీ విద్యార్థుల నైతిక బాధ్యతలు వివరించారు. ముఖ్య అతిథి డాక్టర్ సంకు సనత్ రోషన్ మాట్లాడుతూ.. వినూత్న ఆవిష్కరణలు, ఇన్ ఫార్మకోవిజిలెన్స్, రోగుల పట్ల ఫార్మసీ విద్యార్థులు నిర్వర్తించాల్సిన బాధ్యతలను వివరించారు. గౌరవ అతిథి డాక్టర్ బి.సత్యకిరణ్ ఫార్మసీ విద్యార్థులు రోగులతో వ్యవహరించాల్సిన తీరు, కౌన్సిలింగ్ పద్ధతులు, మందుల రియాక్షన్స్ తదితర అంశాలను వివరించారు. కార్యక్రమంలో వాగ్దేవి కళాశాల సెక్రెటరీ కం కరస్పాండెంట్ డాక్టర్ సీహెచ్ దేవేందర్ రెడ్డి, అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ సీహెచ్ వాహినీదేవి తదితరులు పాల్గొన్నారు.

మహిళల ఆరోగ్యమే కుటుంబానికి ఆనందం

● వరంగల్ ఎంపీ కడియం కావ్య
● స్వస్తినారి ఆరోగ్య అభియాన్ కార్యక్రమం ప్రారంభం

వరంగల్ మెడికల్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): మహిళలు ఆరోగ్యంగా ఉన్నప్పుడే ఆ కుటుంబం మొత్తం ఆరోగ్యంగా ఆనందంగా ఉంటుందని వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య అన్నారు. 'స్వస్తినారి సశక్తి పరివార్ అభియాన్'లో భాగంగా బుధవారం హనుమకొండ లష్కర్ సింగారం పట్టణ ఆరోగ్య కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎంపీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీ కడియం కావ్య మాట్లాడుతూ.. స్పెషలిస్టు వైద్య నిపుణులు, గైనకాలజిస్టులు, పిల్లల వైద్య నిపుణులు, ఫిజీషియన్లు, ఈఎన్‌టీ, దంత, ఇతర స్పెషలిస్టు వైద్యులతో ఏర్పాటు చేసిన ఈ వైద్య శిబిరాలను మహిళలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. వైద్యులు, వైద్యసిబ్బంది అందించే సలహాలు పాటించాలని, ఆరోగ్యకరమైన జీవనశైలి ద్వారా బీపీ, షుగర్ రాకుండా నివారించవచ్చని తెలిపారు. ముఖ్యంగా మహిళలు క్యాన్సర్‌పట్ల అవగాహన కలిగి ఉండాలని సూచించారు. కాగా, ప్రధాని నరేంద్ర మోదీ జాతీయస్థాయిలో ఈ కార్యక్రమాన్ని వర్చువల్‌గా ప్రారంభించి, సందేశం అందించిన అనంతరం ఎంపీ డాక్టర్ కడియం కావ్య మెగా వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్‌తో కలిసి చికిత్స నిమిత్తం వచ్చిన మహిళలతో మాట్లాడి వారి ఆరోగ్య సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

అనంతరం జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ మాట్లాడుతూ.. ప్రత్యేక వైద్య శిబిరంలో తమ పరిధిలోని మహిళలకు వైద్య శిబిరానికి హాజరయ్యేలా ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు చూడాలన్నారు. కార్యక్రమంలో హనుమకొండ డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఎ.అప్పయ్య, అడిషనల్ డీఎంహెచ్‌ఓ డాక్టర్ టి.మదన్‌మోహన్‌రావు, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ విజయ్‌కుమార్, డాక్టర్ అజిత్ మహ్మద్, డాక్టర్ సందీప్, డాక్టర్ ప్రశాంత, డాక్టర్ హారిక, డాక్టర్ హిమబిందు, డాక్టర్ ఇత్తధర్ అహమద్, డాక్టర్ సనత్ చందర్, డాక్టర్ భానుచందర్, డాక్టర్ హైదర్ తదితరులు పాల్గొన్నారు.

పదేళ్ల నియంత పాలన

(5వ పేజీ తరువాయి)

మండలం వంగరలో రూ.7కోట్లతో మాజీ ప్రధాని పీవీ విజ్ఞాన వేదిక అభివృద్ధి పనులు చివరి దశలో ఉన్నాయన్నారు.

పరకాలలో రూ.35కోట్లతో చేపట్టిన వంద పడకల ఆస్పత్రి నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయని, జిల్లాలో రెండు ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలలు మంజూరయ్యాని, క్రీడా పాఠశాల ఏర్పాటు జరుగుతోందని వివరించారు. గత ప్రభుత్వం గాలికి వదిలేసిన హనుమకొండలోని కళాక్షేత్రాన్ని తమ ప్రభుత్వం పూర్తి చేసిందన్నారు.

ఈ వేడుకల్లో వరంగల్ ఎంపీ కడియం కావ్య, మేయర్ గుండు సుధారాణి, ఎమ్మెల్సీ బసవరాజు సారయ్య, ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్ రెడ్డి, కేఆర్ నాగరాజు, జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్, జీడబ్ల్యుఎంసీ కమిషనర్ చాహత్ బాజ్‌పాయి, కాకతీయ పట్టణాభివృద్ధి సంస్థ చైర్మన్ ఇనగాల వెంకట్రామిరెడ్డి, గ్రంథాలయ సంస్థ చైర్మన్ అజీజ్ ఖాన్, సీపీ సన్‌ప్రీత్ సింగ్, మాజీ మేయర్ ఎర్రబెల్లి స్వర్ణ, ఇతర అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. అంతకు ముందు వరంగల్ నిట్ వద్ద మంత్రి పొంగులేటికి ఎంపీ, ఎమ్మెల్యేలు, కలెక్టర్, ఇతర ప్రజాప్రతినిధులు పుష్పగుచ్ఛాలు అందచేసి స్వాగతం పలికారు. మంత్రి శ్రీనివాస్ రెడ్డితో పాటు ఎంపీ, ఎమ్మెల్యేలు, అధికారులు అదాలత్ సర్కిల్‌లోని అమరవీరుల స్థూపం వద్ద పుష్పాంజలి ఘటించారు.

కార్యక్రమం జరిగింది ఇలా..

మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి సరిగ్గా 9.58 గంటలకు హనుమకొండ కలెక్టరేట్ కార్యాలయానికి చేరుకున్నారు. 10గంటలకు జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. జాతీయ గీతం, తెలంగాణ రాష్ట్ర గీతం ఆలాపన జరిగింది. 10.02 నుంచి 10.05 గంటల వరకు మంత్రి పోలీసుల గౌరవ వందనాన్ని స్వీకరించారు. 10.05 గంటలకు మంత్రి జిల్లా ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు. అంతకుముందు ఉదయం 9.48 గంటలకు పోలీసు కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్, 9.51 గంటలకు కలెక్టర్ స్నేహ శబరీష్ వేదిక వద్దకు చేరుకున్నారు. కలెక్టరేట్ వద్ద భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. సాంస్కృతిక సారథులు పాడిన పాటలు పెద్దగా ఆకట్టుకోలేదు. ప్రజాపాలన దినోత్సవాన్ని పురస్కరించుకొని కలెక్టరేట్ ప్రాంగణాన్ని అందంగా అందంగా అలంకరించారు.

ఫిరాయింపులను ప్రోత్సహించింది బీఆర్ఎస్సే..

(5వ పేజీ తరువాయి)

బాహాటంగా కవిత వ్యాఖ్యలు చేసినా ఆ ఇద్దరు నోళ్లు మెదపలేదన్నారు. నాగార్జునసాగర్, శ్రీశైలం తదితర ఎన్నో ప్రాజెక్టులు కాంగ్రెస్ హయాంలో నిర్మాణమైనవన్నారు. దశాబ్దాలు గడిచినా నేటికీ చెక్కు చెదరలేదన్నారు. కానీ కాళేశ్వరం ప్రాజెక్టులు అప్పుడే కూలిపోయే దశకు చేరిందని పేర్కొన్నారు. బీఆర్ఎస్ అవినీతికి ఇంతకంటే నిదర్శనమేమి ఉంటుందని విరుచుకుపడ్డారు. బీఆర్ఎస్ నేతలకు దమ్ముంటే ఉమ్మడి జిల్లా అభివృద్ధిపై చర్చకు రావాలని రాజేందర్‌రెడ్డి సవాల్ విసిరారు. లేదంటే నోరు మూసుకొని ఉండాలన్నారు. పదేళ్ల బీఆర్ఎస్, రెండేళ్ల కాంగ్రెస్ పాలనలో జరిగిన అభివృద్ధి, ప్రజా సంక్షేమంపై చర్చకు రావాలని పలుమార్లు సవాల్ విసిరినా బీఆర్ఎస్ నేతలు ముఖం చాటేస్తున్నారన్నారు.

పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి మాట్లాడుతూ.. ఫిరాయింపుల గురించి మాట్లాడే నైతిక హక్కు బీఆర్ఎస్‌కు లేదని స్పష్టం చేశారు. లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీకి లొంగిపోయి ఆ పార్టీకి ఓట్లు వేయించారన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ పరిస్థితి దిగజారనుందన్నారు. వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు మాట్లాడుతూ.. మీసాలే లేని బీఆర్ఎస్ అగ్రనేతలు సీఎం రేవంత్‌రెడ్డి మగతనం గురించి మాట్లాడుతున్నారంటూ వ్యంగ్యంగా వ్యాఖ్యానించారు. ఇక ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి ఓ బిచ్చగాడని ఎద్దేవా చేశారు. గెలుపు కోసం ప్రజలను బిచ్చమడిగాడన్నారు. వరంగల్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ మాట్లాడుతూ.. పదేళ్లలో కేసీఆర్ రాష్ట్రాన్ని దోచుకుతిన్నారని విమర్శించారు. ఈ సమావేశంలో ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, ఎంపీ కడియం కావ్య, కుడా చైర్మన్ ఇనుగాల వెంకట్రాంరెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అజీజ్‌ఖాన్, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు పెరుమాండ్ల రామక్రిష్ణతో పాటు మోజెస్ ఆనంద్, వెంకటనర్సింగరెడ్డి, కూర వెంకట్, వీసం సురేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విమోచనం పేరుతో బీజేపీ మత రాజకీయం

సీపీఎం జాతీయ కార్యదర్శి ఎంఏ బేబీ



బహిరంగ సభలో మాట్లాడుతున్న ఎంఏ బేబీ

జనగామ రూరల్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో విమోచన దినోత్సవం పేరుతో బీజేపీ మత రాజకీయాలు చేస్తున్నదని సీపీఎం జాతీయ కార్యదర్శి ఎంఏ బేబీ అన్నారు. బీజేపీ, ఆర్ఎస్ఎస్ విమోచనం చరిత్రను వక్రీకరించేందుకు ప్రయత్నిస్తున్నాయని పేర్కొన్నారు. వీర తెలంగాణ పోరాట వారోత్సవాల ముగింపు సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి మోకు కనకారెడ్డి ఆధ్వర్యంలో బుధవారం జనగామ జిల్లా కేంద్రంలో భారీ బహిరంగ సభను నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన సీపీఎం జాతీయ కార్యదర్శి బేబీకి నాయకులు పెంబర్తి కాకతీయ కళాతోరణం వద్ద ఘనంగా స్వాగతం పలికారు. జనగామ రైల్వే స్టేషన్ నుంచి ప్రెస్టన్ గ్రౌండ్ వరకు డప్పు కళాకారుల కోలాహలం, బతుకమ్మలతో ప్రెస్టన్ గ్రౌండ్ వరకు పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించారు. ప్రెస్టన్ గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో బేబీ మాట్లాడారు. తెలంగాణలో 1946 నుంచి 1951 వరకు నిజాం పరిపాలనకు వ్యతిరేకంగా జరిగిన పోరాటంలో 3వేల గ్రామాలు పాల్గొన్నాయని, 10 లక్షల ఎకరాల భూములను పేదలకు పంచగా, 4వేల మంది కార్యకర్తలు మరణించారని పేర్కొన్నారు.

సాయుధ పోరాటాన్ని హిందూ ముస్లిం పోరాటంగా చూపించేందుకు బీజేపీ ప్రయత్నం చేస్తుందన్నారు. మోదీ ప్రభుత్వం సహజ వనరులను కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టే కుట్ర చేస్తుందన్నారు. అమిత్ షా, రాజ్‌నాథ్ సింగ్‌లకు స్వాతంత్ర్యం గురించి మాట్లాడే అర్హత లేదన్నారు. బీజేపీ కులాలు, మతాల మధ్య చిచ్చు పెడుతుందన్నారు. ఈ సభలో సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు మహమ్మద్ అబ్బాస్, హైదరాబాద్ సౌత్ జిల్లా కార్యదర్శి విట్టల్, నాయకులు ఇర్రి అహల్య, సాంబరాజు యాదగిరి, సింగారపు రమేశ్, రాపర్తి సోమన్న, జోగు ప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

పైపులైన్ పనుల్లో డొల్లతనం

(5వ పేజీ తరువాయి)

లేదు. పైపులను అతకడం, భూమిలో వేసి పూడ్చే సమయంలో అధికారుల పర్యవేక్షణ లేకుండా సాగుతున్నాయని ఆరోపిస్తున్నారు. పనులు చేసుకుంటూ వెళ్తున్నారే తప్ప ఎవరు ఎప్పుడు వస్తున్నారో, ఎవరు వీటిని నడిపిస్తున్నారో తెలియడం లేదు.

అనుతులపై అనుమానాలు

ఈ మధ్య కాలంలో వర్ధన్నపేట మునిసిపాలిటీలో జరుగుతున్న పనులపై ఎలాంటి సమాచారం ఉండడం లేదు. పాలకవర్గాల కాలం ముగిసిన నాటి నుంచి కార్యాలయంలో జరిగే పనితీరు పట్ల ప్రజలు ఆగ్రహంగా ఉన్నారు. కోట్ల రూపాయల పనులు జరుగుతుంటే కనీస జాగ్రత్తలు ఆయా శాఖల అధికారుల అనుమతులు ఉన్నాయో లేదో కూడా తెలియడం లేదు. వర్ధన్నపేట-జఫర్‌గడ్ బీటీ రోడ్డును ఎడమ వైపు ధ్వంసం చేస్తూ పైపు లైను వేస్తున్నారు. గతంలో అక్కడ ఏమైనా నీటి పైపులు, పక్కనే నివాస గృహాల పైపులున్నా కాంట్రాక్టరు తన పనులను చకచకా చేసుకుంటున్నాడు. ఆర్అండ్‌బీ రహదారిని తవ్వాలంటే ఆ శాఖ అనుమతులు ఉండాలి. అనుమతులున్నా ధ్వంసమైన చోట వెంటనే మళ్లీ రిపేరు పనులు లేదా నష్ట పరిహారం చెల్లించాల్సి ఉంటుంది.

రెండేళ్లే కాంట్రాక్టు గడువు

రూ. 34.08 కోట్లకు టెండరు ద్వారా పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్ రెండేళ్లలో పనులు పూర్తి చేయాలని నిబంధన ఉన్నట్లు ఏఈ తెలిపారు. ఇప్పటివరకు 45శాతం వరకు పైపులైను పనులు పూర్తయ్యాయి. వాటర్ ట్యాంకులు నిర్మాణం దశలో ఉన్నాయని తెలిపారు. రూ.5.5కోట్ల వరకు బిల్లులు వచ్చాయని, పనుల చేస్తున్న స్థితిని బట్టి చెల్లింపులు ఉంటాయని స్పష్టం చేశారు. థర్డ్ పార్టీ క్వాలిటీ చెకప్‌లు కూడా జరుగుతాయని, నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు ఉంటాయని స్పష్టం చేశారు.

ఉమ్మడి జిల్లాలో ప్రజాపాలన దినోత్సవం


వరంగల్‌లో పోలీసుల గౌరవ వందనం స్వీకరిస్తున్న మంత్రి కొండా సురేఖ


హనుమకొండలో జాతీయ జెండాకు వందనం చేస్తున్న మంత్రి పొంగులేటి తదితరులు


ములుగు కలెక్టరేట్‌లో జాతీయ జెండాను ఎగురవేసి గౌరవ వందనం చేస్తున్న మంత్రి సీతక్క


మహబూబాబాద్‌లో తెలంగాణ గీతాన్ని ఆలపిస్తున్న రాంచందర్‌నాయక్, కలెక్టర్ అద్వైత్‌కుమార్ సింగ్, ఎస్పీ సుధీర్‌రామ్‌నాథ్ కేకన్



జనగామలోని కలెక్టరేట్‌లో మాట్లాడుతున్న ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య, వేదికపై అధికారులు ←


భూపాలపల్లిలో జాతీయ జెండాకు వందనం చేస్తున్న రాష్ట్ర ట్రైకార్ చైర్మన్ బెల్లయ్య నాయక్, ఎమ్మెల్యే జీఎస్సార్, అధికారులు

కేటీఆర్.. దళారీకి వంత పాడతావా!?

- రైతులకు నష్ట పరిహారం ఇప్పించిన కలెక్టర్‌పై అనుచిత వ్యాఖ్యలు సరికాదు
- నిజాయితీ ఉంటే ఆ దళారీని పార్టీ నుంచి బహిష్కరించండి
- మంత్రి ధనసరి సీతక్క


విలేకరులతో మాట్లాడుతున్న మంత్రి సీతక్క

ములుగు, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): సిన్సియర్‌గా పనిచేస్తున్న ములుగు కలెక్టర్ దివాకర‌పై బీఆర్ఎస్ నాయకుడు అనుచిత వాఖ్యలు చేయడం సరికాదని, కేటీఆర్... మీ వెంట ఉంది రైతు ప్రయోజకులా... దళారులా అని రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క ప్రశ్నించారు. బుధవారం జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మంత్రి మాట్లాడారు. నకిలీ విత్తనాలు వేసి నష్టపోయిన 900 మంది రైతులకు నష్ట పరిహారం ఇప్పించినందుకు కలెక్టర్ దివాకర‌పై ఓ దళారీ ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతుంటే కేటీఆర్ వెకిలి నవ్వులు నవ్వుతారా.. అని మండిపడ్డారు.

ములుగు జిల్లాలో చిన్న, సన్నకారు రైతులు ఉన్నారని, వారు దళారుల చేతుల్లో మోసపోవడంతో రూ. 3.80 కోట్లు విత్తన కంపెనీల ద్వారా కలెక్టర్ రైతులకు నష్ట పరిహారం ఇప్పించడం జరిగిందన్నారు. అయితే ఆ కంపెనీలో దళారిగా పని చేసే బీఆర్ఎస్ నాయకుడు నర్సింహమూర్తి కేటీఆర్ ముందుకు పోయి బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే కలెక్టర్‌ను రాష్ట్రంలో ఉంచొద్దని, అందుకు తన యావదాస్తిని పార్టీకి రాసిస్తానని మాట్లాడుతుంటే కేటీఆర్ వెకిలి నవ్వులు నవ్వడం సరికాదన్నారు.

ప్రైవేటు విత్తన కంపెనీ చేతుల్లో మోసపోతున్న రైతులను ఆదుకునేందుకు వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు, వ్యవసాయ శాఖ చైర్మన్ కోదండరెడ్డి, విత్తన శాఖ చైర్మన్ అన్వేష్‌రెడ్డితో కలిసి చర్చించి రైతులకు న్యాయం జరిగేలా చూడాలని జిల్లా కలెక్టర్ దివాకరకు బాధ్యతలను అప్పగించామన్నారు. దీంతో కలెక్టర్ కన్నాయిగూడెం, వాజేడు, వెంకటాపురం మండలాల రైతులకు నష్ట పరిహారం ఇప్పించారన్నారు. అందుకు రైతులు కలెక్టర్‌ను గొప్పవ్యక్తిగా పొగుడుతున్నారని తెలిపారు.

దళారిగా ఉన్న వ్యక్తిని వెంటబెట్టుకుని ఆయనకు భరోసా ఇవ్వడం ఏ రైతు ప్రయోజనాల కిందకు వస్తుందో కేటీఆర్ చెప్పాలని మంత్రి అన్నారు. వాజేడు, వెంకటాపురం, కన్నాయిగూడెంకు వచ్చి మరణించిన రైతు కుటుంబాలను, నష్టపోయిన రైతులను కలిసి విచారించి కలెక్టర్ తప్పు చేస్తే బహిష్కరించాలని కేటీఆర్‌కు సవాల్ విసిరారు. నిజంగా రైతుల పట్ల ప్రేమ, చిత్తశుద్ధి ఉంటే నర్సింహమూర్తిని బీఆర్ఎస్ పార్టీ నుంచి బహిష్కరించాలని డిమాండ్ చేశారు.

పోషకాహారంతో మెరుగైన జీవనశైలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న మంత్రి సీతక్క

గ్రామస్థాయిలో ప్రజలకు అవగాహన కల్పించాలి : మంత్రి సీతక్క

ములుగు కలెక్టరేట్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): పోషకాహారంతోనే మెరుగైన జీవనశైలి అని, మారుతున్న జీవనశైలి మార్పుల కారణంగా ఎదురయ్యే ఆరోగ్య సవాళ్లను ఎదుర్కొనేందుకు పోషకాహారం తీసుకోవాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీ, శిశు సంక్షేమశాఖ మంత్రి ధనసరి అనసూయసీతక్క అన్నారు. బుధవారం ములుగులోని గిరిజన భవన్‌లో కేంద్ర సమాచారశాఖ సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఫొటో ఎగ్జిబిషన్, పోషణ మాసోత్సవాలను ఆమె ప్రారంభించారు.

ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ ఈనెల 17నుంచి అక్టోబరు 16వరకు జిల్లాలో నిర్వహించనున్న పోషణ మాసోత్సవాలను విజయవంతం చేయాలన్నారు. గర్భిణులు, బాలింతలు, పిల్లలు తీసుకోవాల్సిన ఆహారం, పోషణ పర్యవేక్షణపై గ్రామస్థాయిలో ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లల బరువు,ఎత్తు పరిశీలించడం, తల్లిదండ్రులతో సమావేశాలు ఏర్పాటుచేసి పోషకాహారం ప్రాధాన్యత గురించి వివరించాలన్నారు. కిశోర బాలికలకు వైద్యపరీక్షలు చేపట్టాలని, తల్లిపాల ప్రాధాన్యత, కిచెన్‌గార్డెన్ ఏర్పాటు, పరిశుభ్రత పాటించడం, పోషకాహారాల ప్రదర్శన ఏర్పాటుచేసి అవగాహన కల్పించాలన్నారు.

ఈ సందర్భంగా ఫీల్డ్ పబ్లిసిటీ అధికారి శ్రీధర్ మంత్రి సీతక్కకు ఫొటో ఎగ్జిబిషన్ ద్వారా ఉత్తమమైన ఆహార ఆవశ్యకతపై వివరించారు. అనంతరం ఆమె పోషణ మాసోత్సవాల వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించి చిన్నారులకు అన్నప్రాసన, అక్షరాభ్యాసం చేశారు. పోషకాహారంపై ఏర్పాటుచేసిన స్టాల్‌ను సందర్శించారు. ఈకార్యక్రమంలో కలెక్టర్ టీఎస్.దివాకర, అదనపు కలెక్టర్ సంపత్‌రావు, గ్రంథాలయసంస్థ చైర్మన్ బానోత్ రవిచందర్, మార్కెట్ కమిటీ చైర్మన్ రేగ కళ్యాణి, డీఆర్‌డీఏ పీడీ శ్రీనివాసరావు, జిల్లా సంక్షేమ అధికారి తుల రవి, జిల్లా పంచాయతీ అధికారి దేవరాజ్, సీడీపీవో శిరీష, వివిధశాఖల అధికారులు పాల్గొన్నారు.


అమరవీరుల స్థూపం వద్ద నివాళులర్పిస్తున్న మంత్రి పొంగులేటి, కలెక్టర్, ప్రజాప్రతినిధులు

తెలంగాణ అమరవీరులకు నివాళి

హనుమకొండ కలెక్టరేట్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ప్రజాపాలన దినోత్సవాన్ని పురస్కరించుకుని హనుమకొండ అదాలత్ జంక్షన్‌లో ఉన్న అమరవీరుల స్థూపం వద్ద అమరవీరులకు బుధవారం రాష్ట్ర రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి నివాళులు అర్పించారు. మంత్రి పొంగులేటి వెంట వరంగల్ ఎంపీ కడియం కావ్య, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్, కుడా చైర్మన్ ఇనగాల వెంకట్రామిరెడ్డి, వరంగల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణతోపాటు ఇతర ప్రజాప్రతినిధులు ఉన్నారు.

పొంగులేటికి స్వాగతం

తెలంగాణ ప్రజాపాలన దినోత్సవాన్ని పురస్కరించుకుని హనుమకొండకు వచ్చిన రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డికి నిట్ వద్ద బుధవారం వరంగల్ ఎంపీ కడియం కావ్య, పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్, అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి, కుడా చైర్మన్ వెంకట్రాంరెడ్డి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా కలెక్టర్, ప్రజాప్రతినిధులు మంత్రికి పూలమొక్క అందజేశారు.

మహనీయుల త్యాగాలు మరువలేనివి

- పీటీసీ ప్రిన్సిపాల్ ఇంజారపు పూజ

మామునూరు, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): రాచరిక వ్యవస్థ నుంచి ప్రజాస్వామ్యం మన సొంతం కావడానికి మహనీయులు చేసిన త్యాగాలు మరువలేనివని మామునూరు పీటీసీ ప్రిన్సిపాల్ ఇంజారపు పూజ అన్నారు. బుధవారం మామునూరు పీటీసీలో ప్రజా పాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఇంజారపు పూజ పాల్గొని జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..తెలంగాణ చరిత్రలో సెప్టెంబర్ 17 మర్చిపోలేని ఘట్టం అని అన్నారు. అనాటి పోరాటయోధుల త్యాగాల ఫలితమే నేటి తెలంగాణ అని కొనియాడారు. నిజాం నిరంకుశత్వం, దేశముఖ్, పటేల్, పట్వారీ వ్యవస్థల ద్వారా తెలంగాణ అణచివేతకు గురైన సందర్భంలో ఆర్య సమాజం సేవలు, కమ్యూనిస్టులు, చాకలి ఐలమ్మ, దొడ్డి కొమురయ్య లాంటి మహనీయులు పోరు సాగించారని అన్నారు. నాటి రాచరిక వ్యవస్థపై పోరాడి వేలాది మంది అమరులయ్యారని, వారి త్యాగాలు మరవకూడదని అన్నారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీలు రమేష్, భిక్షపతి, వెంకటేశ్వర రావు, సోమాని, డాక్టర్ సుధీర్, ఆర్ఐలు చంద్రశేఖర్, కాశీరామ్, మహేష్, నవీన్ సీఎల్ఐ అశోక్ కుమార్, దీపక్, నరేందర్, ఆర్ఎస్ఐలు రాజేష్, అనిల్ దశరథ్, అరుణ పీటీసీ పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.


జాతీయ పతాకానికి వందనం చేస్తున్న ఎస్పీ పూజ, పోలీసులు

బతుకమ్మ, దసరా ఉత్సవాలకు ఏర్పాట్లు చేయండి

- మంత్రి కొండా సురేఖ
- ఉర్సు గుట్ట వద్ద అధికారులతో సమీక్ష



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి కొండా సురేఖ

కరీమాబాద్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఉర్సు గుట్ట రంగలీలా మైదానంలో నిర్వహించే సద్దుల బతుకమ్మ, దసరా ఉత్సవాలకు మైసూరును తలపించేలా విస్తృత ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ జిల్లా అధికారులను ఆదేశించారు. బుధవారం ఉర్సు రంగలీలా మైదానంలో కలెక్టర్ సత్యశారద అధ్యక్షతన జిల్లా యంత్రాంగం, జీడబ్ల్యూఎంసీ సంయుక్త ఆధ్వర్యంలో అధికారులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథులుగా మంత్రి కొండా సురేఖ, మేయర్ గుండు సుధారాణి, పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్, కలెక్టర్ సత్యశారద, బల్దియా కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ఆడపడుచులు ఎంతో భక్తి శ్రద్ధలతో తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలు ప్రతిబింబించే విధంగా బతుకమ్మ సంబరాలను జరుపుకుంటారని అన్నారు. వారి సౌకర్యార్థం ఉర్సు రంగలీలా మైదానంతో పాటు అన్ని ప్రాంతాల్లో మైదానాన్ని చదునుచేసి, రహదారిపై గుంతలు పూడ్చాలని, డస్టింగ్, లైటింగ్, కలరింగ్, తాగునీటి సౌకర్యం తదితర మౌలిక వసతులు కల్పించాలని అధికారులను ఆదేశించారు. అదే విధంగా బతుకమ్మల నిమజ్జనం సందర్భంగా ఎలాంటి ఇబ్బందులు ఎదురవకుండా చెరువులో ఉన్న గుర్రపుడెక్కను తొలగించాలని అన్నారు. బతుకమ్మ ఆట స్థలాలను ప్రతీరోజు శుభ్రం చేయాలని మున్సిపల్ అధికారుకు సూచించారు.

దసరా పర్వదినం సందర్భంగా రంగలీలా మైదానంలో లైటింగ్, పారిశుధ్యం, తాగునీటి సౌకర్యం, సీటింగ్, ట్రాఫిక్ నియంత్రణ, భారీ పోలీసు బందోబస్తు, సీసీ కెమెరాల ఏర్పాటు, నిరంతర విద్యుత్ సరఫరా, ఆర్టీసీ బస్సుల ఏర్పాటు, పార్కింగ్, వైద్య, ఆరోగ్యశాఖ అంబులెన్స్ సేవలు, అగ్ని మాపక శాఖ సేవలు, చెరువుల వద్ద గజ ఈతగాళ్ల ఏర్పాటు చేయాలన్నారు. తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలను ప్రతిబింబించేలా సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేయాలన్నారు. రాష్ట్ర సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో ప్రతీ రోజు ఓ జిల్లాలో బతుకమ్మ ఉత్సవాలు నిర్వహిస్తున్నారని, ఈ నెల 21న వేయిస్థంబాల దేవాలయంలో నిర్వహిస్తున్న ఉత్సవాలకు పటిష్టమైన ఏర్పాట్లు చేయాలని అన్నారు. ఉర్సుతో పాటు నగరంలోని కాశిబుగ్గ, రంగశాయిపేట, శివనగర్, ప్రాంతాల్లో కూడా ఏర్పాట్లు చేయాలన్నారు. ఉత్సవాల సమయంలో మహిళా సంఘాలచే ఫుడ్ స్టాళ్ల ఏర్పాటు చేయాలని అన్నారు.

మేయర్ గుండు సుధారాణి మాట్లాడుతూ.. సద్దుల బతుకమ్మ, దసరా ఉత్సవాలకు బల్దియా ఆధ్వర్యంలో అన్ని ఏర్పాట్లు చేస్తామని అన్నారు. సీపీ సత్‌ప్రీత్ సింగ్ మాట్లాడుతూ.. వేడుకలకు పటిష్టమైన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేస్తామని, వాహనాల మళ్లింపు, పార్కింగ్, సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తామన్నారు. సమావేశంలో డీసీపీ సలీమా, డీఆర్‌వో విజయలక్ష్మి, పోలీస్, ట్రాఫిక్ అడిషనల్ డీసీపీ ప్రభాకర్‌రావు, ఏసీపీ శుభం ప్రకాష్, స్పెషల్ బ్రాంచ్ ఏసీపీ జితేందర్ రెడ్డి, పలుశాఖల అధికారులతో పాటు దసరా ఉత్సవ కమిటీ అధ్యక్షుడు నాగపూరి సంజయ్‌బాబు, ప్రధాన కార్యదర్శి మేడిది మధుసూదన్ తదితరులు పాల్గొన్నారు.

సివిల్ సప్లయిస్ టెండర్లలో ధాన్యం కుంభకోణం

మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి

హనుమకొండ టౌన్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): సివిల్ సప్లయ్ టెండర్లలో రూ.1100కోట్ల ధాన్యం కుంభకోణం బయటపడిందని, ఇందులో కాంగ్రెస్ పెద్దల బినామీల ప్రమేయం ఉందని మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ రాష్ట్ర నేత పెద్ది సుదర్శన్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో ఆరోపించారు. 35 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోళ్లలో అక్రమాలు జరిగాయని అన్నారు. ఈ కుంభకోణంపై హైకోర్టులో పిల్ (34/24) దాఖలు చేశామని పేర్కొన్నారు. న్యాయపరమైన విచారణ జరుగాలని డిమాండ్ చేశారు. ఈడీ, సీబీఐ, ఏసీబీలకు 755 పేజీల సాక్ష్యాధారాలతో ఫిర్యాదు చేశామని సుదర్శన్‌రెడ్డి వెల్లడించారు. టెండర్ ఏజెన్సీలపై పూర్తి ఈఎండీ జప్తు చేయకుండా కేవలం రూ.65.90 కోట్లు మాత్రమే వసూలు చేశారని ఆరోపించారు. టెండర్ విలువ కంటే అదనంగా రూ.430 కోట్లు మాయమయ్యాయని ఆరోపించారు. ఈ వ్యవహారం దేశ చరిత్రలోనే అతి పెద్ద కుంభకోణంగా నిలుస్తుందని పెద్ది సుదర్శన్‌రెడ్డి అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఈ అక్రమాలను కాపాడే ప్రయత్నం చేస్తోందని పేర్కొన్నారు. నిజాలను బయటపెట్టకపోతే పోరాటానికి దిగుతామని హెచ్చరించారు.

పోక్సో కేసులో నలుగురికి మూడేళ్ల జైలు

వరంగల్ లీగల్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): బాలికలను లైంగికంగా వేధింపులకు గురిచేసిన నలుగురికి పోక్సో చట్టం ప్రకారం మూడేళ్ల కఠిన కారాగార శిక్ష, రూ.12వేల జరిమానా విధిస్తూ హనుమకొండ జిల్లా మొదటి అదనపు సెషన్స్ జడ్జి కమ్ పోక్సో ప్రత్యేక కోర్టు న్యాయమూర్తి టి.అపర్ణాదేవి బుధవారం తీర్పు చెప్పారు.

బాధితురాలికి రూ.లక్ష పరిహారం చెల్లించాలని ప్రభుత్వాన్ని న్యాయమూర్తి ఆదేశించారు. వివరాలు ఇలా ఉన్నాయి. వేలేరు మండలం ఎర్రబెల్లి గ్రామానికి చెందిన బాలస్తి తరుణ్, అల్లం రాజులు అదే గ్రామానికి చెందిన పదో తరగతి చదువుతున్న బాలికకు సైగలు చేస్తూ పెళ్లి చేసుకోవాలని వేధించేవారు. ఈ విషయాన్ని నిందితుల తల్లిదండ్రులకు చెప్పగా వారి కొడుకుల చర్యలను సమర్థించారు. పైగా మీ కూతురు ప్రవర్తనే మంచిగాలేదని చెప్పారు. దీంతో బాలస్తి తరుణ్, అల్లం రాజు, వారిని సమర్థించిన అల్లం సమ్మయ్య, అల్లం ఇందిరమ్మలపై బాధితురాలి తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. నిందితులపై కేసు నమోదు చేసి కోర్టులో చార్జిషీటు దాఖలు చేశారు. కేసు విచారణలో నేరం రుజువైనందున నిందితులకు మూడేళ్ల జైలుశిక్ష, రూ.12వేల జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు వెలువరించారు.

అభివృద్ధి పనులపై సుదీర్ఘ చర్చ

- మంత్రి పొంగులేటి ఆధ్వర్యంలో పాల్గొన్న ఎంపీ, ఎమ్మెల్యేలు
- హాజరైన కలెక్టర్లు, ఇతర అధికారులు
- ప్రస్తావనకు వచ్చిన ఎయిర్‌పోర్టు భూసేకరణ
- స్పోర్ట్స్ స్కూల్ స్థలం, పారిశుధ్య సిబ్బంది నియామకం
- సమావేశానికి మంత్రి సురేఖ దూరం

హనుమకొండ, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి కూడా అయిన పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి హనుమకొండ కలెక్టరేట్‌లో బుధవారం ఎంపీ, ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులతో వివిధ అభివృద్ధి పనులపై సుదీర్ఘంగా చర్చించారు. కలెక్టరేట్‌లో తెలంగాణ ప్రజాపాలన దినోత్సవం ముగిసిన తర్వాత కలెక్టరేట్ రెండో అంతస్తులోని స్టేట్ చాంబర్‌లో హనుమకొండ, వరంగల్ జిల్లాల పరిధిలో పెండింగ్‌లో ఉన్న సమస్యలపై సమీక్షించారు. వరంగల్ ఎంపీ కడియం కావ్య, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, మేయర్ గుండు సుధారాణి, కాకతీయ పట్టణాభివృద్ధి సంస్థ చైర్మన్ ఇనుగాల వెంకట్రాం రెడ్డి, మాజీ మేయర్ ఎర్రబెల్లి స్వర్ణ, ఇతర ప్రజాప్రతినిధులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. సుమారు రెండు గంటల పాటు సుదీర్ఘంగా జరిగిన ఈ చర్చలో హనుమకొండ కలెక్టర్ స్నేహ శబరీష్, అడిషనల్ కలెక్టర్ వెంకట్‌రెడ్డి, వరంగల్ నగర పాలక సంస్థ కమిషనర్ చాహత్ బాజ్‌పాయి, వరంగల్ కలెక్టర్ సత్యశారద, అదనపు కలెక్టర్ సంధ్యారాణి పాలుపంచుకున్నారు.

భూసేకరణ

మామునూరు ఎయిర్ ఏర్పాటుకు ప్రధాన అడ్డంకిగా ఉన్న భూసేకరణ అంశం ప్రధానంగా చర్చకు వచ్చినట్లు తెలిసింది. వీలైనంత త్వరగా భూసేకరణకు అందుబాటులో ఉన్న అవకాశాలను వినియోగించుకోవాలని మంత్రి కలెక్టర్లకు సూచించారు. విమానాశ్రయం ఏర్పాటయ్యే స్థలంలోనే ఓవర్ హెడ్ సర్వీస్ రిజర్వాయర్ (ఓహెచ్ఎస్ఆర్) ఉంది. దీనిని ఎయిర్‌పోర్టుకు దూరంగా ప్రత్యామ్నాయంగా మరో ఓహెచ్ఆర్ఎస్‌ను సత్వరమే నిర్మించిన తర్వాత ప్రస్తుతం ఉన్న రిజర్వాయర్‌ను తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని మంత్రి వరంగల్ కలెక్టర్, కార్పొరేషన్ కమిషనర్‌కు సూచించినట్లు తెలిసింది.

స్పోర్ట్స్ స్కూల్

స్టేషన్ ఘన్‌పూర్ నియోజకవర్గ పరిధిలోని ఉనికిచర్లలో గల ప్రభుత్వ భూమిలో స్పోర్ట్స్ స్కూల్, స్టేడియం నిర్మాణ విషయమై మంత్రి పొంగులేటి సంబంధిత 'కుడా' అధికారులతో చర్చించారు. ఈ స్థల సేకరణ విషయంలో 'కుడా' అధికారులు మోకాలడ్డుతున్నట్లు తెలిసింది. సుమారు 60 ఎకరాల స్థలంలో 'కుడా' వెంచర్ చేయాలని చూస్తోంది. తద్వారా ఆదాయం సమకూర్చుకోవాలని చూస్తోంది. దీంతో ఈ స్థలాన్ని ఇవ్వడానికి 'కుడా' అధికారులు ససేమిరా అంటున్నారు. ఇదే విషయమై సమావేశంలో పాల్గొన్న 'కుడా' చైర్మన్ ఇనగాల వెంకట్రామిరెడ్డితో మంత్రి చర్చించారు. ఈ స్థలంలో కొంత భాగం స్టేడియంకు అయినా ఇవ్వాలని సూచించినట్లు సమాచారం. వీలైతే స్పోర్ట్స్ స్కూల్‌ను వర్ధన్నపేట నియోజవర్గ పరిధిలో ఏర్పాటు చేసే అవకాశాలను పరిశీలించాల్సిందిగా మంత్రి పొంగులేటి సూచించారు.

అదనంగా పారిశుధ్య సిబ్బంది

వరంగల్ నగర పాలక సంస్థలో అదనంగా 250 మంది పారిశుధ్య సిబ్బందిని నియమించడానికి సంబంధించిన అంశం సమావేశంలో చర్చకు వచ్చింది. ఈ ప్రతిపాదనలకు జరుగుతున్న జాప్యాన్ని మేయర్ సుధారాణి మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. వీలైనంత తర్వాత ఆమోదం తెలపాలని కోరారు. ఈ విషయాన్ని సీఎం దృష్టికి తీసుకువచ్చి పోస్టులు మంజూరయ్యేలా చర్యలు తీసుకుంటానని మంత్రి హామీ ఇచ్చినట్లు తెలిసింది.

మంత్రి సురేఖ దూరం

ఈ కీలక భేటీకి రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ నగరంలో అందుబాటులో ఉన్నప్పటికీ హాజరుకాకపోవడం గమనార్హం. ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డికి, మంత్రికి మధ్య ఇటీవల చోటు చేసుకున్న మాటల యుద్ధం, కొంతకాలంగా ఎమ్మెల్యేలకు, మంత్రికి మధ్య పెరిగిన దూరం నేపథ్యంలో జరిగిన ఈ సమావేశం జరగడం ప్రాధాన్యత సంతరించుకున్నది. వరంగల్ జిల్లా కలెక్టర్‌తో పాటు ఇతర అధికారులు హాజరైనప్పటికీ మంత్రి సురేఖ రాకపోవడం చర్చనీయాంశంగా మారింది.

డ్రగ్స్ రహిత సమాజాన్ని నిర్మించాలి

హసన్‌పర్తి, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణంలో సమష్టి కృషి అవసరమని నార్కోటిక్స్ డిపార్టుమెంట్ యాంటీ డ్రగ్ కమిటీ మెంబర్ డాక్టర్ అనితారెడ్డి అన్నారు. మండలంలోని ఎర్రగట్టుగుట్ట కిట్స్ ఇంజనీరింగ్ కళాశాల ఆడిటోరియంలో ప్రిన్సిపాల్ కె.అశోక్‌రెడ్డి అధ్యక్షతన యాంటీ డ్రగ్స్‌పై అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ అనితారెడ్డి, ఇన్‌స్పెక్టర్ సుంకరి రవికుమార్, నాగార్జునరెడ్డి, ఆచార్య రవికుమార్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. కిట్స్ పీఆర్వో డి.ప్రభాకరాచారి, హెచ్ఓడీలు పింగిళి రమేష్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, ఇంద్రసేనారెడ్డి పాల్గొన్నారు.

సంవత్సర నివేదిక అందజేత

వరంగల్ కార్పొరేషన్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): కుడా చైర్మన్‌గా ఇనుగాల వెంకట్రామ్‌రెడ్డి బుధవారంతో యేడాది పూర్తిచేసిన సందర్భంగా ప్రగతి నివేదికను జిల్లా ప్రజాప్రతినిధులను కలిసి బుధవారం అందజేశారు. వరంగల్ ఎంపీ కడియం కావ్య, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, వరంగల్ డీసీసీ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణలకు వారి నివాసాలకు వెళ్లి సమర్పించారు.

బతుకమ్మ పాటలతో సంస్కృతిని చాటండి

మహిళలకు ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి పిలుపు

హనుమకొండ కల్చరల్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ సంస్కృతిని చాటే బతుకమ్మ పాటలను మహిళలంతా చక్కగా నేర్చుకొని పాటలు పాడుతూ సంస్కృతిని చాటాలని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఏకశిల పార్కు వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో తొలినాటి బతుకమ్మ వేడుక సందర్భంగా నిర్వహించే బతుకమ్మ పోటీల ప్రచార పోస్టర్‌ను ఆహ్వానపత్రాన్ని ఎమ్మెల్యే ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు వంగ రాజిరెడ్డి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మహిళలు పోటీపడి బతుకమ్మ పాటలు పాడుతూ ఆటలు ఆడాలన్నారు. వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు వంగ రాజిరెడ్డి మాట్లాడుతూ.. బతుకమ్మ వేడుకలను ఏకశిలా పార్కు శ్రీసీతారామాంజనేయస్వామి ఆలయం ఉత్తరం వైపున ఉన్న ఖాళీ స్థలంలో పెద్ద ఎత్తున వేడుకలు నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో చాడ దశరథరామిరెడ్డి, టి.ఎల్లగౌడ్, సోమయ్య, బొద్దిరెడ్డి రాజిరెడ్డి, కుమారస్వామి, జే.గోపాల్‌రెడ్డి, గోవర్ధన్‌రెడ్డి తదితర వాకర్స్ నాయకులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

రాంనగర్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ మరమ్మతుల దృష్ట్యా నేడు పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని హనుమకొండ టౌన్ డీఈ జి.సాంబరెడ్డి తెలిపారు. మడికొండ సబ్‌స్టేషన్ పరిధిలోని టీఎన్జీవోస్ కాలనీ, ఏకలవ్య కాలనీ, అర్బి కాలనీ, రమణ స్కూల్ ఏరియాలో ఉదయం 11 గంటల నుంచి 1 గంట వరకు, కేయూసీ సబ్‌స్టేషన్ పరిధిలోని కమ్మరివాడ, లష్కర్‌బజార్ ఏరియాలో ఉదయం 9.30 నుంచి 10.30 వరకు విద్యుత్ సరఫరా జరగదని డీఈ తెలిపారు.

తెలంగాణ పోరాట వీరులకు నివాళి

కేయూ క్యాంపస్ సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ విద్రోహ దినమని పీడీఎస్‌యూ, ఎస్ఎఫ్ఐ నేతలు, స్కాలర్లు, వివిధ సంఘాల నేతలు ఆందోళన వ్యక్తం చేశారు. తెలంగాణ సాయుధ పోరాట అమరవీరులకు నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ కేయూ అధ్యక్షుడు బి.బాలకృష్ణ, గణేశ్, యాదగిరి, లోకేశ్, పి.అనూష, సాధన, శ్రీజ, సంగీత పాల్గొన్నారు. ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో కేయూ అధ్యక్షకార్యదర్శులు చెన్నూరు సాయికుమార్, బీరెడ్డి జశ్వంత్‌లు నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కేయూ ఎస్ టిఎఫ్ఐ నేతలు మల్లేశ్, సమ్మయ్య, నాగరాజు, నవీన్, పవన్ కల్యాణ్ తదితరులు పాల్గొన్నారు. డీవైఎఫ్ఐ నేతృత్వంలో జిల్లాకార్యదర్శి డి.తిరుపతి నేతృత్వంలో నివాళులర్పించారు. కార్యక్రమంలో బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు అరెగంటి నాగరాజు, స్కాలర్లు మాదాసి రమేశ్, కేతపాక ప్రసాద్, కందికొండ తిరుపతి, జె.రాజారాం, స్రవంతి, రాజమణి, పీఎస్ఎఫ్ఐ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు వినయ్‌కుమార్, డీవైఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి ఓర్సు చిరంజీవి, బొక్క ప్రవర్ధన్, డి.రంజిత్ తదితరులు పాల్గొన్నారు.

పెరియార్ జయంతి వేడుకలు



పెరియార్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న అధ్యాపకులు

కేయూ క్యాంపస్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): సైంటిఫిక్ స్టడీ ఫోరం (ఎస్ఎస్ఎఫ్) నేతృత్వంలో బుధవారం కేయూ రాజనీతిశాస్త్ర సెమినార్ హాల్‌లో పెరియార్ 146వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఎస్ఎఫ్ఐ కన్వీనర్ అమర్నాథ్ అధ్యక్షత జరిగిన కార్యక్రమంలో కేయూ రాజనీతిశాస్త్రం, చరిత్ర, తెలుగు విభాగాల అధిపతులు డాక్టర్ సంకినేని వెంకట్, డాక్టర్ చిలువేరు రాజ్‌కుమార్, డాక్టర్ మామిడి లింగయ్య, వర్సిటీ పాలక మండలి సభ్యుడు డాక్టర్ చిర్రారాజులు హాజరై పెరియార్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించి సమాజ బాగుకోసం పాటుపడిన పెరియార్ అందరికీ ఆదర్శనీయమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు పెండ్యాల సుమన్, నాయకులు గుత్తికొండ చక్రధర్, కుమ్మరి రమేశ్, కన్వీనర్ అమర్నాథ్, శర్మ, సాంబరాజు, పున్నం, అనిల్, జునాయిద్ తదితరులు పాల్గొన్నారు.

సందడిగా మండల స్థాయి క్రీడా పోటీలు

వరంగల్ స్పోర్ట్స్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఎస్‌జీఎఫ్ఐ) ఆధ్వర్యంలో హనుమకొండ మండల స్థాయి అండర్-17 బాలబాలికల క్రీడా పోటీలు సందడిగా ప్రారంభమయ్యాయి. బుధవారం అండర్-17బాలబాలికల ఖో-ఖో, కబడ్డీ, వాలీబాల్ క్రీడాంశాల్లో హనుమకొండ ప్రాక్టీసింగ్ ప్రభుత్వ పాఠశాలలో ఏర్పాటు చేసిన క్రీడా పోటీలను హనుమకొండ మండల ఎంఈవో నెహ్రూనాయక్ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్‌జీఎఫ్ఐ మండల కార్యదర్శి ఎం.కరుణాకర్ మాట్లాడుతూ.. రెండు రోజుల పాటు మండల స్థాయిలో నిర్వహించనున్న క్రీడల్లో తొలిరోజు అండర్-17 విభాగంలో నిర్వహించిన పోటీల్లో మండలంలోని పలు ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల నుంచి సుమారు 200మంది బాలబాలికల పాల్గొన్నారన్నారు. గురువారం అండర్ 14బాలబాలికల విభాగంలో ఖోఖో, కబడ్డీ, వాలీబాల్ పోటీలను నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం జగన్నాథం, టీజీపేట రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు బి.సుధాకర్, పీడీలు పార్థసారథి మల్లారెడ్డి, శ్రీధర్‌రావు, వెంకటేశ్వర్లు, మనోహర్, రాణి, శోభ, సరళ తదితరులు పాల్గొన్నారు.

'పోరాట వారసత్వాన్ని కొనసాగించాలి'

మహబూబాబాద్ రూరల్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : రైతాంగ సాయుధ పోరాట వారసత్వ స్ఫూర్తితో పోరాటాలకు సిద్ధం కావాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ పిలుపునిచ్చారు. మహబూబాబాద్‌లోని వీఆర్ఎన్ గార్డెన్స్‌లో బుధవారం సీపీఎం ఆధ్వర్యంలో తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వార్షికోత్సవ ముగింపు సభను నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి సాదుల శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన సభలో ఆయన ప్రసంగించారు. తెలంగాణలోని కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలో ఉన్న 25 లక్షల సర్కారు భూమిని పేదలకు పంచకుండా ప్రజాపాలన అంటే ఎలా అని ప్రశ్నించారు. పేదలకు 10 లక్షల ఎకరాలను పంచిన ఘనత కమ్యూనిస్టులదేనని ఆయన చెప్పారు. జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు సూర్నపు సోమయ్య, ఆకుల రాజు, శెట్టి వెంకన్న, గునిగంటి రాజన్న, అల్వాల వీరయ్య, కుంట ఉపేందర్, కందునూరి శ్రీనివాస్, బానోత్ సీతారాంనాయక్, సమ్మెట రాజమౌళి, రావుల రాజు, రాజన్న పాల్గొన్నారు.

ఘనంగా ప్రజాపాలన దినోత్సవం

హనుమకొండ సిటీ, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): హనుమకొండలోని జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో బుధవారం ప్రజాపాలన దినోత్సవ కార్యక్రమం జరిగింది. హనుమకొండ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన జాతీయ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, వరంగల్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ తదితర నాయకుల పాల్గొన్నారు. అలాగే హనుమకొండ నక్కలగుట్టలోని డీసీసీ బ్యాంక్ ప్రధాన కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో టెస్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు జాతీయ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో బ్యాంకు సీఈవో వజీర్ సుల్తాన్, జీయంలు ఉషా పద్మావతి, డీజీఎం అశోక్, ఏజీయంలు మధు, స్రవంతి, రాజు, కృష్ణమోహన్ తదితర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

వరంగల్ క్రైం: వరంగల్ పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో బుధవారం ఘనంగా ప్రజాపాలన దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీ సన్‌ప్రీత్ సింగ్ జాతీయ జెండా ఆవిష్కరించి విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన అమరవీరులకు నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో సెంట్రల్ జోన్ డీసీపీ షేక్ సలీమా, అదనపు డీసీపీలు రవి, ప్రభాకర్‌రావు, సురేష్‌కుమార్, ఏసీపీ నాగయ్య తదితరులు పాల్గొన్నారు.

రాంనగర్: హంటర్‌రోడ్‌లోని బీజేపీ జిల్లా కార్యాలయంలో బుధవారం తెలంగాణ విమోచన దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సంతోష్‌రెడ్డి జాతీయ జెండా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీ సీతారాంనాయక్, మాజీ ఎమ్మెల్యే మార్తినేని ధర్మారావు, బీజేపీ మాజీ జిల్లా అధ్యక్షురాలు రావు పద్మరెడ్డి, ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షులు సంద్ర మధు తదితరులు పాల్గొన్నారు.



సీపీటీసీలో జాతీయ జెండా ఎగురవేసి జాతీయ గీతం ఆలపిస్తున్న అడిషనల్ డీసీపీ రవి, అధికారులు, సిబ్బంది



బీజేపీ కార్యాలయంలో జాతీయ జెండా ఆవిష్కరణలో పాల్గొన్న సంతోష్‌రెడ్డి

● ఎన్పీడీసీఎల్ కార్పొరేట్ కార్యాలయంలో బుధవారం టీజీఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్‌రెడ్డి జాతీయ జెండా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు మోహన్‌రావు, తిరుపతిరెడ్డి, మధుసూదన్, ప్రభాకర్, చీఫ్ విజిలెన్స్ ఆఫీసర్ బోనాల కిషన్, సీజీఎంలు పాల్గొన్నారు.

వరంగల్ కార్పొరేషన్: గ్రేటర్ వరంగల్ నగర పాలక సంస్థ ప్రధాన కార్యాలయంలో బుధవారం తెలంగాణ ప్రజాపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మునిసిపల్ కమిషనర్ చహత్ బాజ్‌పాయ్ హాజరుగా కాగా, మేయర్ గుండు సుధారాణి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం అధికారులు, సిబ్బంది జెండాకు నమస్కరించారు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ చంద్రశేఖర్, ఈఈ రవీందర్, డీఈలు రోజా, సారంగం, టీఎంసీ రమేష్‌తో పాటు శానిటరీ ఇన్‌స్పెక్టర్లు బల్దియా సిబ్బంది పాల్గొన్నారు.

● హనుమకొండలోని కుడా కార్యాలయంలో ప్రజాపాలన దినోత్సవ వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. కుడా చైర్మన్ ఇనుగాల వెంకట్రామ్‌రెడ్డి జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో కుడా వైస్ చైర్‌పర్సన్ చహత్ బాజ్‌పాయ్, కుడా సీపీవో అజిత్‌రెడ్డి, ఈఈ భీంరావుతో పాటు సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

మడికొండ: మడికొండలోని సిటీ పోలీస్ శిక్షణ కేంద్రం(సీపీటీసీ)లో బుధవారం ప్రజా పాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్, అడిషనల్ డీసీపీ రవి ముఖ్య అతిథిగా పాల్గొని జాతీయ జెండా ఎగురవేసి జాతీయ గీతాన్ని ఆలపించారు. కార్యక్రమంలో ఏసీపీ రమణ బాబు, ఆర్ఐ ఉదయభాస్కర్, స్పీకర్లు రవి, మంగీలాల్, అవుట్‌డోర్, ఇండోర్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. అలాగే మడికొండ పోలీసుస్టేషన్‌లో సీఐ పుల్యాల కిషన్ ఆధ్వర్యంలో జెండా ఆవిష్కరించారు.

హనుమకొండ టౌన్: హనుమకొండ రాంనగర్‌లోని బీసీ భవన్‌లో తెలంగాణసాయుధ పోరాట స్ఫూర్తి వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. అమరవీరుల చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సుందర్‌రాజ్ యాదవ్ ప్రొఫెసర్ గడ్డం భాస్కర్, రాజగోపాల్, వేణుమాధవ్, రాము పాల్గొన్నారు.

కేయూ క్యాంపస్: తెలంగాణ ప్రజా పాలన దినోత్సవాన్ని బుధవారం కేయూ పరిపాలన భవనం ఎదుట జరిగింది. కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం జాతీయ జెండాను ఎగురవేశారు. ఈ కార్యక్రమంలో కేయూ పాలక మండలి సభ్యులు డాక్టర్ కె.అనితారెడ్డి, ప్రొఫెసర్ బి.సురేశ్‌లాల్, క్యాంపస్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ తాళ్ళపల్లి మనోహర్, ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి, నరసింహచారి, ఈసం నారాయణ, వాసుదేవారెడ్డి, మామిడాల ఇస్తారీ, డాక్టర్‌ఎల్‌పీ రాజ్‌కుమార్, డీఆర్ ఎల్.రాము, ఏఆర్ సీహెచ్ ప్రణయ్‌కుమార్, పీఆర్వో డాక్టర్ వల్లాల పృథ్వీరాజ్ తదితరులు పాల్గొన్నారు.



మునిసిపల్ కార్యాలయంలో జాతీయ జెండాను ఆవిష్కరిస్తున్న మేయర్ సుధారాణి

రాణునాయక్ స్ఫూర్తితో పోరాడుతాం

సీపీఎం జిల్లా కార్యదర్శి జి.ప్రభాకర్‌రెడ్డి

వడ్డెపల్లి, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : భూమి, భుక్తి, విముక్తి కోసం పోరాడిన రాణు నాయక్ వారసత్వంతో భూపోరాటాన్ని కొనసాగిస్తామని సీపీఎం జిల్లా కార్యదర్శి జి.ప్రభాకర్‌రెడ్డి అన్నారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వార్షికోత్సవ ర్యాలీ సభను హనుమకొండ రాంనగర్ నుంచి పబ్లిక్ గార్డెన్ ప్రాంతంలోని డాక్టర్ బీఆర్‌అంబేద్కర్ విగ్రహం వరకు సీపీఎం హనుమకొండ పశ్చిమ మండల కమిటీ కార్యదర్శి వాంకుడోత్ వీరన్న ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా నాయకులు తేలూరి ఉప్పలయ్య, ఎల్.దీప, వల్లెపు రాజు, ధరావత్ రమేష్, కళవేణి రాధిక, లాలూ, సాంబయ్య, ప్రభాకర్, సమ్మయ్య, సబిత, స్వప్న, పావని, పద్మ, శృతి తదితరులు పాల్గొన్నారు.

విజిలెన్స్ ఆఫీసర్‌ను కలిసిన టీఆర్‌వీకేఎస్

రాంనగర్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): టీజీఎన్పీడీసీఎల్ చీఫ్ విజిలెన్స్ ఆఫీసర్‌గా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన బోనాల కిషన్‌ను టీఆర్‌వీకేఎస్ రాష్ట్ర అధ్యక్షుడు కేవీ జాన్సన్ ఆధ్వర్యంలో బుధవారం మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎన్పీడీసీఎల్ కంపెనీ కార్యదర్శి బండారి ప్రభాకర్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు గరిగె నరేంద్ర, కంపెనీ వర్కింగ్ ప్రెసిడెంట్ సీహెచ్ రాంరెడ్డి, హనుమకొండ రూరల్ అధ్యక్షుడు చీకట్ల మొగిలి, సిటీ అధ్యక్షుడు పగడాల కోటేశ్వర్, ఎంఏ మోసిన్, బండి రంజిత్, మల్లిఖార్జున్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా విశ్వకర్మ భగవాన్ జయంతి



పూజలో పాల్గొన్న సీతంపేట విశ్వబ్రాహ్మణ సంఘం ప్రతినిధులు

వడ్డెపల్లి, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ 55, 57 డివిజన్ల పరిధిలోని గోపాల్‌పూర్ మెయిన్ రోడ్డులో విరాట్ విశ్వకర్మ సంఘం గోపాల్‌పూర్ శాఖ ఆధ్వర్యంలో విశ్వకర్మ భగవాన్ జయంతిని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తొమ్మిది జంటల దంపతులతో శ్రీవిరాట్ విశ్వకర్మ యజ్ఞ మహోత్సవాన్ని రుత్వికులు జరిపారు. విశ్వకర్మ, గణపతి, నవగ్రహ పూజలను భక్తి ప్రపత్తులతో నిర్వహించి అనంతరం మహా అన్నదానం చేశారు. కార్యక్రమంలో గోపాల్‌పూర్ విశ్వకర్మ అధ్యక్షుడు సీపెల్లి శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు చలకుర్తి ఉపేంద్రాచారి, ముఖ్య సలహాదారులు బాలాజీ భద్రయ్య, కార్యదర్శి బెజ్జంకి భద్రయ్యచారి, కోశాధికారి శాంసుందర్, వనపర్తి శ్రీనివాస్ తదితరులు పాల్గొని విశ్వకర్మ భగవానుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

● మడికొండ: మడికొండలోని విశ్వకర్మల కమ్యూనిటీ హాల్‌లో బుధవారం విశ్వకర్మ సంఘం ఆధ్వర్యంలో విరాట్ విశ్వకర్మ మహాయజ్ఞం ఘనంగా నిర్వహించారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. యజ్ఞంలో సంఘం గౌరవ అధ్యక్షుడు ఉద్దండి చంద్రమూర్తి, అధ్యక్షులు కడార్ల పూర్ణ చందర్, ఉపాధ్యక్షులు దుప్పెల్లి విక్రమ్, ప్రచార కార్యదర్శి కందుకూరి బాలరాజు, కోశాధికారి పత్తిపాక ఉపేంద్రాచారి, కార్యదర్శి రంగు రాజేశ్వర్‌రావు, సంఘ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

హసన్‌పర్తి: మండలంలోని సీతంపేటలో బుధవారం విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో విశ్వకర్మ జయంతి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విశ్వకర్మ చిత్ర పటానికి పూలమాలలు వేసి పూజలు నిర్వహించారు. పోచమ్మ ఆలయ పరిసర ప్రాంతంలో వృక్ష యజ్ఞంలో భాగంగా మొక్కలు నాటారు. దాత హెచ్‌డీఎఫ్‌సీ లోన్ మేనేజర్ పొన్నోజు శివప్రసాద్ అన్నప్రసాద వితరణ నిర్వహించారు. అనంతరం విశ్వకర్మ చిత్రపటంతో ఊరేగింపుగా శోభాయాత్ర నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విశ్వబ్రాహ్మణ సంఘం మండల అధ్యక్షుడు వేదమూర్తి, సంఘం నాయకులు వెలిశోజు కేదారి, కృష్ణాది రాజేష్, కృష్ణాది రమేష్, పొన్నోజు సారంగపాణి పాల్గొన్నారు.

డ్రంకెన్‌డ్రైవ్‌లో ఇద్దరికి జైలు శిక్ష

వరంగల్ క్రైం, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడ్డ 28మందిని బుధవారం కోర్టులో హాజరు పరచగా న్యాయమూర్తి వేణుగోపాల్ కొత్తవాడకు చెందిన సిరంగి రాజేష్, హసన్‌పర్తి మండలం ముచ్చర్లకు చెందిన మట్టెడ సైదికి రెండు రోజుల జైలు శిక్ష విధించినట్లు హనుమకొండ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ జి.సీతారెడ్డి తెలిపారు. మిగతా 26మందికి రూ.28,600 జరిమానా విధించామన్నారు. డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా పట్టుబడ్డ నలుగురికి రూ.2600జరిమానా విధించామన్నారు.



జెండా ఆవిష్కరించి మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే ఎం.ధర్మారావు

బీఎంఎస్ జెండా ఆవిష్కరణ

కాజీపేట, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : నిట్ సమీపంలో బుధవారం బీఎంఎస్ ఆధ్వర్యంలో తెలంగాణ విమోచన దినోత్సవాన్ని పురస్కరించుకుని జెండా ఆవిష్కరణ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మాజీ ఎమ్మెల్యే ఎం.ధర్మారావు హాజరై జాతీయ జెండా ఆవిష్కరించారు. విశ్వకర్మ 70వ జయంతిని నిర్వహించారు. కార్యక్రమంలో బీఎంఎస్ రాష్ట్ర కన్వీనర్ గాదె మహేందర్, మాజీ కార్పొరేటర్ నార్లగిరి రామలింగం, నాయకులు కె.కరుణాకర్, కార్తీక్, ఎం. మల్లేశం, తదితరులు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా, కాజీపేటలో విశ్వబ్రహ్మణ (విశ్వకర్మ) పరపతి సంఘం ఆధ్వర్యంలో విశ్వకర్మ మహోత్సవం జరిగింది. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా బీఆర్ఎస్ నేత దాస్యం విజయ్ భాస్కర్ హాజరై ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు కె.రామ్మోహన్, శృంగవరపు బిక్షపతి, ఎన్. రవీంద్రచారి, వినయ్, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

కేయూ పూర్వ విద్యార్థుల సహకారం గొప్పది



అమెరికాలో పూర్వ విద్యార్థుల సమ్మేళనంలో పాల్గొన్న వీసీ ప్రతాప్‌రెడ్డి, ప్రొఫెసర్లు

కేయూ క్యాంపస్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): కేయూ సమగ్ర అభివృద్ధిలో పూర్వ విద్యార్థుల సహకారం గొప్పదని కేయూ వీసీ ప్రొఫసర్ కర్నాటి ప్రతాప్‌రెడ్డి అన్నారు. కేయూ గోల్డెన్ జూబ్లీ వేడుకలను పురస్కరించుకుని కేయూ వీసీ ప్రతాప్‌రెడ్డి, కేయూ ఫార్మసీ కళాశాల పూర్వ విద్యార్థుల సమ్మేళనంలో అమెరికాలో నిర్వహిస్తున్నారు. యూఎస్ఏ న్యూజెర్సీ, అట్లాంటాలో జరిగిన సంబురాల్లో కేయూ ఫార్మసీ పూర్వ విద్యార్థి డాక్టర్ సాంబరెడ్డి అధ్యక్షత జరిగింది. మూడు రోజుల పాటు సెలబ్రేట్ అండ్ కంట్రిబ్యూట్ అనే థీమ్‌తో జరుగుతున్న కార్యక్రమంలో వీసీ ప్రతాప్‌రెడ్డి పాల్గొని మాట్లాడారు. ఫార్మసీ పూర్వ విద్యార్థుల కుటుంబ సభ్యులతో ఏర్పాటు చేసిన సమావేశంలో విస్తృత ఉపన్యాసం చేశారు. కేయూ ఫార్మసీ కళాశాల నుంచి 18వేల మంది ఎంఫార్మసీ, 370 మంది పీహెచ్‌డీలు పొందారని చెప్పారు. అనేక మంది శాస్త్రవేత్తలుగా, వ్యాపారవేత్తలు, వివిధ సంస్థల అధిపతులుగా, అధ్యాపకులుగా ఎదిగారని కొనియాడారు. ఈ సమావేశంలో ఇటీవల మృతి చెందిన ప్రొఫెసర్ మధుసూధన్‌రావుకు నివాళులర్పించారు. ఈ సమావేశంలో ఫార్మసీ రిటైర్డు ప్రొఫెసర్లు కోకాటే, రామ్‌బహు, అమరేశ్వరన్, రామకృష్ణ, ప్రభాకర్, మల్లారెడ్డిల సేవలను గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో కేయూ ఫార్మసీ పూర్వ విద్యార్థులు కిషన్, తదితరులు పాల్గొన్నారు.

ప్రధాని నరేంద్రమోదీ జన్మదిన వేడుకలు

వడ్డెపల్లి, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ 56వ డివిజన్ గోపాల్‌పూర్ సర్దార్ సర్వాయి పాపన్న జంక్షన్‌లో గోపాల్‌పూర్ బీజేపీ జోనల్ కమిటీ అధ్యక్షుడు బండి హరీష్ ముదిరాజ్ , బీజేపీ జిల్లా నేత చింతలపణి అమరేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రధాని నరేంద్ర మోదీ జన్మదిన వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. మోదీ బర్త్‌డే కేక్‌ను కట్ చేసి పంపిణీ చేశారు. అనంతరం వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండేటి శ్రీధర్, రావు పద్మ, ఎడ్ల అశోక్‌రెడ్డి, బీజేపీ జోనల్ కమిటీ అధ్యక్షుడు బండి హరీష్ ముదిరాజ్, ప్రధాన కార్యదర్శి పప్పుల రమేష్, జిల్లా కౌన్సిల్ మెంబర్ తక్కళ్లపెల్లి అమృతరావు, బీజేపీ శ్రేణులు పాల్గొన్నారు.

హసన్‌పర్తి: హసన్‌పర్తిలో ప్రధాని మోదీ జన్మదిన వేడుకలను బుధవారం బీజేపీ మండల అధ్యక్షుడు మారం తిరుపతి, కార్పొరేటర్ గురుమూర్తి శివకుమార్ సంయుక్త ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ముందుగా బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ మారపల్లి రాంచంద్రారెడ్డి తెలంగాణ విమోచన దినోత్సవాన్ని పురస్కరించుకొని జాతీయ జెండాను ఆవిష్కరించారు. అనంతరం స్థానిక ప్రైవేటు ఆస్పత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ వరంగల్ పార్లమెంట్ కన్వీనర్ తాళ్ళపల్లి కుమారస్వామిగౌడ్, మాజీ ఎంపీటీసీలు పిట్టల కుమారస్వామి, పెద్ది మహేందర్‌రెడ్డి, రైల్వే బోర్డు మెంబర్ మేకల హరిశంకర్, జిల్లా కార్యదర్శి చల్లగుండ ప్రభాకర్‌రెడ్డి, మధు, సునిల్, సత్యం, శ్రీనివాస్ పాల్గొన్నారు.

రాంనగర్: ప్రధాని నరేంద్ర మోదీ 75వ జన్మదినం సందర్భంగా బీజేపీ జిల్లా యువమోర్చా ఆధ్వర్యంలో బుధవారం హనుమకొండ హంటర్‌రోడ్‌లోని బీజేపీ జిల్లా పార్టీ కార్యాలయం లో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి డాక్టర్ విజయ్‌రామారావు, బీజేపీ జిల్లా అధ్యక్షులు కొలను సంతోష్‌రెడ్డి, మాజీ జిల్లా అధ్యక్షురాలు రావు పద్మరెడ్డి, నాయకులు డాక్టర్ కాళీప్రసాద్, దొంతి దేవేందర్‌రెడ్డి, విజయ్ చందర్‌రెడ్డి, ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షులు సంద్ర మధు, భరత్, కందకట్ల సత్యనారాయణ, రత్నలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



గోపాల్‌పూర్‌లో మోదీ జన్మదిన వేడుకల్లో పాల్గొన్న బీజేపీ శ్రేణులు

భారత్ అంటే... నాకెందుకు ఇష్టం?

క్రిస్టెన్ ఫిషర్... అమెరికన్ మహిళ. నలుగురు పిల్లల తల్లి. ఆమె గత నాలుగేళ్లుగా భారతదేశంలో నివసిస్తున్నారు. కంటెంట్ క్రియేటర్‌గా తన అనుభవాలను సామాజిక మాధ్యమాల్లో పోస్ట్ చేస్తూ ఉంటారు. ముఖ్యంగా అమెరికా, భారత్‌ల మధ్య ఉన్న వ్యత్యాసాలను వివరిస్తూ ఆమె చేసిన వీడియోలకు సోషల్ మీడియాల్లో మంచి ఆదరణ లభిస్తోంది. మన దేశంలో ఆమెకు ఆకర్షించిన విషయాలు- ఆసక్తికరమైనవి.. అవేమిటో చూద్దాం..



- ప్రతి ఇంట్లో రోజుకు రెండు లేదా మూడుసార్లు వంట చేయడం ఆశ్చర్యం అనిపించింది. ఇక్కడకు వచ్చిన తర్వాత నేను కూడా క్రమం తప్పకుండా వంట చేయటం నేర్చుకున్నా. భారతీయ శాఖాహార వంటలు చాలా రుచిగా ఉంటాయి. వీటిని తిని నేను కూడా శాఖాహారిగా మారిపోయాను.
- భారత మహిళలంటే చీరలు గుర్తుకొస్తాయి. నేను కూడా చీర కట్టుకోవటం నేర్చుకున్నా. చీర కట్టుకున్నప్పుడల్లా అందమైన అనుభూతి కలుగుతుంది.
- బజారులో వస్తువులు, కూరగాయలు, పండ్లు కొనేటప్పుడు బేరసారాలు ఆడడం సరదాగా ఉంటుంది. వర్తకులు ధర తగ్గించినప్పుడు ఆనందంగా అనిపిస్తుంది.
- అమెరికాలో పలు రకాల వస్తువులు లారీల ద్వారా రవాణా అవుతుంటాయి. మనవద్దకు వచ్చే సరికి అవి పాతబడుతుంటాయి. అదే భారత్‌లో అయితే స్థానికంగా ఉండే వీధి వ్యాపారుల వద్ద అన్ని వస్తువులు కొత్తగా కనిపిస్తుంటాయి. ఎప్పుడు కావాలంటే అప్పుడు వాటిని కొనుక్కోవచ్చు.
- అమెరికాలో స్కూటర్స్, బైక్స్ నడిపేవారు తక్కువగా ఉంటారు. ఇక్కడ మాత్రం అవి అందుకే నేను కూడా స్కూటర్ నడపడం నేర్చుకున్నా. దీనిమీద ప్రయాణించడం అనుకూలంగా ఉంటుంది. పనులు త్వరగా పూర్తవుతాయి. సమయమూ మిగులుతుంది.
- భారత్ వచ్చాక నా ఆలోచనా విధానం మారింది. సర్దుబాటు ధోరణి పెరిగింది. ఏ ప్రదేశం కూడా పూర్తిగా మనకు నచ్చినట్లు పరిపూర్ణంగా ఉండదు. అందరూ అనుకుంటున్నట్లు అమెరికాలో అంతా సంతోషమే ఉండదు. ఎక్కడ ఉన్నా మనకు మనమే ఆనందాన్ని వెతుక్కోవాలి. ఆ శక్తి మనకు ఉంటుంది. ప్రతికూలతలను పక్కనపెట్టి సానుకూలతలను ఆస్వాదించాలి. అప్పుడే జీవితం ఆనందమయమవుతుంది.



పెయింటింగ్స్ పట్ల ప్రజల అభిరుచి మారింది!



ఒకప్పుడు హైదరాబాద్ అనేక రకాల సంస్కృతులు.. సంప్రదాయాల సమ్మేళనం. ఈ మధ్య కాలంలో ఆ పునర్వైభవాన్ని తీసుకురావటానికి కృషి చేస్తున్న వారిలో మిహికా దగ్గుబాటి ఒకరు. ప్రముఖ నటుడు రాణా భార్యగానే కాకుండా.. కళా ప్రపంచంలో మిహికాకు ప్రత్యేక స్థానం ఉంది. ప్రస్తుతం ఆమె నిర్వహిస్తున్న 'ఆర్ట్ కనెక్ట్' అనే ఎగ్జిబిషన్‌కు మంచి ఆదరణ కూడా లభిస్తోంది. ఈ నేపథ్యంలో ఆమెను 'నవ్య' పలకరించింది.

హైదరాబాద్ కళా రంగం ఎలా ఉంది?

ఒకప్పుడు హైదరాబాద్ రకరకాల కళలకు ప్రసిద్ధి. ఎంఎఫ్‌హుస్సేన్ వంటి అనేక మంది పెయింటర్స్‌కు ఇక్కడ మంచి ఆదరణ లభించింది. అయితే ఇక్కడ ప్రజలు సంప్రదాయబద్ధమైన చిత్రాలను ఎక్కువగా ఆదరిస్తారు. ఈ మధ్యకాలంలో మన దేశంలోని కళా రంగంలో అనేక మార్పులు జరుగుతున్నాయి. ప్రపంచవ్యాప్తంగానే కాదు.. మన దేశంలో కూడా కొత్త కొత్త ఆర్టిస్టులు రకరకాల ప్రయోగాలు చేస్తున్నారు. అందువల్ల దేశంలోని అనేక స్టూడియోల నుంచి పెయింటింగ్స్‌ను, ఇతర కళాకృతులను ఇక్కడ ప్రదర్శిస్తున్నాం. ఈ ప్రదర్శనకు మంచి స్పందన లభిస్తోంది.

ఇక్కడ ఒకప్పుడు కళా రంగం ఎలా ఉండేది?

నేను హైదరాబాద్‌లోనే పుట్టాను. ఇక్కడే పెరిగాను. ఒకప్పుడు ఇక్కడ అనేక ప్యాలెస్‌లు ఉండేవి. స్వాతంత్రం తర్వాత అనేక మంది రాజకుటుంబీకులు తమ ప్యాలెస్‌లలో ఉన్న పెయింటింగ్స్, ఫర్నీచర్స్‌ను అమ్మేశారు. మా అమ్మమ్మ వాళ్లు కూడా పైగా రాజ కుటుంబీకుల నుంచి ఒక క్రిస్టల్ డైనింగ్ టేబుల్ కొన్నారు. కళా రంగం గురించి నాకు పరిచమయింది అప్పుడే! ఆ తర్వాత ప్రభుత్వం దానిని వెనక్కి తీసేసుకుంది. అద్భుతమైన యాంటిక్ ఫర్నిచర్స్, గొప్ప గొప్ప ఆర్టిస్టుల పెయింటింగ్స్‌ను చూస్తూ పెరిగాను.

ఇక పెయింటింగ్స్ విషయానికి వస్తే- నేను న్యూయార్క్‌కు చదువుకోవటానికి వెళ్లినప్పుడు- అక్కడి మ్యూజియంలలో పెయింటింగ్స్‌ను చూశాను. అవి వర్తమాన ప్రపంచానికి సంబంధించినవి. అంతకు ముందు నేను యూరప్‌లోని దేశాలకు వెళ్లాను. అక్కడ సంప్రదాయ బద్ధమైన పెయింటింగ్స్ ఉండేవి. ఈ రెండింటికీ మధ్య తేడా స్పష్టంగా తెలిసింది. వర్తమాన కళాకారుల పెయింటింగ్స్ పట్ల ప్రేమ పెరుగుతూ వచ్చింది.

> పెయింటింగ్స్ అనేవి జీవిత కాలం మనతో పాటుగా ఉండే ఎమోషన్స్. అలాంటి వాటిని జాగ్రత్తగా ఎంపిక చేసి కొను క్కొంటూ ఉంటా. ఈ మధ్యకాలంలో నేను రెండు డాలీలు (సుప్రసిద్ధ చిత్రకారుడు డాలీ వేసిన పెయింటింగ్స్)ను కొన్నాను. చిన్నతనం నుంచి నేను ఆదరించే చిత్రకారుడి పెయింటింగ్స్ సొంతం చేసుకోవటం నాకొక కల. అది నిజమైంది.

ఈ మధ్యకాలంలో వచ్చిన మార్పులేమిటి?

హైదరాబాద్ ప్రజల అభిరుచులలో కూడా అనేక మార్పులు వస్తున్నాయి. ఒకప్పుడు తంజావూర్ పెయింటింగ్స్‌ను ఎక్కువగా ఆదరించేవారు. గోడల మీద దేవుడి పటాలను పెట్టుకోవటానికి ఎక్కువ ఆసక్తి చూపించేవారు. ఇక్కడ ఒక విషయం చెప్పాలి. ఒకప్పుడు పెయింటింగ్స్‌ను కేవలం ఉన్నత వర్గాల వారు మాత్రమే ఆదరించేవారు. అయితే ఈ మధ్యకాలంలో యువతీయువకులు తమ ఇళ్లలో రకరకాల పెయింటింగ్స్, చిన్న చిన్న శిల్పాలు వంటివి పెట్టుకోవటానికి ఇష్టపడుతున్నారు. ఒకప్పుడు ఖాళీ గోడపై ఏం పెట్టుకోవాలనే విషయాన్ని ఎవరు పెద్దగా ఆలోచించే వారు కారు. కాని ఇప్పుడు ఇంటీరియర్ డిజైనర్స్‌తో కూర్చుని ఆలోచిస్తున్నారు. ఒకప్పుడు పెయింటింగ్స్ గోడకు పెట్టుకొనే ఆభరణాలు. కానీ ఇప్పుడు అవి తప్పనిసరైన అలంకరణలు. జాగ్రత్తగా గమనిస్తే ఈ మధ్యకాలంలో జరిగే ఆర్ట్ ఎగ్జిబిషన్లకు ఇంటీరియర్ డిజైనర్స్ అనేక మంది వస్తున్నారు.

ఈ ఒరవడికి ప్రధాన కారణాలేమిటి?

ప్రజల అభిరుచులు మారుతున్నాయి. అంతే కాదు. ఒకప్పుడు పెయింటింగ్స్, ఫర్నిచర్ వంటివి హోదాకు చిహ్నాలు. వాటికి వాణిజ్యపరమైన విలువ ఏమి ఉండేది కాదు. కానీ ఇప్పుడు పెయింటింగ్స్‌ను భవిష్యత్తుకు పెట్టుబడిలా చూస్తున్నారు. వాటిని తనఖా పెట్టుకొని బ్యాంకులు అప్పులు కూడా ఇస్తున్నాయి. అంటే భూములకు, భవంతులకు ఎంత విలువ ఉందో.. పెయింటింగ్‌లకు కూడా అంతే విలువ ఉంది. ఈ మధ్యకాలంలో షేర్స్‌లో.. స్టాక్స్‌లో పెట్టుబడులు పెట్టినట్లే.. పెయింటింగ్స్‌లో కూడా పెట్టుబడులు పెడుతున్నారు. వారి పెట్టుబడులపై వచ్చే రిటర్న్ కూడా బావుంటున్నాయి. ఇక్కడ మనం కోవిడ్ వల్ల మన సమాజంలో వచ్చిన మార్పులను కూడా గమనించాలి. కోవిడ్ సమయంలో ఎక్కువ మంది ఇళ్లలోనే ఉండిపోయారు. వారికి.. ఇంటికి మధ్య అనుబంధం బాగా బలపడింది. ఒకప్పుడు ఎక్కువ బయటతిరిగే వారు కూడా కోవిడ్ తర్వాత ఇంట్లో ఎక్కువ సమయం గపడటానికి ఇష్టపడుతున్నారు. తమ ఇంటిని వినూత్నంగా తీర్చిదిద్దాలనుకుంటున్నారు. అలాంటి వారు కూడా పెయింటింగ్స్ పట్ల ఆకర్షితులవుతున్నారు.

ఒకప్పుడు రాజకుటుంబాలు గొప్పగా బతికేవి. వారి వద్ద నుంచి పెయింటింగ్స్, ఫర్నిచర్‌లను జాగ్రత్తగా ఉంచుకోవటానికి వారికి తగినంత ఆర్థిక వనరులు ఉండేవి. కానీ వారికి ఆర్థిక వనరులు తగ్గిపోయాయి. వ్యయం పెరిగిపోయింది. దీనితో వారు తమ వద్ద ఉన్న వారసత్వ సంపదను సరిగ్గా కాపాడలేకపోతున్నారు. అలాంటి వారసత్వ సంపదను కాపాడి ముందు తరాలకు అందించాల్సిన బాధ్యత మనపై ఉంది. కానీ దానికి వనరులు అవసరం.

ఇతర నగరాలతో పోలిస్తే హైదరాబాద్ ఆర్ట్ మార్కెట్ ఎలా ఉంది?

మన దేశంలో ముంబాయి ఎప్పుడు అగ్రస్థానంలో ఉంటుంది. ఎందుకంటే ప్రొగ్రెసివ్ మూమెంట్ అక్కడి నుంచే ప్రారంభమయింది. జెజె స్కూల్ అక్కడే ఉంది. దీని వల్ల అక్కడ అనేక మంది చిత్రకారులు నైపుణ్యం సాధించారు. విదేశాలకు వెళ్లారు. అక్కడ కొత్త పద్ధతులు తెలుసుకున్నారు. మళ్లీ ముంబాయికి తిరిగి వచ్చి- మన సంస్కృతికి తగ్గట్టుగా పెయింటింగ్స్ వేయటం మొదలుపెట్టారు. అంతే కాకుండా ముంబాయి మన ఆర్థిక రాజధాని. అందువల్ల అక్కడ అనేక మంది ఆర్ట్ కలెక్టర్స్ కూడా ఉన్నారు. ఇక బరోడా కూడా చిత్రకళకు ఒక ప్రధానమైన కేంద్రం. ఇక స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత ఢిల్లీలో అనేక మంది కళాకారులు తమ కళాకృతులను ప్రదర్శించటం మొదలుపెట్టారు. దీని వల్ల ఢిల్లీకి కూడా ఒక ముఖ్యమైన కేంద్రంగా ఏర్పడింది. ఇక కోల్‌కత్తా, బెంగుళూరులలో కూడా మంచి పెయింటింగ్స్‌కు ఆదరణ లభిస్తోంది.

• సీవీఎల్ఎన్ ప్రసాద్

ఈ వనిత సర్పమిత్ర!



ఏ జీవి మనిషికి శత్రువు కాదు. వాటి మానాన వాటిని బతకనిస్తే మనకు ఎలాంటి హానీ ఉండదు... ఇది మహారాష్ట్రకు చెందిన 50 ఏళ్ల వనితా బొరాడే నిత్యం చేసే ప్రచారం. 60 వేలకు పైగా సర్పాలను కాపాడిన ఆమె 'స్నేక్ ఉమెన్'గా ఖ్యాతి పొందారు. 'నారీ శక్తి' పురస్కారం, తన పేరిట పోస్టల్ స్టాంప్, గిన్నిస్ బుక్‌లో చోటు.. ఇలా ఎన్నో సాధించారు. వీటన్నిటికన్నా ఇటీవల జరిగిన ఒక సత్కారాన్ని జీవితంలో మరచిపోలేనంటున్నారు వనిత. ఆ సంగతులు ఆమె మాటల్లోనే...

"నేను పుట్టింది, పెరిగింది మహారాష్ట్రలోని నయ్‌గ్రామ్ దేశ్‌ముఖ్ అనే గ్రామంలో. దానికి సమీపంలోనే ఘట్‌బోరీ అరణ్యం ఉంది. మా నాన్న వ్యవసాయం చేసేవారు. అడవిలోంచి పాములు పొలాల్లోకి తరచుగా వచ్చేవి. వాటిని నాన్న ఒడుపుగా పట్టుకొనే వారు. మళ్ళీ అడవిలో విడిచిపెట్టేవారు. వాటికి హాని చేయకూడదని, బంధించకుండా స్వేచ్ఛగా వదిలెయ్యాలని ఆయన చెప్పేవారు. గ్రామంలోని చెరువుల్లో, దగ్గరగా ఉన్న నదిలో నీటి పాములు కనిపించడం సర్వసాధారణం. వాటికి విషం ఉండదు. కాబట్టి నాన్న పర్యవేక్షణలో మొదట వాటిని పట్టుకొనేదాన్ని. తరువాత విష సర్పాలను పట్టుకోవడం, అడవిలో వదిలెయ్యడం మామూలైపోయింది.

పన్నెండేళ్ళ నుంచే...

హైస్కూల్లో చదువుతూ ఉండగా, పదిహేనేళ్ళకే నాకు పెళ్ళయింది. 'పాములు పడతానంటే నా భర్త అంగీకరిస్తారా?' అని అనుమానపడ్డాను. కానీ ఆయన ఒప్పుకున్నారు. అంతేకాదు, సర్పాల గురించి వివరించే పుస్తకాలు కూడా తెప్పించి, నాతో చదివించారు. తద్వారా నాకు ఎన్నో విషయాలు తెలిశాయి. మా ఊరు, చుట్టుపక్కల గ్రామాలతోపాటు దూర ప్రాంతాల నుంచి కూడా పాముల్ని పట్టాల్సిందిగా నన్ను పిలిచేవారు. నేను పన్నెండేళ్ళ వయసులో పాముల్ని పట్టడం మొదలుపెట్టాను. ఇప్పటివరకూ 60 వేలకు పైగా పాముల్ని కాపాడాను. 'ఇండియాస్ ఫస్ట్ ఉమెన్ స్నేక్ ఫ్రెండ్'గా గుర్తింపు పొందాను. 2020లో 'నారీ శక్తి' పురస్కారాన్ని అప్పటి రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ చేతుల మీదుగా స్వీకరించాను. 2022లో నా పేరిట పోస్టల్ శాఖ స్టాంప్ విడుదల చేసింది. 'గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్'లో నా పేరు చోటు చేసుకుంది. ఈ ఏడాది స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఢిల్లీలోని రాష్ట్రపతి భవన్‌లో నిర్వహించిన వేడుకలకు ప్రత్యేక ఆహ్వానం అందుకున్నాను. దాన్ని గొప్ప గౌరవంగా భావించాను. రెండు వారాల్లోనే అంతకన్నా సంతృప్తిని, సంతోషాన్ని కలిగించే మరో సంఘటన జరిగింది.



కన్నీరు దాచుకోలేకపోయాను...

కిందటి నెల (ఆగస్టు) మూడోవారంలో... ఢిల్లీ నుంచి మేము నివసిస్తున్న బుల్ఢానా పట్టణానికి తిరిగి వచ్చాను మళ్ళీ రోజువారీ పనుల్లో నిమగ్నమైన సమయంలో... నాకు చిన్నప్పుడు చదువు చెప్పిన మధుకర్ బెలోకర్ మాస్టారు నుంచి ఫోన్‌కాల్ వచ్చింది. ఇప్పుడు తను వాడీ గ్రామంలో స్థిరపడ్డానని చెబుతూ... తన ఇంటికి రావాల్సిందిగా ఆహ్వానించారు. నా సహాధ్యాయులు మరికొందరిని కూడా ఆయన ఆహ్వానించారని తెలిసింది. నా జీవితంలో మరపురాని గురువుల్లో మధుకర్ మాస్టారిది మొదటి స్థానం. చదువుపట్ల ఆసక్తిని పెంచి, నైతిక విలువలను, సామాజిక బాధ్యతను విద్యార్థుల్లో ఆయన పెంపొందించారు. కొన్నేళ్ళ కిందట పదవీవిరమణ చేసిన ఆయనను కచ్చితంగా కలవాలనుకున్నాను. అనుకున్న ప్రకారం మా మాస్టారి ఇంటికి వెళ్ళాను. ఆయనతో పాటు అప్పట్లో మాకు పాఠాలు చెప్పిన ఇతర టీచర్లు, నా క్లాస్‌మేట్స్.. ఇలా అందరూ ఉన్నారు. అక్కడికి వెళ్ళిన తరువాత తెలిసింది... అది నన్ను అభినందించడానికి, సత్కరించడానికి ఏర్పాటు చేసిన కార్యక్రమం అని. ఉపాధ్యాయులను విద్యార్థులు సత్కరించడం ఆనవాయితీ, ధర్మం. కానీ గురువుల చేతుల మీదుగా సన్మానం అందుకోవడం, వారి నుంచి ప్రశంసలు, ఆశీస్సులు పొందడం అంటే నేను ఎంతో పుణ్యం చేసుకొని ఉండాలి. నా ఉద్వేగాన్ని, కన్నీటిని దాచుకోలేకపోయాను. ఆ రోజును నా జీవితాంతం మరచిపోలేను.

అది అందరం గుర్తించాలి

పాము ఎక్కడ కనబడినా భయపడి పారిపోవడం, దాన్ని వెతికి పట్టుకొని చంపేయడం అన్ని ప్రాంతాల్లో సర్వసాధారణం. పాముల విషయంలో ప్రజలకు తగిన అవగాహన లేకపోవడమే కారణం. పాములంటే భయపడడాన్ని 'ఓఫిడియోఫోబియా' అంటారు. కానీ మన దేశంలోని సర్పాల్లో కేవలం పది శాతం మాత్రమే విషపూరితమైనవి. మిగిలిన వాటివల్ల అలాంటి హాని జరగదు. ఒకవేళ విష సర్పాలు కాటేసినా... ప్రాణాలు కాపాడడం కోసం యాంటీవీనమ్ ఇంజక్షన్లు ఉంటాయి. ఈ అంశాలు నేను ప్రచారం చేస్తున్నాను. అలాగే పాము కరిచినప్పుడు ఏ చికిత్స చేయాలో గ్రామీణులకు, ముఖ్యంగా మహిళలకు శిక్షణ ఇస్తున్నాను. పాఠశాలల్లో కార్యక్రమాలు నిర్వహిస్తున్నాను. దీనికోసం 'సోయ్‌రే వనచరి మల్టీపర్పస్ ఫౌండేషన్' పేరిట ఒక సంస్థ ఏర్పాటు చేశాను. ప్రపంచ ఆరోగ్య సంస్థ నుంచి నా కృషికి గుర్తింపు లభించింది. మన భారతీయ సంస్కృతి గ్రామీణ జీవనంతో, అడవులతో ముడివేసుకొని ఉంది. ప్రతి ప్రాణిని పవిత్రంగా భావించే సంస్కృతి మనది. కానీ మానవులు భయంతోనో, స్వార్థంతోనో పక్షులకు, జంతువులకు, ప్రకృతికి హాని కలిగిస్తూనే ఉన్నారు. ఇది కొనసాగితే పర్యావరణ సమతుల్యత దెబ్బతింటుంది. మనం అందరం గుర్తించాల్సిన సత్యం ఇది."

రంగు రంగుల పాస్‌పోర్ట్‌లకు అర్థం..?

విదేశాల్లో... పర్యటించాలన్నా, చదువుకోవాలన్నా, ఉద్యోగ వ్యాపారాలు చేసుకోవాలన్నా పాస్‌పోర్టు ఉండాల్సిందే. ఏ దేశంలోనైనా అధికారిక గుర్తింపు కార్డుగా పాస్‌పోర్టును పరిగణిస్తారు. అలాంటి పాస్‌పోర్టుకు ఒక్కో దేశం ఒక్కో రంగును నిర్దేశించుకున్నాయి. యూరోపియన్ దేశాల్లో ఎరుపు, ఇస్లామిక్ దేశాల్లో ఆకుపచ్చ, ఆఫ్రికన్ దేశాల్లో నలుపు రంగు పాస్‌పోర్టులు కనిపిస్తుంటాయి. మనదేశంలో మాత్రం మూడు రంగుల పాస్‌పోర్టులు అందుబాటులో ఉన్నాయి. వాటి గురించి తెలుసుకుందాం...

ముదురు నీలం రంగు పాస్‌పోర్టు



- విద్య, ఉద్యోగం, పర్యాటకం, వ్యాపారం తదితరాల నిమిత్తం విదేశాలకు వెళ్లేవారికి ముదురు నీలం రంగు పాస్‌పోర్టును ఇస్తారు. భారతదేశంలో పుట్టినవారికి, ఇక్కడి పౌరసత్వం ఉన్నవారికి అత్యధిక సంఖ్యలో జారీ చేసే సాధారణ పాస్‌పోర్టు ఇది. ఆధార్ కార్డ్, పాన్ కార్డ్, చిరునామా, పుట్టిన తేదీ తదితరాలను పరిశీలించి పోలీస్ వెరిఫికేషన్ తరవాత అర్హులైనవారికి మాత్రమే అందజేస్తారు. దీన్ని డిజిటల్ రూపంలో కూడా అందుబాటులో ఉంచుతున్నారు.

తెలుపు రంగు పాస్‌పోర్టు



- తెలుపు.. అధికారాన్ని బాధ్యతను సూచిస్తుంది. కాబట్టి తెలుపు రంగు పాస్‌పోర్టును ప్రభుత్వ ప్రతినిధులు, అధికారులు, ఉద్యోగులు, సైనిక బలగాలకు ప్రత్యేకించారు. కేవలం అధికారిక యాత్రలకు మాత్రమే దీన్ని నిర్ధేశించారు. వ్యక్తిగత ప్రయాణాలకు ఇది చెల్లుబాటు కాదు.

మెరూన్ రంగు పోస్‌పోర్టు



- మెరూన్ రంగు పాస్‌పోర్టును.. విదేశాలతో దౌత్య సంబంధాలు నిర్వహించే అధికారులకు, గ్రూప్ ఎ ఫారెన్ సర్వీసెస్ అధికారులకు, విదేశాంగ శాఖలోని గ్రూప్ బి అధికారులకు, వారి కుటుంబ సభ్యులకు మంజూరు చేస్తారు. విదేశాల్లో పని చేసే భారతీయ అధికారులకు, దౌత్య సంబంధాల్లో భాగంగా విదేశాల్లో నివసించేవారికి కూడా దీన్నే ఇస్తారు.

నారింజ రంగు పాస్‌పోర్టు



- పదోతరగతికి మించి చదవని వారికి నారింజ రంగు పాస్‌పోర్టును ఇచ్చేవారు. పాస్‌పోర్టు రంగును చూడగానే సంబంధిత వ్యక్తులు వివక్షతను ఎదుర్కొంటున్నారనే విమర్శలు రావడంతో ప్రస్తుతం దీన్ని జారీచేయడం లేదు.

కౌన్సెలింగ్

నాకు ప్రొటీన్ ఎలా లభిస్తుంది?

నేను ఈ మధ్యకాలంలో జిమ్‌కు వెళ్లటం మొదలుపెట్టాను. నేను చిన్నప్పటి నుంచి శాఖాహారిని. జిమ్ ట్రైనర్ - "మీకు ప్రొటీన్ సరిపోవటం లేదు.. ప్రొటీన్ పౌడర్ తాగండి" అని సలహా ఇస్తున్నాడు. ప్రొటీన్ పౌడర్ తాగటం నాకు ఇష్టం లేదు. వీటి వల్ల అనేక అనర్థాలు కలుగుతాయని చదివాను. పౌడర్ కాకుండా ఎలాంటి ఆహార పదార్థాలను తీసుకుంటే నాకు తగినంత ప్రొటీన్ లభిస్తుంది?

- చందన, వరంగల్

ప్రొటీన్ కేవలం మాంసాహారంలో ఉంటుందని.. శాఖాహారులకు ప్రొటీన్ తక్కువ ఉంటుందనుకోవటం ఒక అపోహ మాత్రమే. అయితే ల్యాబ్‌లో పరీక్షలు చేయించుకుంటే తగినంత ప్రొటీన్ ఉందా? లేదా అనే విషయం తెలుస్తుంది. ఇక మార్కెట్‌లో లభ్యమవుతున్న రకరకాల ప్రొటీన్ పౌడర్లు అంత మంచివి కావు. డాక్టర్ చెబితేనే వీటిని తీసుకోవాలి. మీ అంతట మీరు ప్రకటనలు చూసి కొనుగోలు చేయటం మంచిది కాదు. ఇక అనేక శాఖాహార ఆహార పదార్థాలలో ప్రొటీన్ లభ్యమవుతుంది. వీటిని క్రమం తప్పకుండా తింటే శరీరానికి తగినంత ప్రొటీన్ లభిస్తుంది. ఇవి ఏ పరిమాణాలలో తినాలనేది శరీర బరువుపైన.. ప్రతి రోజు చేసే పనిపైన ఆధారపడి ఉంటుంది. మీకు సమీపంలో ఉన్న న్యూట్రిషనిస్ట్‌ను అడిగి ఈ పదార్థాలు ఎంత తినాలో నిర్ణయించుకోండి. ఆ పదార్థాలేమిటో చూద్దాం..



గ్రీక్ యోగర్ట్: ఇది చిక్కటి పెరుగు. కానీ ప్రత్యేకంగా తయారు చేస్తారు. ఒక కప్పు గ్రీక్ యోగర్ట్‌లో 23 గ్రాముల ప్రొటీన్ ఉంటుంది. ఉదయం బ్రేక్‌ఫాస్ట్‌లో లేదా మధ్యాహ్నం లంచ్‌లో దీనిని తింటే మంచిది. కొందరికి భోజనంలో పెరుగు తినటం ఇష్టం ఉండదు. అలాంటి వారు దీనిని విడిగా తింటే ప్రొటీన్ లభిస్తుంది. ఇది అన్ని సూపర్ బజార్లలో లభిస్తుంది.



చీజ్: ప్రొటీన్ విషయంలో మాంసాహారులకు మాంసం ఎలాగో శాఖహారులకు చీజ్ అలాగ! చీజ్‌ను ముక్కలు చేసుకొని తినటం ఇష్టం లేని వారు కూర చేసుకొని తినవచ్చు.



తోఫు: ఈ మధ్యకాలంలో ఇది కూడా బాగా ప్రాచుర్యంలోకి వచ్చింది. ప్రతి 100 గ్రాముల తోఫులో 8 గ్రాముల ప్రొటీన్ లభిస్తుంది. దీనిని రకరకాల కూరల్లో చేసుకొని తినవచ్చు.



శనగలు: ప్రతి 100 గ్రాముల శనగలలో 9 గ్రాముల ప్రొటీన్ ఉంటుంది. అందువల్ల ప్రతి రోజు క్రమం తప్పకుండా శనగలు తింటే ప్రొటీన్ విలువలు పెరుగుతాయి.



క్వినోవా: ఈ మధ్యకాలంలో కొందరు వరి అన్నం బదులుగా క్వినోవా తింటున్నారు. దీనిలో ఫైబర్, మినరల్స్‌తో పాటుగా ప్రొటీన్ కూడా ఉంటుంది.

- మానస
న్యూట్రిషనిస్ట్, హైదరాబాద్



సీఎం రేవంత్ రెడ్డితో ఎమ్మెల్సీ పింగిలి శ్రీపాల్ రెడ్డి

తప్పనిసరి 'టెట్' ఆదేశాలపై జోక్యం చేసుకోవాలి

- ప్రధాని, విద్యాశాఖ మంత్రికి ఎస్టీఎఫ్ఐ వినతిపత్రాలు
- రివ్యూ పిటిషన్ వేయాలని ఎమ్మెల్సీ శ్రీపాల్‌రెడ్డి వినతి

హైదరాబాద్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులు రెండేళ్లలో తప్పనిసరిగా ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్)లో ఉత్తీర్ణులు కావాలని లేదా ఉద్యోగం నుంచి రిటైర్ కావాలంటూ ఇచ్చిన తీర్పుపై సుప్రీంకోర్టు సమీక్షించేలా రివ్యూ పిటిషన్ వేయాలని స్కూల్ టీచర్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఎస్టీఎఫ్ఐ) కేంద్ర ప్రభుత్వాన్ని కోరింది. ఈ నెల 1న ఇచ్చిన తీర్పు 23.08.2010కి ముందు దేశవ్యాప్తంగా నియామకమైన 25లక్షల మంది టీచర్లపై ప్రభావం చూపుతుందని ఎస్టీఎఫ్ఐ అధ్యక్షుడు సీఎన్ భారతి, ప్రధాన కార్యదర్శి చావ రవి, కోశాధికారి అబ్దుల్లా షఫీ తెలిపారు. వారు బుధవారం న్యూఢిల్లీలో సౌత్ బ్లాకులో ప్రధానమంత్రి కార్యాలయంలో, శాస్త్రీ భవన్‌లోని విద్యా శాఖ మంత్రి, విద్యాశాఖ కార్యదర్శి కార్యాలయాల్లో వినతిపత్రాలు సమర్పించారు. అలాగే, నేషనల్ కౌన్సిల్ ఫర్ టీచర్ ఎడ్యుకేషన్ (ఎన్సీటీఈ) కార్యాలయంలో చైర్మన్ పంకజ్ అరోరా, కార్యదర్శి అభిలాష మిశ్రాలను కలిసి టెట్ సిలబస్‌ను మార్చాలని, ఉత్తీర్ణత మార్కులను 60% నుంచి 50%కి సవరించాలని వినతి పత్రాలు ఇచ్చారు. అనంతరం సుప్రీంకోర్టును సందర్శించి సీనియర్ న్యాయవాదులతో సంప్రదింపులు జరిపి ఎస్టీఎఫ్ఐ ఆధ్వర్యంలో ఈ నెలాఖరులోగా రివ్యూ పిటిషన్ వేయటానికి ఏర్పాట్లు చేశామని ఓ ప్రకటనలో వారు తెలిపారు. టెట్‌పై సుప్రీం కోర్టు తీర్పుతో రాష్ట్రంలోనూ అనేక మంది ఉపాధ్యాయులు ఉద్యోగాలు కోల్పోయే పరిస్థితి ఉందని ఎమ్మెల్సీ శ్రీపాల్‌రెడ్డి సీఎం దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై రాష్ట్ర ప్రభుత్వం సుప్రీం కోర్టులో రివ్యూ పిటిషన్ వేయాలని విజ్ఞప్తి చేశారు. సీఎంను కలిసినవారిలో పీఆర్టీయూ రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు పుల్గం దామోదర్ రెడ్డి, సుంకరి భిక్షం గౌడ్ ఉన్నారు.

19న పీవీ విశ్వవిద్యాలయం ఐదో స్నాతకోత్సవం

- అక్టోబరు 7న హెచ్‌సీయూ 25వ స్నాతకోత్సవం

రాజేంద్రనగర్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): పీవీ నర్సింహరావు తెలంగాణ పశువైద్య విశ్వవిద్యాలయం ఐదో స్నాతకోత్సవాన్ని ఈనెల 19న నిర్వహించనున్నట్లు వర్సిటీ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ ఎం.జ్ఞానప్రకాశ్ తెలిపారు. బుధవారం వర్సిటీ పరిపాలన భవనంలో ఆయన మాట్లాడుతూ, రాజేంద్రనగర్‌లోని వ్యవసాయ వర్సిటీ ఆడిటోరియంలో జరిగే ఈ స్నాతకోత్సవంలో 2023 జనవరి 1 నుంచి 2024 డిసెంబరు 31 వరకు కోర్సులు పూర్తి చేసిన 524 మంది విద్యార్థులకు డిగ్రీ పట్టాలు ప్రదానం చేయనున్నట్లు పేర్కొన్నారు. వీరితో పాటు వివిధ కోర్సులలో ప్రతిభావంతులైన 25 మందికి బంగారు పతకాలు అందజేస్తామని ఎం.జ్ఞానప్రకాశ్ తెలిపారు. అలాగే, హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం (హెచ్‌సీయూ) 25వ స్నాతకోత్సవాన్ని అక్టోబరు 7న నిర్వహించనున్నారు. హైదరాబాద్- గచ్చిబౌలిలోని బ్రహ్మ కుమారీస్ గ్లోబల్ పీస్ ఆడిటోరియంలో జరగనున్న కార్యక్రమంలో వర్సిటీలో విద్యాభ్యాసం పూర్తి చేసిన 1,700 మంది విద్యార్థులకు యూజీ, పీజీ, పీహెచ్‌డీ డిగ్రీలను, బంగారు పతకాలను ముఖ్యఅతిథుల చేతుల మీదుగా ప్రదానం చేయనున్నట్లు వర్సిటీ ఉన్నతాధికారులు తెలిపారు. స్నాతకోత్సవంలో వ్యక్తిగతంగా డిగ్రీలు అందుకోవాలనుకునే విద్యార్థులు 22లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని అధికారులు తెలిపారు.

బాత్రూంలో 17 లక్షలు!

(మొదటిపేజీ తరువాయి)

విలువ వంద కోట్ల రూపాయలు ఉంటుందని భావిస్తుండగా.. ఏసీబీ విచారణలో అతనికి స్నేహితుడైన రాజేష్‌బాబు బినామీ అని కూడా తెలిసింది. హైదరాబాద్‌కు చేరువగా ఉన్న చేవెళ్ల ప్రాంతం దిన దినాభివృద్ధి చెందుతున్న తరుణంలో కొత్త ఇళ్లు, లేఅవుట్‌లు, ఫామ్‌హౌస్‌లకు విద్యుత్ కనెక్షన్లకు అనుమతులు ఇచ్చేందుకు విద్యుత్ అధికారులు, కాంట్రాక్టర్లు కుమ్మక్కై పెద్దమొత్తంలో డబ్బులు వసూలు చేస్తున్నారన్న ఆరోపణలున్నాయి. మొయినాబాద్‌లో ఏఈగా పనిచేసిన సమయంలో కొత్త ఫామ్‌హౌస్‌లకు విద్యుత్ కనెక్షన్లు ఇచ్చేందుకు రాజేష్‌బాబు భారీగా వసూళ్లకు పాల్పడినట్లు తెలిసింది. ఇదిలా ఉండగా.. ఏడీఈ అంబేడ్కర్‌ను ఏసీబీ అధికారులు బుధవారం కోర్టులో హాజరుపరచగా 14 రోజుల జ్యుడీషియల్ రిమాండ్ విధించారు. అతడిని చంచల్‌గూడ జైలుకు తరలించారు. ఈ కేసులో విచారణ కొనసాగుతోందని, అంబేడ్కర్‌కు చెందిన కొన్ని లాకర్లను తెరవాల్సి ఉందని అధికారులు పేర్కొన్నారు. అతని అక్రమాస్తుల విలువ వంద కోట్లు ఉంటుందని అంచనా వేస్తున్నారు. మంగళవారం మణికొండలోని అంబేడ్కర్ ఇల్లు, బంధువులు ఇళ్లలో ఏసీబీ అధికారులు సోదాలు నిర్వహించిన సంగతి తెలిసిందే. అంబేడ్కర్ బినామీ అయిన సతీష్ ఇంట్లో రూ.2.18కోట్లు స్వాధీనం చేసుకోవడం సైతం ఏసీబీ చరిత్రలో అరుదైన ఘటనగా పేర్కొంటున్నారు.

ఏసీబీకి చిక్కిన తహసీల్దార్

- ఆర్ఐ, కంప్యూటర్ ఆపరేటర్ కూడా..
- రైతు నుంచి రూ.10 వేలు లంచం తీసుకుంటూ పట్టుబడిన వైనం



ఏసీబీకి పట్టుబడిన తల్లాడ తహసీల్దార్, ఆర్ఐ, కంప్యూటర్ ఆపరేటర్

తల్లాడ, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం జిల్లా తల్లాడ తహసీల్దార్ వంకాయల సురేష్‌కుమార్‌తోపాటు రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ మాలోతు భాస్కర్, భూభారతి కంప్యూటర్ ఆపరేటర్ శివాజీ రాథోడ్ ఏసీబీకి పట్టుబడ్డారు. తల్లాడ మండలం మల్లవరం గ్రామానికి చెందిన ఓ రైతు మరో రైతు వద్ద కొనుగోలు చేసిన 15 కుంటల భూమిని భూభారతి ద్వారా తనకు రిజిస్ట్రేషన్ చేయాలని రెవెన్యూ అధికారులను సంప్రదించగా.. వారు రూ.10 వేలు లంచం డిమాండ్ చేశారు. దాంతో సదరు రైతు ఏసీబీని ఆశ్రయించాడు. ఏసీబీ అధికారులు బుధవారం సాయంత్రం సదరు రైతు నుంచి లంచం తీసుకుంటున్న అధికారులను పట్టుకున్నారు. తహసీల్దార్, ఆర్ఐ, కంప్యూటర్ ఆపరేటర్లను అరెస్టు చేశామని, గురువారం కోర్టులో హాజరుపరుస్తామని ఏసీబీ డీఎస్పీ వై.రమేష్ తెలిపారు.

గ్రూప్-1 తీర్పు తప్పులతడక

(మొదటిపేజీ తరువాయి)



తీసుకోవడంలో సింగిల్ జడ్జి పూర్తిగా విఫలమయ్యారని.. అటు చట్టం కోణంలో చూసినా.. ఇటు సుప్రీంకోర్టు తీర్పుల కోణంలో చూసినా సింగిల్ జడ్జి ఇచ్చిన తీర్పు తప్పులతడక అని టీజీపీఎస్సీ తన అప్పీల్‌లో పేర్కొంది. "మునిసిపల్ కమిటీ, హోషియార్‌పూర్ వర్సెస్ పంజాబ్ ఎస్ఈబీ" కేసులో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు ప్రకారం.. సింగిల్ జడ్జి ఇచ్చిన తీర్పును 'పర్వర్స్ (విపరీతమైన) తీర్పుగా అభివర్ణించింది. "సింగిల్ జడ్జి ఇచ్చిన తుది ఆదేశాలే పరస్పర విరుద్ధంగా ఉన్నాయి. ఒక పక్క సమాధాన పత్రాలను ఎనిమిది నెలల్లో పునర్‌మూల్యాంకనం చేయాలని పేర్కొంటూనే మరో పక్క పునర్‌మూల్యాంకనం చేయకపోతే మెయిన్స్ పరీక్షను రద్దు చేస్తామని.. మళ్లీ పరీక్ష నిర్వహించాలని పేర్కొన్నారు. ఈ కారణంతో సింగిల్ జడ్జి ఇచ్చిన ఆదేశాలను కొట్టేయవచ్చు. పునర్ మూల్యాంకనం చేయడం అనేది టీజీపీఎస్సీ రూల్స్‌లో ఎక్కడా లేదు. ఎట్టిపరిస్థితుల్లో పునర్ మూల్యాంకనం ఉండదని రూల్స్‌లో చాలా స్పష్టంగా ఉంది. పూర్తిగా ఊహలు, అంచనాల ఆధారంగా సింగిల్ జడ్జి తీర్పు ఇచ్చారు. అందులో జడ్జి వ్యక్తంచేసిన అభిప్రాయాలకు ఎలాంటి ఆధారాలూ లేవు. మెయిన్స్ పరీక్షకు హాజరైన వారి సంఖ్యలో ఎలాంటి తేడాలూ లేవు. పూర్తిగా బయోమెట్రిక్ ఆధారంగా మొత్తం అభ్యర్థుల హాజరు వివరాలను ప్రకటించాం. 'బొమ్మ పూజితారెడ్డి' అనే అభ్యర్థికి సంబంధించిన మార్కుల జాబితాను ఫోర్జరీ చేసి సమర్పించిన రిట్ పిటిషన్ కూడా సింగిల్ జడ్జి విచారణకు స్వీకరించడం సమంజసం కాదు. ఇలాంటి మరో పిటిషన్‌ను మరో సింగిల్ జడ్జి జరిమానా విధించి మరీ కొట్టేయడంతోపాటు ప్రాసిక్యూట్ చేయాలని ఆదేశాలు కూడా ఇచ్చిన విషయాన్ని సింగిల్ జడ్జి పట్టించుకోలేదు. పోలీసు దర్యాప్తులో సైతం.. సదరు మార్కుల జాబితాను ఫోర్జరీ చేసినట్లు తేలింది. అలాంటి తప్పుడు డాక్యుమెంట్ల ఆధారంగా దాఖలైన పిటిషన్‌పై తీర్పు ఇవ్వడం సరి కాదు. రెండు వేర్వేరు హాల్‌టికెట్‌లపై సింగిల్ జడ్జి రూలింగ్ తప్పుడు అభిప్రాయం. ప్రిలిమినరీ, మెయిన్స్ పరీక్షలకు ఒకటే హాల్‌టికెట్ ఉంటుందని కమిషన్ ఎక్కడా చెప్పలేదు. తొలుత 45 సెంటర్లు అనుకున్నప్పటికీ దివ్యాంగ అభ్యర్థుల కోసం ఒక సెంటర్ పెంచాల్సి వచ్చింది. కోఠి మహిళా కళాశాలలో పురుషులకు టాయిలెట్స్ ఇతర వసతులు లేని కారణంగానే అక్కడ మహిళలను కేటాయించాల్సి వచ్చింది. కొంతమంది అభ్యర్థులను కొన్ని సెంటర్లకు ఎంపిక చేసి కేటాయించారన్న ఆరోపణల్లో ఎలాంటి వాస్తవం, ఆధారాలు లేవు. ర్యాండమైజేషన్ ప్రక్రియలో ఉన్న ఒక ఫీచర్ ఆధారంగానే కొన్ని సెంటర్లకు మహిళలు, కొన్ని సెంటర్లకు పురుషులను ప్రత్యేకంగా కేటాయించాం. కోఠి మహిళా కళాశాలలో ఎక్కువ మంది మహిళా అభ్యర్థులు అర్హత సాధించారనే ఆరోపణలకు ఎలాంటి ఆధారాలూ లేవు. అక్కడ అభ్యర్థులందరూ మహిళలే కాబట్టి ఎక్కువ మంది మహిళలు అర్హత సాధించారు. పబ్లిక్ సర్వీస్ కమిషన్ లాంటి సంస్థకు 'ఏ పద్ధతి పాటించాలి' అని చెప్పడం సరికాదని సుప్రీంకోర్టు స్వయంగా పేర్కొంది. అలాంటప్పుడు మోడరేషన్ పద్ధతి పాటించాలని ఆదేశించడం సమంజసం కాదు. సింగిల్ జడ్జి తన పరిధి మీరి మైక్రోస్కోపిక్ ఎంక్వైరీ చేయడం అనుమతించదగిన విషయం కాదు. పలు అంశాల ఆధారంగా నిపుణులు చేయాల్సిన నిర్ణయాలను సింగిల్ జడ్జి చేయడం సరి కాదు. భారీఎత్తున అభ్యర్థులు హాజరైన పరీక్షలో కొంతమంది అభ్యర్థులకు ఒకేరకమైన మార్కులు రావడం సహజం. ఇలాంటి విషయాలను సైతం సింగిల్ జడ్జి తప్పుబట్టడం సరికాదు. కమిషన్ ఉద్యోగులే ఎవాల్యుయేటర్ల జాబితాను బయటకు ఇచ్చారని సింగిల్ జడ్జి వ్యాఖ్యానించడం సమంజసం కాదు. 'ఎంఏ మాలిక్' అనే అసోసియేట్ ప్రొఫెసర్ 'ఆర్‌సీ రెడ్డి' ఐఏఎస్ ఇన్‌స్టిట్యూట్‌లో క్లాస్‌లు చెప్పలేదు. ప్రభుత్వ కాలేజీల ప్రొఫెసర్లు పుస్తకాలు రాయడం తప్పుకాదు.. వారికి ఆ స్వేచ్ఛ ఉంటుంది. తెలుగు మాధ్యమ అభ్యర్థుల పట్ల వివక్ష జరిగిందన్న వాదనకు ఎలాంటి ఆధారాలూ లేవు. సింగిల్ జడ్జి అవగాహన కోసం రహస్యంగా సీల్డ్ కవర్‌లో ఇచ్చిన రహస్య సమాచారాన్ని మొత్తాన్ని జడ్జిమెంట్‌లో బయటపెట్టడం ద్వారా పరీక్ష వ్యవస్థను దెబ్బతీసేలా వ్యవహరించడంతోపాటు ప్రమాదంలోకి నెట్టారు. సమాధాన పత్రాల మూల్యాంకనంలో కమిషన్ సరైన పద్ధతి పాటించలేదని సింగిల్ జడ్జి చేసిన వ్యాఖ్య వికృతమైన వ్యాఖ్య. కమిషన్ చెప్పిన విషయాల కంటే.. ఉద్యోగాలు సాధించడంలో విఫలమైన అభ్యర్థుల వాదనలనే సింగిల్ జడ్జి ఎక్కువగా పరిగణనలోకి తీసుకున్నారు.' అని టీజీపీఎస్సీ తన అప్పీల్‌లో పేర్కొంది.

బర్త్ డే బంప్స్.. ప్రాణాలమీదకు తెచ్చింది!


- బడిలో వికృత క్రీడతో తొమ్మిదో క్లాసు విద్యార్థికి తీవ్రగాయాలు
- నాచారం ఢిల్లీ పబ్లిక్ స్కూల్లో ఘటన
- ఆస్పత్రికి తరలింపు.. వృషణాలకు శస్త్రచికిత్స
- 3నెలల పాటు బెడ్‌రెస్ట్ తప్పనిసరి అన్న వైద్యులు
- ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు

తార్నాక, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): బర్త్ డే బంప్స్! కేక్ కట్ చేశాక.. బర్త్ డే బాయ్/గాళ్‌కు అభినందనల పేరుతో మీద పడి ఇష్టంవచ్చినట్లు పిడిగుద్దులు కురిపించే ఓ వికృత క్రీడ! పుట్టినరోజు సెలిబ్రేషన్ పేరుతో ఈ భయానక పోకడ, తాజాగా ఓ విద్యార్థి ప్రాణాల మీదకు తెచ్చింది. తరగతి గదిలో బర్త్‌డే బంప్స్ పేరుతో తోటి విద్యార్థుల వెర్రి, మూర్ఖపు చేష్టలతో తొమ్మిదో తరగతి విద్యార్థి తీవ్రగాయాలతో ఆస్పత్రి పాలయ్యాడు. నాచారంలోని ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌లో ఈ ఘోరం వెలుగుచూసింది. ఆగస్టు 29న ఆ బాబు పుట్టినరోజు కావడంతో మధ్యాహ్న భోజన విరామ సమయంలో తోటి విద్యార్థులు బర్త్‌డే బంప్స్ నిర్వహించారు. బాధితుడి మర్మాంగాలకు తీవ్ర గాయాలయ్యాయి. వృషణాలు ఉబ్బిపోయి.. బ్లీడింగ్ అయింది. విషయం తెలుసుకున్న ప్రిన్సిపల్, బాధితుడిని వెంటనే చికిత్స నిమిత్తం దగ్గర్లోని ఆస్పత్రిలో చేర్పించారు. అనంతరం తల్లిదండ్రులకు సమాచారం అందించారు. ఆస్పత్రికి చేరుకున్న తల్లిదండ్రులు, తమ బిడ్డను మెరుగైన వైద్యం కోసం బంజారాహిల్స్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తీసుకువెళ్లారు. అకడి వైద్యులు బాధితుడికి శస్త్రచికిత్స నిర్వహించారు. 3నెలలపాటు బాలుడికి బెడ్‌రెస్ట్ తప్పనిసరి అని వైద్యులు సూచించారు. వృషణాలకు ఆపరేషన్ చేయడం వల్ల బాలుడికి ప్రాణాపాయం తప్పిందని నాచారం పోలీసులు పేర్కొన్నారు. ఘటనపై కుటుంబసభ్యుల ఫిర్యాదుతో బాధ్యులైన విద్యార్థులు, పాఠశాల యాజమాన్యంపై పోలీసులు కేసు నమోదు చేశారు.

చిత్రజ్యోతి

★ SINCE 1965 ★

ప్రధాని మోదీపై బయోపిక్



ప్రధాని నరేంద్ర మోదీ జీవిత కథ తెరకెక్కనుంది. బుధవారం ఆయన పుట్టిన రోజు సందర్భంగా 'మా వందే' అనే టైటిల్‌తో ఈ చిత్రాన్ని ప్రకటించారు మేకర్స్. 'మార్కో' ఫేమ్ ఉన్ని ముకుందన్ మోదీ పాత్రను పోషించనున్నారు. క్రాంతికుమార్ సీహెచ్ దర్శకత్వంలో ఎమ్ వీర్‌రెడ్డి నిర్మించనున్నారు. 'మోదీ జీవితంలో ని కీలక సంఘటనల ఆధారంగా రూపొందుతున్న ఈ సినిమా ఎన్నో పోరాటాల కంటే తల్లి సంకల్పం గొప్పదని నిరూపిస్తుంది. అంతర్జాతీయ ప్రమాణాలతో అత్యున్నత సాంకేతిక విలువలతో తెరకెక్కనున్న ఈ చిత్రాన్ని పాన్ ఇండియా స్థాయిలో విడుదల చేస్తాం' అని మేకర్స్ తెలిపారు. కాగా, ప్రధాని మోదీ పుట్టినరోజు సందర్భంగా ఆయనపై రూపొందించిన ఓ పాటను టీ సిరీస్ సంస్థ పలు భాషల్లో విడుదల చేసింది. తెలుగు వెర్షన్‌కు ఎమ్ఎమ్ కీరవాణి సంగీతం అందించడంతో పాటు తన టీమ్‌తో కలసి ఈ పాటను పాడడం విశేషం.


నటి సరోజాదేవి పేరిట 'అభినయ సరస్వతి' పురస్కారం



పంచభాషా నటి, ఇటీవల కన్నుమూసిన బి.సరోజాదేవి పేరిట 'అభినయ సరస్వతి' పురస్కారాన్ని ఏర్పాటు చేసినట్లు కర్ణాటక ప్రభుత్వం వెల్లడించింది. కన్నడ సినిమా రంగంలో 25 ఏళ్ళపాటు సేవలందించిన నటీమణులకు ఈ జీవన సాఫల్య పురస్కారాన్ని అందజేస్తారు. ఈ ఏడాది నుంచే పురస్కారాన్ని ఇస్తామని ప్రకటించారు. ఎంపికైన వారికి రూ.లక్ష నగదు, 100 గ్రాముల బంగారంతో తయారు చేసిన జ్ఞాపికను (షీల్డు) ఇస్తారు. బి.సరోజాదేవిని ఇటీవలే రాష్ట్ర ప్రభుత్వం 'కర్ణాటక రత్న'గా ప్రకటించింది.

బెంగళూరు (ఆంధ్రజ్యోతి)

నా కెరీర్‌లోనే బిగ్గెస్ట్ మూవీ



'మార్గన్' విజయం తర్వాత తమిళ హీరో విజయ్ ఆంటోనీ చేసిన మరో పవర్‌ఫుల్ ప్రాజెక్ట్ 'భద్రకాళి'. అరుణ్ ప్రభు దర్శకత్వంలో రామాంజనేయులు జవ్వాజి నిర్మించిన ఈ చిత్రాన్ని ఈ నెల 19న విడుదల కానుంది. ఈ నేపథ్యంలో విజయ్ ఆంటోనీ మీడియాతో మాట్లాడుతూ 'భద్రకాళి' ఓ పొలిటికల్ థ్రిల్లర్. రాజకీయాల్లో మీడియేటర్ పాత్ర ఎలా ఉంటుంది, పెద్ద పెద్ద స్కామ్స్‌లో మీడియేటర్ల భాగం ఎంత వరకూ ఉంటుంది అనే విషయాలను ఆసక్తికరంగా చూపించాం. ఇది నాకు 25వ చిత్రం. ఇంతవరకూ నేను చేసిన వాటిల్లో 'భద్రకాళి' బిగ్గెస్ట్ మూవీ. దర్శకుడు అరుణ్ ప్రభు కు నేను అభిమానిని. ఆయన చెప్పిన కథ నాకు బాగా నచ్చి అంగీకరించా' అని చెప్పారు. నిర్మాత సురేశ్‌బాబుతో తనకు మంచి అనుబంధం ఉందనీ, దాదాపు 300 థియేటర్లలో ఆయన ఈ సినిమాను విడుదల చేస్తున్నారనీ విజయ్ చెప్పారు. యాక్టింగ్, నిర్మాణం కారణంగా మ్యూజిక్‌కు ఎక్కువ సమయం కేటాయించలేకపోతనాన్ననీ, ఇకపై సంగీతం మీద కూడా దృష్టి పెడతానని విజయ్ ఆంటోనీ చెప్పారు.

షూటింగ్ పూర్తి

సిద్ధు జొన్నలగడ్డ కథానాయకుడిగా నీరజ కోన తెరకెక్కిస్తున్న చిత్రం 'తెలుసు కదా'. రాశీ ఖన్నా, శ్రీనిధి శెట్టి హీరోయిన్లు. టీజీ విశ్వప్రసాద్, కృతిప్రసాద్ సంయుక్తంగా నిర్మి



స్తున్నారు. ఇటీవలె విడుదలైన తొలి పాట 'మల్లిక గంధ', టీజర్ ఆకట్టుకున్నాయి. చిత్రం షూటింగ్ పూర్తైంది. ఈ సందర్భాన్ని సెలబ్రేట్ చేసుకున్న టీమ్, ఫొటోలను షేర్ చేసింది. అక్టోబరు 17న చిత్రం ప్రేక్షకుల ముందుకు వస్తోంది. ఈ చిత్రానికి డీఓపీ: జ్ఞానశేఖర్ నూలి, సంగీతం: థమన్.



మీకేం కావాలో చెప్పండి!

- సినీ కార్మికులతో తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి

హైదరాబాద్‌ను హాలీవుడ్ స్థాయికి తీసుకెళదామని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. తన మద్దతు సినీ కార్మికులకేనని.. వ్యక్తిగత పరిచయాలతో కార్మికుల సమస్యలను ముడిపెట్టనని స్పష్టం చేశారు. జూబ్లీహిల్స్ నివాసంలో సీఎం రేవంత్ రెడ్డితో సినీ పరిశ్రమ ఉద్యోగుల సమాఖ్య సభ్యులు బుధవారం సమావేశమయ్యారు. సినీ పరిశ్రమ సమస్యలపై చర్చించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. ప్రభుత్వం నుంచి సినిమా కార్మికులకు ఏం కావాలో చర్చించుకుని చెప్పాలని, పరిశ్రమలో కీలకమైన కార్మికులను విస్మరించవద్దని నిర్మాతలకు గతంలోనే చెప్పానన్న విషయాన్ని గుర్తు చేశారు. కళాకారులు, సాంకేతిక నిపుణుల్లో నైపుణ్యాల పెంపునకు సహకరించాలని నిర్మాతలకు సూచించారు. చిన్న సినిమా నిర్మాతలకు తోడ్పాటు ఇవ్వాలని, పరిశ్రమలో పని వాతావరణాన్ని చెడగొట్టుకోవద్దన్నారు. ఈ ప్రభుత్వం కార్మికుల పక్షపాతి అని, సమస్యలను పరిష్కరించే బాధ్యత తనదని, తాను కార్మికుల వైపే ఉంటానని చెప్పారు. సినిమా కార్మికులకు ఆరోగ్య బీమా అందించే అంశాన్ని పరిశీలిస్తున్నామన్నారు. ఈ సమావేశంలో సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి, తెలంగాణ ఎఫ్‌డీసీ చైర్మన్ దిల్‌రాజు, తెలుగు సినీ పరిశ్రమ ఉద్యోగుల సమాఖ్య అధ్యక్షుడు వల్లభనేని అనిల్ కుమార్, ప్రధాన కార్యదర్శి అమ్మిరాజు కానుమల్లి, పలు సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి)

ఆసియా కప్‌లో నేడు
శ్రీలంక X అఫ్ఘానిస్థాన్
రాత్రి 8 నుంచి సోనీ నెట్‌వర్క్‌లో..



ఫైనల్స్
సా. 3.50 నుంచి
స్టార్ నెట్‌వర్క్‌లో..

నీరజ్ X నదీమ్



ఫైనల్ చేరిన భారత్, పాక్ స్టార్లు | నేడు జావెలిన్ త్రో టైటిల్ పోరు | ప్రపంచ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్స్

టోక్యో: క్రికెట్‌లో ఇండో-పాక్ పోరు ఎంత మజానో.. అథ్లెటిక్స్‌లో భారత జావెలిన్ స్టార్ నీరజ్ చోప్రా, పాకిస్థాన్‌కు చెందిన అర్షద్ నదీమ్ మధ్య పోటీ అంతే ఆసక్తికరం. జావెలిన్ త్రోలో వీరిద్దరు తలపడుతున్నారంటే రెండు దేశాల అథ్లెటిక్స్ ప్రేమికులేకాదు..విశ్వవ్యాప్త ఫ్యాన్స్ ఉత్కంఠగా ఎదురు చూస్తారు. అలాంటి నీరజ్-నదీమ్ మరోసారి ఢీ అంటే ఢీ అన బోతున్నారు. గురువారం జరిగే ప్రపంచ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్స్ ఫైనల్లో వీరిద్దరూ అమీతుమీ తేల్చుకోనున్నారు. బుధవారం జరిగిన జావెలిన్ త్రో క్వాలిఫికేషన్స్‌లో డిఫెండింగ్ చాంప్ నీరజ్, నదీమ్ భిన్నమైన ప్రదర్శన చేశారు. గ్రూప్ 'ఎ' నుంచి తలపడిన నీరజ్.. ఫైనల్ మార్క్ 84.50 మీ. దూరాన్ని మొదటి యత్నంలోనే (84.85 మీ.తో) చేరుకున్నాడు. గ్రూపులో చోప్రా మూడో, ఓవరాల్‌గా ఆరో స్థానంలో నిలిచాడు. మరోవైపు అర్షద్ గ్రూప్ 'బి'లో ఉత్కంఠ పరిస్థితులు ఎదుర్కొన్నాడు. మొదటి రెండు యత్నాలలో (76.99మీ.), (74.17మీ.) విఫలమైన అతడు మూడో ఆఖరి త్రోలో 85.25మీ. ఈటెను విసిరాడు. కానీ గ్రూప్ 'బి'లో నాలుగో ఆటోమేటిక్ క్వాలిఫయర్‌గా ఫైనల్లో స్థానం దక్కించుకుని ఊపిరి పీల్చుకున్నాడు. 84.50 మీ. దూరాన్ని అందుకున్న వారు లేదా అత్యుత్తమ ప్రదర్శన చేసిన 12 మంది ఫైనల్లో తలపడతారు.

సచిన్ యాదవ్ కూడా: మరో భారత త్రోయర్ సచిన్ యాదవ్ 83.67 మీ. దూరంతో ఓవరాల్‌గా 10వ స్థానంలో నిలిచి ఫైనల్‌కు క్వాలిఫై అయ్యాడు. మరో ఇద్దరు భారత త్రోయర్లు రోహిత్ 28వ, యశ్వీర్ 30వ స్థానాల్లో నిలిచి ఫైనల్‌కు ముందే నిష్క్రమించారు. క్వాలిఫికేషన్స్‌లో ఓవరాల్‌గా అండర్సన్ పీటర్స్ (89.53 మీ.) అగ్రస్థానం, జులియన్ వెబర్ (87.21 మీ) రెండో స్థానంలో నిలిచారు.

మిగిలిన అందరూ విఫలం..

పురుషుల ట్రిపుల్ జంప్‌లో భారత అథ్లెట్ అబ్దుల్లా అబూబాకర్ (16.33మీ.), ప్రవీణ్ చిత్రవేల్ (16.74మీ.) ఫైనల్‌కు చేరడంలో విఫలమయ్యారు. పురుషుల 200 మీ. పరుగు హీట్స్‌లో అనిమేష్ కుజుర్ తన హీట్‌లో తొమ్మిదో, ఆఖరి స్థానంలో నిలిచి నిరాశపరిచాడు.

దుబాయ్‌లో పాక్ ఆటగాళ్ల హైడ్రామా

గంట ఆలస్యంగా మొదలైన యూఏఈతో మ్యాచ్

దుబాయ్: యూఏఈతో తమ ఆఖరి లీగ్ మ్యాచ్ ఆడే విషయంలో పాకిస్థాన్ హైడ్రామా సృష్టించింది. టోర్నీని బహిష్కరిస్తామన్నట్టుగా హోటల్‌కే పరిమితమైన పాక్ జట్టు.. ఆ తర్వాత బెట్టు వీడింది. హ్యాండ్ షేక్ వివాదంలో మ్యాచ్ రెఫరీ ఆండీ పైక్రాఫ్ట్‌ను బాధ్యతల నుంచి తప్పించాలని కోరుతున్న పాక్.. మరోసారి ఐసీసీకి మెయిల్ చేసింది. కానీ, పాక్ డిమాండ్‌ను ఐసీసీ రెండోసారి తిరస్కరించింది. ఈ నేపథ్యంలో నిర్ణీత సమయంలో హోటల్ నుంచి పాక్ జట్టు స్టేడియానికి బయలుదేరకుండా బెదిరింపు ధోరణికి దిగడంతో సస్పెన్స్ నెలకొంది. దీంతో యూఏఈతో మ్యాచ్‌ను పాక్ బహిష్కరించ నుందన్న వార్తలు వెలువడ్డాయి. అయితే, పాక్ బోర్డు (పీసీబీ) చైర్మన్ మొహిసిన్ నఖ్వీతో కాన్ఫరెన్స్ కాల్‌లో మాట్లాడిన ఐసీసీ సీఈవో సంజోగ్ గుప్తా.. మ్యాచ్ రెఫరీగా పైక్రాఫ్ట్ కొనసాగుతాడని మరోసారి స్పష్టం చేశాడు. అతడు ఎలాంటి నిబంధనలు ఉల్లంఘించలేదని గుర్తు చేశాడు. అంతేకాకుండా పైక్రాఫ్ట్‌ను కూడా హెడ్ క్వార్టర్స్‌కు పిలిపించిన ఐసీసీ.. అతని విషయంలో పూర్తిగా విచారణ చేసినట్టు రాతపూర్వకంగా పీసీబీకి తెలియజేసింది. ఈ క్రమంలో పలుమార్లు నఖ్వీతో మంతనాలు జరిపిన పాక్ జట్టు చివరకు స్టేడియానికి చేరుకొంది. దీంతో మ్యాచ్ గంట ఆలస్యంగా మొదలైంది. మరోవైపు భారత్‌తో జరిగిన మ్యాచ్‌లో చోటు చేసుకొన్న పరిణామాలపై పాక్ మేనేజర్‌ను పైక్రాఫ్ట్ క్షమాపణలు కోరినట్టు పీసీబీ ఎక్స్‌లో పోస్టు చేసింది. కాగా, మ్యాచ్‌ను బహిష్కరిస్తే భారీ జరిమానాలు తప్పవన్న భయంతోనే పాక్ దారికొచ్చినట్టు తెలుస్తోంది.

చచ్చీ చెడీ..

సూపర్- 4కు పాకిస్థాన్
యూఏఈపై గెలుపు
21న భారత్‌తో మళ్లీ ఢీ



దుబాయ్: ఆసియా కప్‌లో పాకిస్థాన్ జట్టు సూపర్-4లో ప్రవేశించింది. గ్రూప్-ఎలో భాగంగా బుధవారం జరిగిన మ్యాచ్‌లో 41 పరుగులతో యూఏఈని ఓడించింది. తొలుత పాకిస్థాన్ 20 ఓవర్లలో 146/9 స్కోరు చేసింది. ఫఖర్ జమాన్ (50) హాఫ్ సెంచరీ చేశాడు. కెప్టెన్ సల్మాన్ ఆఘా (20)తో కలిసి జమాన్ మూడో వికెట్‌కు కీలకమైన 61 పరుగులు జోడించాడు. చివర్లో షహీన్ షా అఫ్రీది (29 నాటౌట్) ధనాధన్ బ్యాటింగ్‌తో పాకిస్థాన్ పోరాడే స్కోరు చేసింది. ఛేదనలో యూఏఈ 17.4 ఓవర్లలో 104 పరుగులకు ఆలౌటైంది. రాహుల్ చోప్రా (35), ధ్రువ్ పరాశర్ (20) మాత్రమే రాణించారు. షహీన్ షా అఫ్రీది, అబ్రార్, రౌఫ్ తలా రెండేసి వికెట్లు తీశారు. ఈ గెలుపుతో పాకిస్థాన్ పాయింట్ల పట్టికలో గ్రూప్-ఎ నుంచి రెండో స్థానంలో నిలిచింది. దరిమిలా సూపర్-4కు క్వాలిఫై అయ్యింది. ఈ గ్రూప్ నుంచి టాప్‌లో భారత్ ఉంది. వచ్చే ఆదివారం జరిగే సూపర్-4 మ్యాచ్‌లో భారత్‌తో పాక్ తలపడనుంది.

సంక్షిప్త స్కోర్లు

పాకిస్థాన్: 20 ఓవర్లలో 146/9 (ఫఖర్ జమాన్ 50, షహీన్ షా అఫ్రీది 29 నాటౌట్, సల్మాన్ ఆఘా 20, జునైద్ సిద్దిఖీ 4/18, సిమ్రన్‌జీత్ 3/26).
యూఏఈ: 17.4 ఓవర్లలో 105 ఆలౌట్ (రాహుల్ చోప్రా 35, ధ్రువ్ పరాశర్ 20, అబ్రార్ అహ్మద్ 2/13, షహీన్ షా అఫ్రీది 2/16, హారీస్ రవూఫ్ 2/19).

ప్రీక్వార్టర్స్‌కు సాత్విక్ జోడీ

'చైనా మాస్టర్స్' నుంచి లక్ష్యసేన్ అవుట్

షెన్‌జెన్ (చైనా): డబుల్స్ స్టార్ జోడీ సాత్విక్ సాయిరాజ్/చిరాగ్ షెట్టి చైనా మాస్టర్స్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో ముందంజ వేసింది. బుధవారం ఇక్కడ జరిగిన పురుషుల డబుల్స్ పోరులో సాత్విక్ జంట 24-22, 21-13తో మలేసియా ద్వయం జునైది ఆరిఫ్/రాయ్ కింగ్ యాప్‌ను ఓడించి ప్రీక్వార్టర్స్‌లో ప్రవేశించింది. కాగా, సింగిల్స్‌లో భారత స్టార్ లక్ష్యసేన్‌కు ఆదిలోనే చుక్కెదురైంది. లక్ష్య 11-21, 10-21తో ఫ్రాన్స్ షట్లర్ తోమా జూనియర్ పోపోవ్ చేతిలో ఓడి తొలిరౌండ్లోనే వెనుదిరిగాడు. ఇక, మిక్స్‌డ్ డబుల్స్‌లో ధ్రువ్ కపిల/తనీషా, మహిళల డబుల్స్‌లో రీతూపర్ణ/శ్వేతాపర్ణ జోడీలు మొదటి రౌండ్లోనే ఓడారు.

మోదీకి మెస్సీ ప్రత్యేక కానుక

న్యూఢిల్లీ: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 75వ జన్మదినం సందర్భంగా సాకర్ దిగ్గజం లియోనెల్ మెస్సీ ప్రత్యేకంగా విషెస్ తెలిపాడు. అంతేకాదు.. మోదీకి పుట్టినరోజు కానుకను కూడా పంపించడం విశేషం. తన సంతకంతో కూడిన జెర్సీని మోదీకి మెస్సీ బహుమతిగా పంపాడు. మెస్సీ సారథ్యంలో అర్జెంటీనా జట్టు 2022 ప్రపంచకప్‌లో విజేతగా నిలిచింది. ఆ టోర్నీలో మెస్సీ ధరించిన జెర్సీనే మోదీకి పంపినట్టు భారత్‌లో మెస్సీ ప్రమోటర్ సతాద్రు దత్తా వెల్లడించాడు. ఈ ఏడాది చివర్లో భారత పర్యటనకు మెస్సీ రానున్నాడు.



మంధాన శతక మోత

రెండో వన్డేలో ఆసీస్‌పై భారత్ ఘన విజయం

ముల్లన్‌పూర్ (పంజాబ్): డాషింగ్ ఓపెనర్ స్మృతీ మంధాన (91 బంతుల్లో 14 ఫోర్లు, 4 సిక్సర్లతో 117) సెంచరీతోపాటు బౌలర్లు రాణించడంతో.. ఆస్ట్రేలియాతో మూడు వన్డేల సిరీస్‌ను భారత్ 1-1తో సమం చేసింది. బుధవారం జరిగిన రెండో వన్డేలో భారత మహిళల జట్టు 102 పరుగుల తేడాతో గెలిచింది. తద్వారా 2007 తర్వాత స్వదేశంలో తొలిసారి కంగారూలపై భారత్ జయకేతనం ఎగురువేసింది. టాస్ ఓడి తొలుత బ్యాటింగ్‌కు దిగిన భారత్ 49.5 ఓవర్లలో 292 పరుగులకు ఆలౌటైంది. దీప్తి శర్మ (40), రిచా ఘోష్ (29), ప్రతీక రావల్ (25) పర్వాలేదనిపించగా.. చివర్లో స్నేహ్ రాణా (24) రాణించింది. ఓపెనర్లు ప్రతీక, మంధాన తొలి వికెట్‌కు 70 పరుగులు జోడించారు. హర్లీన్ డియోల్ (10), కెప్టెన్ హర్మన్‌ప్రీత్ (17) విఫలమయ్యారు. డార్సీ బ్రౌన్ 3 వికెట్లు పడగొట్టింది. ఛేదనలో ఆసీస్ 40.5 ఓవర్లలో 190 పరుగులకే కుప్పకూలింది. సదర్లాండ్ (45), ఎలీస్ పెర్రీ (44) టాప్ స్కోరర్లు. క్రాంతి గౌడ్ మూడు, దీప్తి రెండు వికెట్లు పడగొట్టారు. ఆసీస్‌పై భారత్‌కు ఇదే అత్యధిక స్కోరు. మంధాన ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్‌గా నిలిచింది. ఇరుజట్ల మధ్య సిరీస్ నిర్ణాయక మూడో, ఆఖరి మ్యాచ్ శనివారం జరగనుంది.

1 వంద అంతకు పైగా పరుగుల తేడాతో ఆస్ట్రేలియా ఓడడం ఆ జట్టుకిదే తొలిసారి.

2 77 బంతుల్లో సెంచరీ సాధించిన మంధాన.. భారత్ తరపున రెండో వేగవంతమైన శతకాన్ని నమోదు చేసింది. తొలి సెంచరీ కూడా ఆమె పేరిటే ఉంది. ఐర్లాండ్‌పై మంధాన 70 బంతుల్లోనే వంద సాధించింది.

సంక్షిప్త స్కోర్లు

భారత్: 49.5 ఓవర్లలో 292 ఆలౌట్ (మంధాన 117, దీప్తి శర్మ 40; బ్రౌన్ 3/42).
ఆస్ట్రేలియా: 40.5 ఓవర్లలో 190 ఆలౌట్ (సదర్లాండ్ 45, పెర్రీ 44; క్రాంతి 3/28).



వరుణ్ @1

టీ 20 ర్యాంకింగ్స్‌లో అగ్రస్థానం కైవసం

దుబాయ్: మిస్టరీ స్పిన్నర్ వరుణ్ చక్రవర్తి ఐసీసీ ర్యాంకింగ్స్‌లో తొలిసారి టాప్ లేపాడు. బుధవారం ప్రకటించిన టీ20 ర్యాంకింగ్స్ బౌలర్ల జాబితాలో వరుణ్ మూడు స్థానాలు మెరుగుపర్చుకొని ఏకంగా నెంబర్ వన్ ర్యాంక్‌ను అందుకొన్నాడు. ఈ క్రమంలో టాప్ ర్యాంక్‌ను అందుకొన్న మూడో భారత బౌలర్‌గా చక్రవర్తి నిలిచాడు. రవి బిష్ణోయ్ 8వ స్థానంలో, అక్షర్ పటేల్ 12వ ర్యాంక్‌లో ఉన్నారు. న్యూజిలాండ్ ఆటగాడు జాకబ్ డెఫీ, వెస్టిండీస్ స్పిన్నర్ అఖీల్ హొసేన్ రెండు, మూడు ర్యాంక్‌లు దక్కించుకొన్నారు. ఆల్‌రౌండర్ల విభాగంలో హార్దిక్ పాండ్యా అగ్రస్థానంలో కొనసాగుతుండగా.. అభిషేక్ శర్మ 14వ ర్యాంక్‌కు ఎగబాకాడు. బ్యాటర్ల కేటగిరీలో అభిషేక్ నెం:1 ర్యాంక్‌లో కొనసాగుతుండగా.. తిలక్ వర్మ, సూర్యకుమార్‌లు నాలుగు, ఏడో ర్యాంకుల్లో ఉన్నారు.

కాంస్యపోరుకు అంతిమ్

జగ్రెబ్ (క్రొయేషియా): వరల్డ్ రెజ్లింగ్ చాంపియన్‌షిప్స్‌లో భారత అమ్మాయి అంతిమ్ పంగల్ కాంస్యం కోసం తలపడనుంది. మంగళవారం జరిగిన మహిళల 53 కిలోల విభాగం సెమీస్‌లో అంతిమ్ 3-5తో ఒలింపిక్ రజత పతక విజేత లూసియా యపజ్ గుజ్‌మన్ (ఈక్వెడార్) చేతిలో ఓడింది. దీంతో కాంస్యం పోరులో అంతిమ్ అదృష్టం పరీక్షించుకోనుంది. 62 కిలోల్లో మనీషా భన్వల్.. ఓక్ జు కిమ్ (ఉత్తర కొరియా) చేతిలో ఓటమి పాలైంది. అయితే, కిమ్ ఫైనల్ చేరడంతో మనీషాకు రెపిచేజ్ ఆడే చాన్స్ దక్కింది.

మళ్లీ ఓడిన టైటాన్స్

ప్రొ కబడ్డీ లీగ్

జైపూర్: గత మ్యాచ్‌లో ఓడిన తెలుగు టైటాన్స్‌కు మళ్లీ నిరాశే ఎదురైంది. ప్రొ కబడ్డీ లీగ్ (పీకేఎల్)లో భాగంగా బుధవారం జరిగిన మ్యాచ్‌లో టైటాన్స్ 29-33 స్కోరు తేడాతో దబాంగ్ ఢిల్లీ చేతిలో పరాజయం పాలైంది. టైటాన్స్‌కు ఇది ఎనిమిది మ్యాచుల్లో ఐదో ఓటమి కాగా.. దబాంగ్ జట్టు మాత్రం వరుసగా ఆరు విజయాలతో అజేయంగా కొనసాగుతోంది. మరో మ్యాచ్‌లో హరియాణా స్టీలర్స్ 43-32తో పట్నా పైరేట్స్‌పై విజయం సాధించింది.

బిజినెస్

వడ్డీ రేటు 0.25% తగ్గింపు

ప్రకటించిన అమెరికా ఫెడ్ రిజర్వ్

వాషింగ్టన్: అమెరికాలో వడ్డీ రేట్లు మరింత తగ్గనున్నాయి. కీలక స్వల్పకాలిక వడ్డీ రేట్లను అమెరికా కేంద్ర బ్యాంక్ ఫెడరల్ రిజర్వ్ 25 బేసిస్ పాయింట్లు (0.25%) తగ్గించింది. ఫెడ్ రిజర్వ్ చైర్మన్ జెరోమ్ పోవెల్ అధ్యక్షతన బుధవారం జరిగిన ఎఫ్‌ఓఎంసీ భేటీలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. దీంతో వడ్డీ రేటు 4 శాతం నుంచి 4.25 శాతానికి చేరుకుంది. ఫెడ్ రిజర్వ్ కీలక వడ్డీ రేట్లు తగ్గించడం ఈ ఏడాది ఇదే మొదటిసారి. కొంత అనిశ్చితి ఉన్నా నిరుద్యోగం, రిటైల్ ద్రవ్యోల్బణం దిగి వస్తుండడంతో ఫెడ్ రిజర్వ్ ఈ నిర్ణయం తీసుకుందని భావిస్తున్నారు. కాగా ఈ సంవత్సరం మరో రెండు సార్లు వడ్డీ రేట్లు తగ్గించనున్నట్టు పోవెల్ స్పష్టమైన సంకేతాలు ఇచ్చారు. దీంతో వడ్డీ రేట్లు తగ్గించండి, లేకపోతే మిమ్మల్ని సాగనంపుతా అని అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేస్తున్న హెచ్చరికలను జెరోమ్ పోవెల్ ఆలకించినట్టయింది.

మార్కెట్లకు బూస్ట్

ఫెడ్ నిర్ణయం వెలువడిన వెంటనే డోజోన్స్ సూచీ 438 పాయింట్లు పెరిగింది. ఫెడ్ తాజా నిర్ణయంతో భారత్‌తో సహా ఇతర వర్ధమాన దేశాల స్టాక్ మార్కెట్లకు ఎఫ్‌పీఐల పెట్టుబడులు మళ్లీ గాడిన పడతాయని భావిస్తున్నారు. గురువారం నుంచి భారత మార్కెట్‌పై ఈ ప్రభావం కనిపిస్తుందని భావిస్తున్నారు. మరోవైపు ఫెడ్ నిర్ణయంతో బులియన్ మార్కెట్ కూడా మరింత పరుగులు తీసే అవకాశం ఉందని మార్కెట్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. బుధవారం రాత్రి 11.45 గంటలకు అమెరికా మార్కెట్లో ఔన్స్ (31.10 గ్రాములు) బంగారం ధర రికార్డు స్థాయిలో 3,731 డాలర్లకు చేరింది.

యస్ బ్యాంక్‌లో 13.18% వాటా విక్రయం పూర్తి : ఎస్‌బీఐ

న్యూఢిల్లీ: యస్ బ్యాంక్ ఈక్విటీలో తన వాటాను భారతీయ స్టేట్ బ్యాంక్ (ఎస్‌బీఐ) 10.8 శాతానికి తగ్గించుకుంది. ఇందులో తనకున్న 23.98 శాతం వాటాలో 13.18 శాతం వాటాను జపాన్ కేంద్రంగా పనిచేసే సుమిటోమో మిట్సుయి బ్యాంకింగ్ కార్పొరేషన్ (ఎస్ఎంబీసీ)కు విక్రయించిన సంగతి తెలిసిందే. తాజాగా ఈ డీల్ పూర్తయినట్లు ఎస్‌బీఐ తెలిపింది. ఈ అమ్మకం ద్వారా రూ.8,889 కోట్లు సమకూరినట్టు స్టాక్ ఎక్స్ఛేంజీలకు బ్యాంక్ తెలిపింది. 2020 మార్చిలో యస్ బ్యాంక్ కుప్పకూలినప్పుడు ప్రభుత్వం, ఆర్‌బీఐ ఆదేశాలతో ఎస్‌బీఐ రెండు విడతలుగా ఈ బ్యాంక్ ఈక్విటీలో ఈ వాటాలు తీసుకుంది.

అందుబాటులోకి బీమా సుగమ్

న్యూఢిల్లీ: బీమా సుగమ్ ఇండియా ఫెడరేషన్ (బీఎస్ఐఎఫ్) వెబ్‌సైట్ అందుబాటులోకి వచ్చింది. హైదరాబాద్‌లోని బీమా నియంత్రణ, అభివృద్ధి మండలి (ఐఆర్‌డీఏఐ) ప్రధాన కార్యాలయంలో మండలి బీమా కంపెనీల సీఈఓలతో కలిసి ఐఆర్‌డీఏఐ చైర్మన్ అజయ్ సేథ్ ఈ వెబ్‌సైట్‌ను ఆవిష్కరించారు. 2047 నాటికి ప్రధాని మోదీ లక్ష్యమైన 'వికసిత్ భారత్'లో అందరికీ బీమా లక్ష్య సాధనకు ఈ వెబ్‌సైట్ తోడ్పడుతుందని సేథ్ తెలిపారు. ఈ వెబ్‌సైట్ ద్వారా ప్రజలు తమ అవసరాలకు అనుగుణంగా జీవిత, ఆరోగ్య బీమా పాలసీలతో పాటు జనరల్ బీమా పాలసీలను ఎంచుకోవచ్చు.

కమోడిటీస్ మార్కెట్ విస్తరణకు కృషి

సెబీ చైర్మన్ పాండే



ముంబై: దేశంలో కమోడిటీస్ మార్కెట్ విస్తరణకు కట్టుబడి ఉన్నట్టు మార్కెట్ నియంత్రణ మండలి సెబీ తెలిపింది. ఇందులో భాగంగా వ్యవసాయేతర ఉత్పత్తుల డెరివేటివ్స్ ట్రేడింగ్‌లోకి బ్యాంకులు, బీమా కంపెనీలు, పెన్షన్ ఫండ్లను అనుమతించే విషయాన్ని పరిశీలిస్తున్నట్టు సెబీ చైర్మన్ తుహిన్ కాంత పాండే వెల్లడించారు. మల్టీ కమోడిటీస్ ఎక్స్ఛేంజీ (ఎంసీఎక్స్) నిర్వహించిన ఒక సదస్సులో ఆయన ఈ విషయం వెల్లడించారు. నాన్ క్యాష్ సెటిల్డ్, వ్యవసాయేతర కమోడిటీస్‌లోకి విదేశీ పోర్టుఫోలియో ఇన్వెస్టర్ల (ఎఫ్‌పీఐ)ను అనుమతించే విషయాన్నీ సెబీ పరిశీలిస్తోంది. ప్రభుత్వంతో చర్చించాక వీటిపై నిర్ణయం తీసుకుంటామని పాండే తెలిపారు. దేశ ఆర్థిక వ్యవస్థలో కమోడిటీస్ డెరివేటివ్ మార్కెట్లది కీలక పాత్ర అని పాండే చెప్పారు.

కొత్త జీఎస్‌టీ రేట్లతో కస్టమర్లకు వల

తగ్గింపు ధరలతో ఏసీ బుకింగ్‌లు షురూ



న్యూఢిల్లీ: వచ్చే సోమవారం నుంచి అమలులోకి రానున్న జీఎస్‌టీ రేట్ల తగ్గింపును ముందుగానే వర్తింప చేస్తూ ఎయిర్ కండిషనర్ తయారీదారులు, డీలర్లు కస్టమర్ల నుంచి ముందస్తు బుకింగ్‌లు స్వీకరిస్తున్నారు. జీఎస్‌టీ రేట్ల తగ్గింపు ప్రభావంతో ఏసీలకు డిమాండు గణనీయంగా పెరుగుతుందన్న అంచనాతో వారు ఈ చర్య తీసుకున్నారు. తాము 10% జీఎస్‌టీ తగ్గింపు ప్రయోజనం మొత్తాన్ని వినియోగదారులకు బదిలీ చేస్తున్నామని, మోడల్‌ను బట్టి ఒక్కో ఏసీపై కస్టమర్‌కు రూ.4,000 వరకు ధర తగ్గుతుందని రూమ్ ఎయిర్ కండిషనర్ తయారీదారులు చెప్పారు. ప్రస్తుతం ఏసీలపై 28% జీఎస్‌టీ విధిస్తుండగా కొత్త విధానం కింద దాన్ని 18 శాతానికి తగ్గించారు. బ్లూస్టార్, హాయర్ వంటి కంపెనీలు ఇప్పటికే ప్రీ బుకింగ్ ప్రారంభించాయి. వేసవి తీవ్రత అధికంగా ఉన్న సమయంలో అకాల వర్షాల కారణంగా జూన్ త్రైమాసికంలో ఏసీల డిమాండు గణనీయంగా తగ్గింది.

అంతేకాకుండా కస్టమర్లను ఆకర్షించేందుకు ఏసీ తయారీదారులు ఈజీ ఫైనాన్సింగ్, ఉచిత ఇన్‌స్టలేషన్, గ్యాస్ చార్జింగ్‌తో ఎక్స్‌టెండెడ్ వారెంటీ, జీరో కాస్ట్ ఈఎంఐ సదుపాయాలను తిరిగి ప్రారంభించాయి. ప్రీ బుకింగ్‌కు స్పందన బాగుందని, కొత్త జీఎస్‌టీ రేట్లు అమలులోకి వచ్చే రోజు అంటే 22వ తేదీన వారికి బిల్లు జారీ చేయనున్నట్లు బ్లూస్టార్ ఎండీ త్యాగరాజన్ చెప్పారు.


టీవీలకు పెరగనున్న డిమాండ్

జీఎస్‌టీ రేట్ల తగ్గింపుతో ఈ దీపావళి సీజన్‌లో తాము అమ్మకాల్లో రెండంకెల వృద్ధిని సాధించగలమన్న విశ్వాసాన్ని ఎలక్ట్రానిక్స్ తయారీ దిగ్గజం సోనీ ఇండియా మేనేజింగ్ డైరెక్టర్ సునీల్ నయ్యర్ ప్రకటించారు. టీవీల ధరలు సగటున 7.5-8 శాతం తగ్గుతాయని ఆయన తెలిపారు. ప్రీమియం సెగ్మెంట్లో ఉన్న సోనీ కంపెనీ మోడల్‌ని బట్టి టీవీల ధర రూ.8,000-70,000 మధ్యలో తగ్గనున్నట్టు తెలిపింది.

అపోలో టైర్ల ధర తగ్గింపు

జీఎస్‌టీ ప్రయోజనాన్ని కస్టమర్లకు బదిలీ చేస్తూ అపోలో టైర్స్ తమ టైర్ల ధరను రూ.300-2000 మధ్యలో తగ్గించినట్టు ప్రకటించింది. ప్రయాణికుల వాహన టైర్లయితే రూ.300-1500 మధ్యలో తగ్గాయని, ట్రక్కు/బస్సు రేడియల్ టైర్ల ధర రూ.2000 వరకు తగ్గించినట్టు తెలిపింది.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



18వ తేదీ			
హైదరాబాద్	540	విజయవాడ	560
వరంగల్	542	గోదావరి	550
చిత్తూరు	578	విశాఖపట్నం	555
		డజను గుడ్లు రూ. 72	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	118	విజయవాడ	140
వరంగల్	118	గుంటూరు	135
కరీంనగర్	118	ఒంగోలు	135
మహబూబ్‌నగర్	118	చిత్తూరు	127
కర్నూలు	118	నెల్లూరు	132
విశాఖపట్నం	134	అనంతపురం	132
గోదావరి	140		



బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	1,11,710 ▼	1,02,400 ▼	1,42,000 ▼
విజయవాడ	1,13,000 ▼	1,06,500 ▼	1,29,000 ▼
విశాఖపట్నం	1,13,770 ▼	1,02,400 ▲	1,42,000 ▼
రాజమండ్రి	1,11,710 ▼	1,02,400 ▼	1,33,000 ▲
ప్రొద్దుటూరు	1,14,200 ▼	1,05,060 ▼	1,32,000 ▼
ముంబై	1,09,733 ▼	1,00,515 ▼	1,25,756 ▼

పెట్టుబడి రూ. 55 కోట్లు.. వచ్చింది రూ. 2,437 కోట్లు

అర్బన్ ఐపీఓలో 'యాక్సెల్'కు జాక్‌పాట్

ముంబై: అర్బన్ కంపెనీ పబ్లిక్ ఇష్యూ.. మదుపరులకు భారీ లాభాలను అందించింది. బుధవారం స్టాక్ మార్కెట్లో లిస్టయిన అర్బన్ కంపెనీ ప్రారంభించిన సమయంలో పెట్టుబడులు పెట్టిన మదుపరులకైతే బంపర్ లాభాలు వచ్చాయి. పదేళ్ల క్రితం వెంచర్ క్యాపిటల్ (వీసీ) సంస్థ యాక్సెల్.. అర్బన్ కంపెనీ ఈక్విటీలో ఒక్కో షేరును రూ.3.77 చొప్పున రూ.55 కోట్ల విలువైన షేర్లను కొనుగోలు చేసింది. తాజాగా బుధవారం కంపెనీ షేరు బీఎస్ఈలో ఇష్యూ ధర రూ.103తో పోల్చితే 56.31% ప్రీమియంతో రూ.161 వద్ద లిస్టయింది. ఇంట్రాడేలో ఏకంగా 73.78% లాభపడి రూ.179 స్థాయిని తాకింది. చివరికి 62.18% లాభంతో రూ.167.05 వద్ద ముగిసింది. కంపెనీ మార్కెట్ విలువ రూ.23,986.74 కోట్లుగా నమోదైంది. కాగా ఈ లెక్కన అర్బన్ కంపెనీ ఈక్విటీలో పదేళ్ల క్రితం యాక్సెల్ పెట్టిన పెట్టుబడుల విలువ ప్రస్తుతం ఏకంగా రూ.2,437 కోట్లకు చేరింది. అమెరికాలోని సిలికాన్ వ్యాలీ కేంద్రంగా పనిచేసే ఈ వీసీ గతంలో ఫేస్‌బుల్‌లోనూ పెట్టుబడి పెట్టి భారీ లాభాలు ఆర్జించింది.

రెండో రోజూ మార్కెట్లో ర్యాలీ

భారత-అమెరికా వాణిజ్య చర్చలపై నెలకొన్న ఆశావీచికలు, అమెరికన్ ఫెడ్‌రిజర్వ్ వడ్డీ రేట్లు తగ్గిస్తుందన్న అంచనాల నడుమ ఈక్విటీ మార్కెట్ బుధవారం వరుసగా రెండో రోజూ ర్యాలీని కొనసాగించింది. సెన్సెక్స్ 313.02 పాయింట్ల వృద్ధితో 82,693.71 వద్ద ముగిసింది. నిఫ్టీ 91.15 పాయింట్లు లాభపడి 25,330.25 వద్ద బలంగా క్లోజైంది. నిఫ్టీ 25,300కన్నా పైన నిలబడడం మార్కెట్లో సెంటిమెంట్ బలంగా ఉందనేందుకు సంకేతమని విశ్లేషకులంటున్నారు.

బెంగళూరులో కిమ్స్ హాస్పిటల్స్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): బెంగళూరులో తొలి మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్‌ను ప్రారంభించినట్లు హైదరాబాద్ కేంద్రంగా ఉన్న కృష్ణా ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (కిమ్స్ హాస్పిటల్స్) ప్రకటించింది. 450 పడకల సామర్థ్యంతో ఏర్పాటు చేసిన ఈ హాస్పిటల్‌లో సమగ్ర వైద్య సేవలను అందించనున్నట్లు తెలిపింది. ఈ హాస్పిటల్‌లో 35 మెడికల్, సర్జికల్ స్పెషాలిటీస్, 120కి పైగా అడ్వాన్స్‌డ్ బెడ్స్‌తో పాటు అవుట్ పేషెంట్స్ కోసం ప్రత్యేకంగా 100కు పైగా రూమ్స్ అందుబాటులో ఉన్నాయని కిమ్స్ వెల్లడించింది. అందరికీ నాణ్యమైన వైద్య సేవలను అందించాలన్న లక్ష్యంతో బెంగళూరులో తొలి హాస్పిటల్‌ను ప్రారంభించినట్లు కిమ్స్ హాస్పిటల్స్ సీఎండీ భాస్కర్ రావు తెలిపారు. కాగా త్వరలోనే బెంగళూరులోని ఎలక్ట్రానిక్ సిటీలో రెండో యూనిట్‌ను ప్రారంభించనున్నట్లు భాస్కర్ రావు చెప్పారు.

ఈ ఏడాది ఆదాయంలో రెండంకెల వృద్ధి : తనైరా

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): టాటా గ్రూప్‌నకు చెందిన ఎథ్నిక్ వేర్ బ్రాండ్ తనైరా.. ప్రస్తుత ఆర్థిక సంవత్సర ఆదాయంలో రెండంకెల వృద్ధిని అంచనా వేస్తున్నట్లు ప్రకటించింది. గత ఆర్థిక సంవత్సరం (2024-25)లో సంస్థ ఆదాయం రూ.276 కోట్లుగా ఉందని పండగ సీజన్ అమ్మకాలతో వృద్ధి రెండంకెల స్థాయిలో ఉంటుందని భావిస్తున్నట్లు తనైరా చీఫ్ సేల్స్, మార్కెటింగ్ ఆఫీసర్ సోమ్‌ప్రభ్ సింగ్ తెలిపారు. రానున్న పండగల సీజన్‌ను దృష్టిలో పెట్టుకుని కొత్త కలెక్షన్‌తో పాటు వివాహాల వంటి వాటి కోసం ఈఎంఐ ఆధారిత కొనుగోలు ప్లాన్‌ను తీసుకువచ్చినట్లు చెప్పారు. కాగా తనైరా.. హైదరాబాద్‌లో 6 స్టోర్లు, ఏపీలోని విజయవాడలో ఒక స్టోర్‌ను నిర్వహిస్తోందన్నారు. కొత్తగా మరో 2-3 స్టోర్లను ప్రారంభించాలని చూస్తున్నట్లు సింగ్ తెలిపారు. తనైరా ప్రస్తుతం దేశవ్యాప్తంగా 40కి పైగా నగరాల్లో 80 స్టోర్లను నిర్వహిస్తోంది.



ఒంగోలులో లాట్ మొబైల్స్ రెండో స్టోర్

హైదరాబాద్: మొబైల్ ఫోన్ రిటైల్ చెయిన్ లాట్ మొబైల్స్.. ఆంధ్రప్రదేశ్‌లోని ఒంగోలులో రెండో స్టోర్‌ను ప్రారంభించింది. బుధవారం నాడు ఈ షోరూమ్‌ను టాలీవుడ్ నటి పాయల్ రాజ్‌పుత్, సంస్థ డైరెక్టర్లు యం.సుప్రజ, యం.అఖిల్ లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా పాయల్ రాజ్‌పుత్ మాట్లాడుతూ.. షోరూమ్ ప్రారంభం సందర్భంగా నిర్వహించనున్న లక్కీ డ్రాలో రాయల్ ఎన్‌ఫీల్డ్ బైక్, వాషింగ్ మెషిన్, రిఫ్రిజిరేటర్, ఏసీ, స్మార్ట్ టీవీ, స్మార్ట్‌ఫోన్ బహుమతులుగా అందించనుందన్నారు. మొబైల్స్ కొనుగోలుపై రూ.10,000 వరకు మొబైల్ ప్రొటెక్షన్‌తో పాటు 10 శాతం ఇన్‌స్టంట్ క్యాష్‌బ్యాక్, రూ.6,999 విలువ గల స్మార్ట్ కాలింగ్ వాచీ లేదా రూ.1,999 విలువ గల ఇయర్‌బడ్స్‌ను ఉచితంగా అందించనున్నట్లు డైరెక్టర్ సుప్రజ వెల్లడించారు. ఒంగోలు ప్రజల కోసం ప్రత్యేకంగా జీరో డౌన్‌పేమెంట్ ఫైనాన్స్ పథకం, నో కాస్ట్ ఈఎంఐ వంటి ఆఫర్లు ఈ స్టోర్‌లో అందుబాటులో ఉంటాయని లాట్ మొబైల్స్ డైరెక్టర్ అఖిల్ తెలిపారు.

4 కొత్త వంతెనలు.. 30 రోడ్ల ఉన్నతీకరణ

- రూ.868 కోట్లతో 422 కి.మీ మేర రోడ్ల అభివృద్ధి
- మానేరుపై హైలెవల్ బ్రిడ్జి.. నిధులిచ్చిన కేంద్రం

హైదరాబాద్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో 30 రహదారుల అభివృద్ధి, ఉన్నతీకరణతో పాటు ఓ నాలుగు చోట్ల బ్రిడ్జిలను నిర్మించేందుకు కేంద్రం పచ్చజెండా ఊపింది. రాష్ట్ర వ్యాప్తంగా రూ.868 కోట్లతో 422 కి.మీ, మేర రోడ్లను అభివృద్ధి చేసేందుకు ఉద్దేశించిన 34 పనుల కోసం సెంట్రల్ రోడ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఫండ్ (సీఆర్ఐఎఫ్) కింద కేంద్రం నిధులను మంజూరు చేసింది. ఆయా రోడ్ల వివరాలను రాష్ట్రానికి పంపింది. మొత్తం 34 పనుల్లో 4 చోట్ల నాలుగు హై లెవల్ వంతెనలు రానుండగా, మిగిలిన 30 చోట్ల రోడ్ల వెడల్పు, అభివృద్ధి చేయనున్నారు. వీటిలో కరీంనగర్ జిల్లా పరిధిలోని మానేరు నదిపై ఒక హైలెవల్ బ్రిడ్జిని రూ.77కోట్లతో నిర్మించేందుకు ఆమోదం తెలిపింది. మంచిర్యాల జిల్లా పరిధిలో టేకుమట్ల గ్రామానికి దగ్గర్లో ఉన్న ఇందారం-కుందారం రోడ్డుపై ఒకటి, కుందారం ఎస్సీ కాలనీ దగ్గర ఒకటి, కిష్టాపూర్ దగ్గర మరొకటి కలిపి మొత్తం నాలుగు బ్రిడ్జిలను మంజూరు చేసింది. వీటి కోసం రూ.20కోట్లు ఖర్చవనుంది. కరీంనగర్ జిల్లాలోని చొప్పదండి మండలంలోని అర్నకొండ నుంచి మల్యాల క్రాస్‌రోడ్ వరకు ఉన్న రోడ్డును రూ.50 కోట్లతో వెడల్పు చేసి ఉన్నతీకరించనుంది. నల్గొండ జిల్లాలోని కనగల్ క్రాస్ రోడ్డు నుంచి నాగార్జున సాగర్ క్రాస్ రోడ్డు వరకు 13.2 కి.మీ మేర రోడ్డును రూ.50 కోట్లతో ఉన్నతీకరించనుంది. కాగా, ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ఈ 34 పనులను మంజూరు చేయాలని కేంద్రానికి విజ్ఞప్తి చేసిన నేపథ్యంలో తాజాగా కేంద్రం వాటిని మంజూరు చేసింది.

టెండర్ల కుంభకోణాన్ని ప్రభుత్వమే ఒప్పుకుంది

- మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి

హైదరాబాద్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): ధాన్యం కొనుగోళ్ల టెండర్లలో పాల్గొన్న ఏజెన్సీల ఈఎండీ జప్తు చేసి వాటికి పెనాల్టీ విధిస్తూ.. ప్రభుత్వం జీవో జారీ చేయడం బీఆర్ఎస్ పోరాటంతో సాధించిన విజయమని ఆ పార్టీ మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి పేర్కొన్నారు. టెండర్ ఏజెన్సీల ఈఎండీ జప్తు నిర్ణయం చూస్తే ధాన్యం కొనుగోళ్ల టెండర్లలో కుంభకోణాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం స్వయంగా ఒప్పుకొన్నట్లయిందన్నారు.

టీచర్ల నియామకం కేసులో ప్రతివాదిగా స్పోర్ట్స్ అథారిటీ: హైకోర్టు

డీఎస్సీ-2024లో స్పోర్ట్స్ కోటా కింద ఎస్జీటీ టీచర్ల నియామకంపై దాఖలైన పిటిషన్‌లో స్పోర్ట్స్ అథారిటీని ప్రతివాదిగా చేరుస్తూ హైకోర్టు బుధవారం నోటీసులు జారీచేసింది. డీఎస్సీ స్పోర్ట్స్ కోటాలో అక్రమాలు జరిగాయని పేర్కొంటూ పలువురు అభ్యర్థులు దాఖలు చేసిన పిటిషన్లపై విచారణ జరిపిన జస్టిస్ పుల్ల కార్తీక్ ధర్మాసనం ఈ ఆదేశాలు ఇచ్చింది. అక్రమాలపై పునః పరిశీలన చేస్తామని పేర్కొన్న స్పోర్ట్స్ అథారిటీ అధికారులు ఇప్పటికీ స్పందించడం లేదని పిటిషనర్లు పేర్కొన్నారు. వాదనలు విన్న ధర్మాసనం.. స్పోర్ట్స్ అథారిటీని ప్రతివాదిగా చేర్చి.. వివరణ ఇవ్వాలని నోటీసులు జారీచేసింది. తదుపరి విచారణ అక్టోబర్ 15కు వాయిదా వేసింది.

పోలీసు భర్తీపై పిటిషన్ పెండింగ్‌లో ఉందా?

- వెతకాలని రిజిస్ట్రీకి హైకోర్టు ఆదేశాలు



పోలీసు శాఖలో ఉద్యోగాల భర్తీపై ఏదైనా పిటిషన్ పెండింగ్‌లో ఉందా అని హైకోర్టు ఆరా తీసింది. భారీగా ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేసే విధంగా ఆదేశాలు జారీచేయాలని కోరుతూ దాఖలైన ప్రజాప్రయోజన వ్యాజ్యం (పిల్) విచారణ సందర్భంగా పాత పిటిషన్‌ను ప్రస్తావించింది. పోలీసుశాఖలో మొత్తం మంజూరైన పోస్టులు 91,295 ఉండగా 14,874 పోస్టులు ఖాళీగా ఉన్నాయని పిటిషనర్ పేర్కొన్నారు. మంజూరైన పోస్టుల కంటే 16 శాతం తక్కువగా ఉద్యోగులు పనిచేస్తున్నారని తెలిపారు. దీనిపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అపరేశ్‌కుమార్ సింగ్, జస్టిస్ మొహియుద్దీన్ ధర్మాసనం బుధవారం విచారణ చేపట్టింది. పోలీసు ఉద్యోగాల ఖాళీపై సుమోటోగా విచారణ జరపాలని గతంలో హైకోర్టులకు సుప్రీంకోర్టు సూచించిందని ధర్మాసనం తెలిపింది. ఈ నేపథ్యంలో గతంలో హైకోర్టు ఈ విషయమై ఏమైనా ఆదేశాలు జారీచేసిందా? అని పిటిషనర్, ప్రభుత్వ న్యాయవాదులను ధర్మాసనం ప్రశ్నించింది. న్యాయవాదుల వద్ద సమాచారం లేకపోవడంతో ఏమైనా పెండింగ్‌లో ఉంటే వెతకాలని రిజిస్ట్రీకి ఆదేశాలు జారీచేసింది.

గ్రూప్-1 అభ్యర్థులపై విషం కక్కుతున్న కేటీఆర్

- ఆయనపై చర్యలు తీసుకోవాలి: ఎంపీ చామల కిరణ్

గ్రూప్ -1 పోస్టులకు ఎంపికైన అభ్యర్థులు.. ఒక్కో పోస్టుకు రూ.3 కోట్లు ఇచ్చారంటూ కేటీఆర్ విషం కక్కుతున్నారని, ఈ విషయంలో ఆయనపై చర్యలు తీసుకోవాలని సీఎం రేవంత్‌రెడ్డిని కోరుతానని పేర్కొన్నారు. గాంధీభవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ కాంగ్రెస్‌పై బురద జల్లడం, ప్రజలను తప్పుదోవ పట్టించడమే కేటీఆర్ అజెండాగా కనిపిస్తుందన్నారు. ఇదే అంశాన్ని పాడి కౌశిక్‌రెడ్డి మాట్లాడితే.. ఏదో మీడియా అటెన్షన్ డిసీజ్‌తో ఉందనుకున్నామని, కానీ అదే అంశాన్ని కేటీఆర్ మాట్లాడడం అర్థరహితమన్నారు. హైదరాబాద్ బ్రాండ్ ఇమేజీను దెబ్బతీసేందుకు కేటీఆర్ కుట్ర పన్నారని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ విమర్శించారు. హైదరాబాద్‌లో మెట్రోను నిర్వహించలేమంటూ ఎల్అండ్‌టీ సంస్థ చాలా కాలంగా కేంద్రానికి లేఖలు రాస్తోందని, కానీ సీఎం రేవంత్ బెదిరింపుల వల్లే మెట్రో నుంచి ఆ సంస్థ తప్పుకుంటోందంటూ కేటీఆర్ చెత్త వాగుడు వాగుతున్నారని ధ్వజమెత్తారు.

మధుయాష్కీకి ఫోన్‌లో సీఎం రేవంత్ పరామర్శ

అస్వస్థతకు గురై గచ్చిబౌలిలోని ఏఐజీ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీగౌడ్‌ను సీఎం రేవంత్‌రెడ్డి బుధవారం ఫోన్‌లో పరామర్శించారు. అస్వస్థతకు గురైన కారణాలతోపాటు ప్రస్తుత ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఆస్పత్రి చైర్మన్ డాక్టర్ నాగేశ్వర్‌రెడ్డితోనూ మాట్లాడిన సీఎం.. ప్రత్యేకంగా పర్యవేక్షించాలని సూచించారు. కాగా, టీపీసీసీ చీఫ్ మహేశ్‌గౌడ్, మంత్రులు ఉత్తమ్, పొన్నం ప్రభాకర్, శ్రీధర్‌బాబు, పొంగులేటి, శ్రీహరి, పలువురు నాయకులు యాష్కీని పరామర్శించారు.

ప్రజాస్వామిక తెలంగాణ నిర్మిద్దాం: కోదండరాం

ప్రజాస్వామిక తెలంగాణ నిర్మాణం కోసం అందరం కలిసి ముందుకు సాగుదామని టీజేఎస్ అధ్యక్షుడు కోదండరాం పిలుపునిచ్చారు. తెలంగాణ విలీన దినోత్సవం సందర్భంగా బుధవారం టీజేఎస్ కార్యాలయంలో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి.. అమరవీరులకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూస్వామ్య, పెత్తందారీ వ్యవస్థకు వ్యతిరేకంగా ఆనాడు ప్రజలు సాగించిన సుదీర్ఘ పోరాటాల ఫలితంగానే నిజాం పాలన అంతమైందని, భారతదేశంలో హైదరాబాద్ విలీనమైందని గుర్తుచేశారు. కాగా, ప్రజాపాలనా దినోత్సవం సందర్భంగా అసెంబ్లీ ఆవరణలో స్పీకర్ ప్రసాద్‌కుమార్ జాతీయ జెండాను ఆవిష్కరించారు. దానికి ముందు స్పీకర్ ప్రసాద్‌కుమార్, మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి అసెంబ్లీ ఆవరణలోని మహాత్మా గాంధీ, అంబేడ్కర్ విగ్రహాలకు నివాళులర్పించారు.

గోదావరి-కావేరి అనుసంధానంపై 1న కీలక భేటీ

హైదరాబాద్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): గోదావరి-కావేరీ అనుసంధానం (జీసీ లింక్)పై వివిధ రాష్ట్రాలు లేవనెత్తిన అంశాలపై చర్చించేందుకు అక్టోబరు 1న న్యూఢిల్లీలో జాతీయ నీటి అభివృద్ధి సంస్థ(ఎన్‌డబ్ల్యూడీఏ) పాలకమండలి సమావేశం జరగనుంది. దీనిని హైబ్రిడ్ విధానంలో నిర్వహించనున్నారు. ఈ మేరకు బుధవారం రాష్ట్రాలకు ఎన్‌డబ్ల్యూడీసీ సమాచారమిచ్చింది. కాగా ఛత్తీస్‌గఢ్, తమిళనాడు, పుదుచ్చేరి వంటి రాష్ట్రాలు లేవనెత్తిన అంశాలపైనా వచ్చే నెల సమావేశంలో చర్చించనున్నారు.

రజాకార్లు.. పహల్గాం ఉగ్రవాదులు..

ఇద్దరూ ఒక్కటే!

- భారత్‌ను సమర్థించేవారందరికీ రజాకార్లు శత్రువులే
- తెలంగాణ విమోచన దినోత్సవ వేడుకల్లో రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్
- కర్ణాటకలో విముక్తి దినాన్ని నిర్వహిస్తున్నారు
- ఇక్కడెందుకు నిర్వహించరు?
- కాంగ్రెస్ ప్రభుత్వానికి కిషన్‌రెడ్డి సూటి ప్రశ్న
- నిజాం పాలనలో 'జలియన్ వాలాబాగ్' తరహా ఉదంతాలు ఎన్నో: బండి సంజయ్



వాజ్‌పేయి విగ్రహావిష్కరణలో కేంద్ర మంత్రులు రాజ్‌నాథ్‌సింగ్, గజేంద్రసింగ్ షెకావత్, కిషన్‌రెడ్డి, బండి సంజయ్, ఎంపీ ఈటల



పటేల్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్

హైదరాబాద్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): భారతదేశ చరిత్రలో 'ఆపరేషన్ పోలో' కీలక ఘట్టమని రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ తెలిపారు. 'భారత్ ఐక్యతను దెబ్బతీసేవారికి పరాజయం తప్పదని తేల్చి చెప్పిన రోజు సెప్టెంబరు 17. ఆపరేషన్ పోలో.. ఒక సైనిక చర్య మాత్రమే కాదు.. హైదరాబాద్ సంస్థానంలో హిందువులపై అకృత్యాలకు ముగింపు పలికిన రోజు' అని అన్నారు. దేశంలో ఇప్పటికీ రజాకార్లు ఉన్నారని, వారే మన ప్రధాన శత్రువులని వ్యాఖ్యానించారు.బుధవారం పరేడ్‌గ్రౌండ్స్‌లో తెలంగాణ విమోచన దినోత్సవ వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరైన రాజ్‌నాథ్.. జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి కేంద్ర బలగాల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 'రజాకార్లు హిందువులకే కాదు.. భారత్‌ను సమర్థించే ప్రతీ ఒక్కరికీ శత్రువులే. హైదరాబాద్ సంస్థానాన్ని భారత్‌లో విలీనం చేయాలని స్పష్టం చేసినందుకు ఉర్దూ పాత్రికేయుడు షోయబుల్లాఖాన్ చేతులు నరికారు' అని గుర్తు చేశారు. 'రజాకార్లు, పహల్గాం ఉగ్రవాదులు ఇద్దరూ ఒక్కటే.. ఇద్దరూ మతం అడిగి మరీ హత్యాకాండకు పాల్పడ్డారు. నాడు సర్దార్ పటేల్ రజాకార్ల అకృత్యాలను ఎలా అంతమొందించారో, ఇప్పుడు పాకిస్థాన్ ప్రేరేపిత ఉగ్రవాదులను, వారి ఏజెంట్లను మోదీ ప్రభుత్వం అంతు చూస్తోంది. వేలాది సంవత్సరాల భారతీయ సంస్కృతిపై దాడికి పాల్పడ్డవారిని తుదముట్టించేందుకు ఆపరేషన్ సిందూర్ చేపట్టింది' అని ఆయన వివరించారు.

సిందూర్ ముగియలేదు

ఆపరేషన్ సిందూర్ ముగిసిపోలేదని, ఉగ్రవాదులు మళ్లీ దాడిచేస్తే తిరిగి ప్రారంభిస్తామని రాజ్‌నాథ్‌సింగ్ పునరుద్ఘాటించారు. ఆపరేషన్ సిందూర్‌తో కరడుగట్టిన ఉగ్రవాది మసూద్ అజర్ కుటుంబం ఛిన్నాభిన్నమైందంటూ ఉగ్రవాద సంస్థ జైషే మహమ్మద్ ప్రకటించడం మన సైన్యం పరాక్రమానికి నిదర్శనం అని ప్రశంసించారు. సెప్టెంబరు 17ను తెలంగాణ విమోచన దినంగా ఎందుకు అధికారికంగా నిర్వహించలేదని ఆయన రాష్ట్ర ప్రభుత్వాన్ని నిలదీశారు. సర్దార్ పటేల్ రాజనీతిజ్ఞుడే కాదు.. యుద్ధతంత్రంలో కూడా నిపుణుడని తెలిపారు. రజాకార్ల నాయకుడు ఖాసిం రజ్వీ నాడు ఢిల్లీలో సర్దార్ పటేల్‌ను కలుసుకుని, చివరి వరకూ పోరాడుతాం.. మరణిస్తాం... కానీ ఎట్టి పరిస్థితుల్లో భారత్‌తో కలువబోం అని చెప్పినప్పుడు 'మీరు ఆత్మహత్య చేసుకుంటే మేమెలా అడ్డుకోగలం' అంటూ పటేల్ తనదైన శైలిలో హెచ్చరించారని రాజ్‌నాథ్‌సింగ్ వెల్లడించారు.

అధికారికంగా ఎందుకు నిర్వహించరు

కర్ణాటకలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం.. హైదరాబాద్ ముక్త్ దివస్‌ను నిర్వహిస్తుంటే, ఇక్కడెందుకు నిర్వహించరు? ఏం రోగమొచ్చింది? అని రాష్ట్ర ప్రభుత్వాన్ని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి నిలదీశారు. హైదరాబాద్ సంస్థానంలో నాడు రజాకార్ల దౌర్జన్యకాండ జరుగుతున్నప్పుడు పటేల్ చొరవతో భారత సైన్యం యుద్ధం జరిపి ఇక్కడి ప్రజలకు స్వేచ్ఛ, స్వాతంత్ర్యం కల్పించింది. అటువంటి ఘనచరిత్ర గురించి పాలకపక్షాలు ఈ తరానికి తెలియకుండా దుర్మార్గంగా తొక్కిపెట్టాయి. పాఠ్యాంశాల్లో లేకపోవడం, విద్యార్థులకు కళాశాలల్లో చెప్పకపోవడం దారుణం. హైదరాబాద్ ముక్తి దివస్‌కు పేర్లు మార్చి, అమరవీరుల త్యాగాలను, ఫలితాలను, ఆకాంక్షలను అవమానిస్తున్నారు? ఒకవర్గం ఓట్ల కోసం, ఎంఐఎంకు భయపడి తెలంగాణ చరిత్రను వక్రీకరించి అనేక రకాలుగా 'పేర్లు పెడుతున్నారు' అని కిషన్‌రెడ్డి విమర్శించారు. నిజాం నిరంకుశ పాలనకు తెరదించిన రోజు సెప్టెంబరు 17 అని, నాటి ఆపరేషన్ పోలోలో తన కుటుంబసభ్యులు కూడా పాల్గొనడం గర్వంగా భావిస్తున్నానని కేంద్ర సాంస్కృతిక వ్యవహారాల శాఖ మంత్రి గజేంద్రసింగ్ షెకావత్ తెలిపారు.

నిజాం పాలనలో ఎన్నో 'జలియన్ వాలాబాగ్'లు: బండి సంజయ్

నిజాం పాలనలో 'జలియన్ వాలాబాగ్' తరహా మారణకాండలు ఎన్నో జరిగాయని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ అన్నారు. జాతీయ జెండాను ఎగరేశారనే కారణంతో పరకాలలో 1500 మందిని కాల్చి చంపారని తెలిపారు. జలియన్ వాలాబాగ్ ఘటనను ప్రపంచం ముందుంచిన చరిత్రకారులు... అంతకు మించిన పరకాల దురాగతాన్ని, బైరాన్‌పల్లి, గుండ్రాంపల్లి, వెయ్యిఊడలమర్రి ఘటనల్లో రజాకార్ల రాక్షసత్వాన్ని మాత్రం విస్మరించడం దారుణమన్నారు.

వాజ్‌పేయి విగ్రహావిష్కరణ

తెలంగాణ విమోచన దినోత్సవం కార్యక్రమం అనంతరం రక్షణమంత్రి రాజ్‌నాథ్‌సింగ్.. దివంగత ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయి విగ్రహాన్ని ఆవిష్కరించారు. కంటోన్మెంటు పార్కులో ఈ విగ్రహాన్ని ఏర్పాటు చేశారు.

తెలంగాణ విమోచనోద్యమ అమరవీరులకు నా నివాళులు

కేంద్ర హోంమంత్రి అమిత్ షా

న్యూఢిల్లీ, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ విమోచన దినం.. నిజాం, రజాకార్ల నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా ఎంతో మంది తిరుగుబాటు చేసి, భావితరాలు స్వతంత్ర భారతదేశంలో స్వేచ్ఛగా శ్వాసించేలా చేసిన మహోన్నతమైన పోరాటాన్ని స్మరించుకునే రోజు అని కేంద్ర హోంమంత్రి అమిత్ షా అన్నారు. బుధవారం ఎక్స్ వేదికగా స్పందించిన ఆయన.. తెలంగాణ విమోచనోద్యమ అమరవీరులకు నివాళులర్పిస్తున్నట్లు చెప్పారు. రాష్ట్ర ప్రజలకు తెలంగాణ విమోచన దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.

ఆపరేషన్ పోలో చరిత్రను వక్రీకరిస్తూ.. పటేల్‌ను అవమానిస్తున్న బీజేపీ

- పహల్గాం ఘటన తర్వాతా పాక్‌తో క్రికెట్ మ్యాచా?: మహేష్‌గౌడ్



హైదరాబాద్, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): భారత స్వాతంత్ర్య పోరాటంలో కానీ.. తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలోగానీ పాత్రే లేని బీజేపీ.. తన రాజకీయ ప్రయోజనాల కోసం తెలంగాణ విలీన దినోత్సవాన్ని వాడుకుంటోందని టీపీసీసీ చీఫ్ మహేష్‌కుమార్‌గౌడ్ అన్నారు. ఆపరేషన్ పోలో చరిత్రను వక్రీకరిస్తూ విమోచన పేరుతో డ్రామా ఆడుతున్న బీజేపీ.. తద్వారా హైదరాబాద్ రాష్ట్రాన్ని దేశంలో విలీనం చేయడంలో కీలక పాత్ర పోషించిన సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్‌ను అవమానిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. విలీన సమయంలో ఆ పార్టీ ఉనికి ఎక్కడుందని ప్రశ్నించారు. బీజేపీ తీరుతో పటేల్ ఆత్మ క్షోభిస్తుందన్నారు. గాంధీభవన్‌లో బుధవారం ఆయన మీడియాతో చిట్‌చాట్‌గా ఈ మేరకు వ్యాఖ్యలు చేశారు. గాంధీభవన్‌లో నిర్వహించిన విలీన వేడుకల్లోనూ పాల్గొన్న ఆయన మాట్లాడారు. బీజేపీకి చరిత్ర తెలియదని, చరిత్రను వక్రీకరించడం.. తిరగరాయడమే తెలుసునని విమర్శించారు. నెహ్రూ ఆదేశాలతో పటేల్ ఆపరేషన్ పోలో పేరుతో హైదరాబాద్ సంస్థానాన్ని దేశంలో విలీనం చేశారన్నారు. విలీనం కోసం అహర్నిశలు కృషి చేసిన రామానంద తీర్థ, జమాలపురం కేశవరావు, బూర్గుల రామకృష్ణారావు, పీవీ నరసింహరావు వంటి మహనీయులను, నిజాం వ్యతిరేకంగా పోరాడిన కొమురం భీమ్, దొడ్డి కొమురయ్య, చాకలి ఐలమ్మ, షేక్ బందగీ, కమ్యూనిస్టు యోధులను స్మరించడం ప్రతి తెలంగాణ వాసి బాధ్యత అన్నారు. పహల్గాం ఘటన జరిగిన తర్వాత కూడా పాకిస్తాన్‌తో క్రికెట్ మ్యాచ్‌లు ఎందుకు నిర్వహించారని నిలదీశారు. అమిత్‌షా కుమారుడు, బీసీసీఐ అధ్యక్షుడు జైషా ఆధ్వర్యంలోనే ఈ క్రికెట్ మ్యాచ్ జరిగిందన్నారు. విలీన దినోత్సవానికి, కవితకు ఏంటి సంబంధమని, ఆమె చరిత్ర తెలుసుకుని మాట్లాడాలని హితవు పలికారు. రాహుల్ గాంధీ నడిపిస్తున్న 'ఓటు చోరీ ఉద్యమం' బీజేపీ గుండెల్లో వణుకు పుట్టిస్తున్నదన్నారు. కాగా, మదర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలోగాంధీభవన్‌లోని ప్రకాశం హాల్లో జరిగిన కార్యక్రమంలోనూ మహేష్‌కుమార్ మాట్లాడుతూ రాష్ట్రంలో కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయాలన్నసంకల్పంతో ప్రభుత్వం పనిచేస్తోందన్నారు.

కాంగ్రెస్‌లో ఒక స్థాయి వరకే స్వేచ్ఛ

కోమటిరెడ్డి సోదరులు ఏదైనా ముక్కుసూటిగా మాట్లాడతారని మహేష్‌గౌడ్ అన్నారు. అయితే కాంగ్రెస్‌లో ఒక స్థాయి వరకే స్వేచ్ఛ ఉంటుందని, రెడ్‌లైన్ దాటితే ఎవరినీ ఉపేక్షించేది లేదని ఆయన స్పష్టం చేశారు. బీసీల కోసం పోరాడే నేతగా తీన్మార్ మల్లన్నను గౌరవిస్తానని, అయితే ఆయన కాంగ్రెస్ నిర్ణయాలను వ్యతిరేకించినందునే పార్టీ నుంచి సస్పెండ్ చేసినట్లు తెలిపారు. పార్టీలు ఎవరు పెట్టినా స్వాగతిస్తామని ఆయన చెప్పారు.



అనాజ్‌పూర్ సభలో మాట్లాడుతున్న రాఘవులు

భూమి కోసం పోరాడేవారు సాయుధ పోరాట వారసులే

- బీవీ రాఘవులు
- పోరాట చరిత్రను వక్రీకరించడం గర్హనీయం : కూనంనేని
- మహత్తర పోరాటానికి మతం రంగు పూయొద్దు: హరగోపాల్

హైదరాబాద్/ హైదరాబాద్ సిటీ/ అబ్దుల్లాపూర్‌మెట్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): భూమి కోసం పోరాడే వారందరూ తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారసులేనని సీపీఎం కేంద్ర పోలిట్ బ్యూరో సభ్యులు బీవీ రాఘవులు అన్నారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాల్లో భాగంగా రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్‌మెట్ మండలం అనాజ్‌పూర్ గ్రామంలో సీపీఎం ఆధ్వర్యంలో సభ నిర్వహించారు. కార్యక్రమంలో బీవీ రాఘవులు పాల్గొని మాట్లాడుతూ.. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో వందలాది మంది కమ్యూనిస్టులు ప్రాణాలర్పించారని పేర్కొన్నారు. సాయుధ పోరాటం గురించి చెప్పుకొనే హక్కు ఇతర పార్టీలకు లేదన్నారు. అనాజ్‌పూర్ సీలింగ్ పట్టా రైతులకు సీపీఎం అండగా నిలబడుతుందన్నారు. కాగా తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధుల త్యాగాలను, తెలంగాణ ప్రజల పోరాట స్ఫూర్తిని, సమరంలో అసువులు బాసిన అమర వీరుల చరిత్రను బీజేపీ వక్రీకరించడం గర్హనీయమని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు విమర్శించారు. హైదరాబాద్‌లోని సీపీఐ రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన తెలంగాణ విలీన దినోత్సవ వేడుకల సందర్భంగా ఆయన మాట్లాడారు. భూస్వామ్యానికి వ్యతిరేకంగా జరిగిన మహోన్నత పోరాటాన్ని మత ఘర్షణగా బీజేపీ దుష్ప్రచారం చేస్తోందని ప్రముఖ సామాజికవేత్త ఆచార్య హరగోపాల్ విమర్శించారు. సీపీఐ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం 77 వసంతాల వారోత్సవాల ముగింపు సభ జూబ్లీహిల్స్‌లోని రావి నారాయణ రెడ్డి ఆడిటోరియంలో జరిగింది. కార్యక్రమానికి ముఖ్య వక్తగా హాజరైన హరగోపాల్ మాట్లాడుతూ.. రైతాంగ సాయుధ పోరాటంతో సంబంధం లేని బీజేపీ వేడుకలు చేయడం, అందులో రక్షణ శాఖ మంత్రి పాల్గొనడం ఎంతవరకు సమర్థనీయమని ప్రశ్నించారు. ఎమ్మెల్యే కూనంనేని అధ్యక్షతన జరిగిన సభలో ఏపీ ఉమ్మడి హైకోర్టు విశ్రాంత జస్టిస్ చంద్రకుమార్, స్వాతంత్ర్య సమరయోధుడు కంది మళ్ల ప్రతాపరెడ్డి, మీడియా అకాడమీ అధ్యక్షుడు కె. శ్రీనివాసరెడ్డి, ప్రజా గాయని విమలక్క, సీపీఐ జాతీయ కార్యదర్శి సయ్యద్ అజీజ్ పాషా, ఇతర నేతలు చాడ వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీలో 1743 పోస్టుల భర్తీ!

రాష్ట్రం ఏర్పడ్డాక సంస్థ నుంచి తొలి నోటిఫికేషన్.. డ్రైవర్ 1000.. శ్రామిక్ 743 ఖాళీల భర్తీ

- 8 నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ
- నోటిఫికేషన్ జారీ చేసిన పోలీస్ నియామక బోర్డు
- ఆర్టీసీ నియామక విభాగాన్ని పక్కన పెట్టిన వైనం!
- మొత్తం ఖాళీలు 3080.. సగం పోస్టులకే నోటిఫికేషన్

హైదరాబాద్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టీజీఎస్‌ఆర్టీసీ)లో ఉద్యోగాల భర్తీకి తొలి ప్రకటన వెలువడింది. తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డ తర్వాత ఇప్పటి వరకు ఆర్టీసీ నుంచి ఒక్క నోటిఫికేషన్ కూడా ఇవ్వలేదు. ఆర్టీసీలో 3080 పోస్టుల భర్తీకి ప్రభుత్వం ఏడాది కిందట అనుమతి ఇవ్వగా.. అధికారులు తాజాగా నోటిఫికేషన్ జారీ చేశారు. అయితే ఉమ్మడి రాష్ట్రంలో మాదిరిగా ఆర్టీసీ నియామక విభాగం ద్వారా కాకుండా ఈ సారి రాష్ట్ర పోలీస్ నియామక బోర్డు ద్వారా ఖాళీలను భర్తీ చేయనున్నారు. టీజీఆర్టీసీలో డ్రైవర్లు, శ్రామిక్ పోస్టుల భర్తీకి పోలీసు రిక్రూట్‌మెంట్ బోర్డు చైర్మన్ వీవీ శ్రీనివాసరావు బుధవారం నోటిఫికేషన్ విడుదల చేశారు. మొత్తం 1743 పోస్టులు భర్తీ చేయనున్నట్లు ప్రకటించారు. ఇందులో డ్రైవర్ 1000, శ్రామిక్ 743 పోస్టులు ఉన్నాయి. అక్టోబరు 8 నుంచి పోలీసు రిక్రూట్‌మెంట్ బోర్డు అధికారిక వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తులను స్వీకరిస్తారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసేందుకు అక్టోబరు 28 సాయంత్రం 5 గంటల వరకు అవకాశం ఉంటుందని శ్రీనివాసరావు తెలిపారు. విద్యార్హత, ఇతర వివరాల కోసం డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.టీజీపీఆర్‌బీ.ఇన్ వెబ్‌సైట్‌ను సందర్శించాలని సూచించారు. డ్రైవర్లకు పే స్కేల్ రూ.20,960-60,080; శ్రామిక్‌లకు రూ.16,550-45,030 వరకు ఉంటుందని వెల్లడించారు.

మిగతా పోస్టుల భర్తీ ఎన్నడో?

ఆర్టీసీలో మొత్తం 3080 పోస్టుల భర్తీకి సుమారు ఏడాది క్రితం ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. అందులో 2 వేల డ్రైవర్ పోస్టులు ఉన్నాయి. అయితే తాజాగా జారీ చేసిన నోటిఫికేషన్‌లో 1000 డ్రైవర్ పోస్టులనే భర్తీ చేయనున్నట్లు ప్రకటించారు. మిగతా పోస్టుల భర్తీకి ఎప్పుడు నోటిఫికేషన్ వెలువడుతుందోనని నిరుద్యోగులు ఆందోళన చెందుతున్నారు. ఆర్టీసీలో ఉద్యోగ నోటిఫికేషన్ కోసం ఆశగా ఎదురు చూసిన వారు.. సగం పోస్టులకే ప్రకటన ఇవ్వడంతో నిరాశ చెందారు. ఖాళీల భర్తీపై 14 నెలల జాప్యం తర్వాత వెలువడ్డ నోటిఫికేషన్‌లో సగం పోస్టులనే ప్రకటించడం సరికాదని నిరుద్యోగులు వాపోతున్నారు. మిగిలిన పోస్టుల భర్తీకి వీలైనంత త్వరగా నోటిఫికేషన్ ఇవ్వాలని కోరుతున్నారు. మరోవైపు ఆర్టీసీలో కండక్టర్ పోస్టులు పెద్దఎత్తున ఖాళీలు ఉన్నాయి. కనీసం 2 వేల పోస్టుల భర్తీకి అనుమతించాలని అధికారులు ప్రభుత్వానికి ఇప్పటికే విజ్ఞప్తి చేశారు.

ఆర్టీసీ నియామక సెల్ కాకుండా..

ఆర్టీసీలో ఉద్యోగ ఖాళీలను భర్తీ చేసే బాధ్యత పోలీసు నియామక బోర్డుకు అప్పగించడం సంస్థలో చర్చనీయాంశంగా మారింది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 2013లో చివరి సారిగా ఆర్టీసీలో నియామకానికి నోటిఫికేషన్ వెలువడింది. సాధారణంగా ఆర్టీసీలో డ్రైవర్ నుంచి అధికారి వరకు అన్ని పోస్టుల భర్తీ ఆర్టీసీ నియామక విభాగమే చేపడుతుంది. కానీ, తెలంగాణలో తొలిసారి వెలువడిన నోటిఫికేషన్‌లో ఆర్టీసీ సొంత విభాగానికి కాకుండా పోలీస్ బోర్డుకు అప్పగించడం ఏంటని ఉద్యోగులు ప్రశ్నిస్తున్నారు. నిత్యం రద్దీ మార్గాల్లో ప్రయాణికులతో బస్సు నడపడం అంత సులువైన విషయం కాదని, పోలీస్ నియామక బోర్డు చేపట్టే భర్తీ ప్రక్రియ పూర్తయి, కొత్త వారు విధుల్లో చేరేందుకు కనీసం ఆరు నెలలు పడుతుందని ఆర్టీసీ ఉద్యోగులు చెబుతున్నారు.

రాష్ట్రంలో మరో కొత్త పార్టీ

- 'తెలంగాణ రాజ్యాధికార పార్టీ'ని ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించిన తీన్మార్ మల్లన్న
- పార్టీ జెండా, వెబ్‌సైట్ ఆవిష్కరణ
- ఇది బీసీల తలరాత మార్చే రోజు: మల్లన్న



టీఆర్పీ జెండాను ఆవిష్కరిస్తున్న తీన్మార్ మల్లన్న

హైదరాబాద్ సిటీ, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో మరో రాజకీయ పార్టీ ఏర్పాటైంది. బీసీ రిజర్వేషన్లు, రాజ్యాధికారం లక్ష్యంగా కొత్త పార్టీని ఏర్పాటు చేస్తానని ఇటీవల ప్రకటించిన ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న.. బుధవారం హోటల్ తాజ్ కృష్ణ వేదికగా కొత్త పార్టీని ప్రకటించారు. పార్టీ పేరును తెలంగాణ రాజ్యాధికార పార్టీ (టీఆర్‌పీ)గా ప్రకటించిన ఆయన పార్టీ లక్ష్యాలను వెల్లడించారు. బీసీల ఆత్మగౌరవమే ప్రధాన అజెండాగా టీఆర్‌పీని స్థాపిస్తున్నట్లు చెప్పారు. తెలంగాణ గడ్డ మీద మెజారిటీ సంఖ్యలో ఉన్న బీసీలు తమకు ఒక రాజకీయ పార్టీని కోరుకుంటున్నారన్నారు. ఈ రోజు చాలా మంచిరోజు కావడంతో కొత్త పార్టీని ఏర్పాటు చేశామని చెప్పారు. రాష్ట్రంలో బీసీలు బీజేపీ, బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలను బిచ్చాలు అడుక్కునే పరిస్థితి ఈ రోజుతో ముగిసిందన్నారు. రేపటి నుంచి బీసీల ఆత్మగౌరవ జెండా రెపరెపలాడుతుందని పేర్కొన్నారు. సెప్టెంబరు 17కి ఎంతో గొప్ప చరిత్ర ఉందన్నారు. తమిళనాడుకు చెందిన పెరియార్, విశ్వకర్మల జయంతినాడే కొత్త పార్టీని ప్రకటిస్తున్నట్లు చెప్పారు. ఈ రోజును బీసీల తలరాత మార్చే రోజుగా భావిస్తున్నానని పేర్కొన్నారు. పార్టీ అంటే పాన్ డబ్బా కాదని, బీసీల రాజ్యాధికారం కోసం పార్టీ పెడుతున్నామని చెప్పారు. దీని కోసం అందరూ కలిసి రావాలని కోరారు. తాను ఎమ్మెల్సీగా ఏమీ చేయలేదని ఎవరైనా చెబితే తాను రాజీనామా చేయడానికి సిద్ధంగా ఉన్నానని తెలిపారు. బీసీల కోసం పోరాడుతున్నానని అంటేనే ఎమ్మెల్సీగా ఉంటానన్నారు. ఇప్పటి వరకు అసెంబ్లీ మెట్లు ఎక్కని కులాలను అసెంబ్లీలో కూర్చునేలా చేస్తానని చెప్పారు. టీఆర్‌పీ అధ్యక్షుడిగా తీన్మార్ మల్లన్న, వర్కింగ్ ప్రెసిడెంట్లుగా మాదం రజనీకుమార్ యాదవ్, సూదగాని హరిశంకర్ గౌడ్, ప్రధాన కార్యదర్శులుగా వట్టే జానయ్య యాదవ్, సంగెం సూర్యారావు, పల్లెబోయిన అశోక్ యాదవ్, జ్యోతి పండల్ ఎన్నికయ్యారు.

ఎరుపు, ఆకుపచ్చ రంగుల్లో పార్టీ జెండా

టీఆర్‌పీ జెండాను ఎరుపు, ఆకుపచ్చ రంగుల్లో రూపొందించారు. జెండా మధ్యలో పిడికిలి బిగించిన చేయితో పాటు కార్మిక చక్రం, వరి కంకులు ఉన్నాయి. జెండా పై భాగంలో ఆత్మగౌరవం, అధికారం, వాటా నినాదాలను రాశారు. పిడికిలి కింది భాగంలో పార్టీ పేరును ముద్రించారు. బీసీ మేధావి నారగోని చేతుల మీదుగా పార్టీ జెండాను ఆవిష్కరింపజేశారు. ఆకుపచ్చ రంగు రైతులకు, ఎరుపు రంగు పోరాటానికి సూచన అని మల్లన్న చెప్పారు.

పార్టీ అధికార ప్రతినిధిగా 'ఏఐ'

టీఆర్‌పీ అధికార ప్రతినిధిగా కృత్రిమ మేధస్సు (ఏఐ)ను ఎంచుకున్నట్లు తీన్మార్ మల్లన్న ప్రకటించారు. దేశంలో ఒక రాజకీయ పార్టీ అధికార ప్రతినిధిగా ఏఐను ప్రకటించడం ఇదే మొట్టమొదటిసారి అని తీన్మార్ మల్లన్న చెప్పారు. పార్టీ వెబ్‌సైట్ ఆవిష్కరణను సభకు సాధారణ వ్యక్తిగా వచ్చిన యాదగిరి ముదిరాజ్‌తో చేయించారు.

యథావిధిగా ఆరోగ్య శ్రీ సేవలు

» సేవలందిస్తోన్న 87% ఆస్పత్రులు.. వైద్య ఆరోగ్యశాఖ

హైదరాబాద్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో నెట్‌వర్క్ ఆస్పత్రుల్లో ఆరోగ్యశ్రీ సేవలు యథావిధిగా కొనసాగుతున్నాయని వైద్య ఆరోగ్య శాఖ వెల్లడించింది. అనుబంధ ఆస్పత్రుల్లో 87 శాతం రోగులకు ఆరోగ్యశ్రీ సేవలందిస్తున్నాయని తెలిపింది. కేవలం 13 శాతం ఆస్పత్రుల్లోనే సేవలు నిలిచిపోయినట్లు పేర్కొంది. ఆ 13 శాతం ఆస్పత్రులు కూడా వైద్య సేవలు తిరిగి కొనసాగించాలని ఆరోగ్యశ్రీ సీఈవో ఉదయ్ కుమార్ బుధవారం మరోమారు విజ్ఞప్తి చేశారు. ఆరోగ్యశ్రీ కింద గత రెండు వారాలుగా సగటున రోజూ 844 శస్త్రచికిత్సలు నమోదవ్వగా, బుధవారం 799 శస్త్రచికిత్సలు నమోదు అయ్యాయని ఆయన వెల్లడించారు. రోగులకు ఇబ్బంది కలగకుండా ప్రభుత్వ దవాఖానాల్లో ఏర్పాట్లు చేసినట్లు వైద్యశాఖ పేర్కొంది. రాష్ట్రవ్యాప్తంగా ఆరోగ్యశ్రీ అనుసంధాన ఆస్పత్రులు 477 వరకు ఉండగా, అందులో కేవలం 62 సమ్మెలో ఉన్నాయని, మిగిలిన 415 ప్రైవేటు ఆస్పత్రులు యథావిధిగా సేవలందిస్తున్నట్లు తెలిపింది. మరోవైపు ప్రైవేటు నెట్‌వర్క్ ఆస్పత్రుల అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ రాకేశ్ మాత్రం ప్రైవేటు ఆస్పత్రుల్లో ఆరోగ్యశ్రీ, ఈహెచ్‌ఎస్, జేహెచ్‌ఎస్ సేవలన్నిటిని నిలిపివేశామని తెలిపారు. తమ సమ్మె కొనసాగుతోందని ఆయన స్పష్టం చేశారు.

ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెంటల్ హెల్త్‌కు పూర్వవైభవం

» వైద్యమంత్రి దామోదర రాజనర్సింహ



హైదరాబాద్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెంటల్ హెల్త్‌కు పూర్వ వైభవాన్ని తెచ్చేందుకు అవసరమైన సదుపాయాల కల్పనకు పెద్దపీట వేయాలని మంత్రి దామోదర రాజనర్సింహ అధికారులను ఆదేశించారు. ఆసుపత్రిలో మౌలిక సదుపాయాలు, మానవ వనరుల కల్పన, పరికరాల మరమ్మతు, ఆర్వో వాటర్ ప్లాంట్, పారిశుధ్యం, డ్రైనేజీ సిస్టం, అంతర్గత రోడ్లు, రోగులకు సౌకర్యాలు ఏర్పాటు చేయాలని చెప్పారు. ఉస్మానియా వైద్య కళాశాల అనుబంధ ఆసుపత్రుల్లో వైద్య సేవల బలోపేతంపై మంత్రి ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హెల్త్ కార్యాలయంలో బుధవారం ఉన్నత స్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. మెంటల్ హెల్త్‌లో ప్రస్తుత ఓపీ, ఐపీ సేవలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. మెరుగైన వైద్య సేవలు అందించేలా అవసరమైన ప్రతిపాదనలు సమర్పించాలని మంత్రి ఆదేశించారు. ఆసుపత్రిలోని పాత భవనాల పరిస్థితిపై క్షేత్రస్థాయిలో తక్షణమే పర్యటించి వచ్చే రెండు, మూడు రోజుల్లో నివేదిక సమర్పించాలని టీజీఎంఎస్ఐడీసీ ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. సరోజినీ దేవి కంటి ఆస్పత్రిపైనా మంత్రి చర్చించారు.

సాంస్కృతిక శాఖ డైరెక్టర్‌గా నరసింహారెడ్డి

హైదరాబాద్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): భాషా సాంస్కృతిక శాఖ డైరెక్టర్‌గా డాక్టర్ ఏనుగు నరసింహారెడ్డిని నియమిస్తూ ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఇప్పటి వరకు సాంస్కృతిక శాఖ డైరెక్టర్‌గా సేవలు అందించిన మామిడి హరికృష్ణను వ్యవసాయ, సహకార శాఖలో సహకార సంఘాల అదనపు రిజిస్ట్రార్‌గా బదిలీ చేసింది. తెలంగాణ రాష్ట్రం ఆవిర్భావం నుంచి సాంస్కృతిక శాఖ డైరెక్టర్‌గా మామిడి హరికృష్ణ బాధ్యతలు నిర్వహించారు. తెలంగాణ సంస్కృతి-సంప్రదాయాలకు సంబంధించి పలు కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించారు. గత వారం ఆరోగ్య కారణాలతో ఆయన సెలవుపై వెళ్లడంతో ఆ స్థానంలో స్టేట్ ఆర్ట్ గ్యాలరీ డైరెక్టర్ డాక్టర్ కె.లక్ష్మిని ప్రభుత్వం ఇన్‌చార్జ్‌గా నియమించింది. అనంతరం మహ బూబ్‌నగర్ జిల్లా అదనపు కలెక్టర్(రెవెన్యూ)గా పని చేస్తున్న డాక్టర్ ఏనుగు నరసింహారెడ్డిని భాషా సాంస్కృతిక శాఖ డైరెక్టర్‌గా నియమిస్తూ ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి జయేష్‌రంజన్ ఉత్తర్వులు జారీ చేశారు.

వైద్య విద్యార్థులందరికీ రేబిస్ చికిత్సపై శిక్షణ

హైదరాబాద్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): భారత్‌ను 2030 నాటికి రేబిస్ రహిత దేశంగా చేయడంపై కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. ఇందులో భాగంగా జాతీయ స్థాయి కార్యాచరణను సిద్ధం చేసిన ప్రభుత్వం వైద్య కళాశాలలకు కీలక బాధ్యతలు అప్పగించింది. వైద్య విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులందరికీ కుక్క కాటు నిర్వహణ, రేబిస్ చికిత్సపై శిక్షణ ఇవ్వాలని ఆదేశించింది. ఇందుకు సంబంధించి జాతీయ వైద్య కమిషన్(ఎన్ఎంసీ) వైద్య కళాశాలలకు ఇటీవల ఓ అడ్వైజరీ పంపింది. విద్యార్థులకు రేబిస్ చికిత్సపై శిక్షణ ఇవ్వాలని, యాంటీ రేబిస్ టీకా, యాంటీ రేబిస్ సీరం బోధనాస్పత్రుల్లో నిత్యం అందుబాటులో ఉండేలా చూసుకోవాలని ఎన్ఎంసీ సూచించింది. అలాగే, ప్రతీ వైద్య కళాశాల కుక్క కాటు కేసులపై ఓ రిజిష్టర్‌ను నిర్వహించాలని, రేబిస్ అనుమానిత కేసులను రాష్ట్ర ఆరోగ్యశాఖ నోడల్ అధికారికి తెలియజేయాలని పేర్కొంది.

'కమాండ్ సెంటర్'లో ధరణి ఫోరెన్సిక్ ఆడిట్

హైదరాబాద్, సెప్టెంబరు17(ఆంధ్రజ్యోతి): ధరణి అవకతవకలపై వచ్చిన ఆరోపణలను నిగ్గు తేల్చేందుకు చేపట్టనున్న ఫోరెన్సిక్ ఆడిట్ హైదరాబాద్‌లోని కమాండ్ కంట్రోల్ సెంటర్ భవనంలో జరగనుంది. కేరళ సెక్యూరిటీ ఆడిట్ అండ్ అస్యూరెన్స్(కేఎస్ఏఏసీ) సంస్థ ఈ ఫోరెన్సిక్ ఆడిట్ చేయనుంది. ఈ సంస్థ కార్యకలాపాల నిర్వహణకు కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో కార్యాలయం ఏర్పాటు చేస్తున్నారు. ఇందుకు సంబంధించి సీసీఎల్ఏ ఏర్పాట్లు చేస్తోంది. రెండ్రోజుల క్రితం పది కంప్యూటర్లు, ఇతర సాంకేతిక పరికరాలను సమకూర్చేందుకు ఆదేశాలిచ్చింది. ఫోరెన్సిక్ ఆడిట్‌కు అవసరమైన సిబ్బందిని, సాంకేతిక సహకారాన్ని అందించాలని తెలంగాణ టెక్నాలజీ సర్వీసెస్ లిమిటెడ్‌ను ఆదేశించింది. కాగా, సిద్దిపేట, సిరిసిల్ల జిల్లాల్లో ప్రయోగాత్మకంగా ఇప్పటికే ఫోరెన్సిక్ ఆడిట్ నిర్వహిస్తున్న కేఎస్ఏఏసీ.. ఆ జిల్లాలో ప్రక్రియ పూర్తవ్వగానే రాష్ట్ర వ్యాప్తంగా ఆడిట్ నిర్వహిస్తుంది. అయితే, కేఎస్ఏఏసీ సంస్థ కార్యాలయం కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో ఏర్పాటు అంశం ప్రస్తుతం చర్చనీయాంశమైంది.

రైతులకు పరిహారం ఇప్పించడమే పాపమా?

» ములుగు కలెక్టర్‌పై బీఆర్ఎస్ నేత వెకిలి మాటలెందుకు?

» ఆ నాయకుడిని వారించకుండా కేటీఆర్ నవ్వడం పైశాచికం

» రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క ఆగ్రహం

ములుగు, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): చిత్తశుద్ధితో పనిచేస్తున్న ఐఏఎస్ అధికారులపై అనుచిత వ్యాఖ్యలు చేయడం బీఆర్ఎస్ నేతలకు అలవాటుగా మారిందని పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క మండిపడ్డారు. ములుగు నియోజకవర్గానికి చెందిన ఓ బీఆర్ఎస్ నాయకుడు హైదరాబాద్‌లో జరిగిన ఆ పార్టీ సమావేశంలో ములుగు కలెక్టర్ దివాకర్‌ను ఉద్దేశించి వెకిలిగా మాట్లాడితే వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వారించకపోగా నవ్వారని, ఇది పైశాచికమని ఆగ్రహం వ్యక్తం చేశారు. "జిల్లాలో నకిలీ విత్తనాల కారణంగా నష్టపోయిన రైతులకు పరిహారం ఇప్పించడమే కలెక్టర్ చేసిన పాపమా" అని ప్రశ్నించారు. ములుగులో సీతక్క మాట్లాడారు. విత్తన కంపెనీలో దళారిగా పనిచేసే బీఆర్ఎస్ నాయకుడు నర్సింహమూర్తి.. కేటీఆర్ ముందుకు పోయి బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే కలెక్టర్‌ను రాష్ట్రంలో ఉండనీయొద్దని, అందుకు తన మొత్తం ఆస్తిని పార్టీకి రాసిస్తానని అనడం ఆ పార్టీ నాయకుల మనస్తత్వాన్ని తెలియజేస్తోందన్నారు. "కేటీఆర్ మీ వెంట ఉన్నదెవరు.. రైతు ప్రయోజకులా... దళారులా" అని ప్రశ్నించారు.

దసరాకు ఆర్ఎస్ బ్రదర్స్ ఆఫర్లు

» 'దసరా బ్లాక్ బస్టర్ స్పాట్ గిఫ్ట్స్' పేరుతో తక్షణ కానుకలు

హైదరాబాద్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): దసరా పండుగ సందర్భంగా షాపింగ్ చేసే వారికి ఆర్ఎస్ బ్రదర్స్ శుభవార్త చెప్పింది. 'దసరా బ్లాక్ బస్టర్ స్పాట్ గిఫ్ట్స్' పేరుతో తక్షణ కానుకలు అందజేయనున్నట్టు సంస్థ తెలిపింది. ఈ ఆఫర్ కొద్ది రోజులే అందుబాటులో ఉంటుందని బుధవారం ఓ ప్రకటనలో పేర్కొంది. రూ.2 వేల విలువ చేసే ప్రతీ కొనుగోలుపై విశేషమైన బహుమతులను అందించనున్నారు. అలాగే, రూ.4,495 విలువైన స్వర్ణ పట్టుచీర కొనుగోలుపై అదనంగా రూ.45 చెల్లిస్తే మరో చీర ఉచితంగా పొందవచ్చు. అంతేకాకుండా, రూ.4,995 విలువైన పట్టుచీర కొనుగోలుపై ఒక మిక్సీ గ్రైండర్ ఉచితంగా ఇస్తారు. లేడీస్ వెస్ట్రన్ వేర్, మెన్స్‌వేర్, కిడ్స్‌వేర్ కొనుగోళ్ల పైనా తక్షణ కానుకలు అందజేస్తామని ఆర్ఎస్ బ్రదర్స్ ప్రకటించింది.

మెట్రో రైల్ నుంచి ఎల్ అండ్ టీ ఔట్?

(మొదటి పేజీ తరువాయి)

పలుమార్లు చెప్తోంది. అంతర్గతంగా లేఖలు రాస్తోంది. అయితే రాష్ట్ర ప్రభుత్వం కూడా ఎల్ అండ్ టీ పెట్టిన ప్రతిపాదనను తీవ్రంగానే పరిగణిస్తోందని సమాచారం. రెండో దశ కింద మొదటి విడతలో రూ.24,259 కోట్లు, మలి విడతలో రూ.19,450 కోట్లతో మెట్రో విస్తరణను ప్రభుత్వమే చేపడుతుందని సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించిన సంగతి తెలిసిందే. హెచ్ఎండీఏ పరిధిలోని నలు మూలలనూ మెట్రోతో కనెక్ట్ చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. ఇంత భారీ విస్తరణ చేయడానికి సిద్ధమైన తరుణంలో.. మొదటి విడత మెట్రో నిర్వహణ బాధ్యతను కూడా తీసుకోవడం వల్ల ఇబ్బంది ఏమీ ఉండదన్న భావన ప్రభుత్వ వర్గాల్లో వ్యక్తమవుతోంది. అయితే తమంత తాముగా ఆ ప్రతిపాదన పెట్టబోమని.. ఎల్ అండ్ టీ అంటే మాత్రం దానికి పచ్చజెండా ఊపేయాలనే ఉద్దేశంతో ఉన్నట్లు సమాచారం. మొదటి దశకు, రెండో దశ కింద చేపట్టనున్న మెట్రో ప్రాజెక్టుకు మధ్య అనుసంధానం, సమన్వయం అన్నీ బాగుండాలంటే.. మొత్తం నిర్వహణ ఒకే గొడుగు కింద ఉంటే బాగుంటుందా? అన్న చర్చ కూడా ప్రభుత్వంలో అంతర్గతంగా జరిగిందని తెలిసింది. చాలా రాష్ట్రాల్లో ప్రభుత్వాలే మెట్రోను నిర్వహిస్తున్నందున.. రాష్ట్రంలో కూడా అదే తరహాలో చేయవచ్చనే ఆలోచన ఉంది. దీనికోసం అవసరమైతే ఒక స్పెషల్ పర్పస్ వెహికల్ ఏర్పాటు చేసి ముందుకెళ్లాలన్న ఆలోచనా ఉందని ప్రభుత్వ వర్గాలు చెప్తున్నాయి. నిధుల సమీకరణకు ఈ పని ఉపకరిస్తుందని ఆ వర్గాలు పేర్కొంటున్నాయి.

ఇతర రాష్ట్రాల్లో ప్రభుత్వ ఆధీనంలోనే..

మెట్రో రైల్వే నిర్వహణకు సంబంధించి హైదరాబాద్‌తోపాటు ఢిల్లీ, బెంగళూరు, ముంబై, చెన్నై, కొచ్చి, లఖ్‌నవూ, నాగపూర్, పుణే, అహ్మదాబాద్‌లో నడుస్తున్నాయి. ఇవన్నీ రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో చేపట్టారు. వాటి నిర్వహణకు ప్రత్యేక కార్పొరేషన్లు (ఎస్‌పీవీ) ఏర్పాటు చేశారు. వీటిలో అత్యధికం లాభాల బాటలో నడుస్తున్నాయి. మరికొన్ని నష్టాల్లో నడుస్తున్నట్లు వారి ఆదాయ వ్యయాలను బట్టి తెలుస్తోంది. అయినప్పటికీ అక్కడి ప్రభుత్వాలు ఆ నష్టాలను భారంగా చూడట్లేదు. వాణిజ్యపరంగా చూడకుండా ప్రజారవాణా కోణంలో చూస్తున్నాయి. కొవిడ్ సమయంలో హైదరాబాద్ మెట్రోకే కాకుండా అన్ని మెట్రోలకూ నష్టాలు వచ్చాయి. 2023-24 ఆర్థిక సంవత్సరంలో నమ్మ మెట్రో(బెంగళూరు) లాభాల్లో నడిచినట్లు గణాంకాలు విడుదల చేసింది. అదే ఏడాది కొచ్చి మెట్రో కూడా ఆపరేటింగ్ లాభాన్ని చూపింది. హైదరాబాద్ మెట్రోను పీపీపీ మోడల్‌లో ఏర్పాటు చేయడమే కాకుండా దానికి ప్రభుత్వ భూములు కూడా ఇచ్చారు. సుమారు 90% నిధులను బ్యాంకుల నుంచి రుణంగా తీసుకున్నారు. భూములను సక్రమంగా సద్వినియోగం చేసుకోకపోవడమే మెట్రో ప్రస్తుత పరిస్థితికి కారణమని అధికారులు చెబుతున్నారు. దీంతోపాటు హైదరాబాద్ మెట్రో స్టేషన్లలో 90 శాతం స్టేషన్లకు పార్కింగ్ సౌలభ్యం లేకపోవడం కూడా ప్రాజెక్టు విజయవంతం కాకపోవడానికి మరో కారణంగా చెబుతున్నారు.

ఫాంహౌజ్‌లో దాక్కున్నా లాక్కొచ్చి లోపలేస్తాం!

(మొదటి పేజీ తరువాయి)



ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం ప్రథమ బహుమతి అందుకోవడం మనకు గర్వకారణం. గంజాయి, డ్రగ్స్ విషయంలో ఎంత పెద్ద వారున్నా, ఎవరి మిత్రులున్నా, ఎవరి బంధువులున్నా వదిలేది లేదు. రాజకీయాల్లో హోదాలున్న వారికి బంధువులుండొచ్చు.. ఆ బంధువులకు ఫాంహౌజ్‌లు ఉండొచ్చు.. కానీ ఆ ఫాంహౌజ్‌లను డ్రగ్స్‌కు కేంద్రాలుగా మార్చి దందా చేస్తామంటే ఎంతటి వారినైనా మా ప్రభుత్వం కఠినంగా శిక్షిస్తుంది" అని తేల్చిచెప్పారు.

గేమ్ చేంజర్‌గా తెలంగాణ రైజింగ్- 2047

తెలంగాణ రైజింగ్ 2047 ప్రణాళిక రాష్ట్ర అభివృద్ధికి గేమ్ చేంజర్‌గా నిలుస్తుందని, అందుకు సంబంధించిన డాక్యుమెంట్‌ను సిద్ధం చేస్తున్నామని సీఎం రేవంత్‌రెడ్డి చెప్పారు. తెలంగాణ అభివృద్ధిలో భాగస్వాములు కావాలనుకునేవారు, మేధావులు ఈ ప్రణాళిక కోసం సలహాలు, సూచనలు ఇవ్వాలని కోరారు. డిసెంబర్ 9 నాటికి ప్రణాళికను ప్రజలకు అందిస్తామన్నారు. అది తెలంగాణ ముఖచిత్రాన్ని మార్చబోతోందని, యువతకు ఉజ్వల భవిష్యత్తును అందించబోతోందని చెప్పారు. శంషాబాద్‌కు కూతవేటు దూరంలో నిర్మిస్తున్న ఫ్యూచర్ సిటీ.. రాష్ట్ర ఆదాయాన్ని పెంచడమే కాకుండా.. ఆర్థిక రంగంలో నిలదొక్కుకునేలా చేస్తుందన్నారు. కానీ కొంతమంది అసూయ, అక్కసుతో ప్రజలను రెచ్చగొట్టి, అభివృద్ధిని అడ్డుకోవాలని చూస్తున్నారని మండిపడ్డారు. ఫ్యూచర్ సిటీ కోసం భూములు కోల్పోతున్న రైతులకు సరైన నష్ట పరిహారం అందించి ఆదుకుంటామని చెప్పారు. అహంకారపు ఆలోచనలు, బంధుప్రీతి, ఆశ్రిత పక్షపాతానికి తమ ప్రభుత్వంలో తావులేదని సీఎం రేవంత్ పేర్కొన్నారు. కష్టమైనా, నష్టమైనా ప్రజలతో ప్రతీదీ పంచుకుంటున్నామన్నారు. ఏవైనా తప్పులు దొర్లితే సరిదిద్దుకుంటున్నామని చెప్పారు. విద్యనే మనందరి విజయానికి వజ్రాయుధమని నమ్ముతున్నామని, విద్యా వ్యవస్థలో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుడుతున్నామని తెలిపారు. ఇందిరమ్మ ఇళ్లు పేదల ఆత్మగౌరవ ప్రతీకలని, ఈ ఏడాదిలోనే నాలుగున్నర లక్షల మంది పేదలు సొంతింటి వారవుతున్నారని సీఎం చెప్పారు. 2027 డిసెంబర్ 9 నాటికి ఎస్ఎల్‌బీసీని పూర్తి చేసి, ప్రజలకు అంకితం చేసే లక్ష్యంతో ముందుకు సాగుతున్నామని తెలిపారు.

రాచరికానికి ఘోరీ కట్టి, ప్రజా పాలన వచ్చిన రోజు..

తెలంగాణలో రాచరికానికి ఘోరీ కట్టి, ప్రజాపాలనకు హారతి పట్టిన రోజు సెప్టెంబర్ 17 అని సీఎం రేవంత్ పేర్కొన్నారు. అణచివేత, పెత్తందారీతనం, నియంతృత్వం, బానిసత్వం సంకెళ్లను బద్దలు కొట్టి స్వేచ్ఛకు ఊపిరిపోయడానికి వందలాది మంది ప్రాణత్యాగం చేశారని గుర్తు చేశారు. ఎన్నో ఆశలు, ఆకాంక్షలతో మొదలైన తెలంగాణ స్వరాష్ట్ర ప్రస్థానం తిరిగి నియంతృత్వ నిర్బంధంలోకి జారిపోయిన తీరును గడిచిన పదేళ్లలో చూశామన్నారు.

విద్యా రంగం సమూల ప్రక్షాళనే మా ధ్యేయం: సీఎం రేవంత్

మూడేళ్ల డిగ్రీ, నాలుగేళ్ల ఇంజనీరింగ్ బోధించి పట్టాలిచ్చి పంపే చదువులతో ఎవరికీ ఉపయోగం లేదని, ఉద్యోగాలిచ్చే చదువులు కావాలని సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. ఆ దిశలో విద్యా రంగాన్ని సమూల ప్రక్షాళన చేసి, నూతన విద్యా విధానాన్ని ప్రవేశపెడతామని చెప్పారు. ఈ అంశంపై బుధవారం సచివాలయంలో విద్యాశాఖ ఉన్నతాధికారులు, విద్యావేత్తలు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీలతో నిర్వహించిన సమావేశంలో సీఎం మాట్లాడారు. "ప్రస్తుత విద్యా విధానంలో భాష ఉన్న వారి దగ్గర జ్ఞానం లేదు. జ్ఞానం ఉన్న చోట భాష లేదు. రెండూ ఉన్న చోట నైపుణ్యాలు లేవు. ఇకపై ఈ మూడింటి కలబోతగా విద్య ఉండాలి. క్షేత్రస్థాయి పరిస్థితులు, అధ్యయనం, భవిష్యత్ అవసరాలకు తగినట్టు తెలంగాణ విద్యా విధానం రూపొందాలి. అది భారతదేశ విద్యా విధానానికి దిక్సూచిలా ఉండాలి" అని చెప్పారు. వచ్చే 25 ఏళ్ల వరకు విద్యా వ్యవస్థకు దిశానిర్దేశం చేసేలా తెలంగాణ విద్యా విధానం ఉండాలని అధికారులకు సూచించారు. డిసెంబరు 9వ తేదీన ఆవిష్కరించనున్న తెలంగాణ విజన్ డాక్యుమెంట్-2047లో తెలంగాణ విద్యా విధానానికి చోటు కల్పిస్తామని వెల్లడించారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని సమగ్రంగా వినియోగించుకునేలా కొత్త విధానం ఉండాలని.. ఎంత వ్యయానికైనా వెనకాడబోమన్నారు. సరళీకృత ఆర్థిక వ్యవస్థ అమల్లోకి వచ్చాక దేశ, విదేశాల్లో ఉపాధి అవకాశాలు భారీగా పెరిగినా.. సరైన నైపుణ్యాలు లేక వాటిని అందిపుచ్చుకోలేక పోతున్నారని సీఎం పేర్కొన్నారు. అందుకే నైపుణ్యాల పెంపుపై ప్రత్యేకంగా దృష్టిపెడుతున్నామని చెప్పారు. తాము అధికారంలోకి రాగానే ఉపాధ్యాయ నియామకాలు చేపట్టామని.. ఉపాధ్యాయులు బోధనపై దృష్టిపెట్టేలా వారికి ప్రమోషన్లు, బదిలీలు కల్పించామని వివరించారు. ఆశించిన స్థాయిలో తెలంగాణ విద్యా విధానం అమలయ్యేందుకు వివిధ ఫౌండేషన్లు, ఎన్జీవోల సహకారం తీసుకోవాలని అధికారులకు సీఎం సూచించారు.

మోదీజీ హ్యాపీ బర్త్‌డే టూ యూ: సీఎం రేవంత్

హైదరాబాద్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): ప్రధాని మోదీ పుట్టినరోజు సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. "మోదీ జీ హ్యాపీ బర్త్ డే టూ యూ" అంటూ రేవంత్ తన ఎక్స్ ఖాతాలో పోస్టు చేశారు. ఆయురారోగ్యాలతో సంతోషంగా ఉండాలని కోరుకున్నారు.

నాణ్యమైన విద్య.. నైపుణ్యాల పెంపుపై దృష్టి

విద్యా కమిషన్, ఇతర భాగస్వాములతో విస్తృత సంప్రదింపులు జరిపామని, విద్యార్థి కేంద్రంగా బోధన ఉండాలనేది తమ అభిప్రాయమని తెలంగాణ విద్యా విధానంపై ఏర్పాటు చేసిన కమిటీ చైర్మన్ కేశవరావు చెప్పారు. ప్రొఫెసర్ హరగోపాల్ మాట్లాడుతూ.. నూతన విద్యా విధానం కొలువుల సాధనకే కాకుండా అత్యుత్తమ మానవుడిగా తీర్చిదిద్దేదిగా ఉండాలని అభిప్రాయపడ్డారు. పారిశ్రామిక అవసరాలకు అనుగుణంగా ఇప్పటికే ఉన్నత విద్యలో పాఠ్యాంశాలను మార్చామని, పట్టా పొందిన ప్రతీ విద్యార్థికి ఉద్యోగం కల్పించడమే లక్ష్యంగా పారిశ్రామిక సంఘాలతో ఒప్పందాలు కుదుర్చుకుంటున్నామని తెలంగాణ ఉన్నత విద్యామండలి అధ్యక్షుడు బాలకిష్టారెడ్డి వివరించారు. ఈ సమావేశంలో టీచర్ ఎమ్మెల్సీలు పింగిలి శ్రీపాల్‌రెడ్డి, మల్కా కొమరయ్య, ప్రభుత్వ సీఎస్ కె.రామకృష్ణారావు, విద్యా కమిషన్ చైర్మన్ ఆకునూరి మురళి తదితరులు పాల్గొన్నారు.

వినూత్నంగా విద్యా బోధన

» పిల్లలకు అర్థమయ్యేలా పాఠాలు

» మెదక్ జిల్లా అద్మాపూర్ ప్రాథమిక పాఠశాల గణితం టీచర్ ప్రత్యేకత

» ఆయన యూట్యూబ్ చానల్‌కు దేశ విదేశాల్లో విస్తృత ఆదరణ

» ఇటీవలే ఉత్తమ టీచర్‌గా అవార్డు

నర్సాపూర్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు సులభంగానేకాకుండా ఆసక్తితో పాఠాలను నేర్చుకునేలా వినూత్నరీతిలో బోధిస్తూ తన ప్రత్యేకతను చాటుకుంటున్నారు మెదక్ జిల్లా నర్సాపూర్ మండలం అద్మాపూర్ ప్రాథమిక పాఠశాలలో పనిచేస్తున్న గణితం మాస్టారు రవిరాజ్. పాఠాలను ఆటల మేళవింపుతో నేర్చుకునేందుకు వీలుగా బోర్డ్ గేమ్స్, పజిల్స్‌ను ఆయన ప్రవేశపెట్టారు. వీటితో విద్యార్థుల్లో పాఠాల పట్ల ఆసక్తి పెరుగుతూ సులభంగా నేర్చుకుంటున్నారు. విద్యార్థులకు పాఠాలు అర్థమయ్యేందుకు దోహదపడే పరికరాలను ఆయన సొంత డబ్బుతో కొనుగోలు చేశారు. రవిరాజ్ వినూత్న బోధనకు ఆకర్షితులై అద్మాపూర్ పాఠశాలలో విద్యార్థుల సంఖ్య క్రమంగా పెరుగుతోంది. గతేడాది పాఠశాలలో 53 మంది విద్యార్థులు ఉండగా.. ఇప్పుడు 73కు చేరింది. ఇంతకు ముందు పాఠశాలకు హాజరయ్యే విద్యార్థుల సంఖ్య 45 శాతం ఉంటే.. రవిరాజ్ బోధన విధానంతో విద్యార్థుల్లో ఆసక్తి పెరిగి హాజరు శాతం ఏకంగా 95 శాతానికి ఎగబాకింది. ఆయన వినూత్న బోధనకు గుర్తింపుగా సెప్టెంబరు 5న రాష్ట్రస్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయుడిగా అవార్డు అందుకున్నారు. కాగా రవిరాజ్ ప్రారంభించిన యూట్యూబ్ చానల్ ఎల్లలుదాటుతోంది. కొవిడ్ లాక్‌డౌన్ సమయంలో 'రవిరాజ్ మాస్టర్' పేరుతో ఆయన యూట్యూబ్ చానల్ ప్రారంభించారు. విద్యార్థులు సులభంగా గణితం బేసిక్స్‌ను అర్థం చేసుకునేలా తనదైన శైలిలో వీడియోలను పోస్ట్ చేయడం మొదలెట్టారు. ఈ చానల్‌లో 1,600కు పైగా వీడియోలున్నాయి. ఇప్పుడు ఈ చానల్‌కు 2మిలియన్లకుపైగా సబ్‌స్క్రైబర్లున్నారు. 20 కోట్లకు పైగా వ్యూస్ లభించాయి. ఆయన పాఠాలకు విద్యార్థుల నుంచి ప్రశంసలు లభిస్తున్నాయి.

విద్యార్థుల్లో ఆసక్తి పెరగాలనే..



విద్యార్థులు ఆసక్తిగా నేర్చుకోవాలనే ఉద్దేశంతో పాఠశాలలో వినూత్న రీతిలో బోధన చేస్తున్నా. పాఠ్యాంశాల బోధనేకాకుండా అవసరమయ్యే పరికరాలు సొంత ఖర్చుతో కొని వాటిని ప్రత్యక్షంగా విద్యార్థులకు చూపుతున్నా. కొవిడ్ సమయంలో ఇంటి వద్దనే ఉన్న విద్యార్థులకు విద్యను అందించేందుకు యూట్యూబ్ చానల్ ప్రారంభించాను. ఇప్పుడు లక్షలాది మంది నా వీడియోలు చూస్తున్నందుకు సంతోషంగా ఉంది. నా వీడియోలను మానిటైజ్ చేసుకోలేదు. నా వీడియోలను సామాజిక సేవగానే తప్ప ఆదాయ వనరుగా చూడటం లేదు.


\- రవిరాజ్, గణితం ఉపాధ్యాయుడు

ఎస్పీడీసీఎల్, ఎన్పీడీసీఎల్ల.. పరపతి పెంచేందుకే కొత్త డిస్కమ్!

» పూర్తిగా వాణిజ్య కార్యకలాపాలకే పాత డిస్కమ్‌లు

» కొత్త డిస్కమ్‌కు 28.90 లక్షల కనెక్షన్ల బదలాయింపు

» రూ.71,964 కోట్ల అప్పులు, బాకీలు, కరెంట్ కొనుగోళ్ల బకాయిలు కూడా..



హైదరాబాద్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని విద్యుత్ పంపిణీ సంస్థలైన ఎస్పీడీసీఎల్, ఎన్పీడీసీఎల్‌ల పరపతి పెంచడానికే కొత్త డిస్కమ్ పెట్టాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. కరెంట్ కొనుగోళ్ల రూపేణా భారీగా పేరుకుపోయిన బకాయిలు, కరెంట్ సరఫరా చేసినా వివిధ ప్రభుత్వ శాఖల నుంచి వసూలు చేసుకోలేని మొండి బకాయిలు, రోజురోజుకూ పెరుగుతున్న అప్పులు పాత డిస్కమ్‌లకు భారంగా మారాయి. ఈ నేపథ్యంలో కొత్త డిస్కమ్ ఏర్పాటు సాధ్యాసాధ్యాలను పరిశీలించాలని, ప్రభుత్వ పథకాల కోసమే దీనిని ఏర్పాటు చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి సూచించగా.. ఆ మేరకు కొత్త డిస్కమ్‌కు రూపునిచ్చే పనిలో ఇంధన శాఖ నిమగ్నమైంది. ఇప్పటికే రెండు దఫాలుగా సీఎం రేవంత్‌రెడ్డి వద్ద సమావేశాలు జరగ్గా.. రానున్న అక్టోబరులో మరోమారు ఈ అంశంపై సీఎం సమీక్షించనున్నారు. ఆ తర్వాత మంత్రివర్గంలో చర్చించిన అనంతరం కొత్త డిస్కమ్‌ను ఏర్పాటు చేస్తారు. ఈ క్రమంలో డిస్కమ్‌కు అవసరమైన లైసెన్సును ప్రభుత్వం పొందనుంది. ఇక ఎస్పీడీసీఎల్, ఎన్పీడీసీఎల్‌ను పూర్తిగా వాణిజ్య కార్యకలాపాలకే పరిమితం చేయనున్నారు. కొత్తగా ఏర్పాటు చేయనున్న డిస్కమ్‌కు రెండు డిస్కమ్‌ల పరిధిలో ఉన్న 28,90,686 కనెక్షన్లను బదలాయించనున్నారు. వీటిలో వ్యవసాయ రంగానికి 24 గంటల పాటు కరెంట్ ఇస్తున్న 28,89,921 పంపుసెట్లతో పాటు కాళేశ్వరం, పాలమూరు-రంగారెడ్డి, సీతారామ ఎత్తిపోతల పథకాల పంపులకు సంబంధించిన 429 కనెక్షన్లు, హైదరాబాద్ మెట్రోవాటర్ సప్లై సీవరేజీ బోర్డు(వాటర్ బోర్డు)కు చెందిన 60 కనెక్షన్లు, గ్రామీణ తాగునీటి సరఫరా వ్యవస్థ(ఆర్‌డబ్ల్యూఎస్-మిషన్ భగీరథ)కు సంబంధించి 276 కనెక్షన్లు కొత్త డిస్కమ్ పరిధిలోకి రానున్నాయి. ఈ కనెక్షన్లకు విద్యుత్‌ను సరఫరా చేసే పంపిణీ ట్రాన్స్‌ఫార్మర్లు(డీటీఆర్)లకు స్మార్ట్ మీటర్లు బిగించనున్నారు. అన్ని డీటీఆర్‌ల నుంచి ఎంత విద్యుత్ సరఫరా అవుతుందనే సమాచారం ఆన్‌లైన్‌లోనే రికార్డు కానుంది.

భారీగా బాకీల్లో రెండు డిస్కమ్‌లు

రాష్ట్ర జెన్‌కోలకు గత జూలై 31వ తేదీ నాటికి రెండు డిస్కమ్‌లు(ఎస్పీడీసీఎల్, ఎన్పీడీసీఎల్)లు కలిపి రూ.26,950 కోట్లు చెల్లింపులుచేయాల్సి ఉంది. అంతే కాకుండా కేంద్రప్రభుత్వ సంస్థలకు రూ.2,466 కోట్లు, ఇండిపెండెంట్ పవర్ ప్రొడ్యూసర్లు(ఐపీపీ)లకు రూ.2281 కోట్ల చెల్లింపులు డిస్కమ్‌లు చేయాల్సి ఉంది. ఇందులో రూ.26,950 కోట్లు రాష్ట్ర జెన్‌కోల నుంచి కరెంట్ కొనుగోలు చేసిన బకాయిలను కొత్త డిస్కమ్‌కు బదలాయించనున్నారు. ఇక వివిధ ప్రభుత్వ శాఖలు డిస్కమ్‌లకు రూ.45,398 కోట్లు బకాయిలు చెల్లించాల్సి ఉంది. విద్యుత్ వినియోగిస్తున్నా ప్రభుత్వ శాఖలు బిల్లులు కట్టడం లేదు. నీటిపారుదలశాఖకు చెందిన ఎత్తిపోతల పథకాల వాటానే ఇందులో రూ.22,926 కోట్లు ఉండగా.. హైదరాబాద్ మెట్రో వాటర్ బోర్డు ఏకంగా రూ.7084 కోట్లు, మిషన్ భగీరథ కింద రూ.5972 కోట్లు బిల్లులు డిస్కమ్‌లకు రావాల్సిఉంది. ఇవీ కాకుండా పురపాలకశాఖ రూ.2383 కోట్లు, కేంద్రప్రభుత్వరంగ సంస్థలు రూ.909 కోట్లు, ఇతర ప్రభుత్వ శాఖలు రూ.459 కోట్లు, పంచాయతీరాజ్/గ్రామీణాభివృద్ధి శాఖ కూడా రూ.5665 కోట్లు చెల్లించాల్సి ఉంది. ఇవన్నీ కలుపుకొని రూ.45,398 కోట్లు ఉండగా.. అందులో ప్రధానంగా ఎత్తిపోతల పథకాలకుచెందిన రూ.22,926 కోట్లు, వాటర్‌బోర్డుకు చెందిన రూ.7084 కోట్లు, మిషన్ భగీరథకు చెందిన రూ.5972 కోట్లు కలుపుకొని రూ.35,982 కోట్లను కొత్తగా ఏర్పడనున్న డిస్కమ్‌ల ఖాతాలో వేయనున్నారు. ప్రభుత్వ శాఖలు చెల్లించాల్సి ఉన్న రూ.35,982 కోట్లతో పాటు రెండు డిస్కమ్‌లకు చెందిన రుణంలో కొంత రూ.9032 కోట్లు, ఇక జెన్‌కోలకు డిస్కమ్‌లు కట్టాల్సిన కరెంట్ బకాయిలు రూ.26,950 కోట్లను కొత్త డిస్కమ్‌కు బదలాయించనున్నారు. మొత్తం రూ.71,964 కోట్ల కరెంట్ బిల్లులు, కరెంట్ కొనుగోలు చెల్లింపుల బకాయిలు, రుణాలు కొత్త డిస్కమ్‌కు చేరనున్నాయి. ఇక కేంద్ర విద్యుత్ మంత్రిత్వశాఖ నుంచి కన్సెల్టీగా డిస్కమ్‌లకు రేటింగ్ ఇస్తుండగా.. అన్నింట్లోనూ తెలంగాణ డిస్కమ్‌లు ఆర్థికంగా అట్టడుగు స్థానంలో రేటింగ్‌లు పొందుతున్నాయి. ప్రభుత్వ పథకాల కోసం ప్రత్యేక డిస్కమ్ పెడితేనే.. డిస్కమ్‌ల ఆర్థిక పరపతి పెరిగే అవకాశముంది. ఇప్పటికే పొందిన రుణాలను పునర్ వ్యవస్థీకరించుకొని తక్కువ వడ్డీ తో.. మళ్లీ రుణాలు పొందాలని ఎస్పీడీసీఎల్, ఎన్పీడీసీఎల్‌లు యోచిస్తున్నాయి. పరపతి పెరిగితే వడ్డీలో రాయితీ కూడా పెరుగుతుందనే భరోసాతో ఉన్నాయి.

2 వేల మందితో కొత్త డిస్కమ్

చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్(సీఎండీ), డైరెక్టర్లతో పాటు ఇద్దరు చీఫ్ ఇంజనీర్లు, 10 మంది సూపరింటెండెంట్ ఇంజనీర్లు, 38 మంది డివిజనల్ ఇంజనీర్లు, 90 మంది అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్లు, 520 మంది అసిస్టెంట్ ఇంజనీర్లు/సబ్ ఇంజనీర్లు, 1000మంది ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్ సిబ్బందితో పాటు/ఆర్టిజన్లు, 340 మంది అకౌంట్స్, పరిపాలన సిబ్బంది కలుపుకొని 2 వేల మంది కొత్త డిస్కమ్‌కు అవసరమని ప్రభుత్వం అంచనా వేసింది.

సైబర్ నేరగాళ్ల వేధింపులు.. ప్రాణాలు కోల్పోయిన విశ్రాంత వైద్యురాలు

» డిజిటల్ అరెస్టు పేరిట బెదిరించి రూ.6.6 లక్షల కొట్టేశారు

» వేదనకు గురై గుండెపోటుతో మరణించిన విశ్రాంత డాక్టర్

హైదరాబాద్‌సిటీ, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): సైబర్ నేరగాళ్ల ఉచ్చులో పడిన ఓ విశ్రాంత వైద్యురాలు.. సొమ్ములు పోగొట్టుకోవడమేగాక ప్రాణాలు కూడా కోల్పోయారు. హైదరాబాద్‌లోని మలక్‌పేటకు చెందిన 76 ఏళ్ల విశ్రాంత వైద్యురాలు ఇటీవల గుండెపోటుతో మృతి చెందారు. ఆమె ఫోన్‌ను పరిశీలిస్తున్న సమయంలో కుటుంబ సభ్యులు కొన్ని విషయాలు గుర్తించారు. మృతురాలితో కొందరు గుర్తుతెలియని వ్యక్తులు వీడియోకాల్స్ చాలాసార్లు మాట్లాడారు. ఆమె తన ఖాతాల నుంచి వారు చెప్పిన బ్యాంకు ఖాతాకు 6.6 లక్షలు బదిలీ చేశారు. సైబర్ నేరగాళ్ల చేతికి చిక్కి డబ్బులు పోగొట్టుకొని, ఎవరికీ చెప్పుకోలేక మానసిక వేదనకు గురైనట్లు కుటుంబ సభ్యులు గుర్తించారు. ఆ వేదనతోనే గుండెపోటు వచ్చి ఉంటుందని అనుమానించారు. వెంటనే సిటీ సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. మృతురాలి ఫోన్‌లో కాల్‌డేటా, డబ్బు బదిలీ చేసిన బ్యాంకు ఖాతాల ఆధారంగా సైబర్ నేరగాళ్ల వేధింపుల వల్లనే బాధితురాలు మృతి చెంది ఉంటారని పోలీసులు ప్రాథమికంగా నిర్ధారించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. సైబర్ నేరగాళ్లు 6.6లక్షలు కొల్లగొట్టినట్లు నిర్ధారణకు వచ్చారు.



సూర్యాపేట ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో సీఎం రేవంత్, మంత్రి ఉత్తమ్ ఫొటోలను అమరుస్తున్న కాంగ్రెస్ కార్యకర్తలు

సూర్యాపేట ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి క్యాంప్ కార్యాలయంలో సీఎం ఫొటో

- మంత్రి ఉత్తమ్ ఫొటో కూడా అమర్చిన కాంగ్రెస్ కార్యకర్తలు
- ఫొటోలు తొలగించి పోలీసులకు ఫిర్యాదు చేసిన బీఆర్ఎస్

సూర్యాపేట, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి క్యాంప్ కార్యాలయంలో కాంగ్రెస్ కార్యకర్తలు సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి చిత్రపటాలు అమర్చారు. మార్కెట్ కమిటీ చైర్మన్ కొప్పుల వేణారెడ్డి ఆధ్వర్యంలో అక్కడికి చేరుకున్న కార్యకర్తలు.... నేరుగా సమావేశ మందిరంలోకి వెళ్లిన కార్యకర్తలు రేవంత్, ఉత్తమ్ ఫొటోలను గోడకు అమర్చారు. ఎప్పటినుంచో ఉన్న కేసీఆర్, జగదీశ్‌రెడ్డి ఫొటోలను ముట్టుకోకుండానే బయటకు వచ్చారు. తాము పెట్టిన ఫొటోలను తొలగిస్తే ప్రజాఉద్యమం చేస్తామని వేణారెడ్డి హెచ్చరించారు. కాగా, ఎమ్మెల్యే కార్యాలయంలోకి అక్రమంగా ప్రవేశించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి వై.వెంకటేశ్వర్లు, మునిసిపల్ మాజీ వైస్ చైర్మన్ పుట్టా కిశోర్‌కుమార్ డిమాండ్ చేశారు. కాంగ్రెస్ నాయకులు నినాదాలు చేసుకుంటూ వచ్చి ఫర్నిచర్‌ను ధ్వంసం చేయడంతో పాటు భయానక వాతావరణం సృష్టించారని ఆరోపించారు. కాంగ్రెస్ నాయకులపై పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశామన్నారు. కాసేపటికే రేవంత్, ఉత్తమ్ ఫొటోలను సమావేశ మందిరం నుంచి తొలగించారు.

'స్థానికత'పై జోక్యం చేసుకోలేం

- సుప్రీం తీర్పు ఇచ్చాక ఈ అంశంపై విచారించలేం: హైకోర్టు

హైదరాబాద్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): వైద్య విద్య కోర్సుల్లో స్థానిక కోటా వర్తింపునకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం జారీచేసిన జీవో 33, 150 విషయంలో తాము జోక్యం చేసుకోలేమని హైకోర్టు స్పష్టం చేసింది. స్థానిక కోటాలో సీటు పొందాలంటే నీట్ అర్హత పరీక్షకు ముందు వరుసగా నాలుగేళ్లు తెలంగాణలో చదివి ఉండాలన్న రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయాన్ని సుప్రీంకోర్టు కొన్ని షరతులతో ఆమోదించిందని గుర్తుచేసింది. ఈ మేరకు మహబూబాబాద్ జిల్లా గార్ల మండలం సీతంపేట్ గ్రామానికి చెందిన మలోతు తేజస్విని సహా ఇతర రాష్ట్రాల్లో ఇంటర్ చదివిన 34 మంది అభ్యర్థుల పిటిషన్లను చీఫ్ జస్టిస్ అపరేశ్‌కుమార్ సింగ్, జస్టిస్ మొహియుద్దీన్ ధర్మాసనం కొట్టివేసింది.

ఏపీ సైనిక్ స్కూల్‌లో చదివిన విద్యార్థికి ఊరట

తెలంగాణ ప్రభుత్వ నిధులతో, తెలంగాణ కోటాలో ఏపీలోని కోరుకొండ సైనిక్ స్కూల్‌లో చదివిన వనపర్తి జిల్లా ఘన్‌పూర్ మండలం దొంతికుంట తండా విద్యార్థి ఎం.శశికిరణ్‌ను వైద్య విద్య అడ్మిషన్లలో స్థానికుడిగా గుర్తించాలని హైకోర్టు ఆదేశించింది. ఈ పిటిషన్‌కు సంబంధించి తెలంగాణ కోటాలో ఏపీలోని సైనిక్ స్కూల్‌లో చదివిన వారి పరిస్థితి ఏమిటని మంగళవారం విచారణ సందర్భంగా ప్రభుత్వాన్ని హైకోర్టు ప్రశ్నించింది. దీనికి అడ్వకేట్ జనరల్ ఏ సుదర్శన్‌రెడ్డి బుధవారం వివరణ ఇచ్చారు. ఏపీ పునర్విభజన చట్టం ప్రకారం.. తెలంగాణ, ఏపీ విద్యార్థులు నష్టపోకుండా పదేళ్లపాటు ఇరు రాష్ట్రాల విద్యార్థులకు కోటా ఇచ్చారని.. ఆ కోటాలో 2024 వరకు చదివిన విద్యార్థులకు మినహాయింపు ఇవ్వాలని తెలంగాణ ప్రభుత్వం నిర్ణయించిందని వివరించారు. దీనితో పిటిషనర్‌ను స్థానికుడిగా గుర్తించి కౌన్సిలింగ్‌కు అనుమతివ్వాలంటూ కోర్టు విచారణను ముగించింది.

రాజధానిపై మళ్లీ కుంభవృష్టి

రాత్రి 3 గంటలపాటు కుండపోతగా వర్షం.. చెరువులను తలపించిన రోడ్లు, ఇళ్లలోకి వరద

- మియాపూర్‌లో కి.మీ మేరట్రాఫిక్ జాం
- ముషీరాబాద్‌లో 15 సెం.మీ, మోండా మార్కెట్‌లో 13సెం.మీ నమోదు
- అప్రమత్తంగా ఉండాలని సీఎం ఆదేశం
- రాష్ట్రవ్యాప్తంగా పలుచోట్ల భారీ వర్షం

హైదరాబాద్ సిటీ, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌పై మరోసారి వరుణుడు మరోసారి పడగ విప్పాడు. నిర్దయగా విరుచుకుపడ్డాడు. ఆకాశానికి చిల్లులు పడ్డాయా? అన్నట్టు.. ఎక్కడెక్కడి నుంచో మేఘాలన్నీ ఒక్కచోటకొచ్చి బద్ధలై కురిశాయా? అన్నట్టుగా ఆ ఉధృతికి నగరజీవులు ఉక్కిరిబిక్కిరయ్యారు. క్షణాల్లో ప్రధాన రోడ్లు చెరువులుగా మారిపోతే.. మోకాలి లోతు ఆ నీళ్లలో కార్లు, ద్విచక్ర వాహనాలను ముందుకు కదిలించలేక వాహనదారులు గోసపడ్డారు. లోతట్టు ప్రాంతాల్లోని కాలనీల్లోకి వరద పోటెత్తింది. పార్క్ చేసిన బైక్‌లు నీట మునిగాయి. గడపదాటి లోపలికి దూకిన వరద.. ఇళ్లలోని బియ్యం, పప్పులు ఇతర నిత్యావసర సరుకులను తడిపేసింది. ఆ ఇళ్లలోని బాధితులకు నిద్రలేని రాత్రిని మిగిల్చింది. బుధవారం రాత్రి 8గంటల నుంచి 11 గంటల దాకా ఎక్కడా తగ్గకుండా గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో కుండపోత వర్షం పడింది. మియాపూర్, శేరిలింగంపల్లి, కుత్బుల్లాపూర్, అమీర్‌పేట, సనత్‌నగర్, కృష్ణానగర్, మియాపూర్, చందానగర్, మాదాపూర్, రాయదుర్గం, జూబ్లీహిల్స్ బంజారా హిల్స్ ప్రాంతాల్లో ప్రధాన రహదారులపై మోకాలి లోతు నీరు ప్రవహించింది. కేవలం మూడు గంటల్లో.. ముషిరాబాద్ 15 సెం.మీ, మోండామార్కెట్‌లో 13 సెం.మీ, మారెడ్‌పల్లిలో 13సెం.మీ.. శేరిలింగంపల్లి హెచ్‌సీయూ యూనివర్సిటీ ప్రాంతంలో 12.6 సెం.మీ, మియాపూర్‌లో 11.2 సెం.మీ వర్షపాతం నమోదైంది. యూసు‌ఫ్‌గూడ కృష్ణానగర్ బీ బ్లాక్‌లో వరదనీరు భారీగా ప్రవహించడంతో వాహనాలు సగానికి పైగా నీటమునిగాయి. స్థానికులు రోడ్డు దాటేందుకు ఇబ్బందులు పడ్డారు. కుత్బుల్లాపూర్ సంజీవ్‌నగర్‌లో ఇళ్లలోకి వరదనీరు చేరడంతో స్థానికులు అవస్థలు పడ్డారు. మారేడ్‌పల్లి, ముషీరాబాద్, షేక్‌పేట, బాలానగర్, గోల్కొండ, ముషీరాబాద్‌లో లోతట్టుప్రాంతాలు జలమయమయ్యాయి. మియాపూర్-చందానగర్ జాతీయ రహదారిపై పెద్ద మొత్తంలో వరద చేరడంతో రాత్రి 11 గంటల వరకు కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోయాయి. ఖైరతాబాద్ సచివాలయం ఎదురురోడ్డు, లక్డీకాపూల్ వీఎస్టీ ప్రధానర హదారులపై భారీగా వరదనీరు నిలిచిపోవడంతో చెరువులను తలపించాయి. గచ్చిబౌలిలోని సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ నుంచి బయోడైవర్సిటీ చౌరస్తా మీదుగా రాయదుర్గం, షేక్‌పేట, టోలిచౌకి, నానల్‌నగర్, మెహిదీపట్నం వరకు ట్రాఫిక్ జామ్ సమస్యలు తలెత్తాయి. ఖైరతాబాద్ చౌరస్తా నుంచి ఎర్రమంజిల్ మీదుగా పంజాగుట్ట, అమీర్‌పేట, సంజీవరెడ్డి నగర్, ఈఎస్ఐ ఎర్రగడ్డ వరకు ప్రధాన రహదారిపై వర్షపు నిలిచిపోవడంతో వాహనాల రాకపోకలకు తీవ్ర ఆటంకం కలిగింది. ట్యాంక్‌బండ్ నుంచి రాణిగంజ్-ప్యారడైజ్ మార్గంతో పాటు ఎంజీరోడ్డు-ప్యాట్నీ మార్గంలో ట్రాఫిక్ జామ్‌తో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. వీఎస్టీ ప్రధానరహదారిపై మోకాలిలోతు వరదనీరు నిలిచిపోవడంతో వాహనాలు ముందుకు కదల్లేక వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. కాగా రాష్ట్రవ్యాప్తంగా పలుచోట్ల వర్షం పడింది. కరీంనగర్, మెదక్, సిద్దిపేట, భువనగిరి, నల్లగొండ, సూర్యాపేట, జగిత్యాల, ములుగు జిల్లాలో వర్షం పడింది. మెదక్ జిల్లా శివ్వంపేటలో 6.9 సెం.మీ, కరీంనగర్ జిల్లా శంకరపట్నంలో 6 సెం.మీ, భువనగిరి జిల్లా బొమ్మలరామారంలో 4.1 సెం.మీ వర్షపాతం నమోదైంది. ములుగు జిల్లా వెంకటాపురం సమీపంలో ఓ 20 మంది కూలీలు గోదావరి పాయ ఆవలివైపు చిక్కుకుపోయారు. జేసీబీ సాయంతో వారిని ఈవలివైపు సురక్షితంగా తీసుకొచ్చారు. జగిత్యాల జిల్లా కథలాపూర్ మండలం దుంపెట గ్రామ ఊటచెరువుకు గండిపడటంతో 180 ఎకరాల పంట నీటమునిగింది.



అమీర్‌పేటలో వరద నీటిలో ఇక్కట్లు పడుతున్న వాహనదారుడు

అవసరమైతే తప్ప ప్రజలు బయటకు రావొద్దు: సీఎం

హైదరాబాద్‌లో పలు ప్రాంతాల్లో భారీ వర్షం కురుస్తున్నందున అప్రమత్తంగా ఉండాలని అధికారులను సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. ప్రజలకు ఇబ్బంది లేకుండా అన్ని విభాగాల అధికారులు సమన్వయంతో పని చేయాలని సూచించారు. బుధవారం రాత్రి కురిసిన భారీ వర్షానికి చాలా ప్రాంతాల్లో రోడ్లపై నీళ్లు నిలిచాయని, ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడిన చోట పోలీసులు, హైడ్రా వెంటనే తగిన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. లోతట్టు ప్రాంతాలు, నాలాలు ఉన్న చోట్ల ప్రజలు అత్యవసరం అయితే తప్ప బయటకు రావొద్దని సూచించారు. జీహెచ్ఎంసీ, విద్యుత్తు విభాగాల అధికారులు అధిక వర్షం పడిన ప్రాంతాల్లో అవసరమైన సహాయ చర్యలు చేపట్టాలని ఆదేశించారు.



జూబ్లీహిల్స్‌లో భారీగా నిలిచిపోయిన వాహనాలు



చిక్కడపల్లి వీఎస్టీ వద్ద రోడ్డుపై భారీగా నిలిచిన వరద నీరు

టిప్పర్ బీభత్సం

- మితిమీరిన వేగంతో రాంగ్‌రూట్‌లోకి దూసుకొచ్చి కారును ఢీకొట్టిన టిప్పర్
- కారులోని ఏడుగురూ మృత్యువాత
- నెల్లూరు జిల్లా సంగం వద్ద ప్రమాదం

సంగం, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఆస్పత్రిలో ఉన్న బంధువును పరామర్శించేందుకు కారులో బయలుదేరిన వాళ్లంతా విగతజీవులుగా మారి అదే ఆస్పత్రికి చేరుకున్నారు. మరో 15, 20 నిమిషాల్లో గమ్యస్థానం చేరతారనగా...మృత్యువులా దూసుకొచ్చిన టిప్పర్ వారి కారును ఢీకొట్టింది. ఈఘటనలో కారులోని ఏడుగురూ మాంసంముద్దల్లా మారగా, వారు ప్రయాణిస్తున్న కారు నుజ్జునుజ్జయింది. నెల్లూరు జిల్లా సంగం మండలం పెరమన వద్ద ముంబై జాతీయరహదారిపై బుధవారం మధ్యాహ్నం ఈ ఘోరం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే...నెల్లూరు సిటీలో తాళ్లూరు శ్రీనివాసులు (40) అనే వ్యక్తి తన భార్య రాధమ్మతో (38) కలిసి ఫాస్ట్‌ఫుడ్ సెంటర్ నిర్వహిస్తున్నారు. రాధమ్మ బంధువు ఒకరు ఆత్మహత్యాయత్నానికి పాల్పడి ఆత్మకూరు ప్రభుత్వ వైద్యశాలలో ప్రాణాపాయ స్థితిలో చికిత్స పొందుతున్నాడు. ఈ విషయం తెలుసుకుని వారు... తమ బంధువులు శేషం సారమ్మ (40) బాలవెంగయ్య దంపతులు, చల్లగుండ్ల శ్రీనివాసులు, లక్ష్మి (35) దంపతులతో కలిసి కారులో బయలుదేరారు. తమ వద్ద పనిచేసే బ్రహ్మయ్య అనే వ్యక్తిని కారు డ్రైవింగ్ తెలిసి ఉండటంతో కారు ఎక్కించుకున్నారు. ఇలా ఏడుగురు బుధవారం ఉదయం 10.30గంటలకు బయలుదేరారు. నెల్లూరు దాటి ముంబై హైవే మీదుగా ఆత్మకూరు దిశగా వెళుతూ.. సంగం కొండ దిగి పెరమన సమీపానికి వచ్చింది. ఇంతలో రాంగ్‌రూట్‌లో అతివేగంగా వచ్చిన ఇసుక టిప్పర్.. వీరి కారును ఢీకొంది. ఆ వేగం ధాటికి కారు ముందు భాగం నుజ్జునుజ్జయి 20 మీటర్ల వెనక్కి వచ్చి ఆగింది. అందులోని ఏడుగురూ అక్కడికక్కడే దుర్మరణం పాలయ్యారు. వారి మృతదేహాలు గుర్తుపట్టలేనివిధంగా రక్తపు ముద్దగా మారిపోయాయి.. టిప్పర్ డ్రైవర్ ప్రసాద్‌రెడ్డి అక్కడ నుంచి పరారై సంగం పోలీస్‌స్టేషన్‌లో లొంగిపోయాడు. ప్రమాద సమయంలో అతడు మద్యం మత్తులో ఉన్నట్టు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. టిప్పర్ ఇసుక లోడుతో ఆత్మకూరు నుంచి సంగం వైపు వెళుతుండగా, కారు ఆత్మకూరు వైపు పోతోంది. అది రెండు లేన్ల హైవే...మధ్యలో డివైడరు లేదు. అప్పటివరకు ఎడమవైపు సవ్యంగానే వెళుతున్న టిప్పర్ ఒక్కసారిగా బాగా కుడి వైపునకు వచ్చి కారును ఢీకొట్టడంతో ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. టిప్పర్ ఢీకొట్టిన ధాటికి కారు ముందుభాగం నుజ్జునుజ్జయి టిప్పర్ బంపర్ కిందకు దూసుకుపోయింది. కారు ఇంజన్‌తోపాటు ముందుభాగం వెనుక సీటు వరకు నుజ్జునుజ్జయ్యింది. కారు డోర్‌లు తెరుచుకోకపోవడంతో మృతదేహాలను వెలికి తీయడం కష్టమైంది. పోలీసులు రెండు క్రేన్‌లు, ఒక జేసీబీని రప్పించి ఒకదానికొకటి ఇరుక్కున్న కారు, టిప్పర్‌ను ఎట్టకేలకు వేరుచేశారు. ఇందుకు మూడు గంటలు పడితే, మృతదేహాలను తీసేందుకు మరో గంట సమయం పట్టింది. అనంతరం వాటిని ఆత్మకూరు వైద్యశాలకు తరలించారు.

*Printed and Published by **Koganti Venkata Seshagiri Rao** on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda press, Sy no.1054, Andhrajyothi Building, Madikonda Village, Khazipet Mandal, Hanamkonda (Dist), Pin. 506142, Editor: **N.Rahul Kumar.** Ph. No. (0870) 2100480/84,*
*RNI No:APTEL/2003/9741, **Managing Director : Vemuri Radha Krishna** Founder: K.L.N.Prasad.*